# భారతి

సాహిత్య మాసపత్రిక

ఏప్రిల్ 1981


## ఎదుగుతూ ఉంటే

సిధారెడ్డి

## కొరవి శాసనం

పరబ్రహ్మశాస్త్రి

## అందని జాబిల్లి

రామారావు

## విశ్వనాథవారి వేనరాజు

రామచంద్రయ్య

## ఆశలుతీర్చు-ఆశీర్వదించు

సుధాకరరావు

## పెళ్లి కబురు

అరణి

ఇంకా నరసింహమూర్తి, దిలావర్, అంజయ్య, రఘునాథరెడ్డి, ఆనందారామం, సూర్యం, లీలావతీదేవి, పద్మావతి, సత్య, పెన్నా శిరాకృ, రామకృష్ణరావు, సత్యనారాయణ, వేంకటరమణయ్య, జవహర్‌లాల్, పున్నారావు, గురుప్రసాదరావు, అరుణాచలం, వాగేశ్వరరావు, శేషశర్మ, పద్మావతి, రామేశ్వర దత్త ఇతరుల రచనలు.


వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

# భారతి

మాసపత్రిక

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

ఏప్రిల్ 1981

సంపుటము: 58 సంచిక: 4

విడిపత్రిక వెల రెండు రూపాయలు

# విషయానుక్రమణిక

## ఏప్రిల్ 1981

# వరద

భావాలు పొర్లుకొచ్చిన వేళ
ప్రవాహాన్ని ఈదితే ఏమయ్యేదో!
అంతు పొంతులు అంచనాలు వేసుకుంటూ
ఏ రేవులో అడుగుపెడితే
ఆ ఒడ్డుకు చేరగలనో!
ఆలోచిస్తూ కూర్చున్నాను.

జేగురు వరదకు పసుపూ కుంకం
ఇచ్చి
దీపం పెట్టేవాళ్ళూ
ఒడ్డున కేరింతలు కొడ్తూ
ఒందు పులుముకున్న వాళ్ళూ
ఒళ్ళెరుగకుండా దూకి
అవతలి ఒడ్డుకు బారలు చాచేవాళ్ళు
ఎందరో!
వాళ్ళంతా నాకంటె ముందుకు వెళ్ళేరు.

నేను మాత్రం
గిర గిర తిరిగే సుడిగుండాల్ని
కొట్టుకుపోయే కళేబరాల్ని
పాముల్నీ వాముల్నీ
దుంగల్నీ దూలాల్నీ
చూసి చూసి
ఒక్కసారి కళ్ళుమూసుకున్నాను.

బరువెక్కిన
కళ్ళు తెరిచేదాకా పొరడానికి
అదేం జీవనదా!
మళ్ళీ ఎప్పుడైనా వరద రావాలి
అప్పుడు బుడుంగుమని
ఒక్క మునకైనా వెయ్యాలి.

# ఇది వేళకాదు

కవిత్వం కమ్మకొస్తూంటే
ఇప్పుడు వేళకాదు పొమ్మన్నాను
మరోసారి చూసుకుందాం వెళ్ళిరమ్మన్నాను.

గంధం పూసుకుని అప్సరసలతోపాటు
వెన్నెట్లో విహరిద్దాం రమ్మంటే
అది హాయికాదు—కదలమన్నాను.

ముత్యాల గొడుగువిప్పి
ఉద్యానాల్లో ఊరేగమంటూ ముందుకొచ్చిన
అనుభూతుల పల్లకీబోయీల్ని
కాళ్ళు విరగ్గొడ్తాను — ఖబడ్దారన్నాను.

ముసి ముసి నవ్వుల్తో మురుసుకుంటూ
ఎదురొచ్చిన మణిదీపాల్ని

చిరాగ్గా మూటకట్టి
మట్టిలో పాతిపెట్టాను.

ఆనందంతో చిందులువేస్తూ
అడ్డంపడ్డ అమృతభాండాన్ని
భళ్ళుమని పగలదన్ని
విరగబడి నవ్వేను.

నాచుట్టూ అపురూపంగా వెలసిన
అద్దాలమేడను
పట్టరాని కోపంతో 'హాంఫట్' అంటు
మాయం చేసేను.

కర్పూర విడెమూ కాశ్మీరాంబరం
కోరి వెతుక్కుంటూ వస్తే
ఖతం చేస్తాను జాగ్రత్తన్నాను.

ఉగాదులూ ఉత్సవాలూ
గండపెండారాలూ గజారోహణలూ
బిలబిలా తలుపులు తోసుకుని
రాబోతూవుంటే
కళ్ళురిమి గర్జించి
మెడబట్టి బైటగ్గెంటాను.

"చిత్తం మళ్లీ తమ దర్శనం"
అని నీళ్ళు నములుత్తూ వెళ్లబోతూన్న
కవిత్వాన్ని వెనక్కి పిలిచి
ఇంకెప్పుడూ నీతో పనేంలేదు
మళ్లీ కన్పించినా మాటదక్కదు
ఇక రావద్దు – పొమ్మన్నాను.

డా. యు. ఎ. నరసింహమూర్తి

# గులాబీ కన్నీళ్ళు

## శ్రీమతి తాటికోల పద్మావతి

గాయపడిన హృదయంలో గేయమే వ్రాయాలనివుంది.
కన్న కలలన్నీ కరిగిపోయి కావ్యాలయితే,
కర్తవ్యమునే మరచి గాయాలు చేసింది
ఆశలెన్నో పెంచుకొని
ఊహలతో ఊసులాడి—బాస చేశావు.
రేపులెన్నో గడిచే—మాపులన్నీ మరిచే
నాపుకైనా చేరనీవు—దరి జేరరానేరావు
రోజురోజూ ఎదురుచూసేనీకు
మోజు తీరెనా, నాపైనా
అనుక్షణం ఆవేదనతో—
మరుక్షణం—మధురమైన తలపులతో
మరచిపోనా, నిన్ను మరచిపోనా!
మదిలో కథగా మిగిలించి
ఆ కథలే వ్యథలే రగిలించి
కొత్త పిలుపువిని—పాత వలపు మరిచేవా!

కరగిపోయిన ఆశలతో
కాలమెంత తరగినా
నీకోసం ఎదురు చూస్తానూ,
నీ రాకకై నిదురకాచి వుంటాను.
ముద్దు గులాబీనని గుసగుసలాడి
పొద్దు, పొద్దూ ముద్దు లెన్నో చేసావు
అంతలో ముళ్ళు గుచ్చుకొంటాయని
మురికిలో ముందుకు త్రోశావు.
మల్లె పొద చాటుకు మరల పోయేవా,
తెల్లవారి, ఆ మల్లె నల్లనయితే,
సన్నజాజికే సైగచేశావా!
ఆ సన్నజాజులెన్నో వాడినా,
కన్ను తెరచి చూడవు
మనసు విడచి మాటాడవు ॥గా॥
ఈ గులాబీ కన్నీళ్ళు – నీకు తెలిసేది ఎన్నాళ్ళు!

శ్రీ పి. వి. పరబ్రహ్మశాస్త్రి

# కొరవి శాసన పునర్విమర్శ

ముదిగొండ చాలుక్యుల చరిత్రను దెలుపు శాసనములలో నిదియొక ముఖ్యశాసనము. వరంగల్లుజిల్లా మానుకోట తాలూకాలో కొరవి యను గ్రామమునందు వీరభద్రేశ్వరాలయమువద్ద నీ శాసనము కలదు. దీని యునికిని గూర్చి ఆంధ్ర చరిత్ర పరిశోధకులకు చిరకాలమునుండి తెలియును. శాసనశిల యడుగు భాగమున కొంత విరిగిపోవుటవలన శాసనపాఠము నలువైపుల కొన్ని పంక్తులు నష్టమైనవి. సుమారు పదిహేనేండ్లకు పూర్వము ఆ యూరిలోనే చెఱువుదగ్గర మఱియొక చిన్న శాసనఖండము లభించగా దానిని కూడ గుడి దగ్గరున్న పెద్ద శాసన ఖండమువద్దకు చేర్చిరి. అక్షరములపోలిక, విషయము రెంటిలోను సంబంధము కలిగియున్నను, రెండు శిలలు ఇంచుమించుగ నొకే వెడల్పు గలిగియున్నను ఆ రెండు ఖండములు ఒకే శాసనమునకు చెందినవా లేదా యను సంశయము తీరుటలేదు. శాసనమూలములో కొన్ని పంక్తులు నష్టమగుటవలనను, అందలిభాష క్రీ. శ. పదవ శతాబ్దినాటి ప్రాచీన తెలుగగుటవలనను, ఇందలి విషయముకూడ మనకు సరిగా తెలియని అప్పటి రాజకీయము లగుటవలనను ఈ శాసనములోని కొన్ని యంశము లిప్పటికిని అపరిష్కృతములుగనే యున్నవి.

1975లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భమున 'తెలుగు శాసనాలు' అను పుస్తకములో దీనినిగూర్చి కూడ నేను కొంతవ్రాసితిని. అంతకుపూర్వము కూడ పలువురు దీనిని గూర్చి వ్రాసిరి. వీటి నన్నిటిని సాకల్యముగ బరిశీలించి డా. సి. సోమసుందరరావుగారు, శ్రీ కొల్లూరు సూర్యనారాయణగారు కలిసి గత జనవరి భారతిలో (57 పుట) 'ముదిగొండ చాలుక్యుల కాలనిర్ణయ'మను శీర్షికక్రింద నొక వ్యాసము వ్రాసిరి. వీరీ వ్యాసమునకు నేను 1979 నవంబరు, డిశంబరు; 1980 జనవరి నెలల 'భారతి' సంచికలలో వ్రాసిన క్రివ్వక శాసనము, ముదిగొండ చాలుక్యులు అను వ్యాసముల నాధారముగను విమర్శనోద్దేశకముగను గ్రహించిరి. నా వ్యాసములో ముదిగొండ చాలుక్యుల కాలక్రమముతో గూడిన వంశక్రమము నొసగలేదని వీరి యాక్షేపణ. వీరొక కాలక్రమమును నిర్ణయించి దాని కనుగుణముగ వంశక్రమమును గూడ పునర్నిర్మించిరి. వారి నిర్ణయములపై నాకు గల కొన్ని సందేహములను వెలిబుచ్చుటయే ప్రస్తుత వ్యాసముయొక్క ఉద్దేశము. ఈ చర్చకు మూలము కొరవి శాసనము గనుక ఆ శాసన మూలమును ముందువ్రాసి తదుపరి విషయ చర్చగావింతును.

(ఈ క్రింది రెండు, మూడువైపులలో నేది ముందో యేది వెనుకో సరిగా తెలియదు)

## I పెద్దరాయి

### మొదటివైపు

1 శ్రీ విక్రమాదిత్య నృపా
2 గ్ర తనయుణ్డయ్న చాలుక్య
3 భీమునకు శౌచకన్దప్పన్
4 నకు వే[ం]గీశ్వరునకు రన
5 మ ద్దన్ న్వయ కుల తిలకు
6 ణ్డయ్న కుసుమాయుధుణ్డ గ
7 న్నర బల్లహుని కస్త్రప్రాప్త
8 [ం] బయ్న రనమ ద్దన్ కణ్ఠియం దన
9 భుజవీర్య్యన్ బలపరాక్ర
10 మంబున న్దెచ్చి కణ్ఠియం గట్టి
11 పట్టంబెత్తి ఖడ్గ సహాయు
12 ణ్డై నేల యెల్లం గావంబుని

### I రెండవవైపు (?)

1 సటానెగల్ల శ్రీ నిరవ
2 ద్యు ణ్డనేక సమరసంఘ
3 ట్టణ భుజాసి భాసురు
4 ణ్డై తమయన్న రాజ్యశ్రీ
5 కెల్లన్దాన యరుహుణ్డై
6 చేకొని నిర్చి భీమసలు
7 కి యన్దనేక వస్తు వా
8 హనోత్సవంబు ల్వడయు
9 చు తమయన్న గొణంగయ్య
10 చేసిన ధమ్మన్వులు నస
11 ంబును నెగల్పను గావను
12 రక్షింపను వలయునని

## I మొదటి వైపు

13 మంచి కొణ్డ నాణ్డాదిగ
14 వేంగిదేసము విష్ణువ
15 ర్ధన్ ముతో నర్ధన్ రాజ్యంబు సే
16 యుచున్న కుసుమాయుధు పె
17 ద్ద కొడు కనేక రిపు నృపతి
18 మణి మకుట మకరికా
19 కషణమశృణిత చ[రణ*]
... ... ... ... ...

## I రెండవ వైపు(?)

13 చేకొని కొరవి కిచ్చిన
14 స్త్రీతి సర్వి శిలాస్థ మ్భ
15 ంబు ప్రతిష్ఠించి భీమేశ్వ
16 రంబును నాతని కొట్పించి
17 న చెఱువులు మఱియు మె
18 వ్వియేని నాతని చాయంబడి
19 న ధమ్మన్వుల న్దిఅ ...
... ... ... ... ...

## I మూడవవైపు (?)

1 గలకలావత్తన్ంబు రా
2 జ్యంబు సేయుచు నిష్ట వి
3 షయ కామ భోగంబుల
4 ను భవించుచు సుఖంబు
5 ణ్డి యొక్కనాణ్డు కొరవి నల్ల
6 మేఱయ కొదుకు పెద్దన
7 రావించి నీవు నా ప్రాణస–
8 మానుణ్డైన చెలివి నీ
9 చేసిన యుపకారంబు నా
10 కు ప్రత్యుపకారంబుసేయ
11 వలయుంగాన నీకేమి వ
12 లయుం దాని వే
13 ణ్డి కొమ్మన్న నీ
14 శ్రీ నాకెల్లం గలదేమి లే
15 కున్న వేణ్డి కొణ్డు మయ్న
16 ం బరోపకారంబు పాణ్డ్రె నా
17 ని కొరవి యన్నది ముదు
18 గొణ్డ సల్కుల కుల సన్త
... ... ... ... ... ... ...

## I నాల్గవవైపు

1 . ముక్కు దఱిగినను చఱి
2 చినను చురియ వెఱికిన
3 ను ముట్చిలినను అంక్కాడి
4 నను ఇరువాద్యది ఏను
5 ద్రమ్మలు మాణిసి చేసిన
6 దోసంబునకు వాని జీవిత
7 ంబ దణ్డువు పరియార[ంబ]
8 ంబు పడవరంబు వెల్గార
9 ంబంబు ఎరగద్యాణంబు పె
10 రామణి పున్నమనాణ్డు ఏ
11 నూరు ద్రమ్మలరివె
12 ట్టి సుఖంబు మనువరు
13 నాయకుణ్డైయ్నకాంపులయ్న
14 వెఱరాజులం జొచ్చి మ
15 నాంజనదు యూస్త్రితి యడి
16 సికొన్నరాజు ల్గలరేని
17 యు యూస్త్రితి యడిసిన కవ
18 నాపకు ఇన్ను మన్న కంపు

## II క్రొత్తగా దొరకిన చిన్నరాయి

### మొదటివైపు

... ... ... ... ... ... ...

1 ఱు నన్దమ యమ్మకట్టి
2 న పట్టంబు గావంబూని [ధు]
3 రదెడె రాముణ్డై తనచే
4 తి వాలతోడుగా ననుంగు
5 గొణగణ్డను పేరితో జ
6 లుక్య భీమణ్డన్దను[ధ]

### II రెండవవైపు

1 గాలంబున [... ... ... ...]
2 కాన్తరితుణ్డై చనిన నా
3 తని తమ్ముణ్డు సకల లో
4 కాశ్రయ మణికణక [ము]
5 క్తాలంకార చలుక్యకులో
6 ద్భవ సితగ చఱుక్క [బీ]

### II మూడవవైపు

... ... ... ... ... ... ...

1 ఇచ్చిన స్థితియు పఱియద
2 యుంబోయు వెరెయంబు జి
3 ట్టరి యెల్లన్దక్కి చాబొడి
4 చిన నూట యిరువది ద్ర
5 మ్మలు మనంబొడిచిన
6 నఱువది ద్రమ్మలు
7 అక్కసలకు కఱకులి
8 లేదు

### II నాల్గవ వైపు

... ... ... ... ... ... ... ...

1 మహీపతి వంశజాశ్చపా-
2 పాదపేత మనసోభువి భూ
3 రి భూపా ఏ పాలయన్తి మ
4 మ ధమ్మన్ మిమం సమస్తం
5 తేషాంమయా విరచితోంజలి రేష
6 మూ[ర్ధ్నిన్] చన్ది విగ్రహిచాము
7 [ం]ఱెయ వ్రలు

(విస్తర భీతిచే ఈ మూలమునందలి కొలది వ్యాకరణాది దోషములను సరిదిద్దలేదు)

పై I (పెద్దరాయి), II (చిన్నరాయి) శాసనభాగములు ఒకే శాసన ఖండములని నిశ్చయముగ జెప్పలేక విడివిడిగా జూపితిని. ఇందలి చరిత్రాంశములనంతగా పట్టించుకొనకుండ డా. సోమసుందరరావుగారు, శ్రీ సూర్యనారాయణగారు (సో. సూ. గారలు) కాలనిర్ణయము గావించిరి.[1] అదియు చరిత్ర రచయితలు గత్యంతరములేక స్వీకరించునట్టి విధానము. అనగా పురుషాంతరమునకు 20 లేక 25 సంవత్సరము లొసగుచు స్థూలముగ నొక తాత్కాలిక మగు నేర్పాటు గావించుట. దీనిని కాలనిర్ణయము లేక నిశ్చయమన జాలము. ఈ విధానము చరిత్రజ్ఞులకందరికి సంప్రదాయసిద్ధమై తెలిసినదగుటవలన నేనంతగా పరిగణించి నా 'ముదిగొండ చాలుక్యుల' వ్యాసములో సూచించలేదు.[2] ఈ వంశములో మనకు ప్రస్తుతము తెలియవచ్చుచున్న రాజులుగాక మఱికొంద రుండియుందురను భావముతో తెలిసిన కాలముగల వారినిగూర్చి మాత్రమే ఆయా సందర్భములలో కాలమును సూచించితిని. అందు క్రివ్వక తామ్రశాసనమునకు కొరవి శిలాశాసనమునకు సంబంధము కల్పించుటయే ప్రధానాశయము. అందుచేత కొరవి శాసనకాలము క్రీ. శ. 934 అనియు క్రివ్వక శాసన కాలము క్రీ. శ. 1198 అనియు[3] సుమారుగ సూచించితిని. కాని శ్రీయుతులు సో. సూ. గారలు ఒక్కొక్క తరమునకు సందర్భోచితముగ 15, 20, 25 సంవత్సరముల వ్యవధి నిచ్చుచు కంప్యూటరు విధానములో నొక వంశకాలక్రమమును నిర్ణయించి వక్కాణించిరి.

కొరవి శాసనమును ఎవరు స్థాపించిరి ? ఎప్పుడు స్థాపించిరి ? ఎందుకు స్థాపించిరి ? అను ప్రశ్నలకు సరియగు సమాధాన మరయవలసియున్నది. ఎవరు స్థాపించిరి ? చాలుక్య కుసుమాయుధుని రెండవకొడుకగు నిరవద్యుడు ఈ శాసన శిలాస్తంభమును ప్రతిష్ఠించెనని చెప్పవచ్చును. కాని యింతవరకు రెండవవైపుగా ప్రకటించబడిన భాగములో 'నల్లమేడెయకొడుకైన పెద్దనమురావించి నీవు నా ప్రాణ

సమానమైన చెలివి' ఇత్యాది సంభాషణము నిరవద్యుని అన్నయగు గొణగునికిని పెద్దనకును జరిగినట్లు చెప్పుచుండిరి. శ్రీ సో. సూ. గారలు కూడనట్లే చెప్పిరి. వారిమతమున నిరవద్యుడు తన అన్నను పారదోలి రాజ్యమును దురాక్రమణ చేసికొనెను. అతడు అంత సౌమ్యముగ తనయన్నకు సంబంధించిన యేనాటి సంభాషణమునో యిచట శాసనస్థము గావించునా? అన్నకు ప్రాణసమానుడైన పెద్దన నిరవద్యునియొక్క దురాక్రమణను సహించునా? అతనిది దురాక్రమణయే యగుచో నిరవద్యుడు తనయన్నకు ప్రాణసఖుడైన పెద్దనను గ్రామ నాయకునిగా ఆమోదించునా? అట్టి సందర్భము లలో క్రొత్తనాయకులను నియమించుట క్రొత్తరాజులకు పరిపాటి. తటస్థనాయకులను మార్చరు. కనుక పెద్దనకు సంబంధించిన సంభాషణము గొణగయ్యతోటి కాదనియు, గొణగయ్యను నిరవద్యుడు పాలదోల లేదనియు చెప్పవలసియున్నది. నిజమునకు రాష్ట్రకూట గోవిందరాజుయొక్క ధాటికి నిలబడలేకనే గొణగబిజ్జయ వేములవాడ అరికేసరి ప్రాపు జొచ్చినట్లు వేములవాడ శాసనం చెప్పుచున్నది.[4] "కృద్ధే గోవిందరాజే శరణముపగతో రక్షితో యేన బిజ్జః" అట్లే పంపనియొక్క విక్రమార్జున విజయమునగూడ అరికేసరి యిట్లు కీర్తించబడెను. "చళుక్యకుళ తిళకనప్ప విజయాదిత్యంగె గోవింద రాజం ముళియె తళరదె పెఱగిక్కికాద శరణాగత జలనిధియ పెంపుమం" [5] ఈ విశేషమును శ్రీ సో. సూ. గారలు కూడ చెప్పిరి. కాని తమ కాలక్రమాని కడ్డువచ్చునని రాష్ట్రకూట గోవిందుని మాటచెప్పక రాష్ట్రకూటుల ఆగ్రహమునకని మాత్రము చెప్పిరి. అంతకుముందు 'అనేక సమర సంఘట్ట భుజాసి భాసురుండై తమయన్న రాజ్యశ్రీ కెల్లందానయరుహుండై' అను కొరవి శాసనాం శము నాధారముగగొని నిరవద్యుడు తనయన్నను కూలద్రోసియే బలిమిని రాజ్యమాక్రమించినట్లు తెలియుచున్నదని తీర్మానించిరి. వారు చూపిన 'అనేక సమర' ఇత్యాది ఆధారవాక్యమునుండి నిరవద్యుని దురాక్రమణను నూహింపజాలము. పైగా గోవిందుని కోపమే గొణగుని పారిపోవునట్లు చేసెనని పంపభారతము, వేములవాడ శాసనము ఉద్ఘోషించుచున్నవి. నిరవద్యుని కొరవిశాసనంలో గొణగయ్య—పెద్దనల యేనాటి సంభాషణమునో యూహించుట కష్టము. నిరవద్యునిది దురాక్రమణము కానేరదు. పెద్దనతోటి సంభాషణ నిరవద్యునిదే కాని గొణగయ్యదికాదు. గొణగయ్య సంభాషణ కిచట సందర్భము చెప్పజాలము. గోవిందుని ధాటికి భయపడి గొణగయ్య పారిపోగా నిరవద్యుడు ఉపాయాంతరమవలంబించి కొరవికి రాజయ్యెను. పెద్దనచేత ముదుగొండ సల్కులెవరు రాజైనను తన కభ్యంతరము లేదనిపించుకొని పన్నులగూర్చి తెలుపుచు యీ శిలా శాసనమును నిరవద్యుడు వేయించెను. పెద్ద శాసనములోని రెండు, మూడు వైపులను పైవిధముగ మార్చిన బాగుండునని తోచును.

**ఎప్పుడు వేయించెను?**

శ్రీ సో. సూ. గారలు కొరవి శాసనకాలమును సరిగా నిర్దే శించలేదు. కాని కంప్యూటరు లెక్కవిధానములో గొణగయ్యను క్రీ. శ. 895నుండి 910వరకు 15 సంవత్సరములు అధికారయుతునిగను ఆపైన 935వరకు 25 సంవత్సరములు జీవచ్ఛవముగ కొరవిలోనో వేములవాడలోనో తెలియకుండ దాచియుంచిరి. క్రీ. శ. 930లో రాజ్యాలకువచ్చిన రాష్ట్రకూటరాజగు గోవింద చక్రవర్తిచేత తరుమ బడుట, వేములవాడరాజగు అరికేసరిచేత రక్షింపబడుట అను రెండు ఘనమైన చారిత్రక విశేషములు ఆ గొణగయ్యకు జరుగవలసియున్నవి గనుక వానికా త్రిశంకు స్వర్గమవసరమని వీరు భావించియుందురు. మఱియొక విశేషమేమన వీరి కాలక్రమ విధానంలో కొడుకుతోకూడ వెళ్లి వేములవాడలో స్థిరపడిన గొణగయ్య, అతనికొడుకు బద్దెగుడు క్రీ. శ. 941 వరకు కాలక్షేపం చేస్తుంటే గొణగయ్య రెండవ కొడుకగు (రెండవ) కుసుమాయుధుణ్ని క్రీ. శ. 935 నుండి పినతండ్రియైన నిరవద్యుని అనంతరము కొరవిపాలకునిగ జూపిరి. ఇందుకొరకు కూడ గొణగయ్యను క్రీ. శ. 935వరకు జీవింపజేసిరి. ఇంతకు, నిరవద్యుడు అధికారంలోకి వచ్చుటగాని అధికారం నుండి చ్యుతుడగుటకుకాని సరియగు కారణములను వీరు వివరించలేదు. కొరవిశాసనమునుండి వీరు నిరవద్యుని పేరుమాత్రము గ్రహించి వానికి పెడగా చోటుకల్పించి గొణగయ్య తటస్థదశలో నిరువదైదేండ్లు పాలకునిగ జూపిరి. తరానికి 15, 20, 25 సంవత్సరాల అగతిక సిద్ధాంతాన్ని స్వీకరించుటవలన వీరి కాలక్రమ నిర్ణయవ్యాసంలో కొరవి శాసనం యొక్క చారిత్రక ప్రాముఖ్యము మరుగుపడింది. అయినను ఒకే చాలుక్యభీముని కాలంలోకి కొరవిశాసన విషయాలనంటి సరిపెట్టి లాఘవాన్ని సాధించారు.

చెన్నూరు శాసనాన్ని వివరిస్తూ శ్రీ. సో. సూ. గారలు మఱియొక విచిత్రమైన అభిప్రాయము వెలిబుచ్చిరి. గొణగయ్య తన కొడుకగు బద్దెగునికి ఈ పేరును వేములవాడ చాలుక్య రెండవ అరికేసరి పూర్వికులలో నొకడగు సొలదగండ బద్దెగునినుండి గ్రహించి యుండునని వ్రాశారు. ఆ సొలదగండబద్దెగుని కాలం క్రీ. శ. 850–895 మధ్యయనికూడ వ్రాసిరి. దీనివలన గొణగయ్యకు పూర్వమునుండి వేములవాడ రాజులక్రింద సామంతత్వమున్నట్లు తెలిపిరి. కొరవిశాసనాన్నిబట్టి ఆ గొణగయ్య మఱల చాలుక్యభీముని (అంటే ఆ సొలదగండ బద్దెగునికి విరోధియైన భీమునికి) సామంతు డయ్యెననియు, మఱల వేరొక క్లిష్ట పరిస్థితిలో ఆ భీముని యను గ్రహమునకు దూరమై వేములవాడ రాజులయండ చేరినట్లు భావించు టకు అవకాశము గలదనిరి. అంటే రాష్ట్రకూట గోవిందుని దండ యాత్రకు పూర్వమే చాలుక్యభీముని కాలంలోనే క్రీ. శ. 910లో పదచ్యుతుడయ్యో కాకనో కొరవిలో నిరవద్యునిచేత తరుమబడి యుండునని కాబోలు వీరి తాత్పర్యము. మఱి గోవిందునిచేత క్రీ. శ. 930 తరువాత ఈ గొణగయ్య తరుమబడుట యెందుకో వీరు సరిగా తెలుపలేదు. అరికేసరిపైగల కోపముతో నతనియనుయాయి గనుక గొణగయ్యను గోవిందుడు కొరవినుండి తరిమివేసె ననుకొంద మన్నను, నిరవద్యుడిదివరకే చాలుక్య భీమునికాలంలో అంటే క్రీ. శ. 910 ప్రాంతంలోనే తరిమివేసెనుగదా. అందులకే గొణగయ్యకు వీరు కల్పించిన క్రీ. శ. 910నుండి 935 వరకుగల 25 దేండ్లకాలము త్రిశంకు స్వర్గమువంటిదని చెప్పి యెటు వీలగుచో నటు సర్దుకో వచ్చని వీరితలంపు కావచ్చును.

ఇది యంతయు బద్దెగుని పేరుపై నాధారపడి చేసిన యూహయేగాని వేరొక చరిత్రాధారము దీనికి మృగ్యము.

వారొసగిన కాలక్రమయుక్త వంశక్రమము.

- కొక్కిరాజు
- రణమర్దుడు
  - మొదటి కుసుమాయుధుడు (క్రీ. శ. 870–895)
    - గొణగ విజయాదిత్యుడు (క్రీ. శ. 895–935 పాలన 910 వరకే)
      - బద్దెగుడు (క్రీ. శ. 935–941)
      - రెండవ కుసుమాయుధుడు (క్రీ. శ. 935–955)
        - విజయాదిత్యుడు II క్రీ. శ. 955–970
          - మూడవ కుసుమాయుధుడు (క్రీ. శ. 970–985)
            - గొనగ లేక కరియగొనగ (క్రీ.శ. 1000–1025)
            - నిజ్జయరాజు (1025–1050)
              - నాల్గవ కుసుమాయుధుడు (క్రీ. శ. 1050–1075)
                - బేతరాజు (క్రీ. శ. 1075–1100)
                  - 5వ కుసుమాయుధుడు (క్రీ. శ. 1100–1125)
                    - బొట్టు బేతరాజు (క్రీ. శ. 1125–1150)
                      - కుసుమాదిత్యుడు (క్రీ. శ. 1150–75)
                      - నాగతిరాజు (క్రీ. శ. 1175–1200 లేక 1218)
            - మల్లపరాజు
            - లోభచళక
          - బొట్టు బేతరాజు (క్రీ. శ. 985–1000)
    - నిరవద్యుడు (క్రీ. శ. 910–935)

మునిగొండ చాళుక్యుల చరిత్ర రచనకు కొరవిశాసనం ఆయువు పట్టువంటిది. అట్టిదానిని సమన్వయ పఱచుటలో బరిశోధకులు పరిపరి మార్గములను సూచించుచుండిరి. బెండాల్ ప్రకటించిన మొగలిచెఱువుల శాసనంతోబాటు ఈ కొరవి శాసనాన్ని జతపర్చాలని పలువురు ప్రయత్నించారు. కాని కుదురలేదు. వీటికితోడు ఇటీవల వెలువడిన క్రివ్వక తామ్రశాసనము, దానినుండి గూడూరు శాసనంలోని బొట్టు బేతరాజుయొక్క గుర్తింపు సాధ్యమగునేమోనని భావించి నేనుకూడ కొంత యత్నించితిని[6] గూడూరు శాసనంలో గరుడ బేతరాజును కాకతీయ మొదటి బేతరాజుగ గుర్తించి వానికి సమకాలీనుడగు బొట్టుబేతరాజు క్రివ్వక శాసనంలో కుదరకపోవుటవలన నేను వేరొక బొట్టుబేతరాజును ఆ చాళుక్య వంశములో నూహించి కల్పించితిని. శ్రీ సో. సూ. గారలుకూడ వారి భారతి వ్యాసములో (జనవరి) నట్లే చేసిరి. కాని వీరిలో నొకరగు శ్రీ కొల్లూరు సూర్యనారాయణ గారు గత డిశంబరులో గుంటూరులో జరిగిన ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెసులో గూడూరు శాసనంలో గరుడ బేతరాజు లేడనియు అందు చెప్పబడిన వాడు కాకతి రెండవబేతరాజనియు తీర్మానించుచు నొక ఆంగ్లవ్యాసమును జదివిరి. 'మునయశ్చభిన్నాః మతయశ్చభిన్నాః' అన్నట్లు డా. సోమసుందరరావుగారొక మతమును, శ్రీ సూర్యనారాయణగారొక మతమును విడివిడిగా సమర్థించుచు కాబోలు ఉమ్మడిగానే రెండుమతములను అనగా (1)గరుడబేతని అంగీకరించుచు వాని సమకాలీనుడుగ క్రివ్వక శాసనంలోలేని వేరొక బొట్టుబేతను నావలె కల్పించుచు భారతి వ్యాసంలోను, (2) గూడూరు శాసనంలో గరుడ బేతరాజు నంగీకరించకుండ క్రివ్వక శాసనంలోనున్న యొక బేతరాజుతోనే సరిపెట్టుతూ ఆంగ్లవ్యాసంలోను వ్రాసిరి. కనుక నీయంశములో వారికింకను నిశ్చితాభిప్రాయము కుదురలేదని స్పష్టమగుచున్నది. దీనినిగూర్చి మఱల చెప్పెదను.

కొరవిశాసనంలోని చరిత్రాంశాన్నికూడ నిట్లే సర్దుబాటు చేసుకొన్నారు. వారి కాలక్రమంలో గొణగయ్యను క్రీ. శ. 895నుండి 910వరకు 15నేండ్లకాలను అధికారములోను ఆతరువాత 935 వరకు 25దేండ్లు అధికారములేకుండ జీవచ్ఛవముగ నుంచిరి. అంటే ఆ గొణగయ్యకు క్రీ. శ. 930లో రాజ్యానికి వచ్చిన రాష్ట్రకూట గోవిందునికి భయపడి పారిపోవటం, వేములవాడ రెండవ అరికేసరిచేత రక్షణపొందటం అనే అంత్యక్రియలు జరుగవలసి యున్నవి కనుక వానికి 25దేండ్లు జీవచ్ఛవదశ తప్పదన్నారు. ఈ దశలో కొరవిశాసనంలోగాని వేరేకానరాని నిరవద్యుని కాలాన్ని సరిపెట్టారు. ఇట్లుజరుగుటకు తగిన రాజకీయ కారణమెట్టిదో వారు నిర్దేశించి చెప్పలేదు. అంతేగాక ఇద్దరు గుణగయ్యలను వారి తమ్ములయిన యిద్దరు నిజ్జయరాజులను రెండుసెట్లుగా జూపించి విషయ గౌరవాన్ని కల్పించిరి. దీనితో వారు ఒకే చాళుక్య భీమునితో కొరవి శాసనాన్ని సరిపెట్టే యే లాఘవాన్ని సాధించామనుకొనిరో అదికాస్తా యీ జెప్పిన 'గుణగయ–నిజ్జయ' రెండుసెట్ల కల్పనతో పరాభూతమైంది.

శ్రీ సో. సూ. గారలు నిర్ణయించిన యీ కాలక్రమ–వంశక్రమ పట్టికలో కొరవిశాసనానికి సంబంధించినంతమటుకు ఒక్క చాళుక్య భీముని కాలంనాటికి ఆ శాసనకాలాన్ని సర్దుబాటు చేయటమన్న లాఘవాన్ని సాధించారన్నమాట తప్పితే యీ యనుపపత్తులు అదనముగా సంప్రాప్తమగుచున్నవి.

1. గొణగయ్యయొక్క కాలాన్ని కొంత నిశ్చితాధికారంతోటి కొంత అనిశ్చితాధికారంతోటి దాదాపు 15+25 దేండ్లుచూపుట.

2.వివాహాది బాంధవ్యములతోగూడ రాష్ట్రకూటులకు అత్యంత సన్నిహితులైన వేములవాడ చాళుక్యులతో సొలదగండబద్దెగుని నాటినుండి చేతులుకలిపిన గొణగయ్యను చాళుక్య భీముడు దగ్గరకు తీయుట మఱల బహిష్కరించుటయను విషయమును ఆధారము లేకుండ నిరూపించలేము. ప్రస్తుతమట్టి ఆధారములేదు.

3. నిరవద్యుని అధికారము కొరవిలో 25దేండ్లు సాగిన పిదప అంతరించెననుటకు వానిప్రసక్తి యితరచోట్ల గానరాకుండుటయే ప్రధానకారణమని వారు చెప్పవలెను. వానికది నిజనామముగాక బిరుద నామమగుచో ఆ కారణముచెల్లదు. ఆ కాలములో నిరవద్యుడను బిరుదు ఆంధ్ర–కర్ణాట రాజులకు కొందరికి చెల్లుచుండెడిది. ఈ కొరవిశాసనం రెండవవైపు మొదటిపంక్తిలోనే అది యుండుటచేత దానికి పూర్వము కొంతశాసనము నష్టమైనదనుట స్పష్టము. కనుక అతని పేరుకూడ ఆ నష్టభాగములో నుండినను నుండవచ్చును.

4. అన్నిటికన్న ముఖ్యమైనది. గొణగయ్య పెద్దకొడుకు బద్దెగుడు పోదననాడులో వేములవాడ చాళుక్యులక్రింద క్రీ. శ. 935 941 మధ్యకాలంలో సామంతుడుగా నుండగా వాని తమ్ముడు రెండవ కుసుమాయుధుడు ఆ 935నుండి 955వరకు నిరవద్యుని తరువాత కొరవి పాలకుడుగ నుండుటలో నౌచిత్యముగానరాదు. వేములవాడరాజుల అండతోనా, వేంగిరాజుల అండతోనా లేక స్వతంత్రుడుగనా అతను ఇక్కడ పాలకుడుగాను తరువాత వంశకర్తగాను స్థిరపడుటయను అంశమునకు సరియగు సమాధానములేదు.

5.గొణగయ్య, నిరవద్యుడు, బద్దెగుడు, కుసుమాయుధుడుII ఈ నలుగురి కాలాన్ని యింత గజిబిజి చేసినా సరియగు కాలక్రమము కుదురలేదనిపించు చున్నది.

6. గోవిందచక్రవర్తికి భయపడి పారిపోవునపుడు గొణగయ్య స్వతంత్రాధికారములేక నిరవద్యునికి పోటీగా సుమారు 25 దేండ్లు క్రీ. శ. 910–935 నామమాత్రాధికారము గలిగి జీవచ్ఛవమై యుండెనని చెప్పిరి. ఆ పరిస్థితిలో గోవిందుడు నిరవద్యుని తరిమి వేయవలెనుగాని అధికారములేని గొణగయ్యను తరుమవలసిన అవసరము లేదు. నిరవద్యుడు అప్పటి వేంగిరాజైన రెండవ యుద్ధమల్లునికి తద్వారా గోవిందునికి మిత్రుడని చెప్పెదురేమో. చెప్పవచ్చుగాని గొణగయ్యను రక్షించిన ఘనత అరికేసరికి క్రొత్తదికాక తనతండ్రి తాతలనాటిదేయై పంపనిపొగడ్త నిరర్థకమగును.

ఇంక నావాదమును వివరించెదను.

మొగలిచెఱువుల శాసనంలోగాని క్రివ్వక శాసనంలోగాని వంశావళులు సంపూర్తిగలేవని తోచుచున్నది. కొరవిశాసనంలోని గొణగయ్య, నిరవద్యుడు, చెన్నూరి శాసనంలోని బద్దెగుడు, నారాయణగిరి

శాసనంలోని గొణగుము, యింకా కొందరిని యూహించి గుర్తుపట్ట వలసివచ్చుచున్నది. మొగలి చెఱువుశాసనంలో పేర్కొనబడిన రణమర్దుడు కొక్కిలి తమ్ముడట. బాదామి చాలుక్య వంశంలోని మొదటి విక్రమాదిత్యునికి కొక్కిలియను బిరుదుగలదు.[7] అతని శాసనాలు కొన్ని తెలంగాణం మహబూబునగరం జిల్లాలో దొరికినవి.[8] రణరాగుడని మొదటి పులకేశి తండ్రిపేయను, రణవిక్రముడను మొదటి పులకేశి బిరుదును, రణపరాక్రముడని మొదటి కీర్తివర్మ బిరుదును, రణవిక్రాన్తుడను మంగళేశుని బిరుదును, బట్టి చూడ మన రణమర్దుడుకూడ ప్రాచీన చాలుక్యులకు చెందిన వాడని తోచును. కొక్కిలి విక్రమాదిత్యునికి (I)సహాయముచేస్తూ అతని తమ్ముడైన యీ రణమర్దుడు ఈ మంచికొండ విషయమునుగూడ జయించి చాలుక్య సామ్రాజ్యములో గలిపియుండును. ఈ సందర్భమున మొగలి చెఱువు శాసన వాక్యాలు గమనించదగియున్నవి.

> 'భ్రాతా హ్యరక్ష న్నిఖిలాం ధరిత్రీం నిష్కణ్టకీ కృత్యస
> కొక్కిరాజః;
> పొలకేశి రస్యవాదీ దనుజాన్ప్రతి బద్ధపట్ట మవన్తుమత్పౌత్ర
> పౌత్రా
> ణామితి సామన్త సన్నిధౌ। తత్రాన్వయే భూపతి రావిరాసీ
> ద్రణేషురామో రణమర్దనామా యత్కణ్ఠికాం చారుచలుక్య
> వంశోధత్తే హృది స్వాం కులదేవతాంచ। మంచికొండవిషయం
> మనోహరం కొండపల్లి మపిచ క్రమాగతః తత్రతత్రత నవశాసని
> కృతాం గ్రామసంపద మథాన్య భుంక్తవాన్। కొక్కి
> రాజవైరీన్నిర్జిత్య తత్సుతా[నవనమ్యన]నృపవరంః। తత్సూనుః
> కుసుమాయుధః। ... ...'[9]

ఈ వాక్యములనుండి తెలియునదేమన, కొక్కిరాజు సోదరునితో భూమిని నిష్కంటక మొనర్చి పాలించుచుండెను. పొలకేశిరాజు కూడ తన వంశమున పట్టబద్ధుడైన జ్యేష్ఠుని కనిష్ఠసోదరులు సహాయ మొనర్చి కాపాడుచుండ వలెనని చెప్పెనట. ఆ ప్రసిద్ధ వంశములో రణమర్దుడు పుట్టి రాజవంశచిహ్నముగ నొకకణ్ఠియను ధరించెడివాడు. దానిని ఆ వంశము వారు కులదేవతతోబాటు హృదయమున ధరించుదురు. అతడు మంచికొండ విషయమును, కొండపల్లిని నూతనముగ జయించి గ్రామములందు తన యధికారము నెలకొల్పెను. కొక్కిరాజ వైరులను నిర్జించి(సుఖముగా బాలించుచుండెను)అని. దీనిని బట్టి ప్రాచీన చాలుక్యరాజుల బిరుదముల బోలిన 'రణమర్ద' నామ సామ్యతో బాటు కొక్కిరాజానుజుడగుట,పులకేశివల్లభుడు కుబ్జవిష్ణువర్ధనునితో వలె పట్టబద్ధులైన రాజులు వారి తమ్ములు అన్యోన్యమైత్రిని పాటించుచుండవలెనను సూక్తిని ఆ పులకేశివల్లభుడు చెప్పినట్లు స్మరించుట, తూర్పు తెలంగాణము బాదామి చాలుక్యుల యధీనము లోనికి కనీసము 7, 8 శతాబ్దులలోనైన వచ్చియుండునను ఊహతో నీ రణమర్దుడు పులకేశివల్లభునికి, మొదటి విక్రమాదిత్యునికి కడు

సమీప పురుషాంతరములలోనివాడై యుండునని భావించి నిశ్చిత ఆధారాంతరము లభించువరకు వేచియుండుట మంచిదని నేనీరణమర్దునికి కాలనిర్దేశము చేయజాలకపోతిని. అట్లే క్రివ్వక శాసనకాలము క్రీ. శ. 1198 ప్రాంతమున కించుమించుగా సరిపెట్టగలిగినను గూడూరు శాసనములోని బొట్టు బేతరాజును, చాలుక్య భీముని కాలమునాటి గొణగయ్యను ఇప్పటికి తెలిసిన వంశావళులలో జొప్పించుట నాకు కష్టమనిపించెను. వీటికితోడు మొగలి చెఱువుల శాసనములో కడపటి రాజుల పేర్లను, వారి బాంధవ్యమును బెండాలు మహాశయుడు సరిగా పరిష్కరించక నానా భ్రష్టు చేసిపెట్టెను. ఆ భాగమిట్లున్నది.

"కొక్కిరాజవైరీన్నిర్జిత్య తత్సుతానానమ్య[స]నృపవరః (=రణమర్దుడు)
తత్సూనుః కుసుమాయుధః, తదాత్మజో బిజయితః, తత్సుతః కుసుమాయుధోవినీత జనాశ్రయః, తత్సుతో విజయాదిత్యః, తత్సుతః కుసుమాయుధః, తత్పితామల్లపరాజః (దీనిని మల్బదురాజని పొరపాటు చదివెను), తదనుజో లోభ చళకః, తస్యాగ్రజో నిజ్జయరాజనామా బభూవ వీరోద్ధృతభూమి భారః"

ఇచట గుర్తించిన భాగమునకు ముందున్నది కుసుమాయుధుడు. మఱల అతని తండ్రి మల్లపరాజనుట అసంగతము. తండ్రి పేరు అంతకుముందేయున్నది కదా. అట్లే లోభచళక పేరు చెప్పుట అనవసరము. చెప్పాడు గనుక అతనికి కొంత ప్రాముఖ్యాన్ని చెప్పాలి. అతని అగ్రజుడు నిజ్జయరాజట. అగ్రజుడంటే అన్నగారని, పెద్ద కొడుకని ప్రయోగములు శాసనములందు కనుపించును.[10] ఇట్లే మొదటి భాగంలో 'యత్కన్యకాం చారు చళుక్యవంశోద్భత్తే హృది (స్వాం) కులదేవతాం చ' అని యొక తప్పుడు పాఠమును ప్రకటించి ఆ రణమర్దుని అల్లుడుగాని, వేఱొకని అల్లుడుగాని యీ వంశకర్త యైనట్లు చెప్పి మన చరిత్ర రచయితలను అపమార్గము పట్టించెను. నిజమునకది 'యత్కిర్త్కాంచారు...' అయియుండునని నేను సూచించగా వెనుక డా. వేంకట రమణయ్యగారు ఆమోదించిరి. అట్లే మల్లపరాజనుటకు బదులు మల్బదురాజని తప్పుడు పాఠాన్ని చదివాడు. పూర్వం 'ల్ల' వత్తు ఇప్పటి మన 'బ' వలె నుండెడిది. ఇట్టి లోపములను కొన్నింటినైన సరిచేయుదమన్నను ఆ రాగిరేకులు లభ్యమగుటలేదు. ఇంతకు లోభచళకను పేర్కొనవలసిన యవసర మేమో తెలియదు. ఆ తరువాత నతని అగ్రజుడు లేక అన్న యని నిజ్జయరాజును జెప్పుట యింకను విచిత్రము. ముందు అన్నపేరు చెప్పిగదా తమ్ముని పేర్కొనుట. అదిన్నీ ఆ తమ్మునిగూర్చిన విశేష మేదైన యున్నపుడే అట్లు అతనిని పేర్కొనుట యుచితము. అట్టి విశేషములిందు జెప్పబడలేదు. కనుక మనమిప్పుడు గ్రహించుచున్న క్రమము తప్పు. అగ్రజుడంటే పెద్దకొడుకని అర్థమగుచో నిజ్జయ రాజు లోభచళకకు పెద్దకొడుకగును. ఇచట సందేహము.

III కుసుమాయుధుడు

గొణగయ్య | నిజ్జయరాజు | మల్లపరాజు | లోభచళక

అనే క్రమము బెండాల్ చేసిన అపభ్రంశ పరిష్కరణముపై నాధార పడినదేకాని యీ రాజుల నిజమగు సంబంధమెట్టిదో మనకీనాటివరకు తెలియదనియే చెప్పవలెను. కనుక మొగలి చెఱువుల తామ్రశాసన మందలి రణమర్దునినుండి నిజ్జయరాజు వరకుగల రాజుల కాలక్రమ నిర్ణయమసాధ్యమని యెంచి నేను వారి కాలముల నియ్యలేదు. శ్రీ సో. సూ. గారలు రణమర్దుని కాలమును సుమారు క్రీ.శ. 850గా నిర్ణయించిరి. కాని పైన తెలిపిన యుపపత్తులతో వాని కాలమును నేను సుమారు క్రీ. శ. 700 ప్రాంతమైయుండునని తలంచు చుంటిని. లేనిచో వారి మతమున విష్ణుకుండినుల యనంతరము అనగా క్రీ. శ. 600 నుండి 850 వరకు రెండున్నర శతాబ్దులు తూర్పు తెలంగాణము చరిత్ర శూన్యమనవలసియుండును. అంత దీర్ఘకాలమునకు చెందిన చరిత్రాధార మొకింతయైనను లభించ కుండునా ? ఆ ప్రాంతము పూర్తిగ జనావాసయోగ్యము కానట్టిది కాదు. ఇంక నేను భావించినట్లు రణమర్దుడు క్రీ. శ. 700 ప్రాంతమువాడనుకొన్నచో అచటి చరిత్రకు గోచరించని కాలవ్యవధి నూరేండ్లు మాత్రమే కాగలదు. క్రీ. శ. 670 నాటికే నేటి ఖమ్మం జిల్లాకు నలువైపుల యిమ్మడి పులకేశివల్లభుడు, అతని కొడుకు కొక్కిలి విక్రమాదిత్యుడు (1) చాలుక్యాధికారము నెలకొల్పి యుండిరి. మధ్యనున్న యీ భాగము యితరుల యధికారములో నుండుటను సహించరు గదా. అప్పట్లో వారిని మించిన గొప్పరాజు మొత్తము దక్కనులోనే లేడు. అట్టివాడొకడు ఖమ్మం ప్రాంతంలో నున్నచో తెలియకుండునా. పోనీ యీ ప్రాంతము మొదట తూర్పు (వేంగి) చాలుక్యుల పాలనలో నుండెననుకొనుటకు కూడ తగిన ఆధారములేదు. పులకేశివల్లభుని పుత్రపౌత్రుల ప్రసక్తి మొగలి చెఱువుల శాసనములో గనుపించుటచేత నీ ముదిగొండ శాఖవారు పులకేశి వంశమువారే కాని కుబ్జవిష్ణువర్ధనుని సంతతిలోనివారు కారు. కనుక రణమర్దునికి శ్రీ సో. సూ. గారలూహించిన సుమారు క్రీ. శ. 850 నాటి కాలము అంగీకారయోగ్యము కానేరదు. అట్లే కొరవి శాసనంలో పేర్కొనబడిన కుసుమాయుధుడు మొదటి కుసుమాయుధుడని గుర్తించుట బాగులేదు.

కొరవి శాసనాన్ని నిరవద్యుడెపుడు వేయించెనను ప్రశ్నకు సమాధానము చెప్పవలసియున్నది. క్రీ. శ. 934 ప్రాంతములో నతడీ శాసనమును వేయించియుండునని నేను చెప్పితిని. అప్పటివరకు తన యన్నయగు గొణగయ్యయే కొరవిలో రాజ్యము చేయుచుండెను. క్రీ. శ. 934లో నేర్పడిన రాజకీయ విషమస్థితుల బురస్కరించు కొని నిరవద్యుడు కొరవికి రాజయ్యెను. ఆనాటి రాజకీయముల నొకింత పరిశీలింతము.

1. రాష్ట్రకూట రాజకీయములు: క్రీ. శ. 914 నుండి 928వరకు నిత్యవర్ష బిరుదాన్వితుడైన ఇంద్రవల్లభుడు(III) రాజ్య మేలెను. అతని యనంతర మాతని పెద్దకొడుకైన రెండవ అమోఘ వర్షుడు రాజయ్యెను. కాని యితని యధికారము త్వరలోనే యంత మొందించి క్రీ. శ. 930 మొదటి భాగములో నతని తమ్ముడగు నాల్గవ గోవిందుడు రాష్ట్రకూట సింహాసన మధిష్ఠించెను. ఇతనికి ప్రభూతవర్షుడను బిరుదనామము గలదు. క్రమాగతమైన అన్న

రాజ్యము నపహరించుటచేత నీతినియందు అనుకూలురుకంటె ప్రతి కూలురైన సామంతులు, దాయాదులు అధికమయిరి. దానికితోడు గోవిందుడు భోగలాలసుడును, రాజనీతి నెరుగనివాడును అగుటచేత కొలది కాలములోనే శత్రువ్యూహములలో తగుల్కొని పదభ్రష్టుడు కావలసి వచ్చెను. మంత్రులు, సేనాపతులు ఇతని యాజ్ఞను పాటించువారు గాకుండిరి. దానికితోడు తను స్వయముగ కొన్ని చిక్కుల దెచ్చిపెట్టుకొనెను. క్రీ. శ. 934 ప్రాంతమున వేంగిలో లోగడ యింద్రవల్లభుడు సింహాసన మెక్కించిన రెండవ యుద్ధమల్లుని తొలగించుటకై న్యాయముగ సింహాసనాధికారముగల చాళుక్యభీముని సంతతివారు గట్టి ప్రయత్నము సలుపుచుండిరి. ఆ వివాదములో గోవిందుడు యుద్ధమల్లునికి ప్రత్యర్థులైన ముదిగొండ సోదరుల నెదుర్కొనెను. వేములవాడ రాజైన రెండవ అరికేసరి క్రీ. శ. 930 ప్రాంతములో రాజ్యానికి వచ్చెను. ఇంద్రవల్లభుని కితడు అల్లుడు. ఇతని తండ్రి యగు రెండవ నరసింహుడు ఆ యింద్రుని చెల్లెలిని వివాహమాడుటచే వారి కొడుకగుటచే నరికేసరి యింద్రవల్లభునికి మేనల్లుడుకూడ నగును. రాష్ట్రకూటులతో నిట్టి సన్నిహిత బాంధవ్యముగల అరికేసరి గోవిందుడు అన్నయగు అమోఘవర్షుని పదభ్రష్టుని గావించుట సహించక గోవిందుని సింహాసనమునుండి తొలగించుటకై గట్టి ప్రయత్నము చేయుచుండెను.

2. వేంగి రాజకీయములు: మొదటి చాళుక్యభీము డతి ఘనతతో రాజ్యముచేసి క్రీ. శ. 922లో మృతినొందెను. అతని పెద్ద కొడుకైన కొల్లభిగండ బిరుదాన్వితుడైన నాల్గవ విజయాదిత్యుడు వేంగి సింహాసనమధిష్ఠించెను. కాని రాజ్యాధికారము చేపట్టిన వెంటనే కళింగమువైపునుండి జరుగుచున్న దురాక్రమణ నణచుటకై యుద్ధమునకై దండెత్తి వెడలి యచట మృతుడయ్యెను. వెంటనే అతని పెద్దకొడుకైన మొదటి అమ్మరాజు విష్ణువర్ధన బిరుదు వహించి వేంగిసింహాసన మెక్కెను. ఇతడు క్రీ. శ. 922లో సింహాసన మధిష్ఠించినది మొదలు దాయాద వంశమునకు చెందిన మొదటి యుద్ధమల్లుడు అతని కొడుకులు ఇతనిపై ననేక కుట్రలు పన్నుచుండిరి. సమర్థతతో వాటి నధిగమించుచు క్రీ. శ. 927–28 వరకు రాజ్యాధికారము వహించి చనిపోయెను.

అమ్మరాజ విష్ణువర్ధనుడు క్రీ. శ. 927లో చనిపోగానే యతని పెద్దకొడుకు కంఠికావిజయాదిత్యుడు సింహాసనమెక్కెను. అప్పటికితడు పిన్నవయస్కుడగుటవలన యుద్ధతంత్రములు నేర్వనివాడు. కొలది రోజులలోనే యితని పదభ్రష్టుని గావించి మొదటి యుద్ధమల్లుని కొడుకైన మొదటి తాడపుడు వేంగిసింహాసన మాక్రమించుకొనెను. కాని త్వరలోనే మొదటి చాళుక్యభీముని రెండవ కొడుకైన విక్రమాదిత్యుడు ఈ తాడపుని యుద్ధమున జంపి రాజయ్యెను. ఇతడు మిక్కిలి సమర్థవంతుడు. మొత్తము వేంగిరాజ్యము నంతను మఱల యేకీకరణ మొనర్చగలిగెను. అయినను సంవత్సర కాలము గడవకమునుపే తాడపుని కొడుకగు రెండవ యుద్ధమల్లుడు రాష్ట్రకూట యింద్రవల్లభుని సహాయముతో రెండవ విక్రమాదిత్యుని జంపి రాజయ్యెను. ఇతడారేండ్లు మాత్రము రాష్ట్రకూట గోవిందుని సహాయముతో రాజ్యము చేయగలిగెను. క్రీ.శ.928 నుండి 934వరకు వేంగి సింహాసనముపై నలుగురైదుగురు అధిష్ఠించిరి. రెండవ విక్రమాదిత్యుడు తప్ప వీరిలో నెవరును రాజ్యమునందు పరిపూర్ణాధికారము స్థాపించలేకపోయిరి. వేంగి నిట్లుంచుటయే రాష్ట్రకూటుల ధ్యేయము. ఆనాటి వేంగీశుల వంశావళి యిట్లు చూపబడెను.[11]

కలి విష్ణువర్ధనుడు

- గుణగ విజయాదిత్యుడు III (క్రీ. శ. 844–892)
- విక్రమాదిత్య I యువరాజుగనే మరణించెను
  - చాళుక్యభీముడు I (క్రీ. శ. 892–922)
    - కొల్లభిగండ విజయాదిత్య IV
      - పల్లవదేవికి
        - అమ్మరాజ I విష్ణువ. (క్రీ. శ. 922–27)
          - కణ్ఠికావిజయాదిత్యుడు (15 రోజులు)
      - మేళాంబకి
        - చా. భీముడు II (క్రీ. శ. 934–944)
          - + ఊర్జప
            - దానార్ణవ (క్రీ. శ. 970–73)
          - + లోకాంబ
            - అమ్మరాజ II (క్రీ. శ. 944–970)
    - విక్రమాదిత్య II 11 నెలలు మాత్రము (క్రీ. శ. 928)
- యుద్ధమల్లుడు I
  - తాడప I (క్రీ. శ. 927)
    - యుద్ధమల్లుడు II (క్రీ. శ. 928–934)

క్రీ. శ. 934లో వేంగి సింహాసనముపైనున్న రెండవ యుద్ధమల్లుని తొలగించుటకై మొదటి చాలుక్యభీముని సంతతిలోని వారందరు విడివిడిగా గట్టిప్రయత్నములు చేయుచుండిరి.[12] రాష్ట్రకూట గోవిందునికి శత్రువర్గ మధికమై యుద్ధమల్లునికి తగిన సహాయ మందించలేడని కూడ వీరి తిరుగుబాటుకు ముఖ్యకారణము. రాజవంశములలో జెలరేగు నిట్టి యంతఃకలహములు సామంత మాండలికులకు సంకటముగ నుండును.

వేంగిలో త్వరత్వరగా ననేకులు అధికారము వహించుట తొలగింపబడుటయు, ఆ యధికారము వహించిన వారుకూడ వేంగి రాజ్యమునంతను కూడగట్టుకొని పోగల సామర్థ్యములేని వారగుటయు క్రీ. శ. 927 తర్వాత నేర్పడెను. రెండవ యుద్ధమల్లుడు 928లో రాష్ట్రకూటుల సహాయమున రాజయ్యేనేగాని వానియధికారము రాజ్యమునందంతటను చెల్లుటలేదు. చాలుక్య మొదటి భీముని సంతతిలోని వారందరు తిరుగుబాటు ప్రయత్నము చేయుచుండిరి. ఆ భీమునియందు అభిమానముగల సామంతులు, మంత్రులు, దండనాయకులు యుద్ధమల్లుని దురాక్రమణను సహింపకుండిరి. కొరవిలోనే గొణగయ్యకూడ నట్టివారిలోనొకడు. వీరి తిరుగుబాటునుండి ఆపదనుశంకించి యుద్ధమల్లుడు రాష్ట్రకూట గోవిందుని సహాయము కోరెను. వారి బలముతోనే యింతవరకు నతడు నిలబడెను గనుక నట్టి మిత్రుని పదచ్యుతునిగాకుండ కాపాడవలసిన యవసరము శత్రువర్గము ప్రబలిపోవుచున్న గోవిందునికి తప్పనిసరియయ్యెను. కనుక రాష్ట్రకూట సైన్యము వేంగివైపు పయనమయి త్రోవలోనున్న కొరవినిముందు ఆహుతిగొనెను. ఇప్పుడు గొణగయ్య యెవరిని ఆశ్రయించవలెనో తెలియనిస్థితిలోపడెను. వేంగిలోనున్న యుద్ధమల్లుడు తనదృష్టిలో రాజద్రోహి. మిగిలినవారందరు తమ బలాబలములనింకను కూడగట్టుకొనలేకుండిరి. తన దృష్టిలో పిఠాపురము పారిపోయిన మొదటి అమ్మరాజు కొడుకగు కంఠికా విజయాదిత్యుడే వేంగికి నిజమగు వారసుడని యెంచియుండును. కాని అతడీ పోటీలో నెంతవరకు నెగ్గగలడోయను సందిగ్ధములో పడెను. ఇంతలో వేములవాడలో బలవంతుడై గోవిందునెట్లయిన పదభ్రష్టుని గావించవలెనని దృఢప్రయత్నము గావించుచున్న యిమ్మడి అరికేసరికి వర్తమానమంపి తన కాశ్రయమొసగవలెనని కోరెను. ఇట్టి సమర్థుడగు సామంతుడు, గోవిందునికి శత్రువు తనకప్పుడు మిక్కిలి అవసరమని తోచి యరికేసరి వెంటనే గొణగయ్యను తనవైపు చేర్చుకొని వెంటనే పోదననాటికి తనక్రింద సామంతునిగ నియమించి యుండును. అప్పుడుగాని యిరువురియందు దృఢవిశ్వాస మేర్పడదని అట్లు గొణగయ్యకు సామంతపదవి యిచ్చియుండును. ఇందుమూలమున కొరవిరాజ్యము వేంగీశులయాధిపత్యమునుండి విడిపోవునను ఆశకూడ అరికేసరికి యుండవచ్చును. ఇదియొక యూహ. అట్లుగాక కొరవి సోదరులిరువురు ఇమ్మడి చాలుక్యభీముని పక్షముచేరి యుద్ధమల్లుని కూలద్రోయుటకై సహాయ మొనర్చుచుండియుందురు. దానికాగ్రహించి గోవిందుడు ముందుగా కొరవిలో నధికారమునందున్న గొణగయ్యపై దాడిచేసి యుండును. ఆ రాష్ట్రకూటబలము నెదుర్చు శక్తిలేక గొణగయ్య వేములవాడకు పారిపోయి యుండును. వేంగిలో ధైర్యముచేసి ఆశ్రయించదగిన సమర్థులతని దృష్టిలో లేకుండురు. చాలుక్యరెండవభీముడు కొరవి తమనుండి చేజారిపోకుండుటకై గొణగయ్య తమ్ముడగు నిరవద్యుని తన పక్షమునకు త్రిప్పుకొనియుండును. తుదకా రెండవ భీముడే యుద్ధమల్లుని కడతేర్చి వేంగి సింహాసనమధిష్ఠించుట జరిగెను.' ఈ లోపుగా అరికేసరి గొణగయ్యను సామంత పదవిలో తన రాజ్యములో స్థాపించుకొని, రాష్ట్రకూట గోవిందునిపై యుద్ధమునకు తోడ్కొనిపోయి యుండును. చేదిరాజు, రాష్ట్రకూట మూడవ అమోఘవర్షుడు, అతని కొడుకు మూడవ కృష్ణుడు ఇదివరకే గోవిందునిపై తిరుగుబాటు యత్నములో నుండిరి. వీరితో అరికేసరి; గొణగయ్య కూడ కలిసి గోవిందుని వేంగి దండయాత్ర సాగనియ్యకుండ కొరవినుండియే తిరిగి పోవునట్లొత్తిడి కలిగించిరి. ఈ యదను చూచి చాలుక్య రెండవ భీముడు యుద్ధమల్లుని జంపి వేంగి సింహాసనమాక్రమించుకొనుటతోబాటు తన ప్రక్క నిలిచియున్న నిరవద్యుని కొరవిలో పునఃప్రతిష్ఠించెను. ఈ సందర్భముననే 'నిరవద్యుండనేక సమర సంఘట్టన భుజాసి భాసురుండై' అను పొగడ్తనొంది యుండును. కొరవి నాయకుడైన పెద్దన కూడ గొణగయ్య పారిపోయినపిదప అతని తమ్ముడగు నిరవద్యుని కొరవికి రాజుగ 'కొరవియన్నది ముదుగొండ నల్కులదే'నని చెప్పుచు నంగీకరించును. కొరవిలో ముదుగొండ నల్కులు నిలబడుటయే యతని ఆశయము. రాష్ట్రకూట సైన్యమును పారదోలుటలో నిరవద్యునికి వేంగి చాలుక్య సైన్యమునకు తోడ్పడియుండును. ఇట్టి మేలుచేసిన పెద్దన నాయకునకు ప్రత్యుపకారముగ పన్నులలో కొన్ని రాయితీలు ఇచ్చుచు పెరరాజులం జొచ్చుట పనికిరాదని శాసించుచు నిరవద్యుడు కొరవిలో తన యధికారమును స్థాపించుకొనును. దీనికి చాలుక్య రెండవ భీముని సహాయము కూడ పూర్తిగ కలదు. లేకున్నచో అరికేసరి సహాయముతో గొణగయ్య మఱలివచ్చియుండువాడే. అది జరుగకుండ రెండవ భీముడే నిరవద్యుని కాపాడెను. గొణగయ్య ధైర్యముతో నిలబడలేక పారిపోయిన పిదప నిరవద్యుడు మార్గాంతరమున కొరవిని తమ వంశమునకు దక్కించుకొనెను. ఇది దురాక్రమణ కాజాలదు. చాలుక్య మొదటి భీముని కాలమునుండి తమ చేతులలోనున్న కొరవిరాజ్యాన్ని వేములవాడ రాజులక్రింద సామంత మండలముగా రూపొందించుట నిరవద్యుని కిష్టము లేకపోవుటచేత అన్నయెడల గౌరవభావమున్నను గొణగయ్యను తిరిగివచ్చి కొరవిరాజ్యము చేపట్టుమని అడిగియుండలేదు. అన్న చేసిన కట్టడులనంటిని మన్నించుచు మఱికొన్నిటిని అధికముగా పెద్దన నాయకున కొసగుచు ఈ శాసనము క్రీ. శ. 934 లేక 935 లో వేయించియుండును. కొరవిని మొదట రాష్ట్రకూటులనుండి విడిపించి తమకిప్పించిన గౌరవము కొలది చాలుక్య మొదటి భీముని ప్రశంసించుచు శాసనము ప్రారంభించెను. ఆ భీమునియందు మనుమడైన

రెండవ భీమునికి కూడ గౌరవభావము పూర్తిగ నుండుటవలన తనను నిరవద్యుడు ప్రశంసించలేదని కోపగించడు. 'భీమసలుకి యందనేక వస్తువాహనంబుల్వడయుచు' అని నిరవద్యుడు రెండవ భీమునియెడ కృతజ్ఞతాభావమును తెలిపియేయుండెను. కనుక రెండవ భీమునికి చెందిన 'రాజమార్తాండ', 'రాజభీమ' మున్నగు బిరుదులు కొరవి శాసనంలోలేవను ఆక్షేపణ మంతలెక్కింపతగినది కాదు.

రాజకీయములలో నెప్పుడెపుడేయే మార్పులు వచ్చుచుండునో చెప్పుట కష్టము. జనతా ప్రభుత్వం వచ్చిన తర్వాత మన నాయకు లెందరు పార్టీలెట్లు మార్చుకొనుచు తమ భవిష్యత్తును భద్రము చేసికొను యత్నాలు చేస్తున్నారో మనకు బాగా తెలుసు. ఇవి యన్నియు చరిత్రగ్రంథాల్లోకెక్కవు. పూర్వకాలంలో యిట్టి మార్పులు పత్రికలు కాని వేరే రికార్డు చేయు పద్ధతిగాని లేనిస్థితిలో నాటి యీ రాజకీయ కల్లోలములు నేడూహించుటలో లోపములుండనే యుండును. అయినను కొరవి శాసనంవంటి రికార్డును క్రీ. శ. 934 లో జరిగిన రాజకీయ కల్లోలమునకు చెందినట్లు నేనూహించితిని.

కొరవిశాసనం మొదట్లో కన్నర బల్లహుని కన్నప్రాస్తంబయినది కుసుమాయుధుడేనని నేను తలంచితిని. రణమర్దకంఠియను మాత్రమే కన్నరు దూడదీసుకొనిపోడు కదా. చాలుక్య మొదటి భీమునితోనైన రెండవ యుద్ధములో కుసుమాయుధుడు రాష్ట్రకూట రెండవ కృష్ణుని చేతిలో మడిసెను. ప్రక్కనే యతని కొడుకగు గొణగయ్యయుండి ఆ మృతదేహమునుండి కంఠమును కత్తిరించి కంఠియను శిరస్సును పెరుక్కొని వచ్చెను. లేనిచో శత్రువులా శిరస్సు నూరేగించుచు అవమానపరచెదరు. ఇట్టి పరిస్థితిలో శిరస్సును శత్రువు చేజిక్కకుండచేయుటకై పూర్వము రాజులు తమ అప్తులను యుద్ధములలో ప్రక్కనుంచుకొనెడివారు. అట్లే యిచట గొణగయ్య తన తండ్రి శత్రువు చేతిలో చనిపోగా వెంటనే మృతదేహమునుండి శిరస్సును, వారి రాజలాంఛనమ్మైన రణమర్దకంఠియను తన భుజవీర్య బలపరాక్రమమున దెచ్చి ఆ కంఠియను తన సామంత సూచకముగ చాలుక్యభీముని మెడలొగట్టి (వారల తీసుకొనును) యతనితో సర్ధ రాజ్యమును బాలించుసంతతి మర్యాదను పొందిన కుసుమాయుధుని పెద్దకొడుకు (గొణగయ్య) అను నర్థమును ఆ మొదటి వాక్యానికి చెప్పవలసియున్నది. కృష్ణవల్లభుని మొదటి యుద్ధంలో కుసుమాయుధుడు భీమునికి తోడ్పడి బెజవాడ శాసన మిప్పించుకొనెను. కాని కొరవి శాసనంలో అర్ధరాజ్య మర్యాదను పొందినవాడు కుసుమాయుధుడు కాదు. అతని పెద్దకొడుకని చెప్పవలెను. రణమర్దసీమ యని కొందరు చెప్పిరి. కాదు. అది వారి రాజలాంఛనమ్మైన కంఠియ. దానినే శత్రువుకి చెందకుండ తండ్రి మృతదేహమునుండి గొణగయ్య పెరుక్కొని తెచ్చెను.

ముదిగొండనుండి మొదటిసారిగా కొరవికి రాజధానిని మార్చిన వాడు గొణగయ్య. అది చాలుక్య మొదటి భీముడు రాష్ట్రకూటుల నుండి వేంగికి కాపుగానుండుటకై చేసినపని. అందుచేత ఆ గొణగయ్య కొరవిపురవల్లభుడని సందర్భములేకున్నను, అతను ప్రధానవంశ క్రమములో లేకున్నను క్రివ్వక శాసనంలో కీర్తింపబడెను. గొణగయ్య, అతని కొడుకగు బద్దెగుడు వేములవాడ రాజ్యాంతర్గతమ్మైన పోదస నాటికి పాలకులుగ నిమ్మడియరికేసరికి సామంతులైరి. నిరవద్యుడు అతని సంతతివారే కొరవిలో స్థిరపడిరి. ఈ యంశమునుబట్టియే నేను నిరవద్యుడు, నిజ్జయుడు ఒకే వ్యక్తి కాదగునని చెప్పితిని. కాలక్రమ నిర్ణయానికనేకు లీశాసనములందు బేర్కొనబడలేదని నమ్మకముతో నేనా ప్రయత్నము చేయలేదు. శ్రీ సో. సూ. గారలు చేసిన కాలక్రమ నిర్ణయముగూడ సంతృప్తికరముగ లేదు. నారాయణ గిరి గుణగరసుడు ఈ వంశమువాడైనను కొరవివల్లభుడని కీర్తింప బడిన కొరవి శాసనంలోని గొణగయ్య కానేరడు. అక్కడనే శాసన రచయితలు క్రివ్వక శాసనంలో కొన్ని పేర్లు విడిచి యొకరి కొకరిని పొరబడుట జరిగియుండును. అట్టి లోపములలో జేరినదే గూడూరు బొట్టుబేతరాజు పేరు లేకుండుట కూడ.

నారాయణగిరి శాసనాన్ని నేను గిమనించకపోలేదు. అందున్న గుణగరసుడు తను సత్యాశ్రయ కులాన్వయుడనియు మహాసామన్తాధిపతి యనియు జెప్పుకొనెను. శాసనకాలము క్రీ. శ. 1004 కు సరియగును. ఈ గుణగరసును క్రివ్వక శాసనంలోని కరియగొనగునిగా శ్రీ సో. సూ. గారలు గుర్తించిరి. దానికి వారు చేసిన కాలక్రమ నిర్ణయము సరియగుచున్నది. కాని నా సందియమిది. అనేక పురుషాంతరములు గడిచినను, ప్రధాన వంశములోనివాడుగాకున్నను కుసుమాదిత్యుడి క్రివ్వక శాసనంలో కరియగొనగుడు కొరవిపుర వల్లభుడనియు నవనినొంచి నెగడినట్టి ఘనుడనియు (భూమిని జయించి వర్ధిల్లిన ఘనుడు) విశేషించి కీర్తింపబడుచు తమకు సాక్షాత్తు పూర్వీకుడైన నిజ్జయరాజు ఎట్టి పొగడ్తయు లేకుండ నామమాత్రముగ బేర్కొనబడుట కొరవి గొణగయ్య, నిరవద్యులకే యన్వయించునట్లున్నది. కాని నారాయణగిరి గుణగరసునకు వర్తించు నట్లగుపించదు. ఆ ఘనత తనదేయగుచో దానినతడు తననాటి నారాయణగిరి శాసనంలో కీర్తించకుండునా? 'ఎక్కల సాహసం, తురంగ వెడంగం, కుమారకన్దర్పం, రాజవిద్యాధరం'[13] అని సామాన్య విశేషముల దిగిలించుకొనెనే కాని కొరవిని సాధించినట్లు చెప్పుకొనలేదు. కనుక కొరవిని సాధించిన ఘనత కొరవి శాసనంలోని గొణగయ్యదేనని నేను తలంచి క్రివ్వక శాసనంలోని కరియగొనగ, నిజ్జయరాజులను కొరవి శాసనంలోని గొణగయ్య, నిరవద్యులైయుందురని చెప్పితిని. ఆధారాంతరము లభించు వరకు నారాయణగిరి గుణగరసును, కరియ గొనగునిగా గుర్తించుట కష్టము. చరిత్రాంశము నుపేక్షించవలసి వచ్చును. (గూడూరు శాసన విమర్శ తరువాయి)

## విశేష సూచిక


1 భారతి 1981, జనవరి – 64
2 ,, 1979, డిశంబరు – 36
3 ,, 1980, జనవరి – 35
4, 5 నే. వెం. రమణయ్య 'పల్లవులు – చాళుక్యులు'–225
6 పి. వి. పి. శాస్త్రి 'ది కాకతీయాస్' 52–58
7 ఎ పి. ఇం. XXVIII–21 'కొక్కులి విక్రమాదిత్య' డని పేర్కొనబడెను.
8 గద్వాల పట్టికలు (ఎ పి. ఇం. X–100); కొల్లాపురం పట్టికలు (ఎ పి.ఆం.IV– ); వెల్నాల్లి, ఇపరంకల్లు శాసనాలు, (డా. రమేశన్‌గారి తామ్రశాసనాలు I)
9 ఇం. ఆంటి. XXXII–281
10 ద. హిం. శా. IX-I, పుట 71 లో ఆహవమల్ల త్రైలోక్య మల్లుడు జయసింహవల్లభుని కగ్రజుడని పెద్దకొడుకని నర్థములో జెప్పబడెను.
11 నే. వెం. ర. 'వేంగి చాళుక్యులు' 164–168
12 ,, 'పల్లవులు--చాళుక్యులు' 217
'పశ్చాదహమహమికయా విక్రమాదిత్యాస్తమయనే రాక్షసా ఇవ ప్రజా బాధనపరా దాయాద రాజపుత్రా రాజ్యాభిలాషిణో యుద్ధమల్ల, రాజమార్తాండ, కంఠికావిజయాదిత్య ప్రభృతయో విగ్రహీభూతా ఆసన్. విగ్రహేణైవ పంచవర్షాణి గతాని'' (ఎపి. ఇం. IX–47)
13 వరం. జి. శా. పుట 18.


# అందని జాబిల్లి

శ్రీ తమ్మిశెట్టి రామారావు

నాదారిని నేను పోతున్నాను
ఎడారుల్లోంచి పోతున్నాను
పంట చేలల్లోంచి పోతున్నాను
సముద్రతీరాల్లోంచి పోతున్నాను
అంధకారాన్ని చీల్చుకుంటూ –
వెలుగురేకల్ని వెతుక్కుంటూ –

నీలాకాశపు రాదారిలో
మేలి మబ్బు జారిందప్పుడు
ఎన్నో అమావాస్యల అవాంతరాల్ని
ఎదుర్కొని పున్నమి పూచింది వెండి బంతిలా
నన్ను చూసి నవ్వింది ముద్ద బంతిలా
అప్పుడే ఆరాటం కలిగింది నాలో
అందాల జాబిల్లి పొందు కావాలని
అందలంఎక్కి అందుకోవాలని.
మళ్ళీ –
నా కలంలోంచి కవిత్వం పొంగింది
నా కన్నుల్లో ఆశ రగిలింది.

డా॥ ఘంటా జవహర్‌లాల్

# మేఘచంద్రసిద్ధాంతదేవుని సమాధి ఫలకం

శిలాక్షరములతో గూడిన యీ ఫలకము నల్గొండ జిల్లా, భువనగిరి తాలూకా, కొలనుపాకలోని జినమందిరం గోడలో పూడ్చబడివున్నది. కాకతాళీయంగా పురావస్తు శాఖవారు కాపీ చేసిరి కాపీ చేసిన శాసనమును పరీక్షించగా అది మేఘచంద్రసిద్ధాంతదేవుని సమాధి ఫలకమని స్పష్టపడినది. శాసన ఫలకం మూడు భాగాలు జినాలయపు గోడలలో పూడ్చుకొనిపోగా, ఒక భాగము మాత్రమే మనకు గనపడుచున్నది. అనగా శాసనం అసంపూర్తి యని వేరే చెప్పనవసరం లేదు. మనకు గన్పడు భాగమునున్న ప్రతి పంక్తి చివరి అక్షరములు గూడా సిమ్మెంటుచే గప్పబడి వుండుటచే శాసన పాఠం పూర్తిగా కాపీ చేయుటకు వీలుపడలేదు. శాసనంలోని చివర పంక్తులనుబట్టి మేఘచంద్ర సిద్ధాంత దేవుని సమాధి ఫలకముగా [నాచే] గుర్తింపబడినది. అయిన సమాధి ఫలకము జైన మందిరం గోడలో పూడ్చబడి వుండుట విచిత్రాతి విచిత్రం. కొలనుపాక జైన మందిరం మన రాష్ట్రంలో వున్న యతి పురాతన జినాలయాల్లో ఒకటి. రాను రాను యది ఎన్నో మరమ్మత్తులకు లోనైనది. ఆ సందర్భములో కంట్రాక్టర్లు తరచుగా చేయు పాడు పనులలో ఒక భాగంగా యీ సమాధి ఫలక సమాధి నుండి పెరికింపబడి జైన పూజా మందిరం గోడలో వారిచే బంధింపబడి వుండనోపు. గ్రుడ్డిలో మెల్ల మేలన్నట్లు, సమాధిఫలక పూర్వ స్థానం కోల్పోయినా రూపం కోల్పోక యింకనూ వున్నది. దానికి మనం సంతోషించాలి.

సమాధి ఫలకంపైగల అక్షర సముదాయం క్రీ. శ. 12–వ శతాబ్ది శాసనాక్షరముల పోలిక గల్గి ఉన్నది. శాసన భాష కన్నడం. శాసనం అసంపూర్తిది గాన, శాసన లక్షణాల విశిష్టత తెలుప వీలు లేకున్నది. శాసనం ముగింపు భాగం దొరికిన మూలంగా శాసన విషయం స్పష్టంగా మనకు బోధపడుచున్నది. శాసన సారాంశం ఏమనగా 'మేఘచంద్రుడు సన్యాస వ్రతంబూని సమాధి అయ్యెను.' ఇది గాక మేఘచంద్రుని గొప్పతనం అతడు సాధించిన విజయాలు శాసనంలో కీర్తించబడినవి. ఇంతకు మించి, మేఘచంద్రుని వివరములు శాసన పరంగా మనకు మృగ్యం.

మేఘచంద్రుడు ఎవరు ? ఏ మతానికి చెందినవాడు ? ఏ కాలములో సమాధి అయ్యెను ? ఇత్యాది ప్రశ్నలకు సమాధానములు శాసన మూలంగా మనకు తెలియకున్నవి. మనకు గానరాని శాసన ముఖము [ల]లో వున్నవేమో !! వున్నా మనకు ప్రస్తుతం లభ్యంగావు. శాసనం పూర్తిగా తెలియాలంటే జైన మందిరం గోడను పూర్తిగా కూల్చాలి. అది కాని పని. అయిన యిటువంటి తరుణంలో మనం, లభ్యమైన సమకాలిక శాసనాలలో మేఘచంద్రుని వునికి ఏమైనావున్నదేమో పరిశోధించాలి. శాసనంలో తెల్పిన విషయం--[మేఘచంద్రుడు సన్యాస వ్రతం బూని సమాధిఅయ్యెను.] పరీక్షించగా మేఘచంద్రుడు జిన మతాచార్యుడుగా గుర్తింపనగును. సన్యాసవ్రతం, సల్లేఖనవ్రతం జైన మతాభిమానులు చరమదశలో ఆచరించు ముఖ్య ప్రామాణిక వ్రతాలు. జైన మతానుసారం ప్రతి జిన పిపాసి, సమాధి మరణం, సన్యాస మరణం [లేక పండిత మరణం] పొందవలెనని దీక్షతో సల్లేఖన వ్రతం [లేక సన్యాస వ్రతం] తన చివరి కాలంలో విధిగా ఆచరించాలి.[1] సన్యాస వ్రత ఫలం మూలంగా రెండవ జన్మ గల్గదని జినుల ప్రగాఢ నమ్మిక.

మేఘచంద్రుడు జిన మతాచార్యుడుగా గుర్తించిన యాతని సంఘ చరిత్ర మనకు తెలియకున్నది. జైన శాసనాలు జినాచార్యులను పేర్కొన్నప్పుడు వారు ఏ సంఘానికి, ఏ గణానికి, ఏ గచ్ఛకు చెందినవారో గూడా విధిగా వివరంగా తెల్పుతవి. కాని యీ అసంపూర్తి శిలాఫలకం మేఘచంద్రుని యొక్క సంఘ చరిత్ర తెలుపకున్నది. ఒకవేళ మనకు గానరాని శాసన ముఖములలో లిఖింపబడి వున్నదేమో !! అట్లున్నను నిరుపయోగమే కదా! ఇటువంటి గడ్డుపరిస్థితిలో మనకు సమకాలిక శాసనాలే ఆధారం. ఇప్పటివరకు రెండవ మేడరాజు (క్రీ. శ. 1122) యొక్క గోవిందపురం శిలాశాసనం,[2] ఆరవ విక్రమాదిత్యుని (క్రీ. శ. 1125) కొలనుపాక శిలా శాసనం[3] మరియు మూడవ సోమేశ్వరుని (క్రీ. శ. 1132) జడచర్ల శిలా శాసనంలో[4] మేఘచంద్రుని వునికి యాతని సంఘ చరిత్ర వివరణ ఇవ్వబడినది. పై మూడు శాసనముల విషయం సంగ్రహముగా 'మేఘచంద్రుడు మూల సంఘము, కాణూరు గణము, మేష పాషాణ గచ్ఛ సంఘా రామానికి చెందినవాడ'ని స్పష్టపడుచున్నది. పై శాసనముల విషయం వేరువేరుగా పరిశీలింతము.

మొదటగా మేడరాజుని గోవిందాపురం శాసనమును పరిశీలింతము. శాసనం క్రీ. శ. 12వ శతాబ్దానికి చెంది, తెలుగు–సంస్కృత భాషల్లో వున్నది.[5] మేడరాజు పొలవాశ వంశములో మేటి. 11వ శతాబ్దములో పొలవాసులు, కాకతీయులు చాలుక్యులచే మండలాధిపతులుగా నియమింపబడిరి, ఈ మేడరాజు జిన పిపాసి. విక్రమ జినాల

యము కట్టించి, కడలాలయ బసదికి పెక్కు దానము లిచ్చినట్లు యాతని బానాజిపేట, పద్మాక్షి దేవాలయ శాసనాలు[5] తెలుపుచున్నవి. ప్రస్తుత గోవిందాపురం జినశాసనంలో జినాచార్యుల వంశచరిత్ర వివరణ గూడా వున్నది:- బాలచంద్రముని కాణూరు గణము, మేష పాషాణగచ్ఛ సంఘారామంయొక్క మూలపురుషుడు. అతని శిష్యుడు మేఘచంద్ర భట్టారకుడు. ఆతని భక్తుడు పద్మనంది. యాతని వంశస్తుడు మేఘచంద్ర సిద్ధాంతదేవుడు. ఇందు జినాచార్యుల గణము, గచ్ఛ మాత్రమే తెల్పెను. సంఘముపేరు తెలుపలేదు. సంక్షేపముగా :—

కానూరు గణము - మేషపాషాణగచ్ఛ జినగురువుల వంశచరిత్ర

బాలచంద్రముని
|
మేఘచంద్ర భట్టారకుడు
|
పద్మనంది
|
మేఘచంద్రసిద్ధాంతదేవుడు

ఇక రెండవ శాసనం త్రిభువనమల్ల యారవ విక్రమాదిత్యుని కొలనుపాక శాసనం : ఇది 12వ శతాబ్దానికి చెందినది. ఈ త్రిభువన మల్లుడు గూడా జైనమతాన్ని ఆదరించి పోషించినవాడే. ఈ కొలను పాక శాసనం నాల్గవముఖం పూర్తిగా జినప్రశస్తికే కేటాయింపబడినది. కాని డా॥ పి. శ్రీనివాసాచార్యులుగారు యీ శాసన విషయం ప్రకటించునపుడు నాల్గవ ముఖాన్ని పూర్తిగా విస్మరించిరి. శాసనం మూడు ముఖాలు త్రిభువనమల్లుని దిగ్విజయపరంపరకే కేటాయించిరి. సహజంగా చారిత్రికులు శాసన విషయం వ్రాసేటప్పుడు రాజకీయ ప్రశస్తి కిచ్చిన ప్రాముఖ్యం మతప్రసక్తికి ఇవ్వరు. దానిమూలంగా కొలనుపాక శాసనం నాల్గవముఖం డా॥ శ్రీనివాసాచార్యుల దృష్టి నాకర్షించలేదేమో!! ఈ శాసనం నాల్గవముఖం మూలంగా కాణూరు గణముకు చెందిన మేఘచంద్ర సిద్ధాంత దేవుడికి ముగ్గురు శిష్యులు కలరని బోధపడుచున్నది. వారు వరుసగా : మలనంది—సూరి, పద్మప్రభ-శ్రీముని మరియు మాధవేందు-సిద్ధాంతదేవుడు. ఇందు గణము మాత్రమే తెల్పబడినది. సంఘము, గచ్ఛ తెలుపలేదు. సూక్ష్మంగా:—

కానూరు గణము

మేఘచంద్రసిద్ధాంత దేవుడు

| మలనంది—సూరి | పద్మప్రభ—శ్రీముని | మాధవేందు—సిద్ధాంతదేవుడు |
|---|---|---|

ఇక మూడవది జడచర్ల శాసనం. శాసనకాలం 12వ శతాబ్దం. చాలుక్య ప్రభువైన భూలోకమల్ల మూడవ సోమేశ్వరునిచే యీ శాసనం ఇవ్వబడినది. ఇందు క్లుప్తముగా మేఘచంద్ర సిద్ధాంత దేవుడు మూలసంఘానికి మేషపాషాణ గచ్ఛకు చెందినవాడని వివరించబడినది. అనగా మేఘచంద్ర సిద్ధాంతదేవుని శిష్యులపేర్లుగాని, యాతని గచ్ఛనామముగాని తెలుపలేదు.

పై మూడు శాసనముల విషయం క్రోడీకరించి చూడగా మేఘచంద్రసిద్ధాంతదేవుడు మూలసంఘము, కాణూరుగణము, మేషపాషాణ గచ్ఛకు చెందినవాడని స్పష్టపడుచున్నది. ఇక జినాచార్యుల వంశచరిత్ర యీక్రిందివిధంగా బోధపడుచున్నది :

మూలసంఘం, కాణూరు గణము, మేషపాషాణగచ్ఛ

జినాచార్యుల వంశచరిత్ర

బాలచంద్రముని
|
మేఘచంద్ర భట్టారకుడు
|
పద్మనంది
|
మేఘచంద్రసిద్ధాంతదేవుడు

| మలనంది—సూరి | పద్మప్రభ—శ్రీముని | మాధవేందు—సిద్ధాంతదేవుడు |
|---|---|---|

పై జినాచార్యుల వంశక్రమము పరిశీలించగా ప్రస్తుత సమాధి ఫలకముపై గల మేఘచంద్రసిద్ధాంత దేవుడు కొలనుపాక, జడచర్ల జిన శాసనాలలోని మేఘచంద్రసిద్ధాంతదేవుడు ఒక్కరేనని స్పష్టమగుచున్నది. ఇక సమాధి కాలం తెలుసుకొందము. జడచర్ల జిన శాసన కాలం క్రీ. శ. 1132. ఆ శాసనంలో మేఘచంద్రసిద్ధాంత దేవుని వునికి తెలుపబడినది. అనగా జడచర్ల శాసనకాలం నాటికి మేఘచంద్రసిద్ధాంతదేవుడు సమాధికాలేదు. కావున మేఘచంద్రుని మరణం క్రీ. శ. 1132 తదుపరి సంభవించి వుండవచ్చును.

ఈ శాసన ఫలకం అసలు స్థానం నుండి తొలగింపబడుటచే ప్రస్తుతం మేఘచంద్రసిద్ధాంతదేవుని సమాధి మనకు గానరాకున్నది. కాని, సమాధిగూడ కొలనుపాక జిన మందిరం దరిదాపులలోనే వుండవచ్చును. దీనిపై సమగ్ర పరిశోధన పురావస్తు శాఖచే జరుపవలసి వున్నది. అప్పటివరకు మనం వేచి వుండవలసిందే!!

## శా స న పా ఠ ం

1 మ వేది పాదపద్మోప నతన్యే ...
2 యేన పర్తి సుతం నెగళ్ర్ది ఙ్ఞ కా ...
3 కాపుర ర్వాష్ట్రకూట తిలకోన్నతి వ ...
4 న్నత జైన [గేహ] దాళ్॥ వొద్ద ...
5 శిష్యరం నియామిదం దేవగల వర [మే ...
6 ది నందదిం దొడిసి కాయ సుడి ...

7 ఢి వెగదె పొగి బరుత్త మంగ ...
8 దద [ళి] [చె] బెళ్ళొయిం దళిదు ...
9 ళ మనల్లి యె కయ్యె నిక్కి ...
10 పాదిత చారు సన్యాసన రా...
11 ళ వొప్పదె మేఘచంద్ర రం ...
12 యిన్తి గుణాఢ్య రిన్తు స్త్రకళాత ...
13 మె కోవిదరిన్తు భవ్య హృద్వాన్త ...
14 సరిన్తు బళవత్త సరిన్తు నృపాల ఛ ...
15 ళికె క్రాన్త పదాబ్జ రారె నుత ము ...
16 రె బంటి సె మేఘ చంద్ర సిద్ధా ...
17 ర మునీంద్ర రుత్తమ సమాధి [......]

## ఈ వ్యాస రచనకు తోడ్పడిన రచనలు


1 డా॥ జ్యోతిప్రసాద్ జైన్, జినుల వ్రతం – సంస్కృతి, పుట 97.

2 డా॥ పి. వి. పరబ్రహ్మశాస్త్రి, జె. ఎ. హెచ్. ఆర్. యస్. నెం. 36, పార్టు 1, పుటలు 33 నుండి

3 డా॥ పి. శ్రీనివాసాచారి, ఆం. ప్ర. ప్రభుత్వ పురాతత్త్వ పరిశోధన గ్రంథములు, నెం.3, శాసనం నెం. 45.

4 డా॥ జి. జవహర్‌లాల్, ఎపిగ్రాఫియా ఆంధ్రికా, నెం. 4, పుటలు 49–53.

5 ఆం. ప్ర. ప్రభుత్వ వరంగల్ జిల్లా శాసనాలు; నెం. 14, 22.


[1980, మార్చి మాసంలో అహమ్మదాబాదులో జరిగిన ప్రాచీన లిపి పరిశోధకుల వార్షిక సమావేశంలో నాచే చదువబడిన ఆంగ్ల వ్యాసమున కాంధ్రానువాదం.]

# నీడలు

శ్రీమతి కోడూరి లీలావతీదేవి

ఉదయకాలాన తరుల సిరులు
ప్రకృతి బస్తీలో
ప్రేమపాశాలు
నిబిడ నిశీధాన
శాఖల కాటుక జడలు
వికృతి చెందిన
వింత భయాలు
ఉదయాస్త మయపు
అంతరాలు
కాలచక్ర భ్రమగాన
కదిలి ఆడిన
నీడలు
జీవన రాగాల
నెరిసిన కేశాల
తురిమిన
జ్ఞాపకాల విరులు.

# పెళ్లి కబురు

'మనిషి సగమై పోయాడు'

— అనుకొంటాడు సీతాపతి అతన్ని చూస్తూనే! అలా వున్నాడు రమణమూర్తి.

శ్రీకాకుళం పోయే బస్సు నుండి 'దత్తివలస రోడ్డు'లో దిగాడతను. చేతిలో చిన్న సైజు బ్యాగుంది. ఉదయం నాలుగున్నరా, అయిదూ ఆ ప్రాంతం. ఇంకా తెల్లగా తెల్లారిన వాతావరణం లేదు. దూరంగా వున్న చేలూ, కొండలూ మసక మసగ్గా కన్పిస్తున్నాయి. వెనగ్గా వున్న యేటి అలల సవ్వడి — వుండివుండీ డోలక్‌ను సుతారంగా ఎవరో వాయిస్తున్నట్టుగా వుంది.

ఊరులోనికి పోయే మట్టిదారిని చూసి, "ఇదే దారా?" రమణమూర్తి మరోసారి గొణుక్కొన్నాడు. రెండడుగులు వేశాడో లేదో ఎవరో రాత్రి పెళ్లివారి వంటల గురించి మాట్లాడుకొంటూ ఏటికి పోతున్నారు. "దారి ఇదే!" ఖాయం చేసుకొన్నాడు.

చల్లగాలి వీస్తూంది. రెండ్రోజుల ప్రయాణ బడలికంతా పోయింది. కళ్లద్దాలు తీసి, ముఖాన్నంతా చేత్తో ఓసారి తుడుచుకొన్నాడు. అతనొస్తున్నట్టు టెలిగ్రాం ఇచ్చాడు — రెండ్రోజులక్రితం సీతాపతికి. అందే వుంటుంది!

గాలికి చెట్ల ఆకులు వొరుసుకొంటున్నాయి. టూరింగ్‌టాకీసు తీనెకు మీద ఆకులు పడి కొనగోటితో తాళం వేస్తున్నట్టు శబ్దిస్తున్నాయి. 'మాంగళ్యబలం' సినిమా ఆడుతోంది అందులో.

సిగరెట్‌కోసం లాల్చీ జేబులో చేయి పెడితే పెళ్లి శుభలేఖ, అక్కయ్య రాసిన వుత్తరం తగిలాయి. ఈ పెళ్లికి తనొస్తాడని అనుకోలేదు. చివరికి తెగించి ప్రయాణమయ్యాడు.

దారి ప్రక్క 'టీ' కొట్లు మేల్కొంటున్నాయి. పాలెగూళ్లలో వున్న కరెంటు దీపాలు మసిబారిన చూరుల్ని అంతగా కన్పించనీయట్లేదు.

సుమారుగా ఇరవై యేళ్ల కిందట — ఆ వూరికి ఎలక్ట్రిసిటీ లేదు. ఇప్పుడో!? దాన్తోపాటు, చాలా మార్పులొచ్చాయి. గిలకబావి నిశ్శబ్దంగా వుంది. ఎవరూ నీరు చేదుకోవడం లేదు. అప్పట్లోనే, ఎవరో అందులోపడి చనిపోయారని దాన్ని వాడటం మానేశారు మరి!

పాడుబడ్డ బావి వయసు ఇరవై యేళ్లు!

రమణమూర్తికిప్పుడు నలభై అయిదేళ్లు!?

అతనికి పెళ్ళయ్యింది పాతికేళ్లప్పుడు — అంతకు మూడేళ్ల ముందే సీతాపతి పెళ్లి చేసుకొన్నాడు.

అప్పుడూ రమణమూర్తి పెళ్లకొచ్చాడు. ఇలా ఒక్కడిగా మాత్రం కాదు. టౌన్‌లో పదిమందిని కూడగట్టుకొని సరదాగా సెక్సీ కబుర్లాడుకొంటూ టాక్సీలో దిగాడు.

ఇప్పుడు 'రమణమూర్తి' అనబడే అప్పటి 'మూర్తిగాడి'కి ఇరవై రెండేళ్లు. బి. ఏ. చదువుతుండేవాడు. చిన్నసైజు రచయిత.

బాల్య మిత్రుడు, సీతాపతికి పెళ్లంటే మూడ్రోజుల ముందుగానే ప్రోగ్రాం ఫిక్స్ చేశాడు. వాళ్లు దిగగానే తోడ్కుకుపోవడానికి సిద్ధంగా వున్నాడు సీతాపతి. రెండెడ్లబండి పురమాయించి వుంచాడు. అందరూ 'హలు హలో'మంటూ బండెక్కగానే చర్నాకోలా పట్టుకొని రమణమూర్తే రథసారథి అయ్యాడు. పూటుగావున్న ఎడ్లని పొటేపడి పరుగెత్తించాడు.

నవ్వులు, జోకులు, ఎకసెక్కాలు, ఎన్ని? ఎన్నెన్నో పెళ్లికొడుకు మీద కుమ్మరించాడు. సరదాగా సిగరెట్లు తాగాడు. అప్పటికే సీతాపతి వూరి కరణీకం చేస్తున్నాడు, కలిసిరాని చదువును ఎత్తి గట్టేసి.

కరణంబాబు పెళ్లికి వూరంతా కలివిడిగా వుంది. పెద్ద పందిరి వేశారు. పందిర్నిండా కాగితం పూలు అలంకరించారు. సీతాపతి మిత్ర బృందం వాటిని చూసి చిందులేసింది.

ముహూర్తం రాత్రి తొమ్మిది గంటలకి. శీతకాలం! వేగంగా భోజనాలు కానిస్తే మంచిదన్నారు పెద్దలు. వడ్డన కార్యక్రమంలో ముఖ్యుడయ్యాడు రమణమూర్తి. గళ్ల లుంగీ, కట్ బనీను, చేతిలో సిగరెట్‌తో పాటు మాటకారితనంవున్న అతనికి పేరిందేవి త్వరగానే పరిచయమైంది.

ఆమె వూరి మున్సబుగారి రెండో కూతురు. సీతాపతికి దగ్గర చుట్టం. సలాగ్గా, అందంగా వుంటుంది. సందడిగా మాట్లాడుతుంది. దాన్తో మిత్ర బృందానికి చర్చనీయాంశమైంది.

"ఈ అమ్మాయిని మూర్తిగాడు పెళ్లిచేసుకొంటే బాగుణ్ను" అన్నాడో మిత్రుడు.

పెళ్లి ఆలోచన రాలేదుగాని 'కాలక్షేప బఠానీ' అన్పించింది మూర్తికి. ఆమాటే బృందానికి చెప్పేసరికి 'వహ్వా శభాషో' అన్నారు.

పెళ్లి తంతు జరుగుతూంది. కొంగూ కొంగూ ముడివేశారు. కాలూ కాలూ మట్టించారు. ప్రమాణాలు చేయిస్తున్నారు. వీటన్నిటినీ చూసి మూర్తికి అల్లరి చేయాలన్పించింది.

''బాబోయ్! ఇంత తతంగమా? ఛస్తే పెళ్లి చేసుకోకూడదు'' అన్నాడు కావాలని పేరిందేవిని చూస్తూ. ఆమె నవ్వింది 'కాకపోతే!' అన్నట్టు.

మాంగళ్యధారణ జరిగింది. అక్షితలు దంపతుల మీద కాక, పేరిందేవి మీద జల్లాడు ఎవరూ చూడకుండా. సిగ్గు పడిందామె. చూసిన మిత్ర కూటమిలో వ్యక్తి ''మూర్తిగాడు అప్పడే తలంబ్రాలు పోసేస్తున్నాడోయ్'' అంటూ అరిచాడు. ఆ మాటలకి పేరిందేవి లజ్జతో నజ్జు నజ్జు అయిపోయింది.

రాత్రి పదకొండయింది.

పెళ్లివారు జాతర్లో వ్యక్తుల్లా ఎక్కడ పడితే అక్కడ పడుకొన్నారు. స్నేహితులంతా ఓచోట చేరి సీతాపతితో కబుర్లాడుకొంటున్నారు ఇవతల. మర్నాడు వంటలకి శుచిగా నీళ్లు కావాలి! నలుగురైదుగురు ఆడవాళ్లు యేటికి పోవడానికి చంకన బిందెలు ఎత్తుకొన్నారు.

''ఎవరైనా మగసాయం వస్తే బాగుణ్ను'' అంటూంది పేరిందేవి పెరట్లోంచి ఇవతలకి చూస్తూ.

''ఎందుకులెద్దూ'' అందో పెద్ద ముత్తైదువు.

''బాగుండ్రా! వుండొద్దూ'' అన్నాడు రమణమూర్తి, చొరవ చేస్తూ. కాదనలేదెవరూ. దారిలో రమణమూర్తిని గురించి మిగలా ఆడ జనం చాలా ప్రశ్నలు వేశారు. అన్నిటికీ ఓపిగ్గా సమాధాన మిచ్చాడు.

నాలుగైదుసార్లు యేటికీ, ఇంటికీ తిరగడంతో పేరిందేవి చాలా మాట్లాడింది రమణమూర్తితో.

''మీరు కథ్రలాస్తారా?!'' అంది.

''నచ్చిన అమ్మాయిని పెళ్లి చేసుకోండని'' సలహా కూడ ఇచ్చింది. అంతే!

''నమో వేంకటేశ! నమో తిరుమలేశా! నమస్తే! నమస్తే నమః' అంటూ అరిగిపోయిన గ్రాంఫోన్ రికార్డు బెక్కుతూ విన్పిస్తూంది. పెళ్లి వారింటికి దగ్గర పడ్డాననుకొన్నాడు రమణమూర్తి. మరో ఏడేడడుగులు అనుకొన్నాడు.

సీతాపతి పెళ్లికొచ్చిన స్నేహితులంతా ఈ పెళ్లికొస్తారు.

ఆ రోజు —

''ఒరే మన పెళ్లిళ్లకు మనం కలసినా, కలవకపోయినా, మన పిల్లల పెళ్లిళ్లకుమాత్రం తప్పకుండా అందరం కలుసుకొందాం. అన్ని విధాలా మనకి అప్పడు బలగం అవసరం'' అనుకొన్నారందరూ

మొదటిగా సీతాపతి కూతురికే పెళ్లవుతూంది. కాలం కలిసొస్తే రమణమూర్తి తన కూతురికి పెళ్లి చేయబోతున్నాడు. కాని, కాలం కలసి రావట్లేదు. లేకపోతే ఈ పెళ్ళికి తనొచ్చేవాడేకాదు.

తన కూతుర్ని కోడలుగా చేసుకోమని అక్కయ్యకి వుత్తరం రాస్తే — 'వాడింకా చదువుకొంటానంటున్నాడ్రా! అయినా ఇప్పట్నుంచీ పెళ్లేమిటి చెప్పూ' అని వుత్తరం రాసింది, వారం రోజులకిందట. అంటే పరోక్షంగా 'నా కిష్టం లేదు' అన్నట్టు.

ఉన్న ఆశ ఎగిరిపోయింది. భయంపట్టుకొంది. పిచ్చి ఆలోచనలు రేగాయి. కాసిన్ని రోజులు పాట్నుంచీ తప్పించుకోవాలనుకొన్నాడు. అసలు విషయాన్ని కప్పిపుచ్చి ''అక్కయ్య దగ్గరికి వెళ్తున్నాను, తాడోపేడో తేల్చుకుంటాను'' అని భార్యకి నచ్చజెప్పి, ఇలా వచ్చాడు. పదిమందినీ కలిస్తే పది కబుర్లు, పది కార్యాలూ అన్నారు పెద్దలు! ఎవడి కొడుకునో ముడివేసుకోవచ్చు! లేదా ఎవడో ఎవణ్నో చూపించొచ్చు! అంతా కట్టుకొన్నదాని, కన్నదాని అదృష్టం! అందరికందరూ చుట్టుపక్కలే వున్నారు. అతనొక్కడే అంత దూరం తుళ్లిపోయింది.

అనుకొన్నట్టుగానే రమణమూర్తిని చూసి సీతాపతి ఆశ్చర్యపోయాడు. ''ఏరా? ఇలా?!'' అన్నాడు మనిషిని చూసి పెదవి విరుస్తూ.

పెళ్లి కళ అక్కడి ప్రదేశమంతా నిండుంది. అమ్మాయిలు, అబ్బాయిలూ హడావుడిగా తిరుగుతున్నారు. ఎవరెవరు ఎవరివాళ్లో!? అందర్నీ చూస్తున్నాడు తనకు తెలిసిన మొహం కన్పిస్తుందేమోనని రమణమూర్తి. అబ్బే లేదు! మనుషులు పోల్చుకోలేనంతగా మారిపోయారా? లేక, ఇంకెవరూ దిగిరాలేదా?!

''పదపద స్నానం చేద్దూగాని'' తొందర చేశాడు సీతాపతి.

* * *

పెళ్లి సందడి ముగిసింది.

శోభనం — ఆ కార్యం గంటక్రితం జరిగిపోయింది. పెరట్లో పెద్ద పొయ్యిమీద చలికాచుకుంటూ కలియబెడుతున్నారు ఆడాళ్లు. ''మగ పెళ్లివారికి ఫలహారాలు సరిగ్గా అందలేదట'' అన్నమాటకి ''నాగవల్లి బాజా వాయించేసినానా''అంటూ వాళ్లల్లో వాళ్లే నవ్వుకొంటున్నారు.

మిద్దె ఇంటిని డాబా చేశాడు సీతాపతి. దాని మీద కూర్చున్నారు మిత్రులిద్దరూ. పెరడు, పక్కన పొలం గట్లూ అన్నీ కన్పిస్తున్నాయి. వాటిమీద జంటలుగా మూడు జట్లు తేమ తేమ వెన్నెలలో కూర్చుని కబుర్లాడుకొంటున్నాయి. స్పష్టంగా అవేవీ వినబడటం లేదు.

"కూతురి పెళ్లి అయిందనిపించావు" అన్నాడు రమణమూర్తి.

"ఏదో" పెద్దగా నిట్టూర్చాడు సీతాపతి.

లోలోపల తొలుస్తున్న బాధ బయటకు రాలేకపోతోంది. ఆడగలేక వుండలేకపోతున్నాడు రమణమూర్తి.

"మన వాళ్లెవరూ రాలేదెందుకురా ?!" అడిగాడు చిట్ట చివరికి.

అదేం పెద్ద ప్రశ్న కాదన్నట్టుగా -- "రాలేకపోయారు. పనుల మీద వున్నారు కామోసు" సీతాపతి అన్నాడు.

"ఏం పన్లులేరా ?"

"అలా అనకు ! పెద్ద రామ్మూర్తి కొడుక్కేం బాగాలేదు. పుట్టుకే అల్పంగా పుట్టాడు. పదిహేనేళ్లొచ్చినా ఆ గుంటడు రేపో, మాపో అన్నట్టుగా వున్నాడు. కొడుకుని పట్టుకొని చికిత్సకోసం వాడు తిరగని వూరంటూ లేకపోతూంది."

"మరి చిన్నరామ్మూర్తి !?"

"ఉన్న ఎకరంన్నరా మడిచెక్క కోసం అన్నతో తన్నుకు చస్తున్నాడు. పెద్దరామ్మూర్తి కంబారి మొన్న మడిమీదే వాడి కాలు విరగ్గొట్టేశాడు."

"నిజం !" అదిరిపడ్డాడు రమణమూర్తి.

"సత్తెంగా(డా ! వాణ్ణి చూడాలని వుంది" రమణమూర్తి గొంతులోని ఆప్యాయతని కనిపెట్టాడు సీతాపతి. చెప్పలేకచెప్తున్నట్టు చెప్పకొచ్చాడు.

"వాణ్ణి కాల్చిపారేశారు గుమ్మలక్ష్మీపురం అడవుల్లో. నక్సలైటట !"

ఆ విషయం తెలియకపోవడం, తెలుసుకోకపోవడం తన తప్పన్నట్టుగా విలవిల్లాడాడు రమణమూర్తి.

ఇంకేం విషయాలున్నాయి తెలుసుకోందికి. విషాదాంతాలు తెలుసుకోవడం బాధగా వుంది. గుండెను కెలికేస్తున్నట్టుగా వుంది. చాలాసేపు నిశ్శబ్దంగా కూర్చున్నాడు. సీతాపతి పెళ్లికబుర్లలో పడ్డాడు. తనీ సంబంధం ఎలా వెతికిందీ, ఎంత కట్నానికి పెళ్లి కొడుకుని కొన్నదీ, దానికి మూలమైన మున్సబుగారి బంధువులూ, వాళ్ల గురించి చెప్పకొస్తున్నాడు.

మున్సబుగారంటే పేరిందేవి గుర్తుకొచ్చింది రమణమూర్తికి. ఏడుపులో నవ్వులా ఆమెనుగూర్చి అడగటం సరదా అన్పించింది. ఆడిగాడు.

"మూళ్లేదా నువ్వు" అన్నాడు సీతాపతి.

"లేదు, పెళ్లికొచ్చిందా ?" అన్నాడు ఆశ్చర్యపోతూ.

"రాకపోవడమేమిటీ ! నిన్ను చూపించి రమణమూర్తి కదూ అంటూ నన్ను అడిగింది కూడా."

"కులాసాగా వుందా ?"

"ఏం కులాసా ! ముక్కూ మొఖం తెలీని మిల్ట్రీవాడికి కట్టబెట్టారు దీన్ని. వాడా యుద్ధంలో చచ్చారుకొన్నాడు. వెంటనే ఇదో కొడుకును కనేసి జీవితంలో నిలబడిపోయింది. కొడుక్కి పట్నంలో మందుల షాపుంది దాన్ని పట్టుకుబతుకుతున్నారిద్దరూ."

అంటే ! --

పేరిందేవి కుమారీకాక, శ్రీమతీకాక, గంగా భగీరథీ సమానురాలా !? ఇప్పుడామెను పలుకరించాలంటే పుణ్యానదీనదాలు ఆమె కళ్లల్లోనివి చూడాలా ?! క్షణంసేపు స్థిరంగా కూర్చోలేకపోయాడు రమణమూర్తి. నిశ్శబ్దంగా లేచి నిల్చున్నాడు ప్రసంగం చాలన్నట్టుగా. సీతాపతి కూడా ఆపేశాడు అంతటితో.

"నచ్చిన అమ్మాయిని పెళ్లిచేసుకోండి" అంది పేరిందేవి.

నచ్చిన అమ్మాయినే చేసుకొన్నాడు. కాని, పేరిందేవి అంతగా నచ్చలేదు. నాలుగు వేలు కట్నం కూడ పుచ్చుకొన్నాడు. కట్నానికి ఆశపడి పేరిందేవిని 'కాలక్షేప బఠానీ' అనుకొన్నాడే కాని, కలకాలం హృదయాన్ని స్పందింపజేసే 'ఆడది' అనుకోలేకపోయాడు. దురదృష్టవంతుడు !

అప్పటికీ ఇప్పటికీ ఎంత వ్యత్యాసం ? పేరిందేవిని తను పోల్చుకొనలేకపోయాడు.

సీతాపతి పదిహేను వేలు కూతురికి కట్నంగా ఇచ్చాట్ట ! ఎంత దారుణం !

పేరిందేవిని రేపు పరామర్శించాలి !

పెళ్లి కబురడగాలి !

తన కూతురికి నచ్చడం, నచ్చకపోవడం అంటూలేదు. ఆమె కొడుక్కి తన కూతురు నచ్చితే చాలు !!

చాలు గాక చాలు ! !

—ఆలోచిస్తున్నాడు రమణమూర్తి.

వెన్నెల చంద్రుణ్ణి మబ్బు నాకేసుకొంది. లీలగా చీకటి అలముకొంది. తక్కువ కట్నానికి కుదరకపోతాడా అని రమణమూర్తి ఆలోచన్లని పేరిందేవి కొడుకు సంధించి లాగుతున్నాడు.

పెరట్లో చలివిడి ముద్దలు తయారయ్యాయి.

'తల్లిముద్ద ! పిల్లముద్ద!' అని వేరుచేస్తున్నారు ఆరిందలు.

# ఆశలు తీర్చు - ఆశీర్వదించు

శ్రీ మేకా సుధాకరరావు

గర్భంలో నీవిటు వచ్చినపుడు గర్భందాల్చి
ఎప్పుడు ప్రసవించి పోయావో యేమో-
ఎలా ఉంటావో
నీ గుణ గణాదులేమిటో
శిశువుగా నాకై నే నెరుగను నాడు
ఊహ తెలిసినప్పట్నుంచి వింటున్నాను
ఊరికే ఆడిపోసుకోవడం నిన్ను !

ని న్ననుసరించి వచ్చిన వత్సరాల
పెంపకంలో పెరుగుతూ –
విద్యాభ్యాసం, వివాహం, ఉద్యోగం
సంపాదన – సంతానం
వాళ్ల విద్యా వివాహాదులూ
పిల్లలూ - నిరుద్యోగం...
ఇలా
చక్రభ్రమణంగా సాగే జీవితయానం –
ఎంతమార్పు !
ఎంతో మార్పు వచ్చింది, నాటినుండి.

పారతంత్ర్యంతో పతనమై పోయిన దేశం
స్వాతంత్ర్యం సముపార్జించుకొని
ముప్పై మూడేళ్లుగా
స్వపరిపాలన గావించుకుంటూ
అభివృద్ధి ముఖంగా పయనించే బాటలో
మొలిచిన బ్రహ్మ చెముళ్లూ, పల్లేరులూ
స్వార్థాహంకారాల ఆకలి
ధనాధికారాల దాహం
అభివృద్ధి నెంత కుంటుపరిచాయో
చెప్పాలంటే
అదంతా ఒక దేశ చరిత్ర.
వస్తున్నావు గనుక నీవే చూస్తావదంతా.

నీవు వెళ్లి తిరిగివచ్చే ఈ అరవయ్యేళ్లలో
ఇబ్బడి ముబ్బడైన నీ కుటుంబం
నిర్వహించే బాధ్యత
పదింతలు పెరిగింది నేడు !

దేశ విముక్తి పోరాటం అనే
క్షీర సాగర మథనంలో లభించిన
స్వతంత్ర సుధా భాండంతో
జాతి కల్యాణమనే అమరత్వాన్ని
చేకూర్చుకోడానికి బదులు
అధికారమే అమరత్వంగా భ్రమించి
ఆ సుధను జుర్రుకోడానికి
అంతులేకుండా తగవులాడు కుంటున్నారు
అనుజులంతా !

ఇన్ని కోట్ల నా స్వజనులంతా
సుఖ శుభాలతో
ఆరోగ్యాభ్యుదయాలతో
వర్థిల్లాలని
నిరంతరం నిరీక్షించే నా కనులు
నీరుకారుతున్నవే కాని
వెలుగు లీనడం లేదు.
అయినా, నిరాశ నన్ను వరించదు
ఆవరించదు.
నిరుత్సాహపు శిశిరంలో మోడువారినా,
నిలిచి
మోసులెత్తి పూలు కురిసే
వసంతంకోసం –

నా ఆశలూ ఆశయాలూ
ఆలోచనలూ అనుభవాలూ
అక్షరాలుగా నిక్షిప్త పరుస్తూ;
ముందుకు సాగుతూ వచ్చాను
ఎందరినో వెంట బెట్టుకుని.

భూమిని తవ్వి తీసేవాడు
లోలోతుకు పోతూ,

ఆ మట్టిని పోగుచేసుకునేవాడు
కుప్పను పెంచుకుపోతూ...

ఇలా సాగుతూపోతే

ఇద్దరిమధ్యా దూరం
హద్దులు లేకుండా పెరిగిపోతుందేకాని

ఇద్దరూ భూమ్మీద నిలిచే
దెప్పుడో! ఎలానో?!

అదిగో —
దూరానికే నీ కగుపడుతూంది కదా:

నడుస్తున్న అభివృద్ధిపై ఆధిపత్యంకోసం
పరుగెత్తే అవినీతి!

మంచిని మించిన వంచన!
నిలువ నీడ దొరకని నీతి నిజాయితీలు!

మాసిపోతూన్న మానవత్వం —
సేవా సంస్థలు రక్షకాశ్రయాలుగా

స్వైర విహారం చేస్తున్న
నేరాల ఘోరాల కార్యకలాపాలు ...

ఇంకా...ఇంకా...

ఇదంతా చూస్తూ

ప్రపంచాన్ని చదువుతూ
జీవితాన్ని అధ్యయనం చేస్తూ —

సమాజ సాగర జలాలమధ్య నిలిచిన
ద్వీపంగా నేను

చెరిగిపోతూన్న సంవత్సరాలతో
చేరికొత్తూ వచ్చాను నీకు.

ఏ దుర్ముహూర్తాన
నీకీనామకరణం జరిగిందో గాని

తర తరాలుగా నిన్ను
దూరుకుంటూనే వస్తున్నారు ప్రజ

దుర్మార్గురాలివిగా నిన్ను చిత్రిస్తూ ఉంటే
చిత్రహింసకు గురవుతూంది మనసు.

చెడ్డవారెప్పటికీ
చెడ్డవారుగానే మిగిలిపోకుండా
మంచిని పెంచుకుని పంచుతూ
మంచికి మారుపేరుగా రూపొందడం
ఉత్తమ గుణం.

సంవత్సరాల మెట్లనెక్కి ఎదుగుతూన్న
నా దగ్గరకు
చక్రభ్రమణం గావిస్తూ వస్తున్న నీవు
వస్తున్నావని విని —
ఇన్నేళ్ల తరువాత అమ్మను చూస్తానని
ఆనందంతో ఎదురుచూస్తున్న వానిలా —
ఆప్యాయంగా నిన్నాహ్వానించ
ఎదురొస్తున్నాను.

రంగు రంగుల పూల చీరలు ధరించిన
లతా నెలతలను వెంటబెట్టుకుని —
కనులకు విందుగా
హృదయాలకు పసందుగా
జీవితానికి చైతన్యం
ఒక కొత్త ఊపిరి, ఇచ్చే
వసంతం.
నీకు స్వాగతం చెప్పవస్తూంది
నీవు వచ్చే బాటలో పూలు పరుచుకుంటూ.

''దుర్మతి''గా నీకు వచ్చిన చెడ్డపేరు
చెరిపేసుకొని
'సన్మతి'గా నీ పేరు
సార్థకం చేసుకుంటావనే గంపెడాశతో
నీకు పలుకుతున్నాం స్వాగతం.
రావమ్మా — ఇటు గా
ఆశలు తీర్చు!
ఆశీర్వదించు!!

శ్రీ కుంటిమద్ది శేషశర్మ

# నిగమ-సోపానము

జనవరి 1934న ఒక్కసరి మెరపువలె మించి, మరుగుపడిన నిగమశర్మ "అక్క" శ్రీ సర్దేశాయి తిరుమలరావు పుణ్యమా అని, భారతీ రంగస్థలమున, జూన్ 80లో మరొక్కమరి చిందులాడినది.

శ్రీ తిరుమలరావుగారు, నిగమశర్మఅక్కను మరొక్క దృక్కోణముతో పరికించిరి. నలభైయారు ఏండ్లకుముందు భారతీ దర్పణమున ప్రతిబింబించిన యామెకూ, 1980 జూన్‌లో పునర్దర్శనమొసంగిన ఈమెకూ, ఎంతమార్పు! ఎంతమార్పు!!

ఈమార్పు సారస్వతమున చెక్కుచెదరక యథాపూర్వము నిలిచిన ఆమె స్వభావములోనిదా? లేక సహృదయుల దృష్టిలోనిదా? అన్న విచికిత్స పొడమకమానదు. ఆ విచికిత్సా ఫలితమే ఈ నిరూపణము.

పాత పాత్రలను క్రొంగ్రొత్తగా ప్రదర్శించు భారతీ రంగస్థలము ప్రశంసనీయము. సారస్వత పిపాసువులకు రసావహము.

అనంతకృష్ణశర్మగారి "అక్క", "అమృతములో లేఖిని నద్ది దిద్ది తీర్చి, ఆడించిన పుత్తడిబొమ్మ." తిరుమలరావుగారి దృష్టిలో ఆమెయే, "మారి, డెవిల్ వంటిది."

ఇంతటి వైపరీత్యము వచ్చుటకు కారణములు, వారి సమర్థనములు కూలంకషముగా పరిశీలించినగాని బుద్ధిగోచరములుగావు.

అనంతకృష్ణశర్మగారు పండితులు విమర్శకులు సరసులు కవితామర్మవేత్తలు. తిరుమలరావుగారు నిశిత పరిశీలనావ్యగ్రులు. పట్టిన, స్తనశల్యపరీక్ష చేసిగాని వదలని తత్వపరిశోధకులు. వారి బుద్ధి శశపత్ర శతభేది సూచివలె ముందుకు దూసికొనిపోవగలదు. వారి సరసత, వీరి తార్కికత శంకింపరానివి. ఐనను, మన సామాన్య దృష్టితో, వారి వారి యుపపత్తులను గమనించి ఔచిత్యమును కొంత పరిశీలింతము.

"రామకృష్ణకవికి, నయనాణ్యములతో జీవకళలతో పాత్రల నిర్మాణమునందు అనన్య సామాన్య చాతుర్యముగలదు. దానికితోడు నైజమైన పరిహాస కుశలత, ఆదిమిపట్టినను ప్రక్కసందుల నుండియైన పెల్లుబికి వచ్చును. ఆ వచ్చినది వస్తుపవిత్రతనైనా గమనింపక ప్రసరించునట." అన్న, తమ నిర్ణయమును, "అక్క"లో దర్శించి, ప్రదర్శించినారు, అనంతకృష్ణశర్మగారు.

"క్రొత్తగా చేయించుకొనిన ముక్కరకునై యడలు దుర్వారయై యాడుబిడ్డ" అన్న రామకృష్ణకవి వాక్యము, అతని నైజ పరిహాసశీలతను ఆవిష్కరించుటచేత, పవిత్రురాలైన 'అక్క'కు కలంక మాపాదించినది అనుట త్రోసివేయరానిది.

శర్మగారు, అక్క పూజ్యతను గూర్చి నిపుణముగా సోపపత్తికముగా తమ వ్యాసమున నిరూపించినారు. అంతకంటే ఎక్కువగ ఇతరులు నిరూపించలేరు. నిరూపించనవసరమూలేదు. అది అద్దమును గోరని ముంజేతి కంకణము.

ఇక రావుగారి "అక్క" "మారి, డెవిల్"వంటిది, అనుటకు చూపిన క్రొత్తసిద్ధాంతపు టుపపత్తులు పరిశీలనీయములు.

నిజమున కిది క్రొత్త దృక్పథమే. అందు వారి హేతువులు—"నిగమశర్మ అక్క పవిత్ర వస్తువా?" అన్నది వారి తొలిప్రశ్న. ఆ ప్రశ్నయందే, "కాదు" అన్న తమభావము తొంగిచూచుచున్నది. దానిని, "ఇందు హాస్యము లేకపోగా, గంభీర నిగూఢతత్త్వమేదైనా దాగియున్నదా?" అన్న తుది ప్రశ్న, స్పష్టపరచుచున్నది.

ఈ కడపటి ప్రశ్నలో, రెండుభాగములు. "హాస్యము లేకపోగా" అనుటలో, "హాస్యములేదు" అన్న నిర్ధారణ, "నిగూఢతత్త్వము దాగియున్నదా?"అనుటతో "అట్టిది దాగియున్నది, దానిని నిరూపించుటకే తమ వ్యాసము" అన్న భావములు గోచరించుచున్నవి.

1 నిగమశర్మఅక్క పవిత్ర వస్తువా?

పవిత్రమననేమి? దోషరహితము, గౌరవనీయము, పూజనీయము అని అర్థముచెప్పిన ఉత్తరోత్తరము బలవత్తరము.

భౌతికమైన వస్తువులలో దోషశూన్యత అరుదు.

"ప్రాయేణ సామగ్ర్య విధేగుణానాం పరాఙ్ముఖీ విశ్వసృజః ప్రవృత్తిః" అన్ని గుణములనూ ఒక్కతట్టు కూర్చుట బ్రహ్మ సృష్టికే విరుద్ధము అన్నాడు కాళిదాసు, రంగు ఉండినా నిర్గంధమైన కర్ణికారమును చూచి.

నిగమశర్మఅక్క—పాపము! ఆమె ననామకురాలిగా చేసినాడు కవి. పెట్టదలచిన పేరు పెట్టలేకపోయెనా? మరొక్క వ్యక్తిని సృష్టించి, "సుశీల" అని అన్నవాడు, ఈమెను "సుగుణ" అనియుండిన, 'కాద'ను వారెవ్వరు?

మార్కండేయ పురాణమునన్న విప్రవరుడు, పెద్దన చేతిలో "ప్రవరుడు" ఐనాడు. "దానివలె నిదియూ విశేషణమాత్ర వాచకమను శంక గల్గునేమో" అని, "ప్రవరాఖ్యు డలేఖ్య తనూ విలాసుడై" అని ఇది పేరేనయ్యా అన్నాడు.

కాని, అతని సహధర్మచారిణిని, "వండనబయుదు వేపురు వచ్చిరేని; అన్నపూర్ణకునుద్ది", ఐన ఆమెను, "నాదు మనసులో వర్తించు కులకాంత" అని భర్తృహృదయము చూరగొన్న యామెను అనామధేయనుగనే విడచినాడు. ఏమనగలము ? "నిరంకుశుల్ గారె కవులు."

అనామకురాలైననేమి? పుట్టింటి గౌరవము నిలబెట్టదలచినది. తమ్ముని దుర్వృత్తి నివారింప యత్నించినది. తీండ్రగల వచన రచనా చమత్కారంబుల శల్లిదండ్రుల వంత కొంతకు కొంత తొలగించినది. మందిరముకుందారాధనకు వలయు నేర్పాటు గావించినది. తదీయారాధనల నిర్వర్తింపించినది. జననీ దర్శితంబులైన నష్టావశిష్ట ధనంబుల దుర్వ్యయంబులు గానీక రక్షించినది. దొంగలు దోచికోనలవిగాని జ్ఞాన విజ్ఞాన నిలయములైన పుస్తక సంచయముల భద్రపరచినది. రాజానుగ్రహ లబ్ధములు అనన్య భోగ్యములునైన అగ్రహారముల పరామర్శించి అదుపులోనికి గొనివచ్చినది. పసిపైరుల బాగోగుల నారసి, గలిత సన్నాహమైన గృహంబు యధాపూర్వము నిర్వహణ మనోహరమొనర్చినది,

, హఠాత్తుగా నూడిపడిన తమ్ముని, మంచిమాటలలో, విందు భోజనముతో, ముద్దుమురిపెములతో, వాడి వాక్కులతో, పూర్వోన్నత్య ప్రకాశనముతో, బరువు బాధ్యతల నచ్చజెప్పటలతో చక్కదిద్ద ప్రయత్నించినది. కొంతకు కొంత కృతకృత్యయైనది. ఐతినని యూరటజెందినది. లేకున్నవాడు, రాజాలయమునకు రాకపోకలుచేసి, మాసిన చదువులు మరల చదివి,

ఇన్నాళ్ళు నెచ్చెలు లెదురైన తలవంచి, కులవధూరత్నంబు కుస్తరించి, ఆచార్యజనము సంభావించి, కుతుప వేళాగతా తిధి కోటి కర్చనేసి, తండ్రి యుద్ధమనీయంబు తానయుదుకునా ? తెంపరియై చరించు తమ్ముని నట్టి స్థితికి తేవలయునన్న, ఎంత యోర్పు, ఎంత సౌజన్యము, ఎంత హార్దానురాగము, ఎంత చాకచక్యముండవలయును ? ఆమె ధర్మనిష్ఠ బాధ్యతా నిర్వహణమూ ప్రశంసాపాత్రము. ఇవి ఆమెకు గౌరవమును పూజ్యతను ఆపాదించునవి. పాపియై ధర్మభ్రష్టుడైన వానిని పరిశుద్ధుని చేయుటచే నామె పవిత్రురాలుగాదా?

కాని అట్లు సత్పథమందు చరించువ్యక్తి, పూర్వపు టలవాటు మేరకు రాత్రో రాత్రి పడుపడుకకు చెప్పక చేజిక్కిన విహరించుకొని పోవునని యెవ్వరికి తెలియును ?

"రవిగాంచనిచో కవి గాంచునేగదా ?" అన్నట్లు వాని హృదయ కుహరాంతర నిలీన నిగూఢ భావస్పందనమును పసిగట్టిన కవి, సూచించినాడు, "తేనెబూసి కత్తి ధాత్రీసురుండు" అన్నమాటతో.

ప్రకృతిలో నట్టి సుగుణములే వడగట్టి ఒక్కచో నిలిచియుండజాలవు. ఉండుట ప్రకృతి ధర్మముగాదు. సత్వ రజస్తమస్సులకు నిలయమైన ప్రాకృత శరీరమున బడిన జీవికి, శుద్ధ సాత్త్వికత ఎట్లు దాగలదు? రజోగుణ జన్యములైన కామక్రోధాదులు సత్వప్రకోపముచే నణగియుండినా, కాలపరిసర ప్రభావముచే పైకుబికి తమ సత్తను నిరూపించకపోవు.

వసిష్ఠమహర్షి యంతటివాడు కోపగ్రస్తుడై శిష్యుని చండాలునిగా శపించెను. సీతవంటి యుత్తమురాలు మరది ననరాని మాటలన్నది. ఐనను లోకము వారి పవిత్రతను శంకించుటలేదు. అట్టిచో "అక్క"లో పవిత్రతకు లోటును గుర్తింపదగిన నెరసులున్న రిచ్చవడవలసిన పనిలేదు. "ఏకోహి దోషోగుణ సన్నిపాతే నిమజ్జతి" అన్న కాళిదాసుసూక్తి విస్మరింపరాదు.

ఇంతకూ నామెలో కనిపించిన నెరసు ఏది? కొత్తగా చేయించుకొన్న ముక్కరపోయెనని అడలుటయేనా ?

సొమ్ము పోయెనని అడలిన దీమె యొక్కతెయేనా ? ఎన్నియేండ్ల అనుభవముతోడనో తలనండి, పడబడ పారుచున్ వడకు పుట్టిన తండ్రి తల్లివనట గుందుచుండగా, తానూ తన ముక్కరకై అడలినది. ఆ ముక్కర విలువకుగాదు. అది కొత్తగా చేయించుకొన్నది. చేయించుకొన్నదేగాని ఒక్కసారైనా పెట్టుకొన్నట్లులేదు. పెట్టుకొని అద్దమున చూచి ఆనందించి, ఎదురింటి పుల్లమ్మకు పక్కింటి పాపమ్మకూ చూపించి బాగున్నదని ప్రశంసల నందుకొనవలసిన అవకాశము ఇంకా రాలేదు. తమ్ముని దుర్వార్త చెవిని బడగానే యెకాయెకి వచ్చివేసినది. పుట్టినింటనే దానికి ప్రారంభోత్సవము చేతామని తలంచియుండవచ్చు. ఇచ్చటకు రాగానే ఇంటిని యథాపూర్వస్థితికి తెచ్చు కృత్యమందే మునుగుటతో ఆ సంగతి మరిచిపోయినదేమో.

ఎక్కడెక్కడేదేది దాచినదీ గమనించిన తమ్ముడు వేరు నగలతో బాటు దానినీ హరించుక పోయినాడు. అది తెలిసిరాగానే ప్రాకృత గుణము పైకుబికి ఆమె నడలజేసినది. అది ప్రకృతి సహజము. నిదానముగా తెప్పరిల్లవచ్చునుగాక, కష్టపడి చేయించుకొన్న, ఇంకా కొత్త మెరుగులు మాయనిది. అట్టి ముక్కర పోగొట్టుకొనిపోవుట—తెలిసి, తక్షణమందైనా - మనోవ్యాకులత గల్గదేని, అది హృత్తుగాదు దృషత్తు. ఇట్టులా అక్కకు గృహకార్య నిర్వహణ చతురత, భ్రష్టసోదర సంస్కరణ పటుత, వాటికితోడు చేతనతతోడి మానవత నిండుకొన్నట్లు చిత్రించినాడు.

అట్లా ప్రియమైన సొమ్ము దోపుడుపోయినప్పుడుద్విగ్నమనస్కత గల్గని వైరాగ్యముగల వ్యక్తియేని, "కానున్నది కాకమానదు అంతయు భగవత్సంకల్పాధీనము. మనము నిమిత్తమాత్రులము" అన్న స్థితప్రజ్ఞత గల వ్యక్తియైన, "సోదరుని సంసారము చక్కదిద్దవలె" అని తలంపు గూడా పొడమదు. పొడమరాదు. అటుగాక మానవత ఆర్ద్రహృదయత, సోదరానురక్తియుండెనేని, దానివెంట స్వధనాపగమ వ్యాకులతయు ఉండితీరును. 'అభితప్తమయోపి మార్దవం భజతేకైవ కథాశరీరుషు' కాల్చిన ఇనుమూ మెత్తబడుతుండు మానవుల మాటకు. ఇందు వైరాగ్యముండవలయునన్న, అందునూ అది తప్పదు, తమ్మునిల్లు చక్కదిద్దవలసిన ప్రమేయమూలేదు. ఈ ధర్మమును పాటించి, తన చిత్తవృత్తి పరిశీలనా నిపుణతను ప్రదర్శించినాడు కవి.

కాన మానవ స్వభావమును ఆదర్శముగా నీ పాత్ర చిత్రణమున ప్రకటించుట, ''అసందర్భ నాటక కళ'' అనుట, ''సందర్భశుద్ధి గలది'' అని, అనజాలము.

''అక్కనైన నిందు పరిహాసమేమి ?'' అనిన, దానిని తెర మరుగున నుంచి ఆమె అడలుపాటును చదువరుల యూహాకు వదలక వెలివెట్టుటే. అదియే అనంతకృష్ణశర్మగారు సామాన్యముగ ప్రకటించిన, ''పరిహాసము పవిత్ర వస్తువును గూడా గమనించదేమో'' అన్న నిగమన వాక్యము.

ఇంక రెండవ ''గభీర నిగూఢతత్త్వమేమైన దాగియున్నదా?'' అన్న అంశము విచారింతము. 'ఉన్నదా ?' అన్న విచికిత్సతోగాక ఉన్నది అన్న నిశ్చయజ్ఞానముతోనే ప్రారంభించినారీ విచారము. ''నిగమశర్మ అక్కపాత్రను కావ్యప్రమేయమునుండీ వేరుచేసిన, మార్దవ మానవీయత గలదిగా కన్పడుటలో ఆశ్చర్యములేదు. పాండురంగ మాహాత్మ్యము లౌకికవిషయ కావ్యముగాదు. క్షేత్రమాహాత్మ్య నిరూపక గ్రంథము'' అని తిరుమలరావుగారియొక్క, నూతన నిగూఢతత్త్వోన్మీలనకు పీఠికా వాక్యము.

ఈ వాక్య విన్యాసమే విలక్షణముగా నున్నది. ''అక్కను'' కావ్యప్రమేయమునుండీ వేరుచేయవలె, చేసి పరికించవలె. పరికించిన, అప్పుడు ఆమె మానవీయత కన్పడును. ఆమె మానవీయత కన్పడుటకు కావ్యప్రమేయము లేనిదానిని చూడవలయుననియా ! అస్తు. మార్దవ మానవీయత గలది — అనుచో అన్వయము కుదురుటలేదు. మార్దవము మానవీయత రెండునూ ధర్మవాచకములుగాని విశేషణ విశేష్య భావములు పొసగుటలేదు. మానవీయతలు అని యుండవలయు గాబోలు.

కావ్య సంగతియందే నుంచి చూచిన ఆమెలోని మార్దవము, మానవత్వము గోచరించవా ? రక్తహృదయగలదిగాననేగదా పుట్టినింటికి రావడము, ఇల్లు సరిదిద్దడము. అంతకు మించిన మానవత కథనుండి విడదీసి చూచిన యేమి కన్పడును ? అంతయు భగవల్లీల యని యోగినీస్థితితో పుట్టినింటిని సర్దుటకు రాకయుండిన మానవీయత గోచరించునా ? ''పాండురంగ మాహాత్మ్యము లౌకిక విషయ కావ్యముగాదు. క్షేత్రమాహాత్మ్య నిరూపకము. కావున కావ్య స్థితియందుగాక ఆ పాత్ర రంగమునుండీ నిష్క్రమించిన తరువాత సంఘటనమును పరిశీలించి పాత్ర స్థానము నిర్ణయించవలె''నట.

ఇదీ వీరి క్రొత్త నిగూఢతత్త్వ పరిశీలనామార్గము. ఇచ్చట 'ఆ పాత్ర' అన్న, 'నిగమశర్మపాత్ర'అని రావుగారి భావమనుకొందును. అనంతరము పేరాలో, ''నిగమశర్మ తుది గడియలు వచ్చినప్పుడు''అని యెత్తుకొన్నారు గాన ఆ యర్థము చెప్పవలె.

ఇందువీరు, ''శరణాగతి మార్గము'' అన్న విశిష్టాద్వైత సిద్ధాంతమున అనుత్తమమైన మోక్షసాధనోపాయమును తీసికొనివచ్చి, ''నరసింహక్షేత్రమున ఆక్రోశించుటచే విష్ణుసాయుజ్యమును పొందుట కావ్యపరమార్థము'' అని నిర్ణయించినారు.

'కావ్యపరమార్థమదే' అనుటలో నెవ్వరికీ విప్రతిపత్తి యుండ బనిలేదు. కాని అది శరణాగత మార్గమనుట, మొదట, సమ్మతింప రాని విషయము. రెండవది. కాపువడతి చండాలస్త్రీ అనువారితోబాటు ''అక్క'' ఆతని మోక్షప్రతిబంధక శక్తికి ప్రతీక అనుట.

వేదాంత దేశికులు పరమ పదమునకు నిర్మించినవి, వివేక నిర్వేదాది నవసోపానములు. ''నిగమశర్మ శరణాగతి మార్గమున పయనించు యాత్రికుడు. పై మెట్లన్నియు నెక్కి వచ్చినవాడు'' అని నిర్ణయించుట, దాని నుపపాదించుటకు గీతాదులను ప్రమాణీకరించుట, ''అతుకని పొత్తు''గా గోచరించుచున్నది.

వారు లోతుకు దిగి కారణ సముదాయము నుపపాదించినట్లే మనమూలోనికి దిగి పరిశీలించినగాని తేలని విషయమిది.

వేదాంత దేశికులవారు తాము ముందు వ్రాసిన రహస్యత్రయ సారగ్రంథమునందలి 32 అధికారముల సారమును ఈ పరమపద సోపానమున సంగ్రహించినారు. ముముక్షువు, వివేకాది నవసోపానారోహణముచే సాయుజ్యమును పొందిన, ముక్తుడగుచున్నాడు. అవి యివి.

1. వివేకము :—సంసార లంపటుడైనవాడు, భౌతిక సుఖములు మీసాలపై తేనెలవలె తుచ్ఛములు క్షణికములు అన్నవివేకము,

2. నిర్వేదము :—అయ్యో ! ఎంతకాలము గడచిపోయె. మల మూత్ర భాజనమైన యీ శరీరము పోషణకు ఇంద్రియ సుఖములకు ఆయువంతయూ వెచ్చబెట్టితిని. ఇట్టినన్ని తనువు లొచ్చెనో పోయెనో!

స్వర్గ నరక భూలోక యాత్రలతో విసిగినది చాలు, అని ఆ విధమైన జీవితమున నిర్వేదము,

3. విరక్తి :—"భౌతిక వస్తువులు సుఖజనకములనుకొంటిని. ఇవే మనోవ్యథలకు కారణమైనవి. బంధువులనుకొన్నవారు బాంధవాభాసులు" అని, వస్తువులపై దారపుత్రాదులపై అనురాగశూన్యత,

4. భీతి :— అయ్యో! కేవలేంద్రియ సౌఖ్యములకై ఎంతలేసి ఘోర కృత్యముల చేసితిమి. భగవంతు నాగ్రహ పాత్రులమైతిమి. ఎట్టి నరకముల దుర్వ్యథల పాల్పడవలయునో అన్న భీతి,

5. ప్రసాదనము :—అన్నింటికీ ఆయనే కర్త భర్త గతిత్రాత అని భగవంతుని శరణుచొచ్చుట,

6. ఉత్క్రమణము :—భగవత్కృపకు పాత్రమై పునరావృత్తి లేని పదమునకు పోవువాడు బ్రహ్మ నాడిగుండా దేహము విడచిపోవుట,

7. అర్చిరాదిమార్గము :— లీలావిభూతిలోనున్న దీర్ఘమార్గమును అతివాహకుల సాహాయ్యముతో, వైద్యుత పురుషమార్గ దర్శకత్వముతో సీమాంత సరిత్తువరకూ ప్రయాణము,

8. పరమ పదారోహణము :—సృష్టిలయములను గురియగు ఏకపాద్విభూతి వదలి నిత్య త్రిపాద్విభూతిలో జేరి భగవత్స్వరూప రస గంధాదులనుపొంది నిత్యులతో సంభావితుడగుట,

9. పరత్వప్రాప్తి :—పరమాత్మ సాయుజ్యము అనగా పరమాత్మతో గిలసి సకల సౌఖ్యములనుభవించుట.

ఇవి పరమపద సోపానములు. దేశికులవారు నిరూపించినవి.

"నిగమశర్మ ఈ మెట్లన్నీ ఎక్కివచ్చినాడు" అని తిరుమల రావుగారి వాక్యము. రావుగా రెక్కించినారేమోగాని, రామకృష్ణుని వాక్యములలో నెక్కినజాడ కనుపించలేదు. ఏ ఒక్కమెట్టునూ ఎక్కకుండుటగాక ఇంకన్నిమెట్లు క్రిందకు దిగజారినాడు.

పై నవ సోపానములలో ఐదింటివరకూ మానవ ప్రయత్న సాధ్యములు. ఐదవది ప్రసాదనము భగవచ్చరణ శరణాగతి. దానికి పూర్వరంగమైన నాల్గింటియందు గాఢసంబంధముగల వానికే ఐదవదాని యర్హత. నిగమశర్మ నాల్గింటిదాకా పోలేదు, పోలేదు. 5వ శరణాగతి, తుది గడియలలో ఆక్రోశించుటయేగాదా? అనిన, ఆ యాక్రోశ మెట్లున్నదో చూతము.

"ఒకయింత రెప్పవేయక జూచు పెరవారిఁ దలకొట్టుకొని దుఃఖలధి మునుగు బిలము తెరువునుంచు పృథివిలోఁ జొరఁ బారు సమధిక స్తంభోద్భవము గమించు తిరియువాడునుబోలె దెసలకుఁ జెయి చాచు దొరగు నస్రాంబుధిఁ దొప్పదోగు హా పోయితే యని యరచు భార్యసుగూర్చి బహువిధేరాసక్తి భ్రాంతిఁబొందు జేరగారాని దర్శన స్థితి వహించుబాడబస్ఫూర్తి లోగొన్న పగిదినుండు దానవారాతికాబూని తదవతార దశకమును మున్నె తాల్చెనా ధరణిసురుడు."

ఇది అతని అంతిమస్థితి. నిర్నిమేషముగా విషయ గ్రహణ శూన్యముగా చూచుట, తల కొట్టుకొనుట, దుఃఖించుట, భూవివరము జొర నుంకించుట, స్తబ్ధత, భిక్షమెత్తునట్లు చేతులుజాచుట, హా పోయితే అని చండాల భార్యను గూర్చి అరచుట, మద్యముపై నాసక్తి, ఎవ్వరూ చూడజాలని స్థితి, బడబాగ్ని మ్రింగినట్లు వేదనలు బొందుట, అనువానిలో ఒక్కటియైనను పరమపద ప్రాప్తి సోపానములకు సమీప భూమియందున్నవా? పై విషయములనే, శబ్ద శ్లేషము సుగువైచినంత మాత్రమున భగవత్సరూప్యము వచ్చునా ? అది కేవల సహృదయులకు కవిచమత్కారమును చూపించగలదుగాని, పతితుడైన నిగమశర్మకు భగవంతుని గాని తత్పదప్రాప్తి మెటికలను గాని చూపింపజాలదు.

ఆతనిదృష్టి 'కాంతకల్లు" ఈ రెండిపైననే, "ఆ పల్లవపాణి నల్లనిరూపునకు పరమపావన వంశమును" దారవోసిన మహాత్ముడు. ఈ ఐదుమెట్లపైన నాల్గు భగవదధీనములు. దేహోత్క్రమణ విధానము కావ్యమున పొడగట్టలేదు. దేహము వదలుటే చావు. తదనంతరంబ "యాతనవుం దనువును" దాల్చిన వానిఁ బొదువుడు కట్టుడు వ్రేయుడు అనుటలో "వీడు" స్థూలదేహమును విడచి, సూక్ష్మశరీరముదాల్చి యున్నవాడని అనవలె. మరి వాడెట్లు ఉత్క్రమించి వచ్చినాడు. ఆ యుత్క్రమణ మారవ మెట్టుగదా? బ్రహ్మ నాడిగుండా వచ్చుటగదా ? ఆ మెట్టు నెక్కినవానికి యమకింకరబాధ సోకరానిది. వేరుమార్గమున వచ్చినవానికి పరమపద మార్గమందరానిది. కాన యీ సోపానములు గడచివచ్చినవాడు వీడనుట పొసగనిమాట.

అంతంతమాత్రపు వైష్ణవుడయిన రామకృష్ణుడీ పరమపద సోపానమును, వేదాంత దేశికుల తమిళ గ్రంథమును అసలు చూచి యున్నాడా ? వినియైన యున్నాడా ? తన పాత్ర నావిధముగా పయనింపజేయుటకు? అన్న శంక కలుగకమానదు.

ఎట్లైననేమి ? బైటపడినాడు. పడకేమి చేయును. కార్తాంత దూతలు పాశములువేసి లాగుచుండ; చేసిన తప్పులను, "లల నాధ రోష్ఠ లాలా విలము గ్రోలె నుద్యము పేరికులములెల్ల" ఇత్యాదిగా ఎత్తిపొడుచుచుండ, అట్టి వానిని యమభటులను తరిమి తెల్లదీవి తెరువు పట్టించిరట విష్ణుదూతలు.

ఐదుసోపానములవరకే జీవి, ఎక్కవలె స్వప్రయత్నముతో. మిగత సోపానము లెక్కు శ్రమ, ఎక్కించుభారము భగవంతునిదే.

ఎట్లనో చేరినాడు పరమ పదము. కుముదుని చేసినారు.

కాని వాని "అక్క" 'మారి' డెవిల్‌వంటిదన్న ప్రతిపాదన ఎట్లు ?

"నిగమశర్మఅక్క మాట వినకపోయిన దానివలన హరిపార్శ్వచరులలో నొక్కడై పట్టము గట్టుకొన్నాడు. వినియుండిన ఆ పదవి సాధ్యమై యుండెడిదా?" అని రావుగారి ప్రశ్న.

"అక్క" చెప్పినమాటయేమి ? "నాదు సహోదరుడు సుజన స్తవనీయ మనోజ్ఞమూర్తి. యజ్ఞము చేయును. నేనతని యజ్ఞమున

వేది నలంకరింతును అని వేపురిలో నాడితిని, నీవేదియు లేక యున్నావు'' అని. ఆమెమాట విని యజ్ఞమేచేసి యుండిన ''యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రార్థయంతే! తేపుణ్యమాసాద్య సురేంద్రలోక మశ్నంతి దివ్యాన్ దివి దేవభోగాన్'' అని యజ్ఞము చేసినవారు స్వర్గ సుఖాలనుభవించుతారు. అనుభవించి ''క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి'' అని పుణ్యక్షయంతో భూమికి తిరుగు ప్రయాణం. కాన మోక్షప్రతిబంధక మార్గోపదేశికురాలు. ''కంటిరే మనవారు మునులు గృహస్థులై విఫలులై కైకొన్నవైరితనము భద్రార్థులయ్యును పాయక సంసార పద్ధతి నూరక పట్టువడిరి.'' అని ప్రహ్లాదుడన్నట్లు, సంసారమున త్రెళ్ళునుచున్నది. 'విప్రకన్యామణులన్ సహస్రమయినన్ వరియించి రమించుచున్నది.' ఆతని కామ వికారమునకు దోహద మొనర్చు పల్కులాడినది. ఇట్టిది ఉన్నత పథారోహణ పరిపథిని. కాన, ఈమె 'మారి' 'డెవిల్' అని వీరి సిద్ధాంతము.

ఇందు సత్యమున్నదా? వేయిమందిని రమించమన్నదాయామె? ఒక్క కట్టుకొన్న భార్యనే కన్నెత్తి చూడనివాడు గదా! వీడు. మదించిన కుర్రను హఠాత్తుగా నిల్పి ప్రయత్నించిన, అది నిలువకపోగా వీడునూ పడి శరీరము దోగిపోవును. కాన దానివెంట తానూ పరువెత్తుచూ క్రమముగా త్రాడు లాగి దాని వేగము తగ్గించుచూ నిలబెట్టవలెను. ''మూర్ఖం ఛందో నురోధేన'' అన్నట్లు, వాని బుద్ధి మేరకే కొంత చనవలె. కావున, ''సహస్ర మయినన్ రమించమన్నది. అదీ ఊరకగాదు ''వరించి.'' పాణిగృహీతల వెంటబడువానికి, పాణి గృహీతులను భరించుట సమ్మతమగునా ? గృహస్థ ధర్మము నిరపాయము నిరఘము అన్నదిగాని, పరమ పదమున కడ్డు దగులూటా అది? ''స్వే స్వే కర్మణ్యభిరతస్సం సిద్ధిం లభతే పరాం'' అన్న గీత ఆయా వర్ణాశ్రమాచార నిష్ఠునకు ఆ మార్గముననే సిద్ధిగల్గ ననుచున్నది. గృహస్థుడైనంత మాత్రమున ముక్తిద్వారము మూసియుంచబడదు.

ఇక యజ్ఞములు ముక్తి ప్రతిబంధకము లనుట పరామర్శింతము. ''జ్యోతిష్టోమేన స్వర్గ కామోయజేత'' అని శ్రుతి. స్వర్గాపేక్ష జ్యోతిష్టోమము చేయవలయునట. ఈమె యన్నది ఆ యజ్ఞమా? గృహస్థుడు చేయవలసినవి, చేసి తీరవలసినవి, పంచ యజ్ఞములు. ''సహ యజ్ఞైః ప్రజా స్సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః, అనేనప్రసవిష్యధ్వ మేషవో స్త్విష్టకామ ధుక్'' ''తైర్దత్తాన ప్రదాయైభ్యోయో భుంక్తే స్తేన ఏవసః'' గీత. పుట్టిన మానవుడు ప్రతి వ్యక్తి యజ్ఞమున దేవతల నారాధించవలె. యజ్ఞార్థముగాక తనకై వండుకొన్నవాడు ద్రోహి అట. బ్రహ్మ పితృ దేవ మనుష్య భూత యజ్ఞములు పంచ యజ్ఞములు. అవి నిత్య కర్మలు. చేసిన ఫలము లేదు. చేయకున్న దోషము. గృహస్థ ధర్మము నిర్వహించుము అని చెప్పిన అక్క ముక్తి ప్రతిబంధకియా, స్వార్థపరురాలా? ఏమి స్వార్థ మాసించినది. నీవు చేయు యజ్ఞమున వేదినలంకరింతునన్నది. ''యజ్ఞమ''ను పదము, యజధాతు భావము. దాని కర్థములు, ''యజ దేవ పూజా సంగతి కరణ దానేషు'' అని పాణిని నిర్వచనము. తొలి యర్థము దేవ పూజ. తమ్ముడు దేవారాధన చేయబూనిన తాను దేవుని కట్ట అలికి ముగ్గువెట్టి అలంకరింతును. ఇట్లు మాతమ్ముడు దేవతారాధకుడు నిత్యాగ్నిహోత్రి అని తన తమ్ముని ఘనతను చెప్పకొనుట పదిమందిలో ఆది ఆమె తప్పా.

చేయు పుణ్య కర్మలు యజ్ఞములైనా మరేవైనా; ఫలాశ లేక చేసిన నవే మోక్షసాధనములు. కర్మ చేయవలె ఫలము భగవదర్పణము చేయవలె. ''త్యాగే నైకే అమృతత్వమానశుః'' అనియే శ్రుతి. ఫలము కోరి చేసిన ముక్తి ప్రతిబంధకము. ఫలాశ వదలి చేసిన ముక్తి ప్రదము. అందుకే, ''కర్మణ్య కర్మయః పశ్యేద కర్మణిచ కర్మయః సబుద్ధిమాన్'' -అని గీత. కర్మను అకర్మగా, అకర్మను కర్మగాచేయు నేర్పు మనుజానకున్నది. అదే ఫలాశతో చేసిన కర్మ. నిరాశతో జేసిన అకర్మ. మోక్షప్రతిబంధకము కర్మ. కాని దకర్మ. ఇదీ శాస్త్ర నిర్వచనము కావున అక్క బోధ పరమ పద ప్రతిబంధకము సంసారమున ముంచునది కాదు. కాన ఆమె మారి, డెవిల్ కాదు.

ఎంత ఎంత అధఃపతితు డగునో అంత అంత వేగముగా భగవత్కృప పారునని రావుగారి నిర్వచనము. ఇది నురియూ విచిత్రమైన మార్గము. దీని మేరకు నడిచిన లోకవృత్త మస్తవ్యస్తమగుట సంసారులకు దుర్భర మగుటయూ తప్పదు.

మానవతకు వచ్చిన వ్యక్తికే శాస్త్రములు విధులు నిషేధములు. అవి భగవదాజ్ఞలు. ''శ్రుతి స్మృతిర్మమైవాజ్ఞా యస్తాముల్లంఘ్య వర్తతే ఆజ్ఞాచ్ఛేదీ మమద్రోహీ మద్భక్తోపిన వైష్ణవః'' శ్రుతి స్మృతులు నా యాజ్ఞలు. వాని మీరి చరించువాడు నా ద్రోహి. ''క్షిపామ్యజ స్రమ శుభా నా సురీ ష్వేవ యోనిషు'' అట్టి ఆసుర కృత్యముల చేయువారిని ''నీచ జన్మలకే గురి చేతును'' అని గీతా వాక్యము. అట్టివానిపై అంత వేగముగా భగవద్దయ పారునా ? కనుక రావుగారి ఉపపత్తి అనుమోదింపరానిది.

''భూసురోత్త గార్హస్థ్యమునకు సరియే'' అని పెద్దన చెప్పినట్లు యుక్తమైన గృహస్థ ధర్మ ముపదేశించిన ''అక్క'' మతము గాదవి ''పాప కృత్యము లాచరించుట పరమ పద సోపానములుగా నెక్కుట'' అనుట, వినుట, తగనిమాట.

''అక్క'' పూజ్యముగా నుపదేశించినది. అట్టి పవిత్రమూర్తి మానవతాస్ఫూర్తిచే ఏడ్చిన ఏడ్పనీ. ''ఏడ్చినది'' అని అనకుండిన క్షేత్ర మాహాత్మ్యమునకు లోటురాదు. అట్లయ్యు ''అడలినది'', అనుట, రామకృష్ణ కవి పరిహాసశీలత ''ఉదాత్త పాత్రకు మచ్చ తెచ్చి పెట్టుట'' అనియే, అనంతకృష్ణశర్మగారి వాక్య భావము.

మరి అట్టి పతితులకు క్షేత్రమున తనువు దొరగిన మాత్రమున మోక్షము వచ్చునా ? అన్న శంకకూ, తత్సమాధానమునకూ, ఇది చోటుగాదు, సమయమూ గాదు.

ఏయన్. నాగేశ్వరరావు

# కాళీపట్నం రామారావుగారి "యజ్ఞం"

కథ వ్రాయటం తేలిక.
మంచి కథ వ్రాయటం కష్టం.
గొప్ప కథ వ్రాయటం మరీ కష్టం.

అని ఆ మధ్య ఎవరో అన్నారు. అక్షరాలా సత్యం. రాజరికం ప్రజాస్వామ్యం పేరుతో చెలామణీ అవుతోన్న రోజుల్లో కానీ, నిరంకుశత్వం నియమబద్ధంగా నడుస్తోన్న రోజుల్లోకానీ పాలకులకు వారి ఆశ్రితులకు, వారి తాబేదార్లకూ పనికొచ్చేవెప్పుడూ మంచి కథలు కావు. మైనారిటీ ధనవంతుల సంపదల గురించీ, సరదాల గురించీ, వారి ఆటల గురించీ, పాటల గురించీ, వారి మానసిక భౌతిక వికారాదుల గురించీ రాసినవసలెప్పుడూ మంచి కథలు కానేకావు. తాత్కాలికంగా పాలకవర్గాలూ... తమ కలాల సైన్యాలూ వాటిని పరిరక్షించుగాక! కానీ నేటి జన సాహిత్యయుగంలో వీటికి ఉప్పురాతి విలువా వుండదు.

'సాహిత్యాన్ని సమాజ శ్రేయస్సుకోసం మనమొక సాధనంగా, ఆయుధంగా వాడుతున్నప్పుడు...' దాని ఫలితాలు మనం గమనించాలి. ఆ ఫలితాలు మెట్లుగా మనం నవసాహిత్యకారులం ముందుకు పోవాలి... మనతోపాటు పాఠకుల్ని, వాళ్ల ఆలోచనాస్థాయిని ఎదిగింప జేయాలి. ''సాహిత్యం సాంఘిక చైతన్యంలో ఒక శాఖ. సజీవుడై వున్న ప్రాణికి నాళ్ళు ఆడటమూ, ఊపిరితిత్తులు పనిచెయ్యటమూ ఎంత తప్పనిసరో సజీవమైన సంఘానిక్కూడా చైతన్యం తప్పనిసరి. తప్పనిసరయిన చైతన్యం తప్పనిసరి అయిన మార్పుకు తప్పనిసరిగా దారితీస్తుంది.'' (కొ.కు.) ఇలా సాహిత్యానికి మనమొక 'మార్పు'ను ఆపాదించుకుంటే సాహిత్యానికి తగిన నిర్దిష్ట లక్ష్యం తప్పక ఒనగూరుతుంది.

గొప్ప కథకు తగిన ప్రతిఫలం ఒక్కటే. కథలోని భావాలు పాఠకునిలో సజీవ సదృశం కావాలి. కథ చదివినవాడి గుండెల్లో కొలిమంటుకోవాలి. గుండె రాజుకోవాలి. కన్నీళ్ళు రావాలి... కళ్ళెర్ర బడాలి... పిడికిళ్ళు బిగించాలి. పాఠకుడు స్పందించాలి. స్పందన వృధా పోకూడదు. ఆ స్పందన సామాజిక చైతన్యానికి ఉక్కుపిడికిలి కావాలి. ఇదీ గొప్ప కథకు ప్రతిఫలం.

అలాగే 'నలుగురి' నోళ్ళల్లో గొప్ప కథగా నలిగి నానుతోన్న కాళీపట్నం రామారావుగారి 'యజ్ఞం' ఒకటి. దీన్ని నిష్పాక్షికంగా పరిశీలన చేయడానికి సాహసిస్తా.

రెండున్నరెకరాల పొలం వున్న డెబ్బైయేళ్ళ మాల కులస్థుడు అప్పల్రాముడు. అతనికి పుత్రపౌత్రాదులు చాలామందే వున్నారు. అలాగే ఒకప్పుడు బాగా బ్రతికి ప్రస్తుతం చితికిన షావుకారు గోపన్న. అతని కొడుకులు పొట్ట చేతబట్టుకుని ఊర్లకుపోగా మిగిలిన విధవ కూతుర్నీ, అయిదుగురి మనవల్నీ 'వుండీ లేకా' కాలం గడుపుతున్నాడు.

అప్పల్రాముడు గోపన్నకి కొంత అప్పు పడ్డాడు. మూడేళ్ళ గడువు తీరిపోయింది. గ్రామ పెద్దలూ... గ్రామాన్ని పెద్ద ఎత్తున సంస్కరించి ఆ గౌరవాంకితుడైన శ్రీరాములు నాయుడూ పంచాయతీ నడిపారు. అప్పల్రాముడు అప్పు కింద తన పొలం వదలాలని తీర్పిచ్చారు. అప్పల్రాముడు తను చెప్పవలసింది చెప్పుకున్నాడు. తనకు గ్రామ పెద్దలు యిస్తామన్న బంజరుభూమి గోపన్నకే యిప్పించమనీ, అందులో తమ యింటిల్లిపాదీ పనిచేసి అప్పు తీర్చుకుంటామనీ చెప్పాడు. పెద్దలు తమ తీర్పు మార్చలేదు. దాంతో అప్పల్రాముడు తన పొలం గోపన్నకు రాసిస్తాడు. రాయించి, గోపన్నకూ తనకూ జరిగిన లావాదేవీల చరిత్ర చెబుతాడు. గోపన్న తనవల్లే షావు—కారయ్యాడనీ, లావాదేవీలన్నీ గోపన్నే చూసుకునేవాడనీ తనకు రాత కోతలు తెలీకపోడం వలన ఎన్నోసార్లు మోసపోయాననీ...ఆ అర్థంలో వివరంగా చెబుతాడు.

అప్పల్రాముడు పొలం రాసివ్వడం అతని చివరి కొడుకు శీతారాములుకు సుతరామూ ఇష్టంలేదు. తండ్రిముందే తను నిక్కచ్చిగా పొలాన్ని వదులుకోనని చెబుతాడు. అప్పల్రాముడు పత్రంపై వేలిముద్ర వేయగానే శీతారాముడు పరుగులో గుడిసెలోకెళ్లి ఒక బస్తా మోసుకుని పంచాయతీ మండపం దగ్గరికొస్తాడు. బస్తాను కుమ్మరిస్తాడు... అందులో తన కొడుకు తలా మొండెం వేరయి రక్తమోడుతూ ఉంటయ్. శీతారాముడు తండ్రిని చూస్తూ... తన కొడుకు భూమిలేని బానిస బతుకు బతకడనీ, బానిసగా చెయ్యటం కన్నా చంపేయటం నయమనీ చెబుతాడు. ఇదీ కథకి ముగింపు.

కథలో చక్కని గ్రామీణ వాతావరణమూ, అందమైన తెలుగుదనం, తెలుగు మాటలు, నుడికారాలు, సంఘటనల్లో సన్నివేశాల్లో పాత్రల్లో పరిసరాల్లో తెలుగుదనం... శైలీ రమ్యత కథకి (పెద్ద) గొప్ప శోభని ఒనగూర్చింది. అంతమాత్రాన రచన సమగ్రంకాదు. అందులో నిజాయిజాలూ... పాత్ర చిత్రణా... పరిస్థితులూ గట్రా 'కొంత' వివరంగా చర్చించాలి.

1. గ్రామీణ జీవనం మార్పులూ —
2. శ్రీరాములు నాయుడి పాత్ర (శ్రీ. నా.)

3. ఇతర పాత్రలు

4. అప్పల్రాముడు — అతని అప్పు స్వభావం—

5. ముగింపు. ఇవి స్థూలంగా చర్చించదగిన అంశాలు. ఒకదాని కొకటి సంబంధించిన విషయాలు యిందులో వుండవచ్చు.

కథలో ప్రధానంగా రచయిత 1910 కి పూర్వం, 1910 నుండి 1947 వరకూ, 1947 నుండి 1962 వరకు గ్రామీణ జీవిత రంగంలోని (వ్యవసాయ రంగంలోని) మార్పుల్ని వర్ణించారు.

అప్పల్రాముడు పంచాయితీలో 'ఇది ఏభై ఏళ్ల క్రిందటిమాట' అంటూ ప్రారంభిస్తాడు కాబట్టి దాదాపు 1910, దానికి ముందు కొంత కాలమూ అనుకోవచ్చు. ఇక్కడ అప్పల్రాముడి ద్వారా చెప్పించిన సామాజిక ఆర్థిక స్థితిగతులన్నీ రచయిత అవగాహనా ఫలితాలని వేరుగా చెప్పనక్కరలేదు. అప్పల్రాముడి 'అనుభవాల' మాటల్లో రచయిత 'ఉత్పత్తి సంబంధాల ఉత్పత్తి శక్తుల ...' ఏభైయ్యేండ్ల చరిత్రను చెప్పిస్తున్నారు; (అచ్చంగా యిది మార్క్సిస్టు ఆర్థిక సూత్రాల్లో ప్రధానభాగం...) అంతేగాక అప్పల్రాముడిలాంటి చిన్న రైతులు క్రమేణా ఎలా 'వ్యవసాయ కూలీలు'గా మారేదీ యిక్కడ రచయిత చూపుతున్నారనుకుంటాను.

1910 ప్రాంతంలో సుందరపాలెంలో వేరు శెనగ, గోగూ లాంటివి కేవలం షావుకార్లే వేసేవారు. అప్పల్రాముడి వంటి చిన్న రైతులు కూడా షావుకార్ల మాటలవల్లా, వ్యాపార పంటలవల్ల వచ్చే 'ఆదాయం' వల్లా వ్యాపార పంటలు వేసేవారు. అంతకుముందు వీరు పండిస్తున్న తిండి గింజలు వరి, గంటి, చోడి, జొన్నలాంటి వానికి స్వస్తి పలికారు క్రమంగా. అంతేకాక ఈ వ్యాపార పంట దిగుమతిలో షావుకార్లకి అప్పల్రాముడి లాంటి చిన్న రైతులు అప్పులు కూడా యిచ్చేవారు. ఇక్కడ ఒక విషయం గుర్తించాలి. పేద, మధ్యతరగతి, ధనిక రైతుల విభజన నిర్ణీత ఎకరాల పరిమితిలోనే వుండదు. కొన్ని సందర్భాల్లో హెచ్చు తగ్గులు కూడా వుండవచ్చు. మాగాణి ప్రాంతాలలో విలువైన వ్యాపార పంటలు పండే ప్రాంతాల్లో తక్కువగావుండే కమతాల్లోనే పై తరగతు లేర్పడవచ్చు. క్రమేణా రైతుల భూములను అప్పులు, బాకీల పేర్న తమ భూముల్లోకి కలుపుకోడం మామూలే. అదే యిక్కడా జరిగింది.

భూములమీద వత్తిడి రావటానికీ, షావుకార్లు పెరగటానికీ మరికొన్ని పరిస్థితులు దోహదం చేసినయ్. అప్పల్రాముని మాటల్లో ''అప్పట్లో యీవూరు సాలోళ్ళ కెవ్వరికీ జరుగుబాటుండేది—కాదు. సీమ నూలొచ్చాక ఆల మగ్గాలు మూలపడిపోయాయి. ఆలరాట్నాలు అటక లెక్కేసినాయి. ఆలు తిండికి సానా కష్టపడేవారు.'' ఇక్కడ రచయిత చెప్పదలచుకున్నది చేతి వృత్తులు (బ్రిటిష్ వారి) యంత్రాలొచ్చాక మూలపడ్డాయని. కానీ యిది అసమగ్రంగా తోచుతూంది. బ్రిటిషువారు తమ పరిశ్రమలను స్వదేశంలో ప్రవేశపెట్టటం...వారికి స్వదేశీ సంస్థానాధీశులూ...రాజులూ...జమీందారులూ లాంటి 'జన వ్యతిరేక శక్తులు' తమ పెట్టుబడులను పెట్టి వారి పరిశ్రమలకు వత్తాసు నిచ్చి మన దేశంలోని చేతి పరిశ్రమలు ధ్వంసం కాడానికీ, యిది హెచ్చుగా జరగటం మూలాన ఒక దళారీ వర్గ మేర్పడటానికీ అవకాశమేర్పడింది. ఫలితంగా చేతివృత్తులవాళ్లు తమ వృత్తులను మూలపడేసి వ్యవసాయంమీద ఆధారపడటం; భూమి, భూస్వాముల అధీనం కనుక వ్యవసాయ కూలీలుగా మారటం సంభవించింది. ఈ దళారీ వ్యాపారంలో భారతీయులు 'కొందరు' లక్షాధికారులై భారత పెట్టుబడి దారులుగా పరిణమించారు. ఇంతచరిత్రని కొద్దిమాటల్లో చెప్పబూనటంవల్ల విషయం వివరంగా తెలియటంలేదు.

అప్పటికి గోపన్న చిన్న రైతు. కొంత లాభంతో (కమీషన్!) పొగాకును అమ్మేవాడు. తర్వాత అతను స్వయంగా అప్పల్రామునివంటి రైతుల వద్ద పొగాకుకొని వ్యాపారం చేసేంతవరకు ఎదిగాడు. (కమీషన్ వ్యాపారంలో...). అలాగే షావుకార్లు పొగాకు వ్యాపారంలో బాగా డబ్బు గడించేవారు. రైతులకు 'ఆ లావాదేవీలు' తెలియదు కనుకా వాళ్లింకా వస్తు మార్పిడి స్థితిలోనే (బార్టర్ సిస్టమ్!) వుండటం వల్లా డబ్బు 'మహాత్యం' వీరింకా గ్రహించలేదు. గ్రహించే లోగానే రైతుల చేతులు కాలిపోయాయి.

భూస్వాములూ, ధనిక రైతులూ పండించే ఆహార ధాన్యాలలో హెచ్చు భాగం (వ్యవసాయ అవసరాలకు పోను) మార్కెట్‌కే వెళ్తున్నవి. భూస్వాములూ, ధనిక రైతులేగాక, మధ్య పేద తరగతి రైతులు పండించే వ్యాపార పంటలన్నీ మార్కెట్‌కోసమే! ఈవిధంగా మార్కెట్ కోసమే ఉత్పత్తి చేయటమనేది మన వ్యవసాయంలో ప్రధాన లక్షణంగా ముందుకొచ్చింది. ఇది పెట్టుబడిదారీ లక్షణమని గుర్తించాలి. ఎందుకంటే ఈ పంటలమీద ఆధారపడవలసిన పరిశ్రమలు దేశమంతటా వున్నవి. ఇక్కడ ఒకటి గమనించాలి. వ్యవసాయ రంగంలో కూడ మన దేశం విదేశీయుల మార్కెట్‌గా వుపయోగపడుతున్నది. పొగాకును అప్పల్రాముని వంటి రైతులవద్ద గోపన్నలాంటి షావుకార్లు తక్కువ ధరకి కొనడం, దానిని మిల్లులకు ఎక్కువ ధరకి అమ్మడం—వాళ్ల (మిల్లు యజమానులు) షావుకార్లని దగాచేయటం, వారు విదేశీ పొగాకు కంపెనీలకి అమ్మటం, వారు సిగరెట్‌లు గట్రా తయారుచేసి మళ్లీ ఈదేశంలోనే అమ్మి అంతకంత లాభం పొందడం జరుగుతూంది. అప్పల్రాముడు చెప్పినట్లు ''బాబయ్యా ఆ లెక్కలేవో జనానికి తెలిసేవి కావు. ఇప్పణ్ణయా పైసల తిరకాసు వుంది కదా — ఇంతకన్నా పెద్ద తిరకాసు ఉండేవి. అందుకే బయస్తులం డబ్బు జోలికెళ్ళేవాళ్లం గావు. దినుసు మార్పులోనే బోలెడు దగా జరిగిపోతుండేది. బాబయ్యా ఏ దినుసైనా మాంవమ్మబోతే రూపాయి కైడు కుంచాలూ, మేం కొనబోతే మూడే కుంచాలు. అదే మాదిరి మాంకొనేటప్పుడు కుంచాలు సిన్నగుండేవి. మాంవమ్మే ఏలకి పెద్దవై పోయేవి.''

''బాబయ్యా వంట ముకాన సావుకారొచ్చేవోడు. ఓ రప్పల్రా వుడూ, ఓరసిరిగో, పుట్టీ ఏరు శెనగల ధర యింతరా అనీవోడు. సరే బాబయ్యా అనీ వోళ్లం. కొలగారం యింతా అనీవోడు. నోరు

మూసుకునీవాళ్లం. నీ కింతొస్తది. అవసరమైతే పుచ్చుకొనీవాళ్లం, లేప్పోతే నీకాడే వుణ్ణియయ్యా అనీవోళ్ళం.''

అంటే యిక్కడ అప్పల్రాముడి మాటల్లో (రచయిత చెప్పి నట్లు...) షావుకార్లు రైతులను ఎంతవరకు...ఎలాదోచేదీ వివరంగా తెలుస్తూంది. అలాగే గోపన్న కూడా అప్పల్రాముడ్ని 'బాగా' మోసం చేయటానికి ప్రయత్నించాడనేది స్పష్టం.

అయినా లాభాలధికంగా రావటం మూలాన, రైతుల 'నింకా భ్రమల్లో వుంచటం అవసరం కాబట్టీ ... అప్పల్రాముని ఆరెకరాలు తొమ్మిదై కూచుంది. తర్వాత క్రమంగా ఎగుడు దిగుళ్లు ప్రారంభ మైయ్యాయి. రైతులంతా ఏ పంట ఎక్కువగా పండిస్తే ఆ పంట ధర తగ్గి యింకో పంట ధర పెరగటం. (ఇక్కడ ధరల్ని రైతుల వద్ద స్థిరీకరించడం షావుకార్లేనని మరువరాదు) మరుసటేడు ఆ పంటే పండిస్తే ఈసారి దాని ధర పడిపోయి తక్కువగా వున్న దాని ధర పెరగటం జరిగింది. (ఇది మార్క్సిస్టుసూత్రాల్లోని సప్లయి—డిమాండ్‌కు సరిపోతుంది.)

ఈ ధరలవల్ల రైతులు ఎప్పటి కప్పుడు నష్టపోయి చితికి పోయారు. అప్పల్రాముడూ అందులో భాగం కాబట్టి నలిగిపోయి కష్టాన రెండెకరాలు మిగిలించుకున్నాడు. అంటే ధరలు నిర్ణయించే షావుకార్లు అప్పల్రాముడి లాంటి రైతులను ముంచేయటం జరిగింది. అలాగే గోపన్న చిన్నరైతులవద్ద బాగా సంపాదించినా, అతన్నిమించిన షావుకార్లు అతన్ని మింగేసినారు. వ్యాపారపోటీలో దివాలా తీసినట్లుగా భావించొచ్చు, కానీ దివాలాకు కారణం అతన్ని మించిన షావుకార్లనేది గమనించాలి. (ఇది కూడా గొప్ప మార్క్సిస్టు ఆర్థికసూత్రమే...)

ఇలా ఈ కథలో ఏభయ్యేండ్ల ఆర్థిక స్థితిగతులు వివరించ ప్రయత్నించడం మంచిది, అభినందనీయమే గాని 'కథ'లో యింత విస్తృతమైన చరిత్ర వివరించబూనడంవల్ల సంక్షిప్తమై అవసర మైన చోట్ల వివరణ యివ్వలేకపోయాయి. అదీగాక రచయిత తన మార్క్సిస్టు అవగాహనను ఈ అప్పల్రాముడి పాత్ర ద్వారా చెప్పించ బూనడం, తద్వారా ఆ పాత్రకు కొంత సహజత్వం చెడిందనే అనాలి. అప్పల్రాముడు ఎంత అనుభవం కలవాడైనా ఇలా మార్క్సిస్టు చైత న్యంతో గొప్పగా ఆర్థిక స్థితిగతుల్ని వివరించగలడా ? ఒక సామాన్య రైతుకు(గ్రామీణ) అదిసాధ్యమా? కానీ కా. రా. గారు వివరించబూనిన ఈ విషయాలు మాత్రం కథకు అసమగ్రమైనా నవలరూపేణా ఐతే అత్యంత వివరంగానూ, వాస్తవికంగానూ వచ్చేదానికి అవకాశం వుండే దేమో! రచయితఅప్పల్రామునిద్వారా ఈ చరిత్ర చెప్పించేబదులు తానే స్వగతంలో చెప్పవచ్చు కానీ రచయిత ఉద్దేశ్యపూర్వకంగానే ఈ పాత్ర ద్వారా ఈ విస్తృత చరిత్ర చెప్పించినట్లు తోస్తూంది. అంతేగాకుండా ఈ చరిత్రలో పైన వివరించినచోట్ల వివరణలు పాఠకుడ్ని గందర గోళంలో ముంచుతాయేమో ! ఇంత చైతన్యం అప్పల్రాముడికి కలిగి నట్లు రచయిత మనకు చూపించడు. ఐనా గొప్ప చైతన్యంతో ఈ పాత్ర తన పరిధుల్ని దాటిపోవటం రచయిత చాపల్యంవల్లేననటం సాహసం కాదేమో !

శ్రీరాములునాయుడు గ్రామంలో ప్రవేశించక పూర్వమే పై వ్యావసాయిక స్థితిగతులన్నీ మారేయి. ఆరెకరాలనించీ తొమ్మిదికీ తర్వాత రెండున్నరకీ ప్రవేశించాడు—అప్పల్రాముడు. వ్యాపారపంటల లావాదేవీల్లో అప్పట్లోనే తను గోపన్నకు 'అప్పపడ్డట్టుగా' తెలుసు కొని వుండవచ్చు. శ్రీరాములునాయుడు పట్నంలో 'లా' చదివి అక్కడ గాంధేయవాదాన్ని బాగా అభిమానించి స్వతంత్రం(?) వచ్చిన కొన్నా ళ్లకి తన గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి సుందరపాలేనికి వస్తాడు. ఖద్దరు లాల్చీ కండువాలతో సరిపుచ్చే శాల్తీకాదు శ్రీరాములు నాయుడు. అతను గాంధీ సిద్ధాంతాన్ని బాగానమ్మిన వ్యక్తి. ఆ సిద్ధాం తాలపట్ల 'సిన్సియర్'గా ఉండటాన్ని రచయిత చిత్రించబోయి కొంత 'అతి'గా అతని సిన్సియారిటీని చిత్రించారు. శ్రీరాములునాయుడు 'లా' కాలేజీ మేగజైన్‌లో తను రాసిన వ్యాసాన్ని పాఠకులు పొగడడంతో 'క్రియాశీలియైన రచయితపై దాని ప్రభావం అతనిని స్వగ్రామానికి చేర్చింది' అంటూ రచయిత అతను సుందరపాలేనికి రావడానికి గల ఆంతర్యాన్ని చెబుతారు. ఇది సంభవమా ? ఆలోచించాల్సిన విషయమే!

''వూరు వూరంతటికీ రెండంటే రెండు కాబోలు చిన్న చిన్న కిరాణాకొట్లు. రాత్రుళ్ళు ఇళ్లలో చమురుదీపాలుండేవి. పేదతనంతో ప్రజలు అల్లల్లాడిపోతుండేవారు. మురికి మురికి గుడ్డలూ, మరమ్మ త్తులు కారే యిళ్ళతో బరువు నిండిన బతుకులు వెళ్ళమార్చు కుంటూ నాగరికతకు దూరంగా ఆ మూల పడివుండేవారు.'' అలాంటి పరిస్థితిలో శ్రీ నా. గ్రామానికొచ్చాడు. అతనికి నిండా పాతికేళ్ళు లేవు. 'అతని మాటలూ, యత్నాలూ విసీ, చూసీ వెనకా ముందూ నవ్వనివారూ, యద్దేవా చేయనివారూలేరు.' కానీ ఒక షావుకారువద్ద హైస్కూలుకు విరాళం సంపాయించగనే యితనిమీద విశ్వాసం పుట్టు కొస్తుంది! అతని మాటల్లో మహత్మ్యముందనుకున్నారు జనం. తర్వాత అందరూ అతని మాటలు వినడం ప్రారంభించేరు. (ఇది సాధ్యమా?) తర్వాత శ్రీ నా. పేదలచేత శ్రమదానం చేయించడం, హైస్కూలు కట్టించడం, తర్వాత ప్రభుత్వ సహాయంతో(?) రోడ్లు, కరెంటు, పోస్టాఫీసు, పశువులాసుపత్రి, మనుషులాసుపత్రి లాంటివి అంచెలంచెలుగా ఆ గ్రామానికి ఒనగూరేటట్లు చేశాడు. ఇది శ్రీ నా. గొప్పతనం చెప్పటానికి రచయిత చెప్పారనిపిస్తుంది. ప్రభుత్వం చుట్టు పక్క గ్రామాలకి ఏవిధమైన సౌకర్యాలు లేకుండానే ఒక్క సుందర పాలేనికే శ్రీ నా. లాంటి (నిజాయితీ పరుడైన) గాంధేయుని మాటలవల్ల యిచ్చారంటే చూడటానికి అవాస్తవికంగా వుంటుంది.

శ్రీ నా. పట్ల గ్రామంలోని ప్రజలందరికీ గొప్ప గౌరవం వుంది. తమనేదో వుద్ధరిస్తాడని వారనుకోవటంలో తప్పులేదు. అప్ప ల్రాముడి మాటల్లో ''ఇంతకాలానికి పేదోళ్ల సీకటి బతుక్కి దారి సూపే దొరమ రాజొచ్చినాడు. ఆ బాబు సల్లగుండి ఆయన సెప్పిం దంతా జరిగినా జరక్కపోయినా మా యప్పల్దీరిపోయి మాకింత కూలీ నాలీ దొరికి, జనమంత సల్లగుంటారనుకున్నాను. అలాగుండాలని

వయ్యిదవతలకు ముక్కుకున్నాను." ఇక్కడ శ్రీ నా. పట్ల అప్పలాముడికి పెద్ద భ్రమల్లేవు. తమని సుఖభోగాలలో ఓలలాడించక్కర్లేదనీ, పిల్లలు చదివి కలెక్టర్లు కానక్కర్లేదనీ, తమ అప్పులు తీరి రోజూ కూలి దొరికితే చాలనీ, అదేగొప్ప సుఖమనీ ఇతని అభిప్రాయము. శ్రీ నా. గొప్పగా గాంధీభ్రమల్లో కూరుకుపోయి హైస్కూళ్ళు, రోడ్లు, ఎలక్ట్రిసిటీ, ఆఫీసులు వగైరాలువస్తే అట్టడుగు జనం చదువుకొని పైకి రావచ్చనీ తలచాడేమో! కానీ, అతని గాంధీవాదం, ప్రణాళికా ఫలితాలు ఘోరంగా పరాజయం కావటం ప్రయోగ సదృశంగా చూస్తాం. అయితే రచయిత మోతాదును మించి, శ్రీ నా. అతని గాంధేయవాదంలోని 'భక్తి' ని పొగడటంవల్ల శ్రీ నా.ని సమర్థిస్తున్నాడేమోనన్న అభిప్రాయం కల్గుతుంది. కానీ రచయిత అభిప్రాయం అదికాదేమో!

కానీ ఒకటిక్కడ విస్మరించరాదు. "ఆశ్రయింపులూ, ఆవేశాలూ, ఎత్తుగడలూ" లేకుండా పనులు జరగవనీ ఒకవైపున చెబుతూ సుందరపాలెం అభివృద్ధిమాత్రం చాలా న్యాయంగా జరిగినట్లు రచయిత చిత్రించారు. ఈనాటి వ్యవస్థలో ప్రభుత్వాన్నాశ్రయించకుండా నిజాయితీగా, నిస్వార్థంతో పనిచేసిన వ్యక్తులు, గ్రామాల్ని సుందరపాలెమంత అభివృద్ధికి తేగలరా? ఒక వ్యక్తివల్ల ప్రభుత్వానికి ఏవైనా ప్రయోజనాలు ఒనగూరితే ... ప్రభుత్వం అతనభీష్టాన్ని కొంతవరకూ నెరవేర్చవచ్చు. కానీ శ్రీ నా. నిజాయితీపరుడు కదా! ప్రభుత్వ మతనికెట్లా సాయంచేసింది? రచయిత శ్రీ నా. చాలా సత్వరాభివృద్ధివలన గ్రామాన్ని 'ఉచ్ఛస్థితి'కి తీసుకువెళ్ళేడని చెబుతూ ఇలా కొన్ని పరస్పర విరుద్ధాభిప్రాయాలు చేర్చారు.

అప్పలాముడన్నట్లు స్కూలుకు కూలోళ్లందరు శ్రమదానమివ్వటం శ్రీ నా. మీద గౌరవంవల్లే నన్నది విస్మరించరాదు.

"ఆ తర్వాత కో-ఆపరేటివ్ గోడౌన్లన్నావ్, నూతులన్నావ్, కొంత కొంతమంది, కొంత కొంత కాలం రాయీ-రప్పా మోసుకొని బతికేసినారు. ఆ తర్వాత కొత్త కొత్త పన్లు నువ్వీ వూరికి తేలేకపోనావు. మా బతుకులు ఎక్కడేసిన గొంగళీలు అక్కడే అన్నట్టు తయారైనాయి."

"మావొక తాగుబోతులంకాదు; ఒక ముండల ముఠాకోర్లం కాదు; ఒక జూదగాళ్ళంకాదు..." అప్పలాముడంటాడు. అంటే యిక్కడ ఎన్ని సౌకర్యాలు చేయబోయినా శ్రీ నా. వల్ల తమకు ఏమీ ఒరగలేదనే అర్థం. అంతేకాదు-"మాలో అప్పుడు పుట్టిన బిడ్డల్నొదిలి, అరవై-డెబ్బైఏళ్ళ వుద్దరోళ్ళయినా మా ఆడంగులు కూడా మానాగే గొడ్లతోబాటు మున్నూటరవై రోజులు, ముప్పొద్దులు, ఎండనక, వాననక, సలనక, సంకటాలనక సాకిరీ చేస్తారు." ఇంత చాకిరీచేసినా మేము అప్పుల్లో కూరుకుపోతున్నాం, మాభూములు చెల్లిపోతున్నాయి. "ఏవీ లేనోళ్ళు ఏడాదితిరిగేసరికి కావందులైపోతన్నారు. పదేళ్ళలో పాతికా ముప్పైఏలు ఎనకేస్తున్నారు." ఎవరి సొమ్ము ఎవరు దోపిడీచేయటంవల్ల ఈ వ్యత్యాసం కలుగుతోంది? ఎవరి భూముల్నాక్రమించడంవల్ల ఈ పరిస్థితి పరిణమిస్తోంది? అని అప్పలాముడు శ్రీ నా.ని నిలదీసి అడుగుతాడు. గాంధేయవాదం మూగబోతుంది. అప్పుడు రచయిత 'ఈ ప్రశ్న జవాబు కోరిందికాదు' అంటాడు. ఇలాగే గొప్ప చైతన్యంతో అప్పలాముడు మాట్లాడతాడు. ఒక్కజాతికి చెంది అభివృద్ధి లేశమైనాలేని అధమ సమాజంలోని ఒక సామాన్యరైతుకి యింతటి చైతన్యం ఎలావచ్చింది? ఎలావస్తుంది? ఈ చైతన్యానికి కారణం తన బంధువులతో వాదోపవాదాలక్రిందనలిగిన మాటలేనని రచయిత చూపిస్తాడు.

శ్రీ నా. కృషీ, అభివృద్ధీ అంతా తమకు కొంతకూడా అక్కరకు రాలేదనే నిష్ఠూరం అప్పలామునిలో కలుగుతాయి. కనుకనే "పున్నానికొచ్చిన వోరిన నువ్ మొదలెట్టిన యెగ్గం పాపంలో దింపింది. దిగినాక తెలిసీ తెలీకా అందరం అందలకూరకపోతన్నాం." ఊళ్ళోకి కరెంటు రావడంవల్ల ధాన్యందంపే కూలిపనులుపోయాయి. కానీ (రచయిత మాటల ప్రకారం...) సుందరపాలేనికి చుట్టుపట్ల గ్రామాల్లో పరిస్థితులన్నీ పూర్వం మాదిరే వున్నాయి కాబట్టి అక్కడి పనులు ఎప్పట్లాగే వుండి వుండాలి. సుందరపాలెంలో కూలి దొరక్కపోయినా, చుట్టుప్రక్కల గ్రామాల్లో వీరికి కూలి దొరకవచ్చు. అదీగాక సుందరపాలెపు అభివృద్ధికి ప్రక్కగ్రామాలవాళ్ళు 'ఈర్ష్య' పడుతున్నారని చెబుతూనే రచయిత అప్పలాముడిలాంటి కూలిజనం పడే బాధలవల్ల ఈ అభివృద్ధి అనవసరం అనిపించటం కథలో కొంత తికమకకు అవకాశమిస్తోంది.

పెట్టుబడిదారీ సమాజాభివృద్ధిక్రమంలో యంత్రాలూ తదితరమలైన ఆధునిక శాస్త్రపరికరాలు రంగప్రవేశం చేయటం మామూలే. వాటిని కూడా భూస్వాములు తమకనుగుణంగా వాడుకుంటారు. ఎలా అంటే, తమకున్న ఎందలవేల ఎకరాల్లో ట్రాక్టర్లవంటి యంత్రాల్ని ప్రవేశపెట్టి బావులకు మిషన్లు వేయించి బాగా సాగుచేయించుకుంటారు. అపుడు అంతకుముందున్న పనిపాటకజనం వీరికి ఎక్కువగా అవసరంకారు. కమతాలు లేని వీరికి ఆ పనిపాటలు పోవటం కూడా జరుగుతుంది. అలాగే చిన్న కమతాల రైతులు, సమర్థవంతులు కాని వ్యవసాయదారులు పెద్ద చిన్న కమతాలపై వచ్చేరాబడి, లాభాల మధ్యవున్న గండి పెద్దదని గ్రహించి తమ భూములను అమ్ముకుంటారు. మిగిలినవారి భూములను భూస్వాములు అప్పుపత్రాల ద్వారానో, మరే మోసాలద్వారానో గుంజుకుంటారు. ఇదిలాగుంచితే, పేదల పనులు పోయినప్పటికీ రోడ్లూ, మిల్లులూ, కరెంటూ, బస్సులూ రావటం అభివృద్ధి కాదా? భూస్వామ్యవ్యవస్థ 'కొంత' పెట్టుబడిదారీ వ్యవస్థకి సమాజం రావటం 'అభివృద్ధి' కాదా? బ్రిటిషు ఇండియాలో వారు ఆంగ్లవిద్య ప్రవేశపెట్టడం, సతీసహగమనాది-మూఢాచారాలని నిషేధించడం అభివృద్ధికరమైన పనులుకాదా? (అంతమేరకు) కానీ రచయిత అప్పలాముని పాత్ర ద్వారా ఆధునిక శాస్త్రీయ నాగరికతను నిరసింపజేస్తారు (ఎర్రయ్య పాత్రద్వారా కూడా).

ఇలా రచయిత శ్రీ నా. పాత్రని పరమ సాత్వికునిగా, నిస్వార్థుడైన గాంధీ అనుయాయుడిగా మలిచారు. ఈ ఒక్కవ్యక్తే గ్రామంలోని పేదవర్గాల సాయంలో ఎన్నో అభివృద్ధికరమైన పనులని

చేయిస్తాడు. అవన్నీ పేదవర్గాల సాయంతో చేయబడినా ధనికవర్గాలకే ఉపయోగపడతాయి. అయినా రచయిత, యిందులో శ్రీ నా.. తనకు తెలియకుండా ఈ పొరపాటుచేసినట్లు చెబుతారు. ఇతని ఆలోచన లన్నింటినీ ప్రభుత్వం ఆమోదిస్తుంది. అవన్నీ ధనికవర్గాలకే ఉపయోగ పడతాయి. శ్రీ నా. వల్ల తన ఉనికికి ఏమీ నష్టంలేదని, పైపెచ్చు తనవర్గంవారికే ఈ ప్రయోజనాలన్నీ అని ప్రభుత్వానికి తెలుసు ! శ్రీ నా. పాత్ర కథ ముగింపుకి ఘోరపరాజయానికి గురవుతుంది. ఇదంతా రచయిత గాంధేయవాదపు ఘోరపరాజయానికి పరాకాష్టగా చూపారని తలచవచ్చు. కానీ, శ్రీ నా. పాత్రని రచయిత వాస్తవికంగా చిత్రించబోయి తోటి పాత్రలద్వారా కీర్తింపజేశారు. అతను నిజాయతీ పరుడనీ, అతడు దోపిడీ వ్యవస్థలో భాగమైనా దోపిడీదారు కాదనీ చెప్పటానికి ఎన్నో సంఘటనలని వాడుకున్నారు. కనుకనే కొందరు శ్రీ నా. పాత్రద్వారా, రచయిత 'గాంధేయవాదపు ఊబిలో కూరుకు పోయార'ని అనుకోవడానికి అవకాశమిచ్చింది. ఈ కథకి 'యజ్ఞం' అని పేరుపెట్టిన తీరు, శ్రీ నా. సుందరపాలేనికి చేసిన సేవాభి వృద్ధులే అనుకోవటానికి రచయితే బాధ్యులు. అలా భావించటానికి రచయిత చాలా ఎక్కువ అవకాశాలను కల్పించారు. అయితే ఈ పాత్ర ద్వారా రచయిత చెప్పబూనిన విషయం మాత్రం ఎంతో ప్రశంసనీయమైంది. గాంధేయవాదపు పతనం, లోపాయికారీతనం స్పష్టంగా చూపాలనే తాపత్రయం రచయిత గొప్పతనాన్నీ, అవగాహనా ప్రతిభనూ నిరూపిస్తుంది. ఈ పాత్ర ఎంత కృషిచేసినా ఫలితం అట్టడుగువాళ్ళకి అందలేదనీ, అలా అందాలంటే వాళ్ళే 'ఏదో' చేయాలనీ రచయిత భావం అయ్యుండవచ్చు.

అప్పు విషయమై భూమి రాసివ్వటాన్ని సీతారాములు లాంటి పాత్రలు తిరస్కరిస్తూ అప్పల్రాముడితో శ్రీ నా. డ్ని తూల నాడుతూ అతడూ, అతడి సిద్ధాంతాలూ అనవసరమైనవనీ, కొంపలు కూల్చేవనీ ఆ అర్థంలో మాట్లాడతారు. అపుడు చుట్టం చూపుగా అప్పల్రాముని యింటికి వచ్చిన ఎర్రయ్య సంభాషణల్ని కాస్తంత నిశితంగా పరిశీలించాలి. అతడు మాటాడిన భాషను బట్టి ఆతను అప్పల్రాముడి లాంటి నిరక్షరాశ్యుడేనని తెలుస్తోంది. అంతేకాదు అతడుకూడా గ్రామవాసే ననాలి. (అప్పల్రాముడికి పట్నంతో సంబం ధాలు లేవు కదా!) అలాంటపుడు జీవిత సత్యాల నెంతగా అనుభవిం చినా ... అంత చైతన్యం ఎర్రయ్యకు ఎక్కడ్నించొచ్చింది ? అది సాధ్యం కాదు. ఎందుకంటే యితర గ్రామాల్లో సుందరపాలేనికి జరిగిన అభివృద్ధి జరగలేదని రచయిత పదే పదే చెబుతారు. ఎర్రయ్య మాటలు కొన్ని —

''ఓయోయ్ బుల్లోళ్ళో, ఆయన్నని నాభం నేదు. జరుగు తున్న దగా ఎక్కడో మీకు తెల్నట్టే ఆయనకీ తెలవదు. దీనికంతటికీ కీలకం యిక్కడెక్కడా నేదు. పైనెక్కణ్ణుంచో వచ్చిన ముప్పు మన్నందర్నీ ముంచుతోంది. పండిన పంటంతా కాంవందుల గోదాల కెళ్ళాల. ఎల్లకుండా కూలోడు అడ్డుతగులుతున్నాడు. ఎనకటోజుల్లో అయితే తన్ని సేయించుకునీవోరు. ఇప్పటిరోజుల్లో ఆ పప్పులుడకవు. కూలోడి అడ్డు తొలగించుకోవాలంటే మిసీన్లు కావాలి. మిసీన్లు తేవాలంటే యెల్టిసిటీ, రోడ్లూ కావాలి. అంతేకాదు, సదువుకున్న కూలోళ్ళు కావాల. అందుకనే ఈ యిస్కూళ్ళు, అందుకనే ఈ రోడ్లూ ఈ యల్కట్రిసిటీ. ఇయన్ని మనకోసంవే అనుకోడం మన బుద్ధి తక్కువ'' అని ఎంతో పరిణతి పొందిన చైతన్యంతో, అవగా హనతో మాట్లాడ్డం, శ్రీ నా. సుందరపాలెపు అభివృద్ధి నిర్వహిం చినా అది అట్టడుగు వర్గాలకి సహాయకారి కాలేకపోయిందనేది తెలియ దనీ, తనకు తెలీకుండా ఈ పని చేశాడనీ చెప్పజూడటం ఈ పాత్రకి అలవికాని పని. ఈ పాత్ర ఈ ఊరు లేకపోయినా శ్రీ నా. గురించి, ఊరి గురించి బాగా పరిచయమున్నట్లు సంభాషించటం మీదుమిక్కిలి గొప్ప చైతన్యంతో మాట్లాడ్డం సహజత్వానికి గొడ్డలిపెట్టు.

గోవన్నని ఒక మధ్యతరగతి రైతుగా రచయిత మొదట చిత్రిస్తాడు. కాలం, ధరలు అనుకూలించినపుడు మధ్యతరగతి రైతు లలో కొందరికి మిగులు ఆదాయం ఏర్పడుతుంది. పొగాకులాంటి వ్యాపార పంటల అమ్మకం వల్ల గోవన్నకు కొంత ఆదాయం కూడా వచ్చింది. సామాన్యంగా కొందరు దీనిని పెట్టుబడిగా మార్చుకుని ధనిక రైతులలో చేరుకొంటారు. గోవన్న బాగా ప్రయత్నించినా పెట్టుబడిదారీ వ్యవస్థలోని 'లక్షణాల'లో యిమడలేకపోయాడు. ఫలితంగా అందులోని ధరల అస్థిమితం, ధనికరైతులు (తనకంటె) మిల్లు యజమానులూ తనని మింగటం ఫలితంగా మామూలు పేద రైతుగా దిగజారాడు. పెట్టుబడిదారీ భూస్వామ్య వ్యవస్థల ఫలితంగా మధ్యతరగతి రైతులు పేద రైతులుగా మారటం సర్వసాధారణ పరిణామం. అప్పల్రాముడు గోవన్న వ్యాపారంలో ముందుకుపోతూన్న తరుణంలో అప్పుపడతాడు.

అప్పల్రాముడికి మొదట్లో ఆరెకరాలున్నా తర్వాత పై చెప్పి నట్లు రెండెకరాల స్థాయికి దిగుతాడు. అప్పల్రాముడి కుటుంబమంతా చాలీచాలని ఆ రెండెకరాల పొలంలోనూ, యితరత్రా కూలిపనులు చేసుకుంటూ బ్రతుకుతుంటారు. కనుక అప్పల్రామునికి రైతుకూలీ స్వభావం కొంత ఉంది

ఇలా ఇరువురి పేదరైతుల మధ్య రచయిత విభిన్నత చూపారు. అప్పల్రాముడు తన యింటిలోనివాళ్ళ చర్చలవల్ల గోవన్నకు తాను యివ్వవలసిందేమీ లేదనీ ఆ అప్పే ఒక అన్యాయమనే నిర్ణయాని కొస్తాడు యథార్థం కూడా అదే. కానీ రచయితచే పరమ సాత్వికుడిగా చిత్రించబడ్డ గోవన్న యిలా చేయగలడా ? ఎందుకు చేయలేడు ? (పయిన వివరించాను). అప్పల్రాముడే చెప్పినట్లు కొలిచేటపుడూ, అమ్మేటపుడూ, తరుగు నిర్ణయమూ, రేటు నిర్ణయమూ అన్నీ షావుకారి యిష్టాపూర్ణమే అయినపుడు గోవన్న మోసం చేయలేడా ? చేయకుండానే ధనవంతుడయ్యాడా ?

ఇద్దరి పేదవాళ్ళ మధ్య తగువుగా యిది కనపడినా దీనిలో తప్పకుండా వర్గ స్వభావముంది. అప్పల్రాముడు క్రింది వర్గానికీ, గోవన్న ఆర్థికంగా స్థితిమంతుడు కాకపోయినప్పటికీ, చితికిపోయి నప్పటికీ అప్పల్రాముడి భూమి ద్వారా, తిరిగి మరికొన్ని యిలాంటి

అప్పు వసూళ్ళ ద్వారా రైతుగా నిలదొక్కుకోవచ్చు. ఇక్కడ యితనిలో ఈ లక్షణాలు, రచయిత అవగాహనలో కనపడకపోయినా వాస్తవానికి అతనిలో భూస్వామ్యవర్గపు గీటురాళ్ళు ప్రముఖంగానే వున్నాయి. "ఇది సవర్ణులకూ అవర్ణులకూ మధ్య తగువు కాదు. అప్పులిచ్చే వాళ్ళకీ తీసుకున్నవాళ్ళకీ మధ్య తగువు" అంటూ రచయిత వారిద్దరి మధ్యా వైరుధ్యాన్ని చెప్పటం గమనార్హం.

కనుకనే యిక్కడ తీర్పుకూడా భూస్వామ్యవర్గ పరిరక్షణ ఫలితమేననిపిస్తుంది. కానీ శ్రీ నా. తాను అప్పలరాముడి బదులు గోపన్నకు అప్పు చెల్లించి ఘనత మూటగట్టుకోజూస్తాడు. కానీ అప్పలరాముడు మాట తప్పకూడదనే 'నైతిక క్రియ' వల్ల తానే కడతాడు. పేదరైతులు క్రమంగా ఉన్న 'కాస్త' భూమినీ పోగొట్టుకొని రైతుకూలీలుగా మారినట్లే అప్పలరాముడూ మారతాడు... అతని పుత్రపౌత్రాదులూ రైతు కూలీలుగా మారుతారు.

అప్పలరాముడు చివరివరకు తనవైపు శ్రీ నా. మాట్లాడుతాడనీ 'ఈ 'అన్యాయం' ఉద్ధరిస్తాడనీ ఆశిస్తాడు. ఆ ఆశ అడియాశ కాగానే అతనిమీది విశ్వాసం కేవలం భ్రమగా యితనికి అర్థమవుతుంది. ఫలితమే తన అప్పు స్వభావం...చరిత్ర వివరిస్తాడు. తన సర్వస్వమూ రెండెకరాల భూమినీ కరణంతో రాయించి వేలిముద్రలు వేస్తాడు. తన మిగిలిన కొడుకులు వేలిముద్రలు వేస్తారు. కానీ చిన్నకొడుకు సీతారాములు మాత్రం నిరాకరిస్తాడు. ఇక్కడ యితని ప్రవర్తన కొంత చిత్రంగా కనపడుతుంది. శ్రీ నా. ప్రవర్తనను ముందుగానే తమ వర్గ వ్యతిరేక వైఖరిగా గుర్తించిన సీతారాములు బహుశా ముందుగనే తమ వైఫల్యాన్నీ, శ్రీ నా. తీర్పునీ ఊహించి ప్రతిక్రియ చేయదలిచి వుంటాడు. అతను తమ గుడిసెలవైపు వెంటనే పరువెడతాడు. వెంటనే అక్కడి నాయుళ్ళు కొందరు కర్రలు సిద్ధపరుచుకొంటారు. అంటే... తమ దోపిడీ ఎపుడు గుర్తిస్తారో జనం ఎపుడు మీదపడతారోనని అనుక్షణం భయపడే వర్గపు వైఖరి యిది. అప్పలరాముడి ముందర సీతారాములు ఒక గోనె సంచి క్రుమ్మరిస్తాడు. అందులో వాడి బిడ్డడి తలా మొండెమూ నరకబడి వుంటాయి. అతను అప్పలరామునితో — "నీకు జనం మెప్పుకావాల. అప్పలరాముడు శానా మంచోడు, ఆడితప్పనోడన్న మాట కావాల. అమాయకుడన్న పేరు కావాల. నీ బిడ్డ పాప తెలాగటపోనీ. నీకున్న డంబం అంత ఏటట? కల్పి ఎవరు సెప్పిన దరమం? ఏటా దరమం?"

"నువు మమ్మల్ని సచ్చిందాక బానిస బతుకు బతకమన్నావ్. నీకు తెల్నప్పుడు అది సరే. ఇపుడు తెలిసినాకా నువు ఆమాటే అంటే— ఇదుగో నాకిస్టం నేదు. నాకొడుకుమీద నా కాశెక్కువ. నా కొడుకు బానిస బతుకు బతకడు. నా కొడుకు కంబారి కాదు."

ఇక్కడ సీతారాముడి మాటలు కొడుకుని కావాలని కోపంతో చంపుకున్నట్లులేవు. అతను బాగా పూర్వాపరాలు ఆలోచించి ఆ పని చేసినట్లు తోస్తుంది. చివరగా సీతారాములు శ్రీ నా. తో, "బాబూ, శీరాంపులుబాబు; నువ్వంటే నాకు మాసెడ్డ కసి; ఎప్పుడు యింతకు పూర్వం. ఇప్పుడో నేదు. ఎందుసేత తెలుసునా? నువ్వుత్తి యెర్రి పీరువి. లోకఁవంత నువ్ సెప్పినట్టినాలని ఇంటారని నీ మనసులో ఓ ఉద్దేశం. ఈ రాజ్జ్యాన్ని నిన్నూ ఏలే దొరలెవరో యెరుగుదువా? అదుగో ఆ బాబు లిద్దరు. అదిగో ఆ కరణమయ్య, అదిగో ఆ మునసబయ్య. ఆళ్ళకి ఆళ్ళు సేసుకోలేని మంచిని నువ్ సేసినంత కాలఁవే నీ రాజ్జం. ఆ తరవాత ఆళెవరో, నువ్వెవరో. ఆ సంగతి నీకిపుడు తెలీదు."

ఇక్కడ చివరి వాక్యాల్లో చెప్పినట్లు—మునసబు కరణాలు ప్రభుత్వ ప్రతినిధులు. అంటే పాలకవర్గం మంచికి శ్రీ నా. పాటుబడి దాని ప్రయోజనాల్ని కాపాడినంతవరకే అతని ఉనికికి గౌరవమునీ లేకపోతే శ్రీ నా. ని వారు లెక్కలోకి తీసుకోరనీ, ఇవేవీ శ్రీ నా. కి తెలియవనీ సీతారాములు అంటాడు. ఇంత గొప్ప రాజకీయ చైతన్య నిష్ణాతుడా సీతారాములు? అతని పాత్ర స్థాయికి సరిపడ్డ మాటలేనా యివి? శ్రీ నా.వంటి విద్యావంతులు (నిజాయతీపరులు) గ్రహించలేని విషయాల్ని సీతారాములువంటి అజ్ఞాన నిరక్షరాశ్యులు చెప్పటం రచయిత తాపత్రయం అనాలా? అతనిలో ఆవేశం రావొచ్చు, కోపం వల్ల వొళ్లెరగకపోవొచ్చు కానీ యింత నిగ్రహంగా, నాగరికంగా శ్రీ నా. అనాశక్తతనీ, పాలకవర్గ స్వభావాన్నీ అత్యంత నిశితంగా విమర్శించడం ఈ పాత్రకు రచయిత తన గొంతును అరువివ్వడం కాదా?

ఇందులో అప్పలరాముడు, ఎర్రయ్య, సీతారాములు పాత్రల్ని చూస్తే ఒకటి గుర్తుకు వస్తుంది. "విప్లవ సాహిత్యంలో కూడా పాత్రలు విప్లవ భావాలకి అనుకూలంగా ఉండడమేగాక, జీవితంలోని విప్లవ పరిస్థితులకు అనుగుణంగా ఉండడమేగాక సజీవంగా ఉండాలి. కృత్రిమంగా సృష్టించినవీ, ఎటు కదలమంటే అటుకదిలే చదరంగ పావులు కారాదు." (శ్రీకొడవటిగంటి)

అంతవరకూ ఆ గ్రామంలో తగాదాలన్నీ ఆ మండపంలోనే ఆ పెద్దలవల్లనే తీర్చబడేవి. కానీ నేటి సీతారాముడి చర్య తప్పకుండా పోలీసుల దగ్గరికెడుతుంది. సీతారాముడు మునసబుతో అంటాడు— 'నా కూనీ మాఫీ చేస్తావా?' అని. ఈ వాతావరణంలో గాంధేయవాది శ్రీ నా. మనకు కనపడడు. బహుశా రచయిత అతని పలాయనాన్ని చూపాలని అలా మాటా పలుకూలేని శవంమాదిరి శ్రీ నా. ని చేశారని భావించవచ్చు. చివరలో, "ధర్మపన్నా లెంతవరకూ?...అంతా నువ్ చెప్పినట్టు వినేవరకూ" అని చచ్చిపోయిన గాంధీయిజాన్ని మళ్ళీ ఒక దెబ్బకొట్టారు.

రచయిత సీతారాముడిద్వారా యింత రాజకీయ చైతన్యంతో మాట్లాడించి తన బిడ్డడ్ని తాను చంపుకోవటం, బానిసత్వంనించి రక్షించటం అటుంచి అది వినా మార్గంలేదా? అని పాఠకుడికి తప్పకుండా అనిపిస్తుంది. అయితే పనీ పాటక జనంలో చలనం పుట్టుకు రావాలని చేసిన యత్నమా యిది? ఒక వ్యక్తికి పోరాట చైతన్యం రావటానికి ముందు అతని మానసికస్థితా యిది? కానీ సీతారాముడు మాట్లాడిన సంభాషణలకు, అతను చేసిన ఈ పనికి ఆలోచిస్తే ఏకీ

భావం కుదరటంలేదు. రచయిత సీతారాముడిగా ప్రవర్తిల్లినట్లుంది. అయితే సీతారాముడి చర్య రచయిత ఆమోదమా? ఈ కథకు ముందుమాటలో సుప్రసిద్ధ కథారచయిత శ్రీ కొడవటిగంటి ''యజ్ఞం'' శ్రీకాకుళం పోరాటాలకు ముందు నడచిన కథ అనాలి అన్నారు. అంటే సీతారాముడి చర్య, పోరాటం ముందుదనేగా!

కథలో జీవం శైలీరమ్యత. సంభాషణలు గుండెలనుండి నేరుగా పుట్టినట్లూ, బాధల గాథలు మాటల మూటలుగా మారినట్లూ అనిపిస్తూంది. బహుశా రచయిత గ్రామీణ వాతావరణంతో సంబంధ ముండివుండాలి. లేకపోతే యింత వాస్తవ సదృశంగా కథనాన్ని ఎలా కొనసాగించగలడు? అయితే రచయిత చెప్పబూనిన విషయం ఎంతో బృహత్తరమైనది. గాంధేయవాదం ఎంత నిజాయితీగావున్నా నేటి సమస్యలను అది పరిష్కరించలేక వాజమ్మగా మారుతుందని.

పైన చర్చించినట్లు...ఎంత చర్చకు ఈ పెద్దకథ అవకాశం యిచ్చినా, యిది సరయిన కాలానికే వెలువడింది. ఇది నూతన సామాజిక శక్తులకు, నూతనోద్యమ సాహితీవేత్తలకూ ఒక ఊపునూ ఉత్తేజాన్నీ యిచ్చింది. ఇలాంటి కథలు రావాలి. ఇంకా ఇంకా రావాలి. చెత్తకథలు చదివి చవిచెడిన ఆంధ్రపాఠక లోకానికి యిలాంటి ఆరోగ్యకరమైన కథలువచ్చి లోటును కాస్తంతైనా భర్తీచెయ్యాలి. అదే సమయంలో కాళీపట్నం రామారావుగారిలాంటి మంచి కథకులు జీవితాలని, అనుభవాలని ఆరాట పోరాటాలుగా పాత్రలుగా చిత్రించాలేకానీ యాంత్రికంగా పాత్రలని కదిలింపజేయరాదు. కా. రా. గారు కథకుల్లో గొప్ప రచయిత. వారు దేవుడు(?!) కాదు గనుక లోపాలు చేయవచ్చు, గుర్తించిన తర్వాత వాటిని దిద్దుకోవచ్చు.

'యజ్ఞం' కథకు సాహిత్య అకాడెమీ బహుమతి యిచ్చింది. కా. రా. గారు తిరస్కరించారు. రచయితను కొనాలని తాపత్రయమో, సాహిత్య అకాడెమీలోని పరిమిత అభ్యుదయ(?)కర శక్తుల కృషివల్లో దీనికి బహుమతివచ్చిందనేది స్పష్టం. అంతమాత్రాన అది పేదలకు వ్యతిరేకమైందనీ, కాదనీ తీర్పులివ్వడం నిర్మాణాత్మక విమర్శకాదు. కథని లోతుగా చర్చించడం అవసరం. అయితే అకాడెమీ యిస్తున్న బహుమతులు ఒక వర్గ వైఖరిని సూచిస్తున్నాయి కాబట్టి పైపైన చూస్తే పై కలిగిన అపోహ రాకమానదు. అయితే కథలోకి దిగి విమర్శించడం ఆరోగ్యకరమైన వైఖరి.

# ఆ చా ర్యు డు

## డా. సి. ఆనందారామం

భావ కవిత్వానికీ, ప్రేమ కవిత్వానికీ,
రోజులువెళ్ళమారిపోయాయని,
మార్కిస్ట్ కవిగా మార్గం మార్చుకొన్నాను.
అట్టడుగు బ్రతుకుల్ని అతి రమణీయంగా వర్ణిస్తూ
అంతులేని ప్రశంసలు అందుకొన్నాను.
అటు కమ్యూనిస్ట్ మానిఫెస్టోనీ, ఇటు కేపిటల్‌నీ,
ఒకటికి పదిసార్లు తిరగేసి,
కోట్ చెయ్యటానికి కొన్ని కొటేషన్లు సంపాదించుకొన్నాను.
అప్రతిహత వాగ్ధారతో, అఖండ సన్మానాలందుకొన్నాను.
మత్తులో ఉన్న నన్ను తట్టి లేపాడు ''లవకుశ''.
నాబోటి వి. ఐ. పి. లు బసచేసే హైక్లాస్ లాడ్జిలో
ఎవరు కోరినవి వారి కందించే పనివాడు, వాడు.
అర్థం తెలియకుండానే ఆరాధించే
తరతరాల అజ్ఞానాన్ని
పేరులోనే పొదుగుకొన్న ఆ పసివాడు
సాగిలి మొక్కాడు నాకు,
సాక్షాత్కరించిన మా దేవుడివన్నాడు.
నే రగిలించిన చైతన్యానికి
నేనే ముచ్చట పడిపోతూ —
''సభలో నీవున్నావా?
నా ప్రబోధం అందుకొన్నావా?'' అన్నాను
చీకటిని చూసిన వెలుగులా నవ్వాడు.
''సభలో నేనుంటే,
మీ సేవల కెవరుంటారు?'' — అన్నాడు.
ఎంతకూ అంతుపట్టని మార్క్సిజాన్ని
ఒక్క మాటలో వ్యాఖ్యానించాడు.

[ బందరు రచయిత్రుల సభలో లాడ్జిబాయ్ కావటంవల్ల సమావేశాలకు రాలేకపోయిన సాహిత్యాభిమాని ''లవకుశ''కు కృతజ్ఞతలతో... ]

# నగరంలో ప్రకృతి !

## శ్రీ రెంటాల సత్యనారాయణ

రాత్రంతా అమావాస్య
  రాజ్యమేలిన నగరంలో
ఉన్నట్లుండి ఒక్కసారిగా
అలజడి చెలరేగింది.
అప్పటిదాకా
తూర్పుకొండల వెనుక
యుద్ధ సన్నద్ధుడైన చైతన్య చక్రవర్తి
చీకటి పాలన
ఇక సహించేది లేదన్నట్లు
ప్రాగ్గిరి శిఖరాన నిలిచాడు.
కిరణాల వీరులు
నగరంపై విరుచుకు పడ్డారు,
నగరం నాలుగు చెరగులా ముట్టడించారు.
సహస్ర రూపాలలో — రాత్రంతా
స్వైర విహారం చేసిన చీకటి రాకాసి
పలాయనం చిత్తగించింది.
విజయోత్సాహంతో తీవిగా కదిలాడు
చైతన్య ప్రభాకరుడు
కిల కిల నవ్వుతూ
స్వాగతం పలికాయి పద్మాలు.
తామర మొగ్గల బుగ్గల్ని
సున్నితంగా ముద్దులతో ముంచెత్తాడు.
పులకించాయి తామర మొగ్గలు
సిగ్గుతో మరికాస్త ఎర్రబడ్డాయి వాటిబుగ్గలు !
అటూ ఇటూ చూశాయి
ఎవరైనా చూశారేమోనని !
జాజిమొగ్గల్ని
చిలిపిగా అల్లరి పెట్టింది గాలి
పుష్పించని పసిమొగ్గల
పచ్చి వాసనకే మురిసిపోయింది
మైమరచి పోయింది గాలి !

నగరాన్ని
వెలుగు వెల్లువ ముంచెత్తిందన్నవార్త
నలుగురికీ తెలిసిందో లేదోనని
పనిగట్టుకు బయల్దేరాయి పక్షులు
పదిమందికీ చెప్పాలనీ
తమ సంతోషాన్ని విప్పాలనీ.
సూర్యదేవుడి దండయాత్రకు భయపడి
తప్పించుకోబోయి
కాలుజారి, సొమ్మసిల్లి
దివి నుంచి భువికి రాలి
మల్లెపూవుల పొదల్లోనూ
పారిజాత తరువుల్లోనూ
చిక్కుకున్న అందాల తారలు
స్పృహవచ్చి
పరిసరాలను పరికిస్తున్నట్లు
ప్రియుడి జాడకై వెతుకుతున్నట్లు
ఆకుల మాటునుంచి
కళ్ళింత చేసుకుని
తొంగి తొంగి చూస్తున్నాయి
విరిసిన మల్లెలు, పారిజాతాలు
శాపగ్రస్త గంధర్వ సుమాలు
ఆకుల పొత్తిళ్ళలో నుంచి
తుళ్ళుతూ నవ్వుతున్నాయి పూవులు.
నవ్వులే పువ్వులయ్యాయో ?
పువ్వులే నవ్వులయ్యాయో ?
కళ్ళల్లో కాంతి నింపుకుని
ఆత్మీయమైన పలుకరింపుకు
నిరీక్షిస్తున్నాయి
ధూళి కమ్మిన గడ్డిపూవులు.
కళ్ళు కంటున్నాయి నాజూకు కలలు
అనుభవాలు రేపుతున్నాయి కన్నీటి అలలు !
పంకంలో పుట్టిన పూవులు కొన్ని
జాలిగా బేలగా పిలుస్తున్నాయి

చేతులు ఊపుతున్నాయి
అందుకోమని, ఆలించమని, లాలించమని.
అందుకుంటే ఆనందిస్తున్నాయి
హర్షాశ్రువుల్ని రాలుస్తున్నాయి
లేకుంటే మౌనంగా విలపిస్తున్నాయి
కన్నీటి పన్నీటిని వర్షిస్తున్నాయి.
ఈ పూవులు ప్రకటించే భావాలు
ఏ చిత్రకారుడి కుంచెకు అందుతాయి ?
ఏ కవి వ్రాయగలడు
వీటి విచిత్ర జీవిత కావ్యం ?
నిరాశ మంచును తుడిచేసుకుని
ఆశా వెలుగును నింపుకుని
నిద్ర లేచాయి కొమ్మలు! పూలరెమ్మలు!
లోగిళ్ళలోని
కొమ్మల చేతులలో నుంచి జారి
ఆ రంగు రంగుల పూవులన్నీ
పరుగులు తీస్తున్నాయి తోటలోకి.
ఆ తోటమాలి ఓ ఎండిన మ్రోడు
అతడిని గురించి ఎవ్వరూ
పెద్దగా పట్టించుకోరు.
అప్పుడప్పుడూ అరుదుగా పడుతుంటాయి
అతని జీవిత కేదారంలో
జీతాల చినుకులు.
అయినా — ఆ పూలమీదనే అతని ధ్యాసంతా
అందుకే – విసుగూ విరామం లేకుండా
నింపుతుంటాడు విజ్ఞాన సుధలు రోజంతా
వాటికి — రంగుల తేడాలు తెలియవు
కల్లాకపటం ఎరుగవు.
అవి ఎప్పుడూ
కలిసిమెలిసి ఉంటాయి
ఊసులాడుకుంటాయి
ఆ పూవుల్లో గోచరిస్తుంది
అనిర్వచనీయమైన అందం! ఆనందం
లోన మకరందం! సుగంధం!
తిరిగి ఆ పూవులన్నీ
కొమ్మలను చేరుకుంటాయి.
ముద్దుముద్దుగా పలుకుతుంటాయి
మురిపాలు ఒలికిస్తుంటాయి
ఆ పూల పాపల్ని చూసి
కొమ్మలు ముచ్చట పడుతుంటాయి
ముద్దులు కురిపిస్తుంటాయి
మురిసిపోతుంటాయి
తలల పై కెత్తుకుంటాయి.
జీవితం
రసవిహీన కావ్యంగా తోచినప్పుడు
నవజీవన
ప్రభాత కాంతి కిరణాల్లా
రసాత్మక కవితా చరణాల్లా
రసమయ ప్రబంధాల్లా
ఆనందాబ్ధిలో ఓలలాడించేది
ఆ పువ్వుల నవ్వులే!
ఆ పూవులే
మన ఆశలకు పునాదులు!
ఉజ్వల భవితవ్య దివ్య యుగాదులు!

# అనిమిషత్వం

శ్రీ గోవిందరాజు రామకృష్ణారావు

అనిమిషత్వం
కావాలని
కోరడంలేదు
స్వామీ నేను.
సన్నిధి నిలిచిన
సమయాన
నిరంతర దర్శన భాగ్యం
ప్రసాదించు చాలు!

డా. పణతుల రామచంద్రయ్య

# ఒక సన్నివేశానికి ఉదాత్తీకరణ విశ్వనాథ వారి "వేనరాజు"

సుమారు నాలుగేళ్ల కిందట, సుప్రసిద్ధ కన్నడ రచయిత గిరీష్ కర్నాడ్ రాసిన నాటకం ''హయవదన'' చదివాను. ప్రేక్షకులూ, పాఠకులూ, విమర్శకులూ బహుధా ప్రశంసించిన అపూర్వమైన రచన అది. కాని, అది చదివాక, నేను నా తోటి సాహిత్య జిజ్ఞాసువుల వద్ద వెల్లడించిన సందేహం ఏమిటంటే — ఆ నాటకంలో వున్నట్టుగా, గుర్రపు తల వున్న వ్యక్తితో, ఒకరి తల వేరొకరి మొండానికి అతికించగా రూపొంది జీవించిన పాత్రలతో తెలుగులో ఎవరైనా నాటకం రాస్తే, ప్రదర్శనల మాట అలావుంచి(కన్నడ రంగస్థలంపై ''హయవదన''కు లభించిన ఆదరణ అంతా యింతా కాదు), ఆ నాటకానికి మన సమీక్షకుల సానుభూతి అయినా లభిస్తుందా అని! ఇందుకు కారణం—బడిపంతులు పాఠం వివరించే పద్ధతిలో సరఫరా చేయబడిన కథలతో, పూనకం వచ్చిన మనుషుల ధోరణిలో రాయబడిన వెకిలి సంభాషణలతో నిండిన నాటకాల పట్ల మనవాళ్లకింకా మోజు తీరకపోవటం. ఈ ధోరణికి ఏ మాత్రం భిన్నంగా నాటకం నడిచినా, వాచ్యాన్ని కాదని వ్యంజనకు ఏ మాత్రం చోటు ఇచ్చినా, వాస్తవికతా పరిధిని దాటి నాటక రచయిత వేరే వ్యక్తీకరణ సాధనాలను వాడుకున్నా, ఆ నాటకానికి గ్రహణం తప్పదు. పైగా, అది ఖర్మచాలక ఆధునికత్వాన్ని 'పోజు'గా ధరించిన విమర్శకుడి చేతిలో పడిందంటే, యిక చెప్పనక్కర్లేదు: దానిలో 'అభ్యుదయ' దృష్టి లేదనో, 'వాస్తవికత' లోపించిందనో ప్రవచించి, నాటకానికి ఎంత అపచారం చెయ్యవచ్చునో అంతా చేస్తాడు (ముఖ్యంగా 'వాస్తవికత' అనేది తెలుగు సాహిత్య విమర్శలో ఎక్కువ దుర్వినియోగమై అపార్థం చేసుకోబడ్డ మాటలలో ఒకటిగా నాకు కనిపిస్తుంది). ఇక ఆ నాటక రచయిత జీవితాంతం రంగస్థలానికి ఆమడ దూరంలో ఉండిపోక తప్పదు.

''హయవదన'' చదివినప్పుడు నాకు కలిగిన సందేహం చాలా సహేతుకమైనదని—ఆ తరువాత విశ్వనాథ వారి నాటకం ''వేనరాజు'' చదివాక—చాలాసార్లు అనిపించింది.

మన నాటక ప్రయోక్తలూ, నటులూ, వాళ్ల స్వైరవిహారానికి తలలూచే ప్రేక్షకులూ ఆశించినట్టుగా—అటు బారెడూ యిటు బారెడూ లాగి పాడటానికి వీలైన పద్య సామగ్రి కానీ, నోటినిండా నమిలే(?)రుకోవటానికి సరిపోయే వేదికోపన్యాసాలు కానీ, ''వేనరాజు''లో లేవు. కాని తెలుగువాళ్లు మొదటి నుంచీ ఆస్వాదిస్తూ వస్తున్నది కేవలం వాచ్యప్రధాన నాటకాన్నే. ఈ వాచ్యప్రధాన నాటకాలు చాలా తక్కువ రకానివనే పాశ్చాత్య విమర్శకుల అభిప్రాయాన్ని నేనిక్కడ పునశ్చరణ చెయ్యనక్కర లేదనుకుంటాను. విశ్వనాథ నాటకాల్లో ముఖ్యమైన వేవీ యీ కోవకు చెందకపోవటం వల్ల, అవి అన్యాయమైన అనాదరణకు గురైనట్లుగా నాకు తోస్తుంది.

విశ్వనాథ కవితా శక్తి సార్వభౌమంగా వున్న దశలో 'వేనరాజు' వ్రాయబడి వుండాలి. అది చదివినప్పుడు—నాటకాన్ని కేవలం ప్రదర్శన యోగ్యంగా చెయ్యటంతో తృప్తిపడక, దానికొక భావసంకీర్ణత యిచ్చి, ఆలోచనామృతమైన ఒక సాహిత్య ఖండంగా రూపొందించటానికై చేసిన పనితనం అందులో కనబడుతుంది. ఈ పనితనానికి అవసరమైన మేధా నైశిత్యంతో కథా వస్తువును పరిశీలించే రచయిత, చాలా మంది ద్వితీయశ్రేణి రచయితలు ప్రదర్శించే కృత్రిమ కాల్పనిక భంగిమలను పూర్తిగా నిరాకరిస్తాడు. ఎందుకంటే, అతడి లక్ష్యం నీటికి అతీతమైన ఒక గాఢత్వాన్ని సాధించటం కాబట్టి. ఈ భంగిమలకు లొంగిపోయే రచయిత అయితే, అతడు తన చాపల్యాన్ని తీర్చుకోవటం కోసం—ఒక కర్ణుడినీ మరొక రావణుడినీ అన్యాయానికి గురైన విప్లవ వీరులుగానో, ఒక అహల్యను అపార్థం చేసుకోబడిన పవిత్ర స్త్రీ గానో, ఒక కీచకుణ్ని చావుకు జంకని మహా ప్రేమికుడు గానో, ఒక వేనుణ్ని సమకాలీన వ్యవస్థ వల్ల దెబ్బతిన్న సంస్కర్త గానో తీర్చి, తక్కువ స్థాయిలో పాఠకుల దృష్టిని ఆకట్టుకోవాలని చూస్తాడు. కాని విశ్వనాథ వంటి పరిణతుడైన కావ్యశిల్పి తొక్కే దారి మాత్రం ఇదికాదు.

అందుకే ఆయన, ''భాగవతం'' (చతుర్థస్కంధం) లోని వేనరాజు పాత్రలో అంతర్గతమైన మూర్తిని మార్చకుండానే,మూలం అనుమతించిన మేరలో కథాంశాలను తన నాటకీయతా లక్ష్యాలకు అనుగుణంగా వాడుకుంటూ, దానికొక నూతనార్థాన్ని కల్పించి సంపన్నం చెయ్యగలిగాడు. ''భాగవతం'' లోని వేనరాజు పరమ దుర్మార్గుడు. పరహింసా పరాయణుడై, సమకాలీన నైతిక సంప్రదాయానికి ప్రమాదకరంగా,తల్లిదండ్రులైన సునీథకూ అంగరాజుకూ దుఃఖ హేతువుగా, పరిణమించిన రాజు. అతడి దుష్కృత్యాలు దుర్భరం కాగా, ఋషులందరూ కలిసి అతణ్ని తుదముట్టించారు. అలా మరణించిన వేనుని బాహువులు మథనం చెయ్యగా, దానిలో నుంచి

అర్చి, పృథువూ అనబడే దంపతులు పుట్టారు. ఈ పృథు చక్రవర్తి ప్రజలందరినీ చక్కగా ఏలి, తరువాత భూమిని ధేనువుగాచేసి ఓషధులను పిదికి, రాజ్యాన్ని సస్యశ్యామలం చేశాడు.

ఈ మూల కథాలేశం ఏమంత గొప్పది గనుక ? ఇందులో నాటకీయతావకాశాలేమున్నాయి గనుక? ముఖ్యంగా, పృథువు భూమిని ధేనువుగా చేసి పిదుకటాన్ని దృశ్య కావ్యంలో ఏ విధంగా, ఏ కళౌచిత్యంతో ప్రతిబింబించాలి? సామాన్య రచయిత వూహను ఏ మాత్రం జ్వలింపజేయని సన్నివేశం ఇది. కాని, దీన్ని విశ్వనాథ చూచిన తీరూ, ఉపయోగించుకున్న వైఖరీ, అద్వితీయం. తత్ఫలితంగా, వేనుని పాత్ర—ఖూనీ[1] కాలేదు సరికదా — ఒక అరుదైన పునస్సృష్టిగా రూపొందింది.

ఈ పునస్సృష్టిని సామాన్య వాస్తవికతా నిబంధనలకు భిన్నమైన 'ఉదాత్త' స్థాయిలో చేశాడు విశ్వనాథ. అందుకు అనుగుణంగా కథను కొద్దిగా మార్చి, వేనుని బాహుమథనం వల్ల పుట్టినట్టు మూలంలో పేర్కొనబడిన పృథువును—మొదట వేనుని చెల్లెలుగా వుండి, తరువాత భూదేవి సాన్నిహిత్యంతో తనలోని ''నిగూఢమైన రాజత్వము విబోధితము'' కాగా, స్త్రీత్వాన్ని విసర్జించి పురుషుడుగా (వేనుని తమ్ముడుగా) మారినట్టు సూచించాడు. మూలంలోని వృత్తాంతాన్ని ఒక సంకేతంగా గ్రహించి, పృథువు చక్రవర్తిత్వం మాత్రం వేనుని దక్షిణ బాహు మథనం వల్ల స్పష్టమైనట్టు ధ్వనించి, నాటకం చివర మాత్రం అతణ్ని ''వేనాసుర దక్షిణ బాహు నిర్మథన సంజాత !'' అని సంబోధింపజేశాడు. వేనుని తల్లి సునీథ ''లోకము నిందపడలేక (యామె) ఆత్మహత్య చేసికొన్న'' దని చెప్పించాడు. ఇక అంగరాజు బహిష్కృతుడనీ, ''యింటినుండి వెడలగొట్టబడినా''డనీ సూచించినా, అతడు నిజంగా జీవించివున్నాడో, లేక మరణించాడో, లేదా ఒక అతి మానుషస్థాయిలో తిరుగాడుతున్నాడో, తేలని విధంగా ఒక అందమైన అస్పష్టతను అతడి పాత్రచుట్టూ గడుసుగా సృష్టించాడు రచయిత. అలా సృష్టించటానికి కావలసిన అనుమతి మూలకథలోనే దొరికింది రచయితకు. ఒకానొక రాత్రివేళ ఇల్లు విడిచిపోయి, ఎంత వెదకినా కనిపించకుండా వున్న అంగరాజును, ''గూఢుండయిన పరమ పురుషుని''లా వున్నట్టు వర్ణిస్తోంది''భాగవతం''. ఇందులోని 'పరమ పురుష' శబ్దాన్ని, కేవలం దైవతత్వంగానే కాక, ఒక లోకాతీతమైన స్థితిని సూచించేదిగా తీసుకోవచ్చు. అందువల్ల అంగరాజు లోకాతీతుడై, గూఢత్వం కల వ్యక్తిగా చిత్రించబడ్డాడు. అలా చిత్రించటం వల్ల, అంగరాజును కథాసన్నివేశంలోని ఒక పాత్రగానే కాకుండా, ఆ సన్నివేశానికి అతీతంగా నిలిచి పరిస్థితిపై వ్యాఖ్యానం చేయగల వ్యాఖ్యాతగా కూడా వాడుకోవటానికి మంచి వీలుకలిగింది రచయితకు.

మొదటి అంకంలో, తెర ఎత్తగానే ఈ రకం పరిస్థితిని గురించిన స్పృహ ప్రేక్షకునికి చురుకెత్తిస్తుంది. వేనుడి రాజ్యంలో అవ్యవస్థ పీఠం వేసుకుని వుంది. సహజసిద్ధమైన విలువలు తారుమారైనాయి. జీవం కల సంప్రదాయపు విలువలు జీవానికి వ్యతిరేకమైన పిశాచాలుగా భావించబడుతున్నాయి. అమాయికులైన శ్రీధరభట్టు, అతడి తండ్రి వినీతభట్టు లాంటివాళ్లకు ఘోరమైన మరణదండన లభిస్తోంది.[2] ''సిద్ధాంతములు వేరు, ఆచరణలు వేరు !'' సర్వత్రా నిర్వీర్యత తాండవిస్తోంది. వేనుడి వంటి మహావీరుడు సైతం, నిత్యమూ పూలతో ఆటలాడుకునే పల్చదనానికి దాసుడవుతున్నాడు. అంతేకాదు. ''రాజ్యములో నెవ్వరును వివాహము చేసుకోరాదు'' అంటున్న వేనుడు మళ్లీ ''ఏక గర్భ జనితులైన స్త్రీ పురుషులు వివాహమాడినచో ఆస్తి విషయమున భేదమే రాదు కదా ?'' అంటూ (3వ అంకం) ఒక దారుణ సిద్ధాంతాన్ని ప్రవేశపెడుతున్నాడు. 'మోక్షం' వంటి పురుషార్థ సంబంధమైన విలువలకు వక్రభాష్యం చెబుతున్నాడు. అతడి దృష్టిలో 'మోక్షా'నికి ఆధ్యాత్మికత విరోధి ! (''అవి వదలిన గాని...మానవజాతికి మోక్షము లేదు'' — 1వ అంకం) ఇలాంటి సన్నివేశంలో తండ్రీ కొడుకులకూ, తండ్రీ కూతుళ్లకూ, అన్నాచెల్లెళ్లకూ, మిత్రులకూ, రాజుకూ ప్రజలకూ మధ్య అన్యతా భావమూ దూరమూ ఏర్పడక తప్పదు. వీటన్నిటినీ మించిన ఘోరమేమిటంటే, ప్రకృతి రూపం ధరించిన వసుంధరపై యాజమాన్యం వహించవలసిన పురుష భావం నిస్తేజమై, భరింపరాని కృత్రిమ గుణం అలవరచుకుంటోంది. ఇందుకు సంకేతమే, భవిష్యత్తులో చక్రవర్తి కావలసిన పృథువు స్త్రీరూపం ధరించి వుండటం. ఈ స్త్రీత్వం పోయి, పురుష భావం వచ్చి, ఆయన తనను వీడిపోయిన స్త్రీత్వాన్ని వసుంధరకు ఆరోపించి,

''...నేడు బహిర్గతంబు వడిన
నా మనోవాంఛవలె తోచినావు నీవు.'' (8వ అంకం)

అన్నప్పుడు, భూమిపై వ్యవస్థ తిరిగి నెలకొంటుందన్నమాట. అప్పుడు, తనవారిపట్ల వేనుని పరాయితనం తొలగిపోయి, పృథువును 'సాక్షాన్నారాయణుడవు'గా, తండ్రిని తండ్రిగా, గుర్తించక తప్పదు. ఈ సంకీర్ణ పరిణామాన్ని చిత్రించటానికి అనువైన శైలికోసం విశ్వనాథ చేసిన అన్వేషణే, ''వేనరాజు'' నాటకం.

ప్రారంభంలో వేనుని పైశాచికత్వం అంతులేనిది. కాని, 'అప్రత్యక్షమైన' దేవుణ్ని నమ్మనట్లే, తనలో అప్రత్యక్షంగా వున్న పైశాచికత్వాన్ని కూడా వేనుడు గమనించటం లేదు. అందువల్లనే, ఆ పైశాచికత్వానికి బలియైన శ్రీధరుడు, వినీతుడు మొదలైన వారి పిశాచాలను రంగంపై ప్రవేశపెట్టాడు రచయిత. ఇక్కడ, సామాన్య వాస్తవికతా నిబంధనల దృష్ట్యా మనం నాటకాన్ని [illegible] హింసించటానికి పూనుకుంటే, అప్పుడు రచయిత ఉద్దేశించిన వ్యక్తీకారక శైలికి తీరని అన్యాయం చేసినట్లే అవుతుంది. ''అలా పిశాచాలు వేనుడితో మాట్లాడటం ఎలా సాధ్యమవుతుంది?'' అంటూ ప్రశ్నించటం ప్రారంభిస్తే, ఆ ప్రశ్నతో సున్నితమైన నాటక స్వరూపాన్ని ముక్కలు ముక్కలు చేసినట్లే అవుతుంది.

తనలో అంతర్గతమైన పైశాచికత్వం యిలా పిశాచ రూపంలో స్పష్టంకాగానే, వేనుడు ఆ తత్వానికి వీడ్కోలు చెప్పినట్లే సౌమ్యగుణాన్ని పెంపొందించుకున్నట్లే. అప్పుడతడు శ్రీధరుని పిశ

చంతో మాట్లాడే మాటల్లో ఈమార్పు బహు శక్తిమంతంగా, విశ్వనాథవారి అధికారానికి లోబడిన వ్యావహారిక శైలికి సహజమైన తీవ్రతతో వెల్లడైంది ("ఓయి శిశూ! చచ్చికూడ సౌమ్యమూర్తివి. నీ పసి నెత్తురు, నీ యమాయికపు నెత్తురు, నా మొగమున బూసి కొంటిని"). ఆపిమ్మట అతడు శ్రీధరుని పిశాచపునవ్వు కూడా సహించ లేడు ("అయ్యో! ఇది యేమి నవ్వు?") అంతకుపూర్వం శ్రీధరుడమాయికంగా చేసి "ఓసి పురాతనక్షితి భృదుగ్ర మహావ్రతశాలి..." అన్న కైవారాన్ని 'తిరుగుబాటు'గా భావించి అతడు కల్లోలపడితే, ఇప్పుడు రెండోసారి ఆ మాటలు విన్నప్పుడు, అవి తనలోని చెడుపట్ల చేసే తిరుగుబాటుకూ, ఈ క్షణాన తన మానసిక పరిధిలో ఇమడ లేనంతగా ఉబికే సంస్కారానికీ తట్టుకోలేక, "అది చదువకుము" అని వేడుకున్నాడు. "నీ గీతార్థమునకు తగినస్థితి నాకింక మరల రాదు," అని స్పష్టం చేశాడు.

ఇలా, నాటకంలో వేనుని ప్రయాణం తమస్సులోనుంచి వెలుగులోకి; "రాత్రిచేత నావరింపబడిన పట్టణమును" చూచి ఏదో ఇంద్రియ లౌల్యాన్ని జోకొట్టాలనుకునే తత్వంలోనుంచి "పరమార్థము చివరకు తెలిసికొంటిని," అనగలిగే స్థితిలోనికి. ఈ దృష్ట్యా "వేనరాజు" నాటకం, ఒక మానవజాతి ప్రతినిధి ఆత్మజ్ఞానార్జనా మార్గంలోచేసే ప్రస్థానానికి విశ్వనాథ ఇచ్చిన చిత్రణ. ఈ ప్రయాణం "సౌందర్యంబు నేత్రములద్వారా తెలిసికొన దగినది"గా భావించే వేనుని 'కుతర్కము'ల ద్వారా, 'ఘోరము'లద్వారా, ఒక విరుద్ధమార్గంలో సాగించబడింది.

ఈ ప్రయాణం ప్రేక్షకులకు (లేదా, పాఠకులకు) ఆసక్తికరంగా వుండాలంటే, వాళ్ళు వేనునిపట్ల సానుభూతి చూపేటట్లు చెయ్యటం అవసరం. "భాగవతం"లో వలె అతడిని కేవలం 'దుర్జనుడు'గా, 'దారుణ కర్ముండయిన పాతకుండు'గా చూపిస్తే లాభం లేదు. అతడు అకృత్యాలు చేస్తున్నా, 'నరపాల రూపము ధరించిన యీశ్వరుడు'గా తనని తాను భావించుకునేవాడు ("భాగవతం"). కాబట్టి ఆ ఈశ్వర తత్వాన్ని అతడు దర్శించాలి. అలా దర్శించటానికి ఆటంకంగావున్న దోషాలన్నీ ఎవరో చేసిన పాపంవల్ల ('మాతామహ దోషంబున...' అంటోంది "భాగవతం") అతడికి సంక్రమించినవే. ఈవిధంగా, మూలం యిచ్చిన కొద్ది అవకాశాన్నీ బాగా వాడుకుని, ఆ దోషాలవల్ల ఆచ్ఛాదితమైన ఒక జ్వాల వేనుడిలో ఉండవచ్చునన్న భావాన్ని ఆవిష్కరించాడు రచయిత. తద్వారా, వేనుడుచేసే ఘోరాలపై పాఠకులచేత నైతికమైన తీర్పు యిప్పిస్తూనే, వాళ్ల సానుభూతినీ మెచ్చుకోలునూ అతడికై రాబట్టగలిగాడు. ఈ తీర్పుకూ సానుభూతికీ మధ్య ఏర్పడే సంఘర్షణలోనుంచే వేనుడిపాత్ర జీవాన్ని సంతరించుకుని ఎదిగింది.

తత్వదర్శనం చేసిన ఋషులందరూ 'తప్పత్రోవవెంట బోవుచున్నా'రనే భ్రాంతి ఆవరించటంవల్ల వేనుడు తానే తప్పదారిలో నడుస్తూ ఘోరాలు చేస్తున్నా, అతడు మంచి స్నేహితుడు. 'మన యాత్మలు ఒకచోట నుంచిన రెండు పూవుల వాసనలవలె గలసి పోయిన'వని గౌతముడితో అనగల రాగస్నిగ్ధ హృదయుడు (1వ అంకం) ఘ్రవంది శ్రీధరుడు చదివిన పద్యానికి అతడు కుపితుడైనా, ఆపద్యంలోని ప్రకృతి కవిత్వానికి తల వూపగల సౌందర్య పిపాసి. కళాకారుడు. అతడి వీణావాదనలో గౌతముడు ఆఘ్రాణించిన 'పురాజన్మ సంస్కారం' (4వ అంకం) వేనుడిదే. కాని, అది ఆచ్ఛాదితం. కాబట్టే, అతడి స్నేహంలో గాంభీర్యంలేదు. (అతడు గౌతముని 'సౌందర్యా'నికి లోబడి ముద్దు పెట్టుకోవటమూ, ఒక సందర్భంలో గౌతముడతణ్ణి 'కృత్రిమ స్నేహితు'నిగా వర్ణించటమూ ఇందుకు నిదర్శనాలు). అతడి హృదయ ధర్మాలు తప్పదారిలో ప్రనోదిత మవుతున్నాయి. ప్రకృతి లక్షణాల్లోని మెరుపులకు ఉత్తేజితుడై అవే సర్వస్వమని భావించే అతడి సౌందర్య పిపాసలో గాఢత్వంలేదు ('నీకు సౌందర్య జ్ఞానమే లేదు' అని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పేశాడు గౌతముడు. ఒకరకంగా, నాటకావిష్కృతమైన సన్నివేశాలపై అంగరాజు వ్యాఖ్యాత అయినట్లే, వేనుడి తీరుపై వ్యాఖ్యాత గౌతముడు). ఇక, అతడి కళాభినివేశం మేధా విలసితంకాదు; అతడి సంగీత నినాదంచేత వాయుమార్గాలన్నీ 'మహా శ్రుతి మేళవించు'కోవచ్చుగాక; దాని ఆస్వాద్యత పరిమితమైనది. 'గోధుమవన్నె త్రాచు లొకటొకటి/ప్రేమం బెనవేసికొనుచు పింపిళ్ళు కూసి'నట్లుగా (4వ అంకం) అది ఆనంద భ్రాంతితో మోహం కలిగించేది మాత్రమే. కాబట్టే, జ్ఞాని అయిన గౌతముడు దాని ప్రభావం నుంచి బయటపడి, "ఎట్లైనను వేనుడు గతించవలసినదే"నన్న నిర్ణయానికి చేరుకోగలిగాడు.

పాఠకుడి మనస్సులో కూడా వేనుడిపట్ల ఈ నిర్ణయం ఆకారం దిద్దుకుంటున్నా, నాటకాన్ని చదువుతున్నంతసేపూ అతడా నిర్ణయాన్ని వాయిదా వేస్తుంటాడు. త్వరత్వరగా వేనుణ్ణి నైతికమైన తీర్పుకు గురిచెయ్యటం ఆపి, "ఎవరీ అపూర్వవ్యక్తి? హింసాచరణమూ, తళుక్కుమనే మానవతా, స్నేహంతో నిండిన ఆత్మలోనుంచి వెలువడే అధర్మమూ, కళాభినివేశమూ, మొండితనమూ, జాలీ విచిత్రంగా మేళవించిన ఈ మూర్తిలోని విశేషమేమిటి?" అనే విచికిత్సకు లోనవుతాడు. 'మహాప్రత్యేకతా లక్షణములు' కలిగివున్నా (పృథువు పలికినట్లుగా) 'లోకమునకు లాభము' చేకూర్చలేని ఆ వ్యక్తిని అర్థం చేసుకోవటానికి ఉత్సుకుడవుతాడు. అలాగని నైతికమైన తీర్పుకు ప్రాధాన్యం తగ్గదు సరికదా, ఒక వాయిదా వేయబడిన బాధ్యతగా అది పాఠకుడి స్పృహలో మరింత బలవత్తర మవుతుంటుంది. అలా బలవత్తరం కాకపోతే నాటకం విశ్వనాథ రచన కావటానికి వీల్లేదు. వేనుడిపట్ల చవకబారు జాలిని కలిగించే అంశాలను తోసిపుచ్చగల నైతికవాది కాబట్టి, విశ్వనాథ దృష్టిలో వేనుడొక అవాంఛనీయమైన, కృత్రిమ సౌందర్యం కలిగిన, జీవన విధానానికి ప్రతినిధి. ఆ విధానాన్ని తుడిచిపెట్టకపోతే, మరొక ఆరోగ్యకరమైన సంప్రదాయపు సౌష్ఠవానికి దెబ్బతప్పదు. కాబట్టి, వేనుడి ప్రపంచమూ, ఆ ప్రపంచంలోని విలువలూ— అవి ఎంత సుందరంగా కనిపించేవైనా సరే—విచ్ఛిత్తి కాక తప్పదు.

అలా విచ్ఛిత్తి కావటం సృష్టి ప్రణాళికలోని ఒక భాగంగా, ప్రకృతి సహజమైన విషయంగా ప్రదర్శించటంలో రచయిత చూపిన నేర్పు ప్రశంసనీయం. వేనుడు–సృష్టి అంతా పరస్పర విరుద్ధ

ధర్మాల పకృష్ట బంధమనీ, దానిలోని మంచి చెడ్డల అంతస్స్వరూపాలుగా సౌందర్యమూ అసౌందర్యమూ, ఆనందమూ బాధా, వెలుగూ చీకటీ, మార్దవమూ కాఠిన్యమూ, సంగీతమూ మౌనమూ కలయిక పొంది దాన్ని అర్థవంతం చేస్తున్నాయనీ తెలియనివాడు. సౌందర్యానికీ, ఆనందానికీ, మార్దవానికీ, సంగీతానికీ ఒక అసాధ్యమైన నిరంతరత్వాన్ని ఆపాదించటానికి ప్రయత్నిస్తూ, బాహ్యరూపాన్నే అంతస్సత్యంగా భావిస్తున్నవాడు. ప్రతి విషయంలోనూ అతడు చూచేది 'సౌకుమార్యపు లోతుల...ఆ లోతులలో నవ్యక్తముగా దాగియున్న...గాన మాధురులు.' (1 వ అంకం). అతడి వాక్కులలో పుష్కలంగా కనిపించేవి 'నవ నీరేజములు', 'వెన్నెల', 'లీలా బిలాస కాండములు', 'వసంత కోకిల గొంతు', 'పూవులు, పూలకొమ్మలు'— ఇలాంటివి. 'పూవుల చేత నలంకరింపఁబడని సొగసును' అతడు చూడలేదు. ఇలాంటి ఎడతెగని సొగసు ప్రకృతి క్రమానికి విరుద్ధమనీ, ఈ సొగసులతో వేనుడు ఊహించుకున్న ప్రపంచం దుర్బలమయిందనీ—సున్నితంగా, మెలకువ కల పాఠకునికి మాత్రం అందేటట్లుగా, (అంగరాజు చేత పలికించిన పద్యాలతో) సూచించాడు రచయిత.

> ''స్వాతి చల్లని వాన జలజలా కురిసి
> ప్రీతి ముత్తెపు చిప్ప పిలపిలా విరిసి
> తొలుత సంద్రము నడుమ దూరెనే కాని
> వెలువడి ముత్తెమ్ము వెలిగించె దెసలు.''
>
> (8 వ అంకం).

దెసలు వెలిగించే ముత్యం లభించాలనుకున్నప్పుడు, అందమైన స్వాతి చినుకు సముద్రంలోని ముత్తెపుచిప్పలో పడిపోయిందే అనే చింత అర్థరహితం. విశ్వ వ్యవస్థ యొక్క ఫంక్షనింగ్‌లో, ప్రతి ఆనందమూ దానికై చెల్లించబడవలసిన మూల్యంతో ముడిపడి వుంది. ఈ భావాన్ని మరింత వ్యంజనా సంపన్నంగా వ్యక్తం చేస్తూ అంగరాజు పలికే మరొక పద్య పాదం—

''తొలిపాటలో మౌనములు కొన్ని కలవు.'' ఈ విషయాన్ని వేనుడు గుర్తించిన క్షణాన, అతడు వెలుగులోకి ప్రవేశించినట్లే. ఆ తర్వాత అతడికి పూర్వ దుష్కృత్య వాసనా దుష్టమైన శరీరం దుర్భరంగా తోచింది. యుద్ధానికై గౌతముణ్ని తొందర చేశాడు. తాను మొద్దుబారిన కత్తితో యుద్ధం చేయటం ద్వారా నైనా గౌతముడి చేత తన 'దక్షిణ బాహు దళనము' చేయించి ప్రాణత్యాగం చెయ్యాలని ఆరాటపడ్డాడు. వేనత్వాన్ని విసర్జించాడు.

ఈ వేనత్వం విశ్వ వ్యవస్థకు అవరోధం కల్పించటం ఒక తాత్కాలికమైన దశ. తిరిగి వ్యవస్థ నెలకొన్న తరువాత, అసలు అవరోధం అనేది ఎప్పుడైనా వుండినదా అని సందేహం కలిగించేటంతగా 'లోకము నిరామయ' మవుతుంది.(10వ అంకం). అందుకే, నాటకం చివర,'నా మనస్సున కతడు పుట్టినట్లే లేదు; చనిపోయినట్లె లేదు' అంటాడు, విశ్వవ్యవస్థను పునరుద్ధరించిన పృథువు(ఒక సరికొత్త ఆధ్యాత్మిక మార్గంలో పునరావిర్భవం పొందిన వేనరాజే పృథువు).ఇలా, వేనుడి వేనత్వం అస్తినాస్తి విచికిత్స రేకెత్తించేదిగా వుంది కాబట్టే,దాన్ని వాస్తవికతా స్థాయికి దూరంగా తీసుకొనిపోయి, నాటకంలోని సన్నివేశాన్ని ఉదాత్తీకరణ[3] చేశాడు విశ్వనాథ. అందుకు అనుగుణంగా, వేనుడి ప్రపంచం భగ్నం కావటం పూల సంకేతాలతో సూచించబడింది.

నాటకం ప్రారంభంలో వేనుడి తోటలోని పూలను అంగరాజు, ఒకసారి తన దేహంపై అలంకరించుకోవటానికీ, మరొకసారి సునీథ పాదాలు పూజించటానికీ పూర్తిగా కోసుకుని పోతున్నాడు. అంటే, చేవగల ధర్మాన్ని ఉపేక్షిస్తూ, సౌందర్య ప్రలోభంతో నైశిత్యం కోల్పోయిన వేనుడి ప్రపంచం నిలిచేది కాదని అర్థం. మరణదండన ననుభవించబోయే శ్రీధరుణ్ని వినీతభట్టు 'మందార సుమం'తో పోల్చినట్లుగా, వేనుడు కూడా ప్రారంభంలో పృథువుచే, తోటలో మిగిలిన 'మందార సుమము'తో పోల్చబడ్డాడు. ఈ మందార సుమానికి కూడా మరణం తప్పదు. అందుకే యీ పువ్వు 'తెగగొట్టబడిన రాజు తలకాయ వలె నెత్తురులో మునిగి' తేలుతున్నట్లుగా వర్ణించబడింది. భూమి అయాచితంగా అందించే పూవులకు అంకితమైన శుష్క సౌందర్య పిపాసలో వేనుడు మునిగి తేలుతోంటే, పృథువు అలా కాకుండా ప్రజల పిపాసను తీర్చటానికై అదే భూమి నుండి మధుక్షీరాలనూ, ఓషధులనూ యాచించి పిదికి ఒక సంపన్నమైన ప్రపంచానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. (అలా పిదుకటానికి, భూదేవి సంపర్కంలో రాజరికాన్ని విబోధితం చేసుకున్న పృథువు

కన్నా అర్హుడెవడగా లేడనీ, అతడు పిదికే ఓషధుల్లో రాజరికం ఒకటిగా వుండి, అవ్యవస్థ అనే రుగ్మతను హరిస్తుందనీ పాఠకుడు వూహించుకోవాలి). 8వ అంకంలో, పరిస్థితులు మంచి మార్గాన పడి, పృథువులో పురుషత్వమూ, నైశిత్యమూ స్పష్టమైనప్పుడు, తోటలోని పూలన్నిటినీ అంగరాజు కోసుకుపోవటం లేదు; సగము పోయినవి, సగమున్నవి'. జీవితంలో సగమే సౌందర్యమని అంగీకరించిన ఈ ప్రపంచం— వేనుడి ప్రపంచంవలె శుష్కత్వంపై, అతీత దృక్పథాలపై కాక — మధ్యేమార్గంపై, సంయమనంపై ఆధార పడినట్టిది. అర్థవంతమైనట్టిది. ఈ ప్రపంచం భగ్నం కాదు. వేనుడి మరణమనే యజ్ఞాహుతి నుండి యీ ప్రపంచం పుట్టింది కాబట్టి, వేనుడి మరణం అతడి విజయం కూడా.

నాటకంలోని సంఘటనలన్నీ 7వ అంకం వరకు రాజాంతః పురంలోనూ, కోటముందూ జరుగుతాయి. చివరి మూడు (8, 9, 10) అంకాలలో సంఘటనలు ఎక్కడ జరుగుతున్నాయో రచయిత స్పష్టం చెయ్యడు; చెయ్యటానికి వీల్లేదు కూడా. కారణం: మానుష స్థాయికి దూరంగా జీవించే అంగరాజుకు ప్రాధాన్యం యిచ్చే సన్నివేశం అది; 'ప్రత్యక్షము దాటి యేదియు' లేదన్న వేనుని ప్రపంచం చెరిగి పోతున్న సన్నివేశం; వాస్తవానికీ భ్రమకూ, జీవితానికీ మృత్యువుకూ, స్త్రీత్వానికీ పురుషత్వానికీ మధ్య రేఖలు చెరిగిపోతుండగా, జీవితంలో జరుగని విధంగా వేనరాజు పిశాచాలతో (తనలోని పైశాచికత్వంతో) ముఖాముఖి నిల్చున్న సన్నివేశం. కాబట్టి ఆ సంఘటనల చుట్టూ ఒక అస్పష్టతను సూచిస్తూ, అవి జరిగేచోటు ఒక అనామక ప్రదేశమనే భావం ప్రేక్షకులలో కలిగించటం అవసరం. రచయితతో ప్రయాణిస్తూ అలాంటి ప్రదేశంలో సంచరించిన తర్వాత ప్రేక్షకుడు, చివరన వసుంధర "మనము హిమవత్పర్వత ప్రాంత కాంతారదేశములకు వచ్చితిమి" అన్నప్పుడు (10 వ అంకం), దాన్ని సులభంగా అంగీకరిస్తాడు. "అదెలాగ ? ఆ ప్రదేశం కనబడకుంటే ఉన్నదనుకోవటం ఎలా సాధ్యం ?" అని మెలకువ గల ప్రేక్షకుడెవ్వడూ ప్రశ్నించడు. ప్రేక్షకుడు తన ఊహాశక్తిని ఉపయోగించకుండా, తన కవసరమైన యథార్థ భ్రాంతినంతా రచయితే పళ్లెంలో పెట్టి అందివ్వాలనుకోవటం బడిపిల్లల మనస్తత్వం లాంటిది.

పైన పేర్కొన్న సన్నివేశాలను రంగస్థలంపై కల్పించటం కష్టంకాదు కాబట్టి, ఈ నాటకానికి ప్రదర్శనా సౌలభ్యం వుంది. సంభాషణల్లో కూడా రచయిత ఎన్నదగిన నిగ్రహం ప్రదర్శించాడు. అయితే ఈ నిగ్రహం అక్కడక్కడ లోపించటం వల్ల, కొన్నిచోట్ల మాత్రం సంభాషణల్లో కాస్త ఉపన్యాస ధోరణి ప్రవేశించింది. ఉదాహరణకు : 2 వ అంకంలో "నీ యంతరాత్మకు, ఋషుల అంతరాత్మకు భేదమున్నది" అంటూ గౌతముడు వేనునితో చేసే సంభాషణ; 3 వ అంకంలో పృథువూ, అంగరాజూ వేనుడితో చెప్పే మాటలు; 6 వ అంకంలో ముసలిభట్టు వేనుడితో, "నీ బహిరింద్రియములకన్న అంతరింద్రియములు" అంటూ చేసే వివరణ. ఈ సంభాషణలు బాగా కుదించివుంటే, నాటకం మరింత బలం సంతరించుకుని, చిక్కగా అల్లిన సాహిత్యరూపంగా తయారై వుండేది. అయినా, యీ లోపాలు అతి స్వల్పం కావటం వల్ల, వాటిని ప్రదర్శనలో ఎవరూ గమనించరు.

కొందరడగొచ్చు : ఇంతటి భావ సంకీర్ణత గల నాటకం ప్రదర్శనకు పనికొస్తుందా, అది ప్రేక్షకులకు అందుతుందా అని. నిస్సందేహంగా అందుతుంది. కాని, నాటక ప్రదర్శన ప్రేక్షకులకు అందటంలో చాలా అంతస్తులు ఉన్నాయి. అవగాహనాశక్తిని పూర్తిగా సమాయత్తం చేసుకోకుండా, ఏవైపుకు తిరిగి కూచున్నా నాటకం అర్థమవుతుందన్న పద్ధతిలో నాటకశాలకు వెళ్లిన ప్రేక్షకుడికి అందులోని అనుభూతి పూర్తిగా అందాలనుకోవటంలో అర్థం లేదు. ముఖ్యంగా, యిలాంటి నాటకంలో, తెరయెత్తినప్పటినుంచీ ప్రతి సంఘటనపట్లా, ప్రతి చిన్న సంభాషణపట్లా ప్రేక్షకుడు మెలకువగా వుండి తీరాలన్న నియమాన్ని విధిస్తాడు రచయిత. తను నాటకంలో అందించే అనుభూతికీ, ఆ అనుభూతిపై తను చేసే వ్యాఖ్యానానికీ ఒక ప్రత్యేకతా, లోతూ వున్నప్పుడు, ప్రేక్షకుడిపై అలాంటి నియమాన్ని విధించే హక్కు రచయితకు తప్పకుండా వుంది.

## అధోజ్ఞాపికలు

1 విశ్వనాథ వారు వేనుని పాత్రను 'ఖూనీ' చేశారంటూ శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరి తాము రాసిన "ఖూనీ" అనే నాటకం పీఠికలో విమర్శించారు.

2 నిజంగా వేనుడంతటి 'క్రూరుడా ?' అని శ్రీ చౌదరి ప్రశ్నించారు. కాని, వేనుణ్ని ఒక చారిత్రక వ్యక్తిగా శ్రీ చౌదరి భావిస్తున్నారేమోనని నా సందేహం. అదెంతవరకు సమంజసమో చెప్పలేను గాని, "భాగవతం"లోని వేనుడు నిజంగా క్రూరుడే. ఆ క్రూరత్వాన్ని కళావసరాల దృష్ట్యా అతిశయింపజేసే హక్కు నాటక రచయితకు ఉందని మాత్రం చెప్పగలను.

3 'హయిటెనింగ్' అనే రచనా శైలిని సూచించటానికి వేరే పదం ఏదీ దొరక్కపోవటం వల్ల ఈ 'ఉదాత్తీకరణ' అనే మాటను వాడవలసి వచ్చింది. 'ఉదాత్తత' అనే మాట తెలుగు విమర్శలో సాధారణంగా 'గంభీరత' అనే అర్థంలో వాడబడుతున్నా, నేనిక్కడ దాన్ని సంగీతంలో వలె 'సాధారణ స్థాయిని దాటి ఒక మెట్టు పైన వుండటం' అనే ప్రత్యేకార్థంలో తీసుకుని 'ఉదాత్తీకరణ' అన్నాను.

డా. విశ్వనాథ అరుణాచలం

# గణితం-విజ్ఞానశాస్త్రం

గణితశాస్త్రాన్ని గురించి వ్రాస్తూ ఇ. టి. బెల్ అనే మహాశయుడు "మేథమెటిక్స్ ఈజ్ ది క్వీన్ ఎండ్ సర్వెంట్ ఆఫ్ సయిన్సెస్" అని అంటాడు. ఈ ప్రతిపాదనలో గణిత స్వభావ లక్ష్యాలను రెండు ముక్కలలో చెప్పడమైనది. స్థూలంగా గణితాన్ని రెండు భాగాలు చేయవచ్చు. మొదటిది శుద్ధగణితము-ప్యూర్ మేథమెటిక్స్. రెండవది వినియుక్త గణితము-ఎప్లయిడ్ మేథమెటిక్స్.

"వినియుక్త గణితశాస్త్రము
ననవచ్చు మధుర కవిత్వమని స్వీకృత శీ
లనము విశుద్ధ గణితము—ల
క్షణ శాస్త్రమునకు తులయగు గణగణ ఘంటా-"

అన్నది గంటాశతకంలోని పద్యం. వినియుక్త గణితం లలిత పద సమన్వితమైన మధుర కవిత్వంలాగా ఆనందదాయకమైతే తర్క సంబంధియై లక్షణశాస్త్రంలాగా విశుద్ధగణితం మన ఆలోచనా విధానాన్ని శాసిస్తుంది. వినియుక్త గణితశాస్త్రం అనుక్షణం భౌతిక శాస్త్రాలు, ప్రకృతిశాస్త్రాలు, భూగర్భశాస్త్రాలు, అంతరిక్ష పరిశోధన మొదలైన విజ్ఞాన శాఖలతో సంబంధాలను పెంచుకొంటూ వాటి అభివృద్ధికి ఎంతో దోహదకారి అగుచున్నది. విశుద్ధ గణితం అరూపభావ అవగాహనలో మనకు తోడ్పడుతూ విశ్వసత్య గవేషణకు నిరంతరం కృషి చేస్తూ ఉన్నది. మేథమెటిక్స్ ఈజ్ ఎ స్టడీ ఆఫ్ స్ట్రక్చర్స్ అన్న నిర్వచనం ఉద్దేశము గణితశాస్త్రంయొక్క అలౌకికమైన స్వభావాన్ని (ఎథీరియల్ నేచర్) ప్రకటించడానికే.

ప్రాచీనకాలంలో భారతదేశంలో గణితశాస్త్రం ఉన్నతస్థానాన్ని అలంకరించి ఉండినది. క్రీ.పూ.1200సం॥నాటి మేధావి,తాత్త్వికుడు అయిన లగధముని తన వేదాంగ జ్యోతిష గ్రంథంలోఅంటాడు:

"యథాశిఖామయూరాణాం నాగానాం మణయోయథాః
తద్వత్ వేదాంగ శాస్త్రాణాం గణితం మూర్ధనిస్థితమ్"

అని. ప్రకృతిలో ఒక క్రమం, ఒక సౌందర్యం (ఆర్డర్ ఎండ్ బ్యూటీ) అనుస్యూతంగా ఉన్నదనే గట్టి విశ్వాసంతో, విజ్ఞాన శాస్త్రజ్ఞుడు తన కృషిని కొనసాగిస్తాడు. ఈ సత్యాన్ని శోధించడానికి అనేక ప్రయోగాలను నిర్వహిస్తాడు. తద్వారా ఫలితాలను క్రోడీకరించి విశ్లేషణ, సంశ్లేషణలద్వారా "సత్యా"న్ని ఆవిష్కరిస్తూ పురోగమిస్తున్నాడు— అన్వేషించి ఆవిష్కరించిన సత్యాలద్వారా విజ్ఞానశాస్త్రం మానవ కల్యాణానికి (మారణహోమానికి కూడా) బంగారు బాటలు వేయిస్తోంది. ఈ మహత్కార్యంలో గణితశాస్త్రం ఒక మంచి అనివార్యమైన కొలముట్టుగా ఉపయోగపడుతున్నది.

భౌతికశాస్త్రంలో, ఇంజనీరింగ్ టెక్నాలజీలో, కంప్యూటర్ విజ్ఞానంలో, అంతరాళ పరిశోధనలో, ప్రత్యామ్నాయమైన ఇంధనాలు కనుక్కోవడంలో విశ్వశక్తికి ఆనకట్టలు కట్టి అనుకొన్నచోటికి ప్రవహింప చేయడంలో గణితం అత్యవసరమని అందరూ అంగీకరిస్తున్నారు. గణితంతో పొత్తులేనివనుకొన్న రాజనీతిశాస్త్రం, వృక్షశాస్త్రం, వైద్య శాస్త్రం మొదలైన వాటిలోకికూడా ఈనాడు గణితశాస్త్రం ప్రవేశించింది. గణితశాస్త్ర పద్ధతులద్వారా ఆధునిక ప్రపంచంలో ప్రతి మేధాప్రక్రియ ప్రభావితమౌతూ ఉన్నదంటే అతిశయోక్తికాదు.

బానిస నిశినుంచి విముక్తిపొందిన భారతదేశంలో ఏ సంధ్యలోనో అస్తమించిన విజ్ఞానభాస్కరుడు మళ్ళీ ఉదయించినాడు. శ్రీ నెహ్రూ కాలంనుంచి ప్రభుత్వం ఇస్తూఉన్న నిరంతర ప్రోత్సాహంవల్ల మనదేశంలో సైన్సు, సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతూవస్తూ ఉన్నది. జాతీయస్థాయిలో నెలకొల్పబడిన సైన్సు సంస్థలలో పరిశోధనలు జరుగుతూ ఉన్నవి. బీదదేశమైనా భరత ఖండ పరిశోధనాలయాలలో తరిబీదు పొందిన సైంటిస్టులు అగ్ర దేశాలకు వెళ్ళి రాణిస్తున్నారు. కొత్త వాతావరణంలో చరిత్రాత్మకమైన విజ్ఞాన రహస్యాలను పరిశోధిస్తున్నారు. ఈ విజ్ఞానయుగంలో ఆర్భాటంలేని నిరంతరసేవ గణితశాస్త్రంద్వారా జరుగుతూఉంది. స్థూలంగా ఈ సేవను గురించి తెలుసుకొందాము.

విజ్ఞానశాస్త్రంలో చర్చనీయాంశాలనురాశీకరించిన(క్వాంటిటీ) వెంటనే వాటిని అధ్యయనంచేసి అంతర్లీనమై గుప్తంగా ఉన్న సత్యాలను వెలికితీయడానికి ఒక భాషను, ఒక పద్ధతిని (ఎ లాంగ్వేజి ఎండ్ ఎ మెథడ్) గణితం సమకూరుస్తున్నది. సూత్రాలను, సిద్ధాంతాలను, నిర్మాణాలను, పరివర్తన ప్రక్రియా స్వరూప స్వభావాలను, సంభావ్యతా భావాన్ని ప్రవేశపెట్టి గణితశాస్త్రం సైన్సు అభివృద్ధికి దోహదం చేస్తూ ఉన్నది. జ్యోతిష్కునికిమల్లె సైంటిస్టు రాబోయే సంఘటనల్ని ఊహించి ప్రకటించగలుగుతున్నాడు. ఇక్కడ గణిత విశ్లేషణాన్ని, తర్కాన్ని ఉపయోగిస్తున్నాడు. పరమక్లిష్టమై దురవగాహనమైన ప్రకృతి లీలావిలాసాన్ని (నాచురల్ ఫినామినా) అవగాహన చేసుకోవడానికి ప్రమేయభావాన్ని (ఫంక్షన్ కాన్సెప్ట్), రేఖాచిత్రాన్ని(గ్రాఫ్), పరివర్తన(ట్రాన్స్‌ఫర్మేషన్)ను గణితశాస్త్రజ్ఞుడు ప్రవేశపెట్టినాడు.

విశుద్ధ గణితంలో మొదట కొన్ని స్వీకృతాలు (ఆక్సియమ్స్) ప్రకటించి వాటిద్వారా గణిత నిర్మాణాన్ని (మేథమెటికల్ స్ట్రక్చర్) సాగించి కొత్త కొత్త స్వరూపాలను సాధించడం గణితజ్ఞుని క్రీడా కలాపం. క్రీ. పూ. ప్రఖ్యాతిచెందిన యూక్లిడ్ ఈ విధానానికి చక్కని పునాదులు వేసినాడు. ఈ తత్త్వం నేడు విజ్ఞానశాస్త్ర రంగాలకు

వ్యాపించిందంటే, విస్తృతమౌతూఉన్న గణిత ప్రభావానికి అవి గట్టి నిదర్శనం. గణితజ్ఞుని దృష్టిలో బిందువు, రేఖ మొదలైనవి శుద్ధ భావాలు (ప్యూర్ కాన్సెప్ట్స్) మాత్రమే. మన అనుభవంలో అనుకొనే బిందువు, రేఖ వగైరాలు ఈభావాలకు మోటురకమైన ప్రతీకలే. అన్ని గణిత భావనలకు మనం దృశ్యమాన జగత్తునుండి ఉపమానాలను ఇవ్వలేము. అయినంతమాత్రాన గణిత ఉపకల్పనలు, భావనలు సార్థకంగా వ్యవస్థితం కాకపోవు—భౌతిక శాస్త్రంలో కాంతి, రేడియోతరంగాలు పయనించడానికి ఒక మాధ్యమంగా మనం అనుకొనే ఈథర్ ఒకగణితీయ ఉపకల్పనే. విజ్ఞానశాస్త్రంలో అనేక ఉపకల్పనలు సమీకరణలు ప్రవేశిస్తాయి. కొన్నిటికి భౌతికంగా అర్థాలను (ఫిసికల్ సిగ్నిఫికెన్స్) అన్వయిస్తాము. కొన్నిటికి వీలుకాదు. ఈ ఉపకల్పనలకు ఈనాడు భౌతికంగా తాత్పర్యం లభించకపోవచ్చు. కానీ ఉత్తరోత్తర విజ్ఞానం యింకా పెరిగిన తర్వాత లౌకికమైన వాటి అంతరార్థం తెలియకపోదు.

సైన్సులో గణితాన్ని ఉపయోగించడంవల్ల మరొకలాభం ఉంది. కొత్త త్రోవలలో ఆలోచనా విధానం నడవడానికి అనుకూలతను, ఆసక్తిని కలిగిస్తుంది. శతాబ్దాల తరబడి ప్రచారంలోఉన్న శాస్త్రీయ విశ్వాసాలకు ఎదురు తిరిగి ప్రశ్నించడం, తద్ద్వారా మానవ విజ్ఞాన పరిధులను విస్తరిల్ల చేయడం గణితశాస్త్ర చరిత్రలో మనం తరచూ చూస్తూఉంటాము. యూక్లీడియేతర జ్యామితులు (నాన్. యూక్లిడియన్ జామెట్రీస్), ద్వంద్వాంశ (బయినరీ) సంఖ్యామానము కాంతి, ఉష్ణములను గురించిన శక్తిభావన ఇవన్నీ మొట్టమొదట గణితీయంగా ఏర్పడిన విప్లవభావాల వ్యవసాయ ఫలితమే—

క్రీ. శ. 1600 సం॥ నాడు గణితశాస్త్రంలో ప్రమేయ భావన ప్రవేశించింది. తరువాత కొద్ది కొద్దిగా ప్రచారంలో ఉండిన గణిత సాంకేతికభాష (సింబాలిక్ లాంగ్వేజి ఆఫ్ మేథమెటిక్స్) పుష్కలంగా అభివృద్ధి చెందసాగింది. సాంకేతికభాష, సంజ్ఞాసంపద విజృంభించడంవల్ల గణిత చర్చలలో అరూపభావ అవగాహన మానవ సహజమైన రాగద్వేషాలకు అతీతంగా సాగడానికి అనుకూల్యత ఏర్పడింది. సైన్సుయొక్క పరమావధి రాగద్వేషాలకు లోనుగాక జరిగే విశ్వసత్యాన్వేషణమేకదా. గనుక గణితీయమైన సాంకేతికభాష సమాయత్తపరచిన తోడుగుగా పరిణమించింది, సైన్సు పరిశోధనలకు. క్రీ. శ. 1600 ప్రవేశించిన గణిత ప్రమేయాన్ని గురించి ఇప్పుడే ప్రస్తావించినాము. దీనినుండి త్రికోణమితి బాగా వృద్ధిచెంది ఆవర్తన ప్రమేయాలు(పిరియాడిక్ ఫంక్షన్స్)అవతరించాయి. వీటిని ఉపయోగించి గలీలియో, లోలక ఆవర్తన గమనాన్ని అధ్యయనం చేసినాడు. గాలికణాల ఆవర్తన గమనంనుండే శబ్దం ఉత్పన్నమైనదని న్యూటన్ కనుక్కొన్నాడు. కాంతికి సంబంధించిన ఆవర్తన తరంగ గమనాన్ని (పిరియాడిక్ వేవ్ మోషన్) భావించగలిగినారు విజ్ఞాన శాస్త్రజ్ఞులు.

న్యూటన్ మొదట గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని ప్రవచించినాడు. ఇరువదవ శతాబ్దంలో ఐన్‌స్టెయిన్ పరిశోధనలు ఫలవంతమయ్యేవరకు నిరర్గళంగా గురుత్వాకర్షణ సిద్ధాంతం విజ్ఞానుల విశ్వాసాలను శాసించింది. ఒక బ్రహ్మాండమైన ద్రవ్యరాశికి స్వల్పద్రవ్యరాశుల్ని ఆకర్షించే గుణం సహజంగా ఆపాదితమౌతుందని ఈ గుణ ప్రాగల్భ్యంవల్లనే భూమి "ఆపిలుపండు"ను ఆకర్షిస్తుందని న్యూటన్ అనుయాయులమై నమ్ముతూ వస్తున్నాము. అయితే ఐన్‌స్టెయిన్ దీన్ని కాదని దేశ కాల అవిచ్ఛిన్నమైన అనంత విశ్వాంతరాళంలో అక్కడక్కడ శిల్పించబడిన లోయల నైజగుణం అన్నాడు—ఇవి భౌతిక లక్షణంకాదు. అంతరాళానికి జ్యామితీయంగా ఏర్పడిన గణిత స్వభావం అన్నాడు. తదనుగుణంగా ఐన్‌స్టెయిన్ తన సాపేక్ష సిద్ధాంతాన్ని ప్రకటించినాడు. దీన్ని మామూలుగా అందరికీ అర్థమయ్యేటట్లు చెప్పడానికి ఒక ఉదాహరణను పేర్కొంటాము. రైలు పట్టాలమీద పోతూ ఉన్నదనుకొందాము. పట్టాలు తిన్నగాఉంటే రైలు గమించే తీరుకూడా తిన్నగా ఉంటుంది. పట్టాలు వంపుతిరిగితే రైలు కూడా వంపుతిరుగుతుంది. కనుక రైలు గమనంలో జరిగే ఈ మార్పులన్నీ రైలు పట్టాలనుమోసే భూమిమీద ఆధారపడక రైలుపట్టాల జ్యామితిని ఆశ్రయించి ఉన్నాయి. ఆలాగే అంతరాళంలో భూమి ఉన్న చోట అంతరాళానికిఉన్న జ్యామితీయ లక్షణంవల్లనే గురుత్వాకర్షణ ఏర్పడి ఉన్నదని చెబుతాము. అంతరాళాన్ని గురించి ఇట్లాంటి వినూత్న భావాలు రేకెత్తడానికి ప్రధాన కారణాల్లో ఒకటి గౌస్, బొల్యా, లాబొచెవ్‌స్కీ లాంటి మేధావులు కృషిచేసి ప్రవేశపెట్టిన నాన్—యూక్లిడియన్ జామెట్రీలు.

ఇంతవరకు గణితంవల్లనే సైన్సు అభివృద్ధి చెందుతూ ఉన్నది అంటూ వచ్చాము. ఇది శాస్త్ర సత్యానికి సంబంధించిన ఏకపార్శ్వదర్శనమే. సైన్సువల్లకూడాగణితం ఎంతగానో అభివృద్ధిచెందుతూఉన్నది.

బ్రహ్మాండంగా, అనుదినం పెరుగుతూఉన్న విజ్ఞానశాస్త్రం అనేక సమస్యలను ఎదుర్కొంటున్నది. ఇప్పటి వరకు రూపొందిన గణిత శాస్త్ర సిద్ధాంతాలు, సమీకరణాలు, పరికరాలు, ఈ సమస్యల్ని సాధించలేకపోతే గణితశాస్త్ర ప్రతిష్ఠ ఏం కావాలి? కనుక గణితం ఈ సవాళ్ళను ఎదుర్కొంటుంది. లేని పరికరాలను కూర్చుకొనుటకై పరిశోధనలు చేసి తన పెంపును కూడా చూచుకొంటుంది.

విజ్ఞాన శాస్త్రంలో మనం చర్చించే భౌతిక వస్తువులు, వాటి పరిశీలనలో మనకు లభించే వాస్తవాలు గణితం దృష్ట్యా మూలాకాలుగా స్వీకృతాలుగా రూపొందించుకోవచ్చు. గణిత ప్రక్రియలను ఉపయోగించి గణిత సత్యాలను కనుక్కొని వాటి వ్యాఖ్యానాలుగా భౌతిక ఫలితాలను ప్రదర్శిస్తాము. మన సమక్షంలో జరిగే భౌతిక సంఘటనల కనుగుణంగా గణిత సత్యాలు లభించకపోతే వాటికై శోధిస్తాము. ఈ శోధనలోనే గణితశాస్త్రం మరింత వికసిస్తుంది.

విఖ్యాత తాత్త్వికుడు కాంట్ అంటాడు "ఎంత వరకు సైన్సు గణితీకరణమైనదో ఆ పరిమాణం మీద ఆధారపడి ఉంటుంది సైన్సు అభివృద్ధి".

"తర్కాన్ని ఉపయోగించి హేతువాదంద్వారా గణితం—ప్రకృతి బహిర్గతం చేయని రహస్యాల నెన్నిటినో ఆవిష్కరిస్తుంది" అంటాడు మారిస్ క్లీన్. భావాలకు సంబంధించిన పొదుపరి తనము, ప్రకటనల విషయంలో సమగ్రతను భంగం చేయని క్లుప్తత గణితం నుంచే సైన్సు నేర్చుకొన్నది. ఇట్లా అనేక విషయాలను ప్రస్తావించి గణితానికి విజ్ఞానశాస్త్రానికి ఉన్న దృఢసంబంధ బాంధవ్యాలను ధ్రువపరచవచ్చు.

డా. ఎ. పున్నారావు

# ఆంధ్రశబ్దచింతామణిలో ప్రాకృత వ్యాకరణానుకరణం

ఆంధ్రశబ్దచింతామణి కాలాన్ని కర్తృత్వాన్ని గూర్చి యింతవరకు చర్చించిన పెద్దలెవరూ చింతామణిని ప్రాకృత వ్యాకరణాలతో పోల్చిచూచిన జాడలేదు. చింతామణి రచనలో ప్రాకృత వ్యాకరణాల ఛాయ కొట్టవచ్చినంత గాఢంగా కనిపిస్తుంది. ప్రాకృత వ్యాకరణాలలో గూడ త్రివిక్రముని ప్రాకృత శబ్దానుశాసనం చింతామణికి మార్గదర్శక మని చెప్పవచ్చు.

త్రివిక్రముడు తన ప్రాకృత శబ్దానుశాసనంలో రచనా లాఘవాన్ని సంపాదించే ఉద్దేశంతో నూతన సంజ్ఞలు, పరిభాషలు కొన్నింటిని కల్పించాడు. అతనికి పూర్వులైన ప్రాకృత వ్యాకర్తలు, వరరుచి, చండ, ధనపాల, హేమచంద్రులెవరూ ఆ పనిచేసి ఉండలేదు.

త్రివిక్రముడు కల్పించిన సంజ్ఞలు, పరిభాషలు అనేకం ఉన్నా, వాటిలో చింతామణి స్వీకరించినవి మూడు. సంజ్ఞలు రెండు. పరిభాష ఒకటి. వాటిని క్రమంగా ముందు ప్రాకృతశబ్దానుశాసనంలో, తరువాత ఆంధ్రశబ్దచింతామణిలో తులనాత్మకంగా పరిశీలిద్దాం.

''సుప్ స్వాదిరన్త్యహలా'' త్రివిక్రమ--1–1–4

వృత్తిః:– సుప్సు స్వాదిషు విభక్తిషు ఆదివర్ణోవచనం వ్యాన్త్యహలా అన్త్యవ్యంజనేన సహ సంజ్ఞాభవతి। యథా సు, ఔ, జస్– సుస్; అమ్, ఔట్, శస్ – అస్; టా, భ్యాం, భిస్– టాస్; ఙే, భ్యాం, భ్యస్ – ఙేస్; ఙసి, భ్యాం, భ్యస్ – ఙసిస్; ఙస్, ఓస్, ఆమ్–ఙామ్; ఙి, ఓస్, సుప్ – ఙిప్;

పఞ్చమ్యా 'ఙస్' ఇతివక్తవ్యే 'ఙసిస్' ఇతి ఙసః షష్ఠ్యేకవచనస్య సన్దేహార్థమ్ ।

పంచమికి పై సూత్రం ప్రకారం 'ఙస్' అని ప్రత్యాహార మేర్పడవలసి ఉంటే 'ఙసిస్' అని చెప్పడమెందుకంటే 'ఙస్' అనేది షష్ఠీ – ఏక వచన ప్రత్యయంగా ప్రసిద్ధం గాబట్టి సందేహం కలగకుండా ఉండటం కోసం – అని వివరించాడు – తన వృత్తిలో త్రివిక్రముడు.

పాణినీయంలో 'సుప్ తిఙన్తం పదమ్' (1–4–14) అనే సూత్రం నామక్రియా విభక్తి సముదాయాన్ని రెండుగా, సుప్, తిఙ్ అని ప్రత్యాహారరూపంగా వెలువరిస్తుంది. ఆ రెండురూపాల్ని మినహాయిస్తే, నామ విభక్తులతోగాని, క్రియావిభక్తులతోగాని ఏర్పడిన ఇతర ప్రత్యాహారాలు పాణినీయంలో మృగ్యం. పాణిని నామవిభక్తుల, క్రియావిభక్తుల సముదాయాన్నంతటినీ ప్రత్యాహారం చేసి చూపిస్తే, అనంతరం ఈ ప్రాకృత వ్యాకర్త ఆ పద్ధతినే మరికొంత విశాలంచేసి ఒక్కొక్క విభక్తిలోని మూడు ప్రత్యయాలను, ఒక ప్రత్యాహారంచేసి తన వ్యాకరణంలో ఉపయోగించాడు–సు, ఔ, జస్ = సుస్–ఇత్యాదిగా. ఈ పద్ధతికి శ్రీకారం చుట్టినవాడు త్రివిక్రముడు.

పై లక్షణానికి లక్ష్యం :–

''ఙసిసో హి'' త్రివిక్రమ. 2–2–17.

వృత్తిః: –అతః పరస్య ఙసిసః పఞ్చమ్యా హి ఇతి వా భవతి।వచ్ఛాహి। ధణాహి। భ్యస్యేత్వే – వచ్ఛేహి। ధణేహి। పక్షే – హింతో త్తోదోదు–ఇత్యేతే చ।

''స స్సమాసః'' త్రివిక్రమ 1-1–8

వృత్తిః:–సమాసః స సంజ్ఞకో భవతి।

సమాస శబ్దానికి ''సః'' అనే సంజ్ఞను కల్పించాడు త్రివిక్రముడు. దానికి లక్ష్యంగా క్రింది సూత్రం.

''వాసే'' త్రివిక్రమ 1–4–90.

వృత్తిః:–సే సమాసే శేషాదేశయోర్ద్విత్వంవా భవతి। ణ ఇగ్గామో ణఇగామో। కుసుమప్ప అరో కుసుమప అరో। దేవత్థుఈ దేవథుఈ।

''సాను నాసికొచ్చారణం ఙిత్'' త్రివిక్రమ 1–1–16

వృత్తిః:– ఙకారానుబన్ధం కార్యం సానునాసికొచ్చారం భవతి। యథా కాముక యమునా చాముండాతిముక్తకేమో ఙ్లుక్। కాఉఓ। జఉణా। అత్ర మకారస్య ఙానుబన్ధేలోపే శేషస్య స్వరస్య సానునాసిక ఉచ్చారః।

'ఙిత్తు' అనునాసికోచ్చారణ పూర్వకంగా ఉంటుందని సూత్రార్థం. ఉదాహరణగా కాముక–కాఉఓ–వంటివి యివ్వబడ్డాయి. ఇక్కడ కాముక శబ్దంలోని మకారానికి లోపంవచ్చి, దాని ఙిత్వాన్ని పురస్కరించుకొని మిగిలిన స్వరానికి అనునాసికోచ్చారణం ఏర్పడినది.

ప్రాకృత శబ్దానుశాసనం నూతన సంజ్ఞాపరిభాషా కల్పనంచేసి ప్రయోగించినతీరు చూచాం. అదేక్రమంలో ఆంధ్రశబ్దచింతామణిలో ఆయా సంజ్ఞల, పరిభాషల అనుకరణం ఎలా జరిగిందో క్రింద పరిశీలిద్దాం. మచ్చుకు ఒక్కొక్కటి మాత్రమే తీసికుందాం.

''జసిస ఉచ్యతే వలనః'' చింతా—అజంత—23.

వ్యాఖ్య :—జసిసః = పంచమీవిభక్తికి, వలనః = వలనవర్ణకము, ఉచ్యతే=చెప్పబడుచున్నది. అనఁగా పంచమీవిభక్తికి వలన వర్ణకం బాదేశంబుగా వచ్చునని తాత్పర్యము. ఉదా:—రాముని వలన, రాముల వలన—ఇత్యాదులు.

''షష్ఠ్యా ఉతోఽచినుమ్సే'' చింతా—సంధి—17.

వ్యాఖ్య:—షష్ఠ్యాః=షష్ఠియొక్క, సే=సమాసమునందు, ఉతః= ఉకారాన్త పదమునకు, అచి=అచ్చు పరమగుచుండఁగా, నుమ్=నుమాగమము, స్యాత్=అగును. అనఁగా షష్ఠీ సమాసమందు కారాన్తపదమున కచ్చు పరమగునపుడు నుగాగమంబు ఎచ్చునని తాత్పర్యము. ఉదా :— రామునాజ్ఞ, పాను నెమ్మలు, గురువునానతి—ఇత్యాదులు.

ఇక త్రివిక్రముని జిత్త్వపరిభాషా ప్రయోగం ఆంధ్రశబ్ద చిన్తామణిలో జరిగిన తీరు చూడవలసి ఉంది. దాన్ని చూడటానికి ముందు చిన్న ఉపోద్ఘాతం అవసరం.

చింతామణిలో 'రాముఁడు'—వంటి రూపాల నిష్పత్తికై త్రివిక్రముని జిత్త్వపరిభాషా స్వీకారం తప్పనిసరి. అయితే చింతామణికర్త ఆ విషయం చెప్పడు. కనీసం సూచనైనా చేయడు. చెప్పకపోయినా, సూచించకపోయినా, ఆ అంశం ఆంధ్రవైయాకరణులందరికీ తెలిసినదే—అని అతని అభిప్రాయం కావచ్చు. ఎందుకంటే ఆ కాలంలో త్రివిక్రముని ప్రాకృత శబ్దానుశాసనం తెలుగునాట పఠన పాఠన ప్రసిద్ధంగా ఉండేది.[1] దానికున్న ఆ ప్రసిద్ధిని పురస్కరించుకొని సూత్రకర్త ఆ 'తప్పనిసరి' అయిన అంశాన్ని, అది అధ్యాహార్యమన్నట్లు వదిలేశాడు.

అయితే ప్రాచీనులకి వారి సంస్కారాన్ని పురస్కరించుకొని కార్యా కార్యాలకు ప్రమాణమంటూ ఒకటి ఉండటం అవసరం. చింతామణికర్త తన వ్యాకరణంలో జిత్త్వ ప్రయోజనాన్ని చెప్పకుండా వదిలేశాడంటే, ఆ వదలడానికి గూడ అతనికి ఒక ప్రమాణం ఉండి ఉండాలి. నిజమే. ఆ ప్రమాణాన్ని అందించింది గూడ త్రివిక్రముడే. నాడు భారతదేశంలో ప్రసిద్ధమైన అష్టభాషా వ్యాకరణాలలో దేనిలోనైనా, అవసరమైన అంశం చెప్పబడకపోతే, ఆ చెప్పబడని అంశం ఇతర వ్యాకరణాల్లో ఎక్కడైనా చెప్పబడిఉంటే, దాన్ని అక్కడినుండి తీసికోవచ్చు. ఈ విషయాన్ని సూత్రించినవాడు త్రివిక్రముడే.

''అనుక్తమన్య శబ్దాను శాసనవత్'' త్రివిక్రమ—1—1—2.

వృత్తిః :—యదిహ స్వరాది సంజ్ఞాత్వేన సన్ధిప్రభృతికార్యత్వే నానుక్తం తత్సర్వమన్య శబ్దాను శాసనవత్ కౌమార జైనేంద్రపాణినీయ ప్రభృతిషు వ్యాకరణేషు యథోక్తం తత్తథైవేతి వేదితవ్యమ్।

స్వరం మొదలయిన సంజ్ఞలు తన వ్యాకరణంలో చెప్పబడకపోయినా, వాటిని తన పూర్వుల వ్యాకరణాలనుండి స్వీకరించమంటున్నాడు త్రివిక్రముడు.

చింతామణి ప్రక్రియలో 'రామ' అనే ప్రాతిపదికకు ఉత్త్వం వచ్చిన తరువాత ''మహతస్సోర్డుజనితో భవేత్ పుంసి'' చింతా—అజంత—12 అనే సూత్రం ప్రకారం 'డు' ప్రత్యయం చేరుతుంది. ఇక్కడ డు ప్రత్యయాన్ని సూత్రకర్త 'జిత్తు'గా చెప్పాడు. ఆ జిత్త్వ ప్రయోజనమేమిటంటే ఆ ప్రత్యయానికి ముందు అరసున్న రావడం.

త్రివిక్రమునిలో ''జ ఉ ణా'' అనే రూపనిష్పాదనంలో అనునాసికోచ్చారణకు కారణమైన జిత్త్వమే ఇక్కడ అరసున్నకూ కారణమైంది.

ఈ జిత్త్వప్రయోజనం ఇంకా గోఁగులు, కలఁడు—వంటి శబ్దాల నిష్పత్తిలో గూడ ఆవశ్యకమైన రీతిలో, చింతామణి సూత్ర రచన కొనసాగింది.

ఇలా త్రివిక్రముని సంజ్ఞా పరిభాషల్ని స్వేచ్ఛగా అనుకరించిన ఆంధ్రశబ్దచింతామణి అతని సూత్రాల్నిగూడ కొన్నిటిని యథాతథంగా, మరికొన్నిటిని ఈషణ్మాత్ర భేదంతో అనుకరించిన ఘట్టాలు గూడ ఉన్నాయి. వాటిలో కొన్ని చూద్దాం.

త్రివిక్రమునిలో మొట్ట మొదటి సూత్రం

''సిద్ధి ర్లోకాచ్చ'' త్రివిక్రమ 1—1—1.

వృత్తిః:—సిద్ధిరిహ ప్రాకృత సమ్బన్ధినీ పరిగృహ్యతే। సాచలోకాద్భవతి। యస్మాత్—ఋౠవర్ణాభ్యా మైకా రౌకా రాభ్యా మసం పృక్త ఙ ఞ కారాభ్యాం శషాభ్యాం ద్వివచనాదినా రహిత శ్శబ్దోచ్చారో లోక వ్యవహా రాదేవోప లభ్యతే। దేశ్యాశ్చ శబ్దాః। తస్మాత్ సిద్ధి ర్లోకా దితి వేదితవ్యమ్। చకారా ద్వక్ష్యమాణ లక్షణా దన్యైకాన్తాచ్చ।

ప్రాకృత భాషా సిద్ధి లోక వ్యవహారాన్నిబట్టి కలిగినదని సోపపత్తికంగా నిరూపించాడు త్రివిక్రముడు. లోకవ్యవహారంలోనే కొన్ని వర్ణాలు లోపించడం, ద్వివచనం భ్రష్టం కావడం జరిగినదని వాకొన్నాతడు.

పై సూత్రానికి ప్రతిబింబాన్ని మనం చింతామణిలో చూస్తాం—ఇదే సందర్భంలో.

''సిద్ధిర్లో కా ద్దృశ్యా'' చింతా—సంజ్ఞా—6.

వ్యాఖ్య:— సిద్ధిః=ఆంధ్రశబ్ద స్వరూపసిద్ధి, లోకాత్=లోకవ్యవహారము వలన, దృశ్యా=తెలియఁదగినది. అనఁగా నాంధ్రశబ్ద స్వరూపము లోక వ్యవహారము వలన సిద్ధించుచున్నదనుట.

త్రివిక్రమ సూత్రంలోని 'చ' శబ్ద స్థానాన్ని చింతామణిలో 'దృశ్యా' అనే పదం ఆక్రమించింది.

ప్రాకృత వ్యాకరణాల (తత్రాపి త్రివిక్రమ వ్యాకరణ) సమ్య ్శీలనం వలన చింతామణికర్తకు బలమైన ప్రాకృత వ్యాకరణ సంస్కారం అయత్నంగా సిద్ధించి ఉంటుంది. కాబట్టే అతనిలో, ప్రాకృత వ్యాకరణస్థ సంజ్ఞా పరిభాషలతోపాటు ఇతర పద బంధాలు గూడ కొల్లలుగా కనిపిస్తాయి. మచ్చు కొకటి చూద్దాం.

"యశ్రుతిరః" త్రివిక్రమ. 1–3–10

వృత్తిః:— ఆదిత్యను వర్తతే। ప్రాయోలుగిత్యా దినాలుకిసతి య్యోవ శిష్యతే అవర్ణః సః అవర్ణాత్ పరః లఘు ప్రయత్నతర యకార శ్రుతిర్భవతి।

ఉదా:— శకటమ్–సయఢం; ఆకరో–ఆయరో; ప్రకారః–పయారో.

అచ్చుకు పరమైన అచ్చు లఘు యకారంగా మారడాన్ని త్రివిక్రముడు సూత్రించాడు.

పైగా ఆ యకారం లఘువనిగూడ పేర్కొన్నాడు–వృత్తిలో. ఆగా ఆ సూత్రానికి ప్రతిధ్వనివి మనం చింతామణిలో వినవచ్చు.

"యశ్రుతి మార్యా లఘయం ప్రవదన్తి ప్రాణతః పరం ప్రాణమ్"

చింతా–సంజ్ఞా–25.

వ్యాఖ్య:— ఆర్యాః=పెద్దలు, ప్రాణతః=అచ్చుకంటె, పరం=పరమయిన, ప్రాణం=అచ్చును, యశ్రుతిం=యకారముయొక్క శ్రవణము వంటి శ్రవణము గల, లఘుయం=లఘు యకారముగా, ప్రవదన్తి=చెప్పుచున్నారు. అనఁగా నచ్చు కంటెఁ బరమైనదియై యకారమువలె వినఁబడునట్టి స్వరము లఘు యకారమని పెద్దలు చెప్పుచున్నారని భావము.

ఉదా :— హరియతఁడు–ఇత్యాది.

చింతామణికర్త పేర్కొన్న పెద్దలు బహుశః హేమచంద్ర త్రివిక్రములే కావచ్చు. హేమచంద్రుడు గూడ ఈ సందర్భంలో ఇలాంటి సూత్రాన్నే నిర్మించి ఉన్నాడు.

మరొక మౌలికమైన ప్రాకృత వ్యాకరణానుకరణం గూడ చింతామణిలో కనుపిస్తుంది.

వచ్చి, రాన్–వంటి తెలుగు అసమాపక క్రియల్ని సంస్కృతంలో చెప్పవలసి వచ్చినపుడు చింతామణి కర్త తప్పకుండా ప్రాకృత వ్యాకరణాల పారిభాషిక మార్గాన్ని అనుసరించాడు. కేతనాదు లెవరూ ఈ మార్గాన నడిచినట్లు లేదు.

"ఎచ్చ క్త్వా తుం తవ్య భవిష్యతి" త్రివిక్రమ–2–4–19

వృత్తిః:— క్త్వా, తుం, తవ్యేషు భవిష్యత్కాల విహితే చ ప్రత్యయే పరే అతః ఏత్వం, చకారా దిత్వం చ భవతి।

ఉదా:— క్త్వా–హసే ఉణ, హసి ఉణ

తుం — హసే ఉం

తవ్య — హసే అవ్వం

భవిష్యత్–హసే హిఇ

ప్రాకృతంలో క్త్వార్థం, ఇతరార్థాల్లో ధాతుగత అకారానికి ఏత్వవిధానం చేశాడు త్రివిక్రముడు. దీని ఛాయలుగల సూత్రరచన చింతామణిలో ఎంతో కనిపిస్తుంది.

"క్త్వాభూతయోః క్రియాన్త స్యేత్"

చింతా. క్రియా –16.

వ్యాఖ్య:— క్త్వాభూతాయోః = క్త్వార్థ భూతార్థముల యందు, క్రియాన్త్యస్య = ధాత్వంత్య వర్ణమునకు, ఇత్ = ఇకారము, స్యాత్=అగును. అనఁగా క్త్వా ప్రత్యయార్థము నందును, భూతార్థము నందును క్రియాంత్య వర్ణమున కికారాదేశం బగు నని తాత్పర్యము. ఉదా:— పోషించి, పోషింపించి, పోషించిరి–ఇత్యాది.

చింతామణి తెలుగు శబ్దాన్ని సంస్కృతంలో నిర్దేశించవలసి వచ్చినపుడు తొక్కిన దారిగూడ బహుశః ప్రాకృత వ్యాకరణాల నుండి నేర్చుకున్నదే కావచ్చు. త్రివిక్రమ. 2–1–1 సూత్రంతో, చింతామణి–అజంత–34 సూత్రాన్ని పోల్చి చూస్తే ఈ విషయం నిశ్చితమౌతుంది.

పై పరిశీలనంవలన, చింతామణి ప్రాకృత వ్యాకరణానుకరణం ఎంత అధికంగా చేసిందో, దానిపై త్రివిక్రముని ప్రభావం ఎంత గాఢంగా ప్రసరించిందో గ్రహించగలిగాం. కాని ఆ ప్రభావమే మరీ ముదిరి కొంత అనౌచిత్యాన్ని గూడ చింతామణి నిర్మాణానికి కలిగించిన దని చెప్పవలసి వస్తుంది–క్రింది ఉదాహరణలు పరికిస్తే.

"ఇదమే తత్ కిం యత్తద్ భ్యష్టో డినా" త్రివిక్రమ – 2–2–73.

వృత్తిః:— ఏభ్యః స్వరాది భ్యోన దన్తేభ్యః పరస్యతావచనస్య ఇణా ఇతి డిత్ భవతి తు।

ఉదా:— ఇమిణా–ఇమేణ; ఏదిణా–ఏదేణ; జిణా–జేణ; తిణా–తేణ;

ఇదం, ఏతత్, కిం, యత్, తత్— ఈ శబ్దాలకు తృతీయా – ఏకవచనంలో ద్వైరూప్యాన్ని త్రివిక్రముడు సూత్రించాడు. పై సూత్రాన్ని రచనలో అనుకరిస్తూ చింతామణికర్త ఇలా సూత్రించాడు.

"ఇద మదసే తద్యత్త చ్ఛబ్దా శ్శబ్దాన్త రాన్వయే బహుళం
హ్రస్వం ప్రపద్య దీర్ఘా ద్విత్వ ముపర్యక్షరస్య జనయన్తి"

చింతా–హలంత–24.

వ్యాఖ్య:— శబ్దాన్తరాన్వయే=మరియొక శబ్దముతో నన్వయము గలుగు చుండగా, దీర్ఘాః=దీర్ఘాంతములయిన, ఇద మదసే తద్యత్త చ్ఛబ్దాః=ఈ, ఏ, ఆ–అను శబ్దములు, బహుళం=బహుళముగా, హ్రస్వం=హ్రస్వమును, ప్రపద్య=పొంది, ఉపర్యక్ష

రస్య = మీది యక్షరమునకు, ద్విత్వం = ద్విత్వమును, జనయన్తి = పుట్టించుచున్నవి.

ఉదా:— ఈ + దేశము=ఉద్దేశము; ఏ + దేశము=ఇద్దేశము; ఆ + దేశము = అద్దేశము

ఇక్కడ గమనించవలసిన అంశమేమిటంటే చింతామణికర్త, ఇదం, అదస్, ఏతస్—శబ్దాల్ని ప్రాకృతంలో త్రివిక్రమునివలెనే అనాలోచితంగా ప్రయోగించడం. ప్రాకృతంలో ఆ మూడు శబ్దాలకు ప్రత్యేక విధానముంది. అవి పర్యాయాలే అయినా మూడిటికీ ప్రత్యేకమైన ఉనికి ప్రాకృతంలో కనిపిస్తుంది. కాని తెలుగులో అలా కాదు. తెలుగులో ఆ మూడు పదాలూ కలిసి ఇచ్చే అర్థం ఒక్కటే—'ఈ' అని. అయినపుడు ప్రాకృత వ్యాకర్తవలె ఆ పర్యాయాలు మూడిటినీ సూత్రంలో నిక్షేపించడం అనవసరం. ప్రాకృత వ్యాకరణాల పఠన పాఠన ప్రభావ మెంత బలంగా చింతామణి కర్తమీద ఉన్నదో చూపడానికే ఈ ఉదాహరణ మిచ్చాను.

ఇక, చింతామణి రచనను ఇంతగా ప్రభావితం చేసిన త్రివిక్రముని కాలం గురించి తెలిసికోవాలి. అతడు ప్రసిద్ధ ప్రాకృత వ్యాకర్త హేమచంద్రుని తరువాతివాడు. హేమచంద్రుని సూత్రరచనను అనుకరించినవాడు గూడ. హేమచంద్రుడు 12వశతాబ్దికీ, త్రివిక్రముడు 13వ శతాబ్దికీ చెందిన వ్యాకర్తలని ప్రాక్ పశ్చిమ విద్వాంసులు నిర్ణయించి ఉన్నారు. కాగా 11వ శతాబ్దికి చెందిన మన నన్నయభట్టు ఈ ఆంధ్రశబ్దచింతామణికి కర్త కాజాలడని తెల్లమవుతుంది. ఇక్కడ ఇక "ప్రాచీన పండిత పరంపరాయుతముగా" వినవచ్చే జనశ్రుతి[2] అబద్ధమని తేలిపోయినట్లే. అయినపుడు ఆంధ్రశబ్దచింతామణి నిశ్చయంగా 13వ శతాబ్దికి తరువాత, బహుశః రెండు మూడు శతాబ్దాల అనంతరం వ్రాయబడినదని చెప్పవచ్చు.

## అ ధో జ్ఞా పి క లు

1 విశ్రుతులు హేమచంద్ర త్రివిక్రమాదు
లొనరఁ జూపిరి ప్రాకృతంబునకుఁ ద్రోవ
సంధ్ర భాషయుఁ బ్రాకృతాహ్వాయయ కాన
వలయుఁ దల్లక్షణంబులు వరుసఁ దెలియ.

కా. చూ. మ. 9–8.

2 ఈ జనశ్రుతి ప్రాచీనం కాదని మిక్కిలి అర్వాచీనమని నా సిద్ధాంత వ్యాసం "సంస్కృతంలోని ప్రసిద్ధాంధ్ర వ్యాకరణాలు" (ప్రస్తుతం ముద్రణలో ఉంది)లో నిరూపించాను.

# ఆ మ ని ఈ మే న ని !

## సూ ర్యం

ఎక్కడో నిన్ను చూచాను...
అందాల యింద్రధనుస్సు క్రింద
ఐస్ క్రీమ్ తింటున్నప్పుడు కాదు...
సంజకెంజాయల సాన్నిధ్యంలో
నీ అందం ఆరబోసుకుంటున్నప్పుడు కాదు...

మధ్యతరగతి మందహాసంతో
మరచిపోలేని మండుటెండలో
విధి నిర్వహణలో నిన్ను నీవు
మరచిపోయినపుడు
నీ పరిచయానికై నే పలకరిస్తే
సభ్యతా సంస్కారాలు నాకు
జవాబు చెప్పినపుడు...

చిరుస్వేదంతో...
చిరునవ్వుతో...
అలసిపోయిన నీ వదనంలో
అరవిందాలే విందిచ్చాయి...
అలవిమీరిన ఆశలు లేవని
అందని పళ్ళపై ధ్యాసలు లేవని
వెలవెలబోతున్న నీ వలువలే
వ్యక్తిత్వపు విలువలు చెబుతున్నాయి...
నీ నైర్మల్యపు కనుపాపలే
నా హృదయానికి చూపిచ్చాయి...
నా హృదయంలో గుసగుసలాడాయి...
"ఆమని ఈమేనని
నా మనసాగింది నీ
మొగసాల ముందేనని!"

# చెయ్యే దీపం

తిరగబడుతున్న చేతులు
  ఎదురు తిరుగుతున్న ఆయుధాలు
ఉరకలేస్తున్న జనానికి
ఉప్పెన ముంచుకొచ్చినట్లు.

చేతులెత్తినంత కాలం
చేతులు చప్పట్లు చరిచినంతకాలం
చేతులు రాపిడికి గురికానంతకాలం
నీ అధికారం దేదీప్యమానం.

చేతులు నీ బొమ్మకు ముద్దరేసినంతకాలం
చేతులు పొట్ట బత్తెంకై
నీ ముంగిట్లో చేతులు నలుపుకున్నంతకాలం
చేతులు నీ మాటలకు పూలేసినంతకాలం
నీ పిడికిట్లో ఆయుధాలు వాళ్ళు.

చేతులు వంగి సలాం కొడితే
చేతులు ముడుచుక కూచుంటే
చేతులు భూమికేసి చూస్తుంటే
నీవు ఆడిందల్లా ఆటే.

ఎత్తిన చేతులే ఎరుపెక్కిన గండ్రగొడ్డళ్ళై
ముద్దరేసిన చేతులే ముడిచిన నిప్పు పిడికిళ్ళై
చేతులు ఆయుధాలై, అమరిన పంజాలై

నిన్ను, నీ జాతిని
నామరూపాల్లేకుండా నలిపి పారేస్తుంటే
ఉరకలేస్తున్న జనానికి
ఉప్పెన ముంచుకొచ్చినట్లు.

# చేతులు కలిస్తే

భూమికేసి
  తలను చితక్కొట్టుకుంటున్న చినుకులు
మన చర్యలన్నీ
నుదుటి రాతలైనపుడు
మన చరిత్రంతా
గ్రహాల్లో చిక్కుకున్నపుడు
చినుకులకు బుద్ధిచెప్పి ఏం లాభం ?

వాటి నుదురూ
ఎక్కడో ఓచోట రాయబడిందేగా ?
చినుకులకు గాలి తోడయింది
వానరాళ్ళై భూమిని ఢీకొంటున్నాయి
అయస్కాంతీకరణ శక్తికి అతుక్కుని

కరిగి నీరై పోతున్నాయి
రాళ్ళను తూలనాడి ఏం లాభం ?
వాటి కర్మ అలా కాలబడింది.
ఎక్కడ ఏ ఆవేశం పొంగిందో

పిడుగులు రాలాయి మండుతూ
భూమి కొస చీలింది
పిడుగుల్ని గుటుక్కున మింగి
చీలిన కొసల పూడ్చుకొంది భూమి

గాలిని కట్టుకొని
చినుకులు చినుకులు

రాళ్ళు రాళ్ళు
పిడుగులు పిడుగులు

అన్నీ ఏకంగా దండెత్తాయి.
వేదాంతం మూలబడింది.
వణుకుతూ
ముడుచుకోవడం మినహా
ఎదుర్కోవడానికి
ఏ భూమికీ దమ్ముల్లేవిక.

శ్రీ కె. అంజయ్య

# చీకటి - ఎలుగు

## శ్రీ దుగ్గిశెట్టి వేంకటరమణయ్య

పొద్దు హద్దు మీరి పడమటి కనుమసానువులో పండింది;
    వేడి దొరకరకు కౌగిలి సడలిన నేలనెలత నిట్టూర్చింది;
వెలుగులేని బల్బులు, సద్దదగిన గూళ్ళు;
కాని సరసానికి గునిసే కునికిపాట్లు;
ప్రమిదలో దీపం చీకటికి ఊపిరిపోస్తుంది;
సన్నవెన్నెల స్పర్శకు సన్నజాజి విప్పారింది;
మెత్తని వాసన మెల్లగా సాగుతుంది;
ఆకల్లాడలేదు, ఒకే ఉక్క;
బడలిన శరీరం — కాలుసాచింది — తల దిండును తాకింది;
వెచ్చని పడకను తాకిన వీపు చమట టప్పనపేలింది;
ముసిరే ఉసుళ్ళు, ఆలోచన సుళ్ళు, మనసును గాయపరచే ముళ్ళు;
తూగే కళ్ళు దోమకాపు ములుగర్ర పోటుకు విచ్చినాయి;
చూడని చూపులు;
మసక సంగీతాన్ని చీలుస్తూ గుడిగంటల మ్రోత;
ఎండిన పెదవులు, పిడుచగట్టిన నాలుక, ఎంగిలిని చప్పరిస్తున్నాయి;
ఉన్న కాసిని నీళ్ళను కూజా తాగేసింది
గది మూలల తీరిన మాలల బూజులు;
ఒకనాటి మన్ననల చిహ్నాలు;
మనస్సులో గతస్మృతుల పరిభ్రమణం;
వ్రేలు బూజుల కదలిస్తూ ఒక పురుగు;
నల్లగా కార్బన్ కాగితం లాంటి రెక్కలు;
గది మధ్య తిరుగుతుంది; బూజుకు ఉసురొచ్చినట్లుంది
అసహ్యంగా ఉంది; కార్కోన్న కాలుష్యంలా;
"క్షేత్రజ్ఞం చాపిమాం విద్ధి సర్వక్షేత్రేషు' అని పరమాత్మ ప్రవచనం;
అయినా స్వరూపం స్వభావం భిన్నం;
దీంతో సహజీవనమా! ఛా! ఛా! కూడదు;
దీన్ని బయటకు తోలాలి; అదలించినా పోదే;
ఔరా దీని వేగం; అదలింపులతో వేగం పొంగింది;
తిరిగింది; తిరిగింది, గోడ మూలల తాకింది;
జారింది; అలసి ఒక మూల వ్రాలింది;
దాన్ని వెన్నంటిన చూపులు, దాన్ని అదలించిన చేతులు విశ్రాంతిని కోరినాయి;
కొండెక్కపోయే దీపం పొడుగ్గా నీలిగింది;
వెన్నెలను మ్రింగిన చీకట్లు బలమైనాయి;

మూలను ప్రాలిన చీకటి పులుగు బెదరు కళ్ళతో చూస్తుంది—దగ్గరకు చేరిన ఎర్రటికళ్ళ మొగాన్ని;
భయంతో ఆ పులుగు ఒక్క ఉదుటన లేచింది,
పైకి వంగిన నుదురును కొట్టుకొని క్రింద పడింది, మరల లేచింది;
కిటికీలోంచి, విశాల విశ్వంలోకి, కీచు
కీచు మంటూ ఎగిరిపోయింది చీకటి పులుగు ఎగరలేని, ఎదగని మానసిని వెక్కిరిస్తూ;
జాడ తెలియని తమస్సులో కలిసిపోయింది
దాని ఎలుగు - చీకటి ఎలుగై — ఇప్పటికీ చెవుల్లో గింగురు మంటూంది.

# నిష్క్రమించే విభావరి

సత్య

దిగులుతో దుఃఖంతో
రగిలిపోయే నీ జీవితపు వాకిలిలోనికి
ఈనాడు వసంతం నెమ్మదిగా వచ్చింది.
నీ చుట్టూ చిగురించిన వనం,
నీ ఏకాంత నీరవతను మాయంచేసి
నిన్ను లాలించడానికి
ఎవరో ఎవరో వస్తున్నారు
నిన్నటివరకూ నీ పరధ్యానానికి కారణం వేరు.
ఈనాటి నీ విసుగుకి కారణం వేరు.
రాబోయే చైతన్యోత్సవం కొరకు
ఎదురు చూసే నీ కన్నులలో
ఆలస్యానికై ఎంత అసహనం......
నీ ఉత్సాహాన్ని
నీ ఆనందాన్ని
కోరుకొని తపించిన నాకు
ఇపుడెలా ఉండాలి?
నీతోపాటు నీ ఉత్సవాలలోనికి ప్రవేశించి
నీ జీవితానందానికి అభినందనలు తెలపాలి.

ఎందుకో
నీ వాకిలిలోనికి
రాలేకపోతున్నాయి నా పాదాలు
ఈ పెదవులు, ఈ కన్నులు......ఇవేవీ
నన్ను లెక్కచెయ్యడం లేదు
నీ ఆత్మీయుల మధ్యలో
నన్ను పరాభవం పాలు చెయ్యడానికి కూడ
వెనుకాడడం లేదు
నాదైనదీ, నాకంటూ ఉన్నదీ అయిన
ఆ మనసును
నీ ఆవరణ నుండి ఇప్పుడైనా పరిత్యజించు.
ముగియబోయే
ఈ నాటకానికి మిగిలిన పాత్రను
ఏకైక ద్రష్టను నేనే కదా
నీ శుభజీవన పథానికి
నాంది పలికి, భరత వాక్యంలో
శుభాకాంక్షలను అంతర్లీనము చేసి
నిష్క్రమిస్తాడు ఈ సూత్రధారి.

శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు

# భాస్కర రామాయణ పాఠములు

ప్రాచీన కాలమున వెలసిన రామాయణములలో భాస్కరునిపేర వాసికెక్కిన రామాయణము పరిశోధకులకు బాగుగా పని పెట్టినది. దాని కర్తృత్వము వివాదాస్పదము. దానిని నలుగురు రచించిరా ? ఐదుగురు రచించిరా ? యను ప్రశ్న గ్రంథు లింతవఱకు విడివడలేదు. పరిశోధకులెవరికి నచ్చిన సిద్ధాంతములను వారు, తాము ప్రబలములని నమ్మిన సాక్ష్యములతోఁ జేసిరి. ఈ సందర్భమున ముడులు విప్పఁబోయి యింకఁ గ్రొత్తముడులు వేసినవారు కొందఱు గలరు. కర్తృత్వ నిర్ణయ మొక పెద్ద గందరగోళము. అది యిప్పటి నా ప్రమేయముగాదు. మఱి యీనాఁడు మన చేతికి వచ్చిన భాస్కర రామాయణము స్వస్వరూపముతో నున్నదా ? దానిని బరిష్కరించిన వారి కైవాడ మెంత దానిలో నెలకొన్నది ? ఈనాఁడు ప్రధాన పాఠముగా మనము పరిగణించుచున్న దానిలో నెంతవఱ కర్తృవంత మయిన భాగమున్నది ? ఈ ప్రశ్నములకు, చరమ సిద్ధాంతములు చేయవలయుననను కుతూహలముతోఁ గాక, కేవలము సత్యజిజ్ఞాసతో మాత్రమే సమాధానములు చెప్పఁగోరుచున్నాను. సాపేక్ష మయిన జగత్తులో చరమ సిద్ధాంతములు చేయుట సాధ్యముగాదు — దండిగా మొండితనమున్నప్పుడు తప్ప. కేవల మారణ్యకాండములో నొక సీతాపహరణ ఘట్టము నాశ్రయించి యీ వ్యాసము విస్తరిల్లును.

ఈ ప్రయత్నమున నేను నాలుగు భాస్కర రామాయణ ప్రతులను సంప్రతించితిని. అందొకటి తంజనగరము తేవప్పెరుమాళ్లయ్యగారు పరిష్కరించినట్టిది. మిగిలిన మూఁడును 1923, 1930, 1953 వ సం॥లలో వావిళ్లసంస్థవారు ప్రకటించినట్టివి.

పరిశోధకు లయిన పండిత ప్రకాండులు తాళపత్ర గ్రంథములను, బరిశీలించి చెప్పినదానినిబట్టి నేఁడు మనకు దక్కిన భాస్కర రామాయణము సుపరిష్కృతముగాదని స్పష్టముగాఁ జెప్పవచ్చును. ఈ రామాయణములో నవతారిక లేదు. వావిళ్లవారు వాల్మీకిని ప్రశంసించు నొక మంగళ శ్లోకమును గ్రంథాదిని జేర్చిరి. వారి ప్రతులలో నిప్పట్టున నొక సంగ్రహ రామాయణమున్నది. అది యెక్కడిదో తెలియదు. వావిళ్లవారి రామాయణమునకుఁ బీఠిక రచించిన శ్రీ మేడేపల్లి వేంకటరమణాచార్యులుగారు 1923 వ సం॥ లోనె "మునుపటి ప్రతిలో (అనఁగా వావిళ్లవారు1915సం॥లో ముద్రించిన ప్రతిలో)లేని విషయములు దీనిలోఁ జేర్పఁబడినవి. ఎట్లంటే వాల్మీకి రామాయణమునకు మొదట సంగ్రహ రామాయణమున్నట్లు దీనిలోఁ గూడ నొక సంగ్రహరామాయణము చేర్పఁబడిన"దని వ్రాసిరి. ఈసంగ్రహ రామాయణమును రచించిన వారెవ్వరో యది యే ప్రతులలో నున్నదో వారు చెప్పనే లేదు. మఱి యీనాఁడు భాస్కర రామాయణములో ప్రధాన పాఠముగాఁ జూపినది తాళపత్ర గ్రంథములలోఁ గనఁబడదు. పాఠాంతరములుగాఁజూపినవే తాళపత్ర గ్రంథములలో నున్నవి. ఎఱ్ఱాప్రగడ, కొఱవి సత్యనారన రచించిన రామాయణములలోని పద్యములు భాస్కర రామాయణమున కెక్కినవని పరిశోధకులు నిర్ణయించిరి. వ్రాయసగాండ్ర పద్యములు గూడఁజేరియుండునని చెప్పిరి. భాస్కర రామాయణ రచయితలగు కుమార రుద్రదేవాదులు భాస్కర రామాయణము ఖిలమై పోఁగా, ఖిలమైన భాగములను పూర్తిచేసి, వానిని దమపేరఁ బ్రకటించుకొనిరని నేలటూరి వేంకట రమణయ్య గారు వ్రాసిరి. (చూడు. వాఙ్మయ వ్యాసమంజరి. పారట 233) అది యటుండనిండు.

ఇఁక • నారణ్యకాండమును గూర్చి చెప్పవలసిన పనిలేదు. తేవప్పెరుమాళ్లయ్యగారు దీనిని గూర్చి "...... ఇవి యన్నియు నట్లుండ నారణ్యకాండమున వ్రాఁతప్రతులఁ జూపట్టు పాఠను మిక్కిలియు సంగ్రహముగా నుండ, నచ్చుప్రతులయందలి పాఠ మదేమి కారణమో యంతకంటెఁ జాల నధికముగాను, బెక్కుచోట్ల మిక్కిలియు భిన్నముగాను జూపట్టుచున్నది. కొన్నిచోట్ల వ్రాఁతప్రతుల యొక్క పద్యమునకు నచ్చుప్రతులం బెక్కు పద్యములు చూపట్టుచున్నవి. అచ్చుప్రతులం గానిపించు నధిక పద్యములు గాని, భిన్న పద్యములు గాని మాకు దొరికినన్ని వ్రాఁతప్రతులందును గానరావు. ప్రాచ్య లిఖిత భండార మందలి ప్రతులందుఁ గొన్నిట నవి కానిపించుచున్నవి. ఈ గ్రంథమును దొలుత ముద్రణము గావించిన కరాలపాటి రంగయ్యగారు విస్తృతముగా నున్న పాఠములను గొని ముద్రించిరో తెలియరాదు. ఆరణ్యకాండమునకుఁ గల పాఠము లిట్లు కొన్ని సంగ్రహముగాను, కొన్ని విస్తృతముగాను నుండుటం బట్టి మంత్రి భాస్కరునిదా, హుళక్కి భాస్కరునిదా యని వివాదగ్రస్తమై యున్న యీ యారణ్య కాండపుఁ గవనము మొదలే చాల భాగము బహు కర్తృకముగాఁ దోఁచుచున్న"దని వ్రాసిరి. (చూడు. పీఠిక. పారట 6, 7)

ఈ సందర్భమున వేటూరి ప్రభాకరశాస్త్రిగారు వెల్లడించిన యభిప్రాయములు విస్మరింపరానట్టివి. వారు "ఆనంద ముద్రణాలయము వారి భాస్కర రామాయణ ముద్రణము కొఱకు వారియొద్ద పండితులుగా నుండిన క్రీ.శే. తంజనగిరం తేవప్పెరు మాళ్లయ్యగారు ఆరణ్యకాండమున రెండు భిన్నరచనము లుండుటను గూర్చి కొంత నాతోఁ జర్చించిరి. భాస్కర రామాయణము నందలి యారణ్య కాండమున ప్రధాన పాఠముగా గ్రహింపఁబడిన పద్యము లనేకములు ఏ తాళపత్ర ప్రతిలోను గానరాకుండెను. పాఠాంతరములుగా పుటల యడుగున చిన్నటైపుతో ముద్రింపఁబడిన పాఠములే తాళపత్ర ప్రతులలో

నున్నవి. తొలుదొలుత భాస్కర రామాయణమును ముద్రించిన వారు కరాలపాటి రంగయ్యగారో, నిశ్చింత తేవప్పెరు మాళ్లయ్య గారో యని మే మప్పుడు గుర్తించితిమి. వారే ప్రతులను జూచి అట్లు ముద్రించిరో యెఱుఁగరాదు. కరాలపాటి రంగయ్యగారు గొప్ప కవి. ఆయన కొన్ని ప్రౌఢ గ్రంథములను రచించెను. ఆరణ్య కాండమున ప్రధాన పాఠముగా గ్రహించిన పద్యముల నాతఁడు చేర్చెనేమో యని కూడా మే మప్పుడనుకొంటిమి — తాళపత్ర ప్రతులలో నా పద్యములు కాన రాలేదు కాన'' అని వ్రాసిరి. (చూడు. తెలుఁగు మెఱుఁగులు. పొరట 170, 171)

ఇది యారణ్యకాండ స్వరూపము. దీనిని మంత్రి భాస్కరుఁడు గాని, హుళక్కి భాస్కరుఁడు గాని రచించెనని పరిశోధకులు చెప్పుచున్నారు గదా! వారు రచించిన కాండమ్మైనను యథాతథముగా మనకు లభించినదా? లేదు. అట్టిచో ఈ కాండములో సరిగా లేని పాఠములు కవులవో, వ్రాయస కాండ్రవో, పరిష్కర్తలవో చెప్పలేము. అట్లని యూరకున్నచో అర్థావబోధ యంతరించి, మొదటికే మోస మగును. కాన యున్నపాఠములను ప్రకరణ భంగము గాకుండ సవరించికొనుట మేలు. అదే నేను జేయఁబూనినది.

భాస్కర రామాయణమునకు మాతృక వాల్మీకి రామాయణము. కాని యీ యాంధ్ర చంపూ రామాయణము మూలమునకు యథానువాదము గాదు. మఱి స్వేచ్ఛానువాదము. మూలములోలేని కథ లిందుఁ గలవు. మూల శ్లోకములను యథాతథముగా ననువదించిన చోట్లు, త్యజించిన తావులు నిందున్నవి. మూల శ్లోకార్థములను సంగ్రహముగా స్వీకరించిన ఘట్టములు దీనిలో ననేకములు. ఒక ప్రకరణమునందలి శ్లోకార్థమును మఱియొక తావునకు మార్చిన పట్లు గూడ నున్నవి. ఒక్క యుదాహరణమిత్తును. రావణుఁడు సీతనపహరించెను. ఆ సందర్భమున సర్వ భూతములును ''రాముని భార్యయగు వైదేహిని రావణుడపహరించికొని పోవుచున్నాఁడు. కాన ధర్మము లేదు. మఱి సత్యమెక్కడ? నిష్కాపట్యము, దయయు నెక్కడ?''[1] అని గుంపులు గట్టి విలపించెనని మూలము. ఆరణ్యకాండ రచయిత యీ సందర్భమున ఈ శ్లోకమును వదలెను. ''గగనంబున నాక్రోశించె నఖిల భూతావళియున్'' అని మాత్రమే రచించెను. రావణుఁడు సీతను లంకకుఁ గొనిపోయిన తరువాత, అప్పు డాకాశమున నున్న చారణులు చూచి ''రావణుఁడింతటితో సరి'' యని పలికిరి. సిద్ధులు గూడ నట్లే యనిరి'' అని మూలము.[2] కాని ఆరణ్యకాండ రచయిత భూతములు పలికిన పలుకులు సిద్ధచారణులు పలికినట్లు మార్చి యీ క్రింది పద్యము రచించెను.

కం. ధర్మనిధి యైన రాము స
ధర్మిణి నెత్తికొనిపోయె దశముఖుఁడింకన్
ధర్మంబు మఱి యహింసా
కర్మము నార్జవము తగవు కలవే లంకన్
(ఆరణ్య. పద్య 178)

దీనికి ముందున్న పద్యములో సిద్ధచారణులు ''ఖలుం డలవిమియింకన్ గతాసుఁ డయ్యెడు''నని పలికినట్లు రచించెను. ఇది మూల విధేయమే. భూతములు పలికిన పలుకులు కూడ సిద్ధచారణులే పలికినట్లు రచించుట మార్పనఁదగి యున్నది.

ఆరణ్య కాండము తీరుతెన్ను లిట్లుండును. ఇక దీనిని ముద్రించుటలో దొరలిన దొసఁగులను, అప పాఠములను మనవిచేయుదును. రావణుఁడు సీతకు స్వబల పరాక్రమములను ధీరగంభీరముగా ''సక్రోధంబుగా నవ్వుచు'' వివరించు సందర్భమున వావిళ్ల వారి ప్రతులలో

''పెఱుకుదునే ఫణీంద్రు విష
భీకరదంష్ట్రలు, నేలఁ గ్రుంగఁజే
సఱుతునె, నింగి మ్రింగుదునె,
చండ దిశా గజదండ కాండముల్
విఱుతునె ... ... ... ... ...''
(ఆరణ్య. ఆ 2. పద్య 104)

అని యున్నది. ఇట వాస్తవముగా ''దంతకాండముల్'' అని యుండఁదగును. తేవప్పెరుమాళ్లయ్యగారి ప్రతిలో నిట్లేయున్నది. ఇక్కడ నొక విశేషము కలదు. యుద్ధకాండములో రాక్షసులు రావణునితో ప్రగల్భోక్తులు పలుకునపుడు ఈ పద్యమే యథాతథముగా నున్నది (చూడు. పద్య 60). ఇందు ప్రకరణమునుబట్టి యేకవచనము బహువచనముగా మాఱి ''పెఱుకుదుమే'' యిత్యాదిగా నున్నది. ఈ పద్యములో ''దంతకాండముల్'' అనియే యున్నది. వావిళ్లవారి ప్రతులలోనే యిట్లున్నది. ఆరణ్యకాండము పరిష్కరించినవారు, యుద్ధకాండము పరిష్కరించినవారు వేర్వేరు పండితులా? ఒక పండితుఁడే రెండు కాండములు పరిష్కరించి యున్నప్పటికీ, మానవ సహజమగు ప్రమాదముపాదుకొన్నదని యూహించుచున్నాను. అచ్చు తప్పనుకొనుటకు మూఁడు ముద్రణములలో ''దండకాండముల్'' అనియే యారణ్య కాండముననున్న పాఠము.

రావణుఁడు సీత నపహరించి దక్షిణాభి ముఖముగాఁ బోవుచుండెను. ఈ సందర్భమున సకల చరాచర ప్రపంచమును సీతాపహరణమున కేవిధముగా నాక్రోశించెనో యాదికవి వాల్మీకి యత్యద్భుతముగా వర్ణించెను. ఆంధ్రకవి యీ ప్రకరణమును అలుగోలుగా వ్రాసెనని చెప్పక తప్పదు. అయినప్పటికీ అచ్చుప్రతులలోని పద్యములందు అపపాఠములు చేరినవి. భాస్కర రామాయణ ముద్రిత ప్రతులన్నిటియందును ఈక్రింది పద్యము గలదు.

''సకల మునులు శోకసంతాపములఁ బొంద
నంధకార భరితమయ్యె జగము.
నలువబుద్ధిఁ జూచి నాకారిచే టింక
నిక్కమయ్యె ననుచు నిశ్చయించె''
(ఆరణ్య. ఆ 2. పద్య 147)

మూలమునందలి మూఁడుశ్లోకముల భావమును ఆరణ్యకాండ రచయిత యీ పద్యమునఁ గూర్చెను. మూలములో "సీతకు నిట్టి తిరస్కారము కలిగిన వెంటనే చరాచర ప్రపంచమంతయు కొలఁదులు తప్పి సత్త్వ ప్రకృతి నశించి గాఢాంధకారము గ్రమ్మినట్టులయ్యె"[3] ననియు, "పరామృష్ట, దీనురాలగు సీతను దివ్యదృష్టితోఁ జూచి బ్రహ్మకార్యంబయినదని పలికె"ననియు[4] "దండకారణ్యవాసులగు మహర్షులు సీత రావణునిచే పరామృష్టయగుట చూచి, రావణునకు వినాశము ప్రాప్తించినదని తెలిసికొని, దుఃఖమును సంతోషమును బొందిరి"[5] యనియు వాల్మీకిమహర్షి వర్ణించెను.

తెలుఁగు పద్యము సక్రమముగాలేదు. ఇప్పు డదియున్న తీరును బట్టి యర్థముచెప్పుట క్లిష్టము. మునులు శోకసంతాపములు పొందిరిగదా! జగము అంధకారభరితమయ్యెనుగదా! వాస్తవముగా నీ రెండింటికి సంబంధములేదు. మూలమున అది కానరాదు. కాని తెలుఁగు పద్యము, జగము అంధకారభరిత మగుట యను క్రియ మునులు శోకసంతాపములు పొందుట యను క్రియ ఒకదానితో నొకటి పొత్తు కలిగి యున్నట్టుగా రూపొందినది. లోకమున అంధకారము ఎప్పుడు వ్యాపించెనో "పొందన్" అను క్రియ సూచించు చున్నది. అనఁగా అది భావలక్షణ మయినది. మునులు శోకసంతాపములు పొందుట లక్షణము. జగము అంధకారభరితమగుట లక్ష్యము. మూలమునుబట్టి చూచిన ఈ రెండుక్రియలు పరస్పర నిరపేక్షముగ జరిగినట్లే చెప్పవలయును. అదియునుగాక "శోకసంతాపములు" అను ద్వంద్వపాఠము మూలవిరుద్ధ మగుటయేకాక యొకవిధముగా పునరుక్తి సంకలితమగును. కావున పద్యమునందలి మొదటి రెండు పాదములను

"సకల మునులు శోకసంతోషములు పొంది,
రంధకార భరితమయ్యె జగము"

అని సంస్కరింపఁదగును. ఈ సంస్కారము మూలవిధేయము.

ఈ సీతాపహరణ ఘట్టముననే ముద్రిత ప్రతులన్నిట

పవన చలిత శాఖా ప
ల్లవము లభయహాస చేష్టలం బొనరఁ జెలం
గువిహంగంబులు రుతముల
నవనిసుతను వెఱకు వెఱకు మన్నట్లుండెన్

(అరణ్య. ఆ 2. ప. 149)

అను పద్యము కలదు. "అభయహాస చేష్టలన్" అను పాఠము అర్థశూన్యము. మూలమున శ్లోకార్థము ముచ్చటగా నున్నది. అందు "రావణుని వేగమునఁ బుట్టిన గాలిపాటున చెట్లు తలలు గదల్చుచు, నానావిధ పక్షిధ్వనులతోఁ గూడినవై సీత నూఱడించుటకై భయపడ వలదని పలుకుచున్నట్లు చూపట్టినవి"[6] అని యున్నది. ఇట వృక్షములయందు సాంత్వనోక్తులు పలుకుప్రాణి ధర్మ మారోపితమయ్యెను. చెట్లు గాలికి తలలాడించుట సీత నోదార్చుచున్నట్లున్నది. వాని యందలి పక్షులధ్వనులు ఓదార్పుమాటలు పలుకుచున్నట్లున్నవి.

తెలుఁగు పద్యములో వృక్షములు గానరావు. కాని వాని కొమ్మల చిగుళ్ళు కనఁబడుచున్నవి. పక్షులే చెట్లకు మాఱుగా ఓదార్చుచున్న ట్లున్నది. చిగుళ్ళు "అభయహాస చేష్టల"తో నొప్పుచున్నవఁట! పక్షు లోదార్చుచున్నవఁట! ఈ పద్యమునకు మూలవిధేయముగా సమగ్రముగా, అర్థము చెప్పుకొనవలయునన్న వృక్షములెట్లును అధ్యాహృతములుగాక తప్పదు. కావుననే పద్యము నీ క్రిందివిధముగా సవరింపఁ దగునని సూచించుచున్నాను.

"పవన చలిత శాఖలు, ప
ల్లవము లభయహస్త చేష్టలం బొనరఁ, జెలం
గు విహంగంబు లరుతముల
నవని సుతను వెఱకు వెఱకు మన్నట్లుండెన్"

ఈ సవరణమునుబట్టి సీతాదేవిని వృక్షములే భయపడవలదని యోదార్చుచున్నట్లగును. అవి గాలికిఁ గదలుచున్నవి. కదలునపుడు వాని కొమ్మల చిగుళ్ళు అభయ హస్తముద్ర పట్టినట్లున్నవి. చేతులను చిగుళ్ళగా, చిగుళ్ళను చేతులుగా వర్ణించుట కవిసంప్రదాయమే. వృక్షము లెట్లులోదార్చుచున్నవని ప్రశ్నింతురేని, పక్షుల ధ్వనుల రూపముననని సమాధానము. పక్షులు ధ్వనులుచేయుట, వృక్షములు పలుకుట. ఈవిధముగా మూలవిధేయమయిన సమగ్రత తెలుఁగు పద్యమునకుఁ గలుగును. ప్రాజ్ఞులే దీనికి ప్రమాణము.

అన్ని యచ్చుప్రతులలో నున్న యీ క్రిందిపద్యము విచిత్రముగా నున్నది. ఈ పద్యమును జదివినచో, భాస్కర రామాయణము కొన్నిపట్టులలో నెంతగా సంస్కారము నపేక్షించుచున్నదో తెలియును.

"రమణీయ హేమరుచి వి
భ్రమయగు నల సీతచేత రావణుఁ డొప్పెం
గమనీయ కనక కక్ష్యం
గొమరారుచు నున్న భూరికుధరము పగిదిన్"

"భూరికుధరము" అనునది అసహ్యమైన పాఠము. ప్రకరణమునకుఁ దగనట్టిది. వాల్మీకి రామాయణములో "చిగురుబోడి యగు సీతాదేవి నీలదేహుఁడగు రావణుని జేరి, నడుమునకుఁ గట్టిన బంగారు మోకు ఏనుఁగును వలె ప్రకాశింపఁజేసెను"[7] అని యున్నది. ఈ సందర్భమున గోవిందరాజు "నడుమునకుఁ గట్టిన మోకు ఏనుఁగును పొంది, మావటివానిచే దానిని నిగ్రహింపఁ జేయును. అట్లే సీత రావణుని జేరి రామునిచే వానిని నిగ్రహింపఁ దగినవానినిగాఁ జేసిన"[8] దని వ్యాఖ్యవ్రాసెను. రావణునకు చావుమూడినదన్నమాట.

మూల శ్లోకమునందలి "కక్ష్య" అను పదమే పద్యము నందున్నది. కక్ష్య యనఁగా ఏనుఁగు నడుమునకుఁ గట్టు మోకు. "దూష్యా కక్ష్యా వరత్రా స్యాత్" "కక్ష్యా ప్రకోష్ఠే హర్మ్యాదేః కాఞ్చ్యాం మధ్యేభ బన్ధనే"యని యమరము చెప్పుచున్నది. గోవిందరాజు సైతము "కక్ష్యా ఇభబంధనీ" యని వ్రాసెను. కక్ష్య కీయర్థమున్నప్పుడు "భూరికుధరము పగిదిన్" అను పాఠము సమంజస మగునా? ఇది బోడితలకు మోకాలికి ముడిపెట్టినట్లుండును. కాన

పద్యములో నాల్గవ పాదము చివర "భూరి కుంజరము గతిన్" "భూరి కుంజరముక్రియన్" ఇత్యాదిగా నుండక తప్పదు. కుధర మనఁగా కొండ. ఏనుఁగు నడుమునకుఁ గట్టు మోకుతో కొండకు ఏమాత్రము పొత్తు కుదురదు. ఏనుఁగు అను అర్థము గల పదమే యిట యుండఁదగును. కావుననే యతి దప్పని కుంజర పదమును సూచించితిని.

రావణుఁడు లంకాభిముఖుఁడై పోవునపుడు, సీతాదేవి "వెచ్చ నూర్చి రోషావేశంబున" నాతని నుపాలంభించును. ఇప్పట్టున ముద్రిత ప్రతులలో నీ క్రింది పద్యమున్నది.

"జములోకంబున కేఁగుచోఁ గనెదు యు
ష్మత్కంఠముల్ కాల పా
శములం గట్టి ప్రచండభంగిఁ దిగువన్
క్షారామ్ల కల్లోల సం
ప్రభవ వద్వైతరణీ తరంగిణిని, దు
ర్దాంతాసి పత్రాటవీ
సముదాగ్రాయస కంటకోగ్ర కనకాం
చచ్ఛాల్మలీ వృక్షమున్" (ఆర. ఆ2. పద్య 171)

నరకము చేరుదువని వైదేహి రావణుని దూషించుచు, నతఁ డక్కడఁ జూడఁబోవు దృశ్యములను వర్ణించుచున్నది. మూలరామాయణములో "రావణా! భయంకరమై రక్తప్రవాహముతోఁ గూడిన వైతరణీ నదిని, భీకరమైన యసిపత్ర కాననమును జూడఁగలవు"[9] అనియు, "తప్తకాంచన పుష్పములు, వైడూర్య పర్ణములు, ఆయసకంటకములు కలిగిన శాల్మలీ వృక్షమును జూడఁగలవు"[10] అనియు నారక దృశ్యవర్ణనను కొనసాగినది.

వైతరణీనది రక్త ప్రవాహముతోఁ గూడినట్టిది. కాని పద్యములో "క్షారామ్ల" అని యున్నది. ఇట క్షారశబ్దము విశేషణము దానికి ప్రసవించునదని యర్థము. మూలశ్లోకమునందలి "నివాహినీం" అనుదానికి సమానముగా కవి ప్రయోగించినట్టిది. గోవిందరాజు "నివహతి ప్రవహతీతి తథా" అని చెప్పెను. మఱి 'అమ్ల' శబ్దము పద్యములో నున్నది. దీని యర్థమిట కుదురదు. మూలములో "రుధిరౌఘ" అని యున్నది. దానికి రక్తప్రవాహమని యర్థము. కాన పద్యములో రక్తపర్యాయ శబ్దముండవలయును. ఆమ్లము రక్త పర్యాయశబ్దము గాదు. అస్రము రక్తపర్యాయ శబ్దము. కావున "క్షారాస్ర" అని యుండఁదగును. మూల శ్లోకమునందలి వైడూర్య పర్ణములు, హేమపుష్పములు ననువాదమునఁ గానరావు. కేవలము కనక శబ్దము మాత్రము ప్రయుక్తమయినది. ఈ రామాయణ కవుల యనువాదమును బట్టి పరికించినచో, ఈ పద్యము నింకను మాతృకానుసారముగా సవరించుట వ్యర్థప్రయత్నమగును.

మొదలిరామాయణ కవులు స్వేచ్ఛగా వాల్మీకి రామాయణమును దెలిఁగించిరని విన్నవించితిని. నా సూచించిన సవరణలు మూల శ్లోకార్థములు యథాతథముగా ననువాదమున నుండఁదగునను తలంపుతోఁ జేసినవి గావు. మఱి యనువాదము నందలి పద్యములు ప్రకరణోచితముగా రూపొందవలసియున్నదను సంకల్పముతోఁ గావించినట్టివి. ఉన్న పద్యములను సంస్కరించుటకు మూలము ననుసరింపక తప్పదు. విద్వాంసులిది గ్రహింపఁ గలరు.

## ఆధోజ్ఞాపికలు

1 నాస్తి ధర్మః, కుతస్సత్యం, నాఽఽర్జవం నాఽనృశంసతా
యత్ర రామస్య వైదేహీం భార్యాం హరతి రావణః ఇతి
సర్వాణి భూతాని గణశః పర్యదేవయన్ (ఆరణ్యా. సర్గ 52. శ్లో 41)

2 అంతరిక్షగతా వాచ స్ససృజు శ్చారణా స్తదా
ఏ తదంతో దశగ్రీవ ఇతి సిద్ధా స్తదాఽబ్రువన్
(ఆరణ్యా. సర్గ 54. శ్లో 10)

3 ప్రధర్షితాయాం సీతాయాం బభూవ సచరాచరం
జగత్సర్వ మమర్యాదం తమసాఽంధేన సంవృతం
(సర్గ 52. శ్లో 11)

4 దృష్ట్వాసీతాం పరామృష్టాం దీనాం దివ్యేన చక్షుషా
కృతం కార్యమితి శ్రీమాన్ వ్యాజహార పితామహః
(సర్గ 52 శ్లో 13)

5 ప్రహృష్టా వ్యథితా శ్చాఽఽసన్ సర్వే తే పరమర్షయః
దృష్ట్వా సీతాం పరామృష్టాం దండకారణ్య వాసినః
రావణస్య వినాశంచ ప్రాప్తం బుద్ధ్వా యదృచ్ఛయా
(ఆర. సర్గ 52. శ్లోక 14)

6 ఉత్పన్నవాతాభిహతా నానాద్విజగణయుతాః
మాభై రితి విధూతాగ్రా వ్యాజహ్రు రివ పాదపాః
(ఆరణ్యా. సర్గ 52. శ్లో 36)

7 తరు ప్రవాళరక్తా సా నీలాంగం రాక్షసేశ్వరం
ప్రాశోభయత వైదేహీ గజం కక్ష్యేవ కాంచనీ
(సర్గ 52. శ్లో 27)

8 యథా కక్ష్యా గజగతా గజం యంతు ర్నిగ్రాహ్యాం కరోతి తథేయమ్
రావణం ప్రాప్య రామనిగ్రాహ్య మకరో దితి భావః

9 నదీం వైతరణీం ఘోరాం రుధిరౌఘ నివాహినీం
అసిపత్రవనం చైవ భీమం పశ్యసి రావణ
(సర్గ. 53. శ్లో 19)

10 తప్తకాంచన పుష్పాంచ వైడూర్య ప్రవరచ్ఛదాం
ద్రక్ష్యసే శాల్మలిం తీక్ష్ణా మాయసైః కంటకై శ్చితాం
(శ్లో 20).

# జీవితం!

జీవితం అనిర్వచనీయ నిర్వచనం!
భాష్యం చెప్పలేని పారదర్శిక భావనా విలసనం!

కాళిదాసు కావ్యరస శాలలోని
వెన్నెల సోన జీవితం!
విధి అనే శకారుని పుష్పవనంలోని
వసంతసేన — జీవితం!

అనంత మధురాను భూతుల సముద్రాలను
తనలో దాచుకున్న బుద్బుదం!
శతకోటి చేదు అనుభవాల కెరటాలను
తనలో కలుపుకున్న సముద్రం!

సమస్త విలాసవస్తు సమన్వితమైన
అంతులేని ఎడారి జీవితం!
ఎడారిలో; తీరని పిపాసతో అలమటించే పాంథునికి
వింతగా సాక్షాత్కరించే ఒయాసిస్సు–జీవితం!

అపరిమిత వేగంతో దూసుకు పోయే
గమ్యం లేని పరుగు జీవితం!

ఆకాశించే ఇంద్రధనుస్సు ఎదుటనే వున్నా
అడుగు కదపలేని 'నిస్సహాయత' జీవితం!

శృంగారం కనుగొనల లోంచి స్రవించే
శోకరసం జీవితం!
శోకం పెదవులపై విలాసంగా నర్తించే
దరహాసం జీవితం!

కోడె ప్రాయపు కోర్కెలు పడగ విప్పే
అందమైన పుట్ట — జీవితం!
కష్టసుఖాల రెక్కలు అల్లార్చుతూ
ఏ తీరాలకో ఎగిరే పిట్ట—జీవితం!

వెన్నెల కావడిలో వ్రేలాడే
చీకటి కుండలు — జీవితం!
చీకటి కుండలో చిందులేసే
వేకువ వెన్నముద్ద — జీవితం!

జీవితం అనిర్వచనీయ నిర్వచనం......
భాష్యం చెప్పలేని పారదర్శిక భావనా విలసనం ... ... !

# రణయజ్ఞం

1

శైశవం 'లివర్ల'ను పోషిస్తే
బాల్యం చెత్తకుండీలకు అంకితమైతే
కౌమారం హోటళ్లలో ఎంగిలిప్లేట్లు కడుగుతుంటే
యవ్వనం నిరుద్యోగాన్ని ప్రేమతో కౌగిలిస్తే
అందీ అందని వెలుగు అందంగా దగా చేస్తుంటే
అందమైన చీకటి వ్యసనంలా కమ్ముతుంటే
ఆ ట్రాన్స్‌పరెంట్ బతుకులో
ఆ మాయ మంచు పొరలలో
ఏం వెతుక్కుంటావ్ ?
ఏ దారి ఎన్నుకుంటావ్ ?

2

నాగళ్లను సిలువలుగా మోస్తున్న ఏసులకు
ఏ పునరుత్థానం ఆశపెడతావ్ ?
జనపదాలు విడిచి రాక్షస నగరాలకు పాకుతున్న
ఆశకు ఏ ఆధారం చూపెడతావ్ ?
మరల కోరల్లో చిక్కుకున్న జీవచ్ఛవాలకు
ఏ పునర్జీవితం దొరుకుతుంది ?
ఫుట్‌పాత్‌ల మీద యింకా ఆరని మూల్గులకు
ఏ నాగరిక హృదయం కరగుతుంది ?

3

నీ రెక్కల కష్టంతో వాడి అంతస్తులకు రెక్క
లొస్తుంటే
నీ ఆడబడుచు పడుచుమేను వాడు పొడుచుకు
తింటుంటే
నోట్ల బలంతోటి నీ నోరు మూయిస్తుంటే
అడుగున పడివున్న నీ మీంచి వాడి అహం పైకి
లేస్తుంటే

ఏ చీకటికి మొరపెట్టుకుంటావ్
యింత వెలుగు ప్రసాదించుమని ?
ఏ కాటికి పరుగెట్టుతుంటావ్
యింత చోటు మిగిలించుమని ?

4

మేధావుల మెదడు పుస్తకాల్లో సమాధి అవుతుంటే
వినాయకులు పదిలంగా గద్దె పొదివి పట్టుకుంటే
అరాచకం పట్లిగ్గా అందల మెక్కుతువుంటే
అవినీతికి ఘనంగా కనకాభిషేకం జరుగుతుంటే
ఆ సంరంభంలో ఆ కోలాహలంలో
నీ దారిద్ర్య పరిరంభం—జీవన హాలాహలం
ఎవడు పట్టించుకుంటాడు ?
ఎనలేని సుఖాల్లో మునిగి తేలుతూ
ఎందుకు విసుగు పుట్టించుకుంటాడు ?

5

ఎవడి క్కడుపు నొప్పివస్తే
వాడు మందు తినాలనేది ఆర్యోక్తి
కడుపు మండి నోళ్ళంతా
కలిసి ఎదురు తిరగాలనేది యిప్పటి సూక్తి.
అందుకే అన్నలారా !
వ్యవధి లేదు ప్రతి యొక్కడు కార్చిచ్చై కదలండి!
అవధి లేదు మీ శక్తికి; రణయజ్ఞం చేయండి !
అవినీతి అరాచకం
అధికారం అజ్ఞానం
పదవీ నిష్ఠా, ధనపిపాస
రణయజ్ఞం అగ్నిలోన ఆహుతి కాగా
సమ సమాజం స్థాపించుదాం—
మన లోకం నాకం కాగా !

శ్రీ దిలావర్

# సంధ్యాగీతం

## జలసూత్రం పద్మావతి

సాయంత్రం
వాహ్యాళికని బయలుదేరాను
రోడ్డు పక్కన
తెల్లని కాకర పువ్వొత్తుల్ని పట్టుకున్న పున్నాగచెట్లు
ఎలక్ట్రిక్ తీగలపై కూచొని
'శబ్ద దీపా'ల్లా వెలిగిపోతున్న పిచ్చుకలూ
నా నిశ్శబ్ద 'దీ'పాలై,
అక్షరాలై, శాశ్వతాలౌతున్నాయ్.
ఓపక్క
పశ్చిమాన నిష్క్రమిస్తున్న 'ఎర్రరథాని'కి
మేడలెక్కి వీడ్కోలిస్తున్న మేఘాలూ
మరోపక్క,
రెపరెపలాడుతూ, ఉర్రూతలూగించే ఎర్రని 'ప్రవాహపు చీర'
ఆకాశమంతా, అన్నివైపులా
సుగంధం నింపుతున్న ఓ 'అజ్ఞాతకంఠం అగరొత్తి'—
అబ్బ!
ఎన్నెన్ని ఘన సౌందర్యాల ఆనందాల కలయిక ఈ సంధ్య!!
నా గుండెనిండా నింపుకోనీ, ఈ వెలుగుల సంధ్యను
నల్లని కష్టాలొచ్చినప్పుడు
'రేడియమ్' నై వెలగటానికి!

# కవిత

### శ్రీ జెట్టిగుండ్ల రఘునాథరెడ్డి

నువ్వెప్పుడూ నాతో వుంటుంటావు
నిన్నెప్పుడూ నాలో కంటుంటాను
నువ్వెవరివి ?

ఎవ్వరూ లేక వొంటరిగా
సవ్వడి లేని గదిలో కూర్చొని
దేన్నో గురించి పరితపిస్తుంటే
నీకు నీవుగా వొస్తావు
నా బాధని పంచుకుంటావు
నా హృదికి వూరటనిస్తావు.
నువ్వెవరివి ?

నిద్రలేక నిశీధిలో
విసుగూ విరామం లేకుండా ఆలోచించుకుంటుంటే
ముసుగులో జరిగే ఘోరాల్ని నెమరేసుకుంటుంటే
గుండెలో కొట్టుకులాడే ఆవేదనని
వెలికి తీసి విశ్వానికి అందిస్తావు
విశ్రాంతి నిస్తావు
నువ్వెవరివి ?

అనంత స్వరూపంతో
అమృత హృదయంతో
సతతం సెలయేరులా
నాలో ప్రవహిస్తుంటావు
నువ్వెవరివి ?

రసమయ కావ్య పఠనాజగత్తులో
రసావేశం చెందిన తన్మయత్వంలో
నవరస భావాలొలికించి—నన్ను
కువ కువ లాడిస్తావు
నువ్వెవరివి ?

నిరంతర జీవన ప్రయాణ పథంలో
అలసి సొలసి బెగ్గడిల్లిన నన్ను
మరో లోకానికి తీసుకెళ్లి
మేనకలా నృత్యం చేసి
ఆనంద డోలికల్లో వోలలాడిస్తావు
నువ్వెవరివి ?

ఎవరు విడిపోయినా
నన్నెప్పుడూ వీడిపోక నీడలా వుంటావు
ఎవరు ఏమన్నా
నువ్వేమనవు సరికదా, రవ్వలనవ్వులు చిందిస్తుంటావు
ఏది వాడిపోయినా
నువ్వు నాలో పారిజాతంలా గుబాళిస్తుంటావు
నువ్వెవరివి ?

ఓహో తెలిసింది
నువ్వు అక్షర కుక్షివి గదూ ?
నిరక్షర కవికి ప్రత్యక్ష దైవానివి కదూ ?
మృదు మధురమైన భాషలో 'కవిత'వి గదూ ?



# శ్రీ శంకరాచార్య భాష్యసహిత విష్ణు సహస్రనామమ్

[భాష్యము ననుసరించి ఆంగ్లానువాదము : ఆర్. అనంత కృష్ణశాస్త్రి; సైజు : డెమ్మీ; పుటలు (ఉపోద్ఘాతము) 30+475 ప్రచురణ : ది అడయార్ లైబ్రరీ అండ్ రీసర్చ్ సెంటర్, మదరాసు, 1980; వెల : తెలియదు]

భారతదేశము పుణ్యభూమి.[1] భారతీయులు ఆధ్యాత్మిక చింతనము కలవారు. కాన ధర్మార్థకామమోక్షములనెడి పురుషార్థములను సాధించుటకు ప్రతి భారతీయుడు ప్రయత్నించును. ధర్మార్థ కామములను సాధించి మోక్షసామ్రాజ్యము నధిష్ఠించుటకు ప్రయత్నించును. మోక్షప్రాప్తికి సాధకుని శక్తిసామర్థ్యముల ననుసరించి కర్మ, భక్తి, జ్ఞానమార్గములు సూచింపబడినవి. ఇందు జ్ఞానమార్గము పరమోత్కృష్టము, కాని దీనినవలంబించుట మిక్కిలి కష్టము. సర్వకర్మ ఫల సన్యాస మొనరించి సతతము పరమేశ్వరుని ధ్యానించుచు పరమేశ్వరుని యందే భక్తి కలిగియుండువారికి మోక్షము సులభసాధ్యము. మాయామయము కష్టమయమైన ఈ సంసార బాధలను తప్పించుకొనుటకు, ప్రాపంచిక సుఖములను పొందుటకు పరమేశ్వరుని దివ్య నామములను, రూపములను, లీలాకార్యములను కీర్తించుచు మోక్ష ప్రాప్తికి భగవద్భక్తు లెందరో తాము. తరించుటయేగాక నితరులను కూడ తరింపజేయుటకు భగవత్సాన్నిధ్యము చేరుటకు భక్త్యావేశమున భగవానుని స్తుతించుచు వివిధ రీతులలో స్తోత్రములను రచించిరి. వ్యయప్రయాసలతో భ్రమప్రమాది దోషములతో కూడిన వ్రతాదులను, యజ్ఞయాగాదుల నొనరించుట కంటే భక్తిసులభుడైన పరమేశ్వరుని వాగ్రూపమున స్తుతించి యాతని కృపాకటాక్షముచే ముక్తినొందుట సుకరము. సర్వజనులకును నందుబాటులో నుండును. కావుననే భక్తులెందరో తమ తమ ఇష్టదైవములను స్తుతించుచు స్తోత్రములను రచించిరి. ఈ స్తోత్రము లనంత సంఖ్యాకములగుటచే స్తోత్రవాఙ్మయము ప్రత్యేకశాఖగా సంస్కృత సాహిత్యమున వెలసినది. ఈ స్తోత్ర వాఙ్మయమును నిశితముగా పరిశీలించినచో అనాదిగా భారతదేశమున నున్న యారాధనా పద్ధతులు, భక్తితత్త్వము, దాని సంప్రదాయములు దానినాధారము చేసికొని బయలుదేరిన మతములు మొదలగు విషయములు తెలియును.

మానవుడున్నత స్థితికి చేరుటకు మూడు దశలు సూచింపబడినవి. అందులో మొదటిది ప్రతిమాపూజ; రెండవది జపస్తోత్రాదికము, ఇది మధ్యమము; మూడవది 'సోఽహం భావము' (నేనే పరమాత్మను అనెడి భావము)తో చేయు మానసిక పూజ. ఇది ఉత్తమమైనది.

ప్రథమా ప్రతిమా పూజా, జపస్తోత్రాణి మధ్యమా,
ఉత్తమా మానసీపూజా, సోఽహం పూజోత్తమోత్తమా॥

బాహ్యపూజల వలన, జపస్తోత్రాదికముల వలన చిత్తైకాగ్రత, చిత్తశుద్ధి కలిగిన భక్తుడు మానసిక పూజతో 'సోఽహం భావము' నలవఱచుకొని పరమేశ్వర సాయుజ్యమును పొందును. తెలిసియో తెలియకయో పరమేశ్వరుని నామములుచ్చరించుట వలన పాపములు నశించునని శ్రీమద్భాగవతము[2] నుడువుచున్నది.

అజ్ఞానదథవా జ్ఞానాదుత్తమ శ్లోకనామ యత్,
సంకీర్తనమఘం పుంసో దహేదేధో యథానలః॥

యజ్ఞములలో జపయజ్ఞము యుత్తమమనియు తను జపయజ్ఞమనియు శ్రీకృష్ణుడు గీతలో[3] వచించెను.

మనస్సు, వాక్కు, దేహములతో భగవాను నారాధించుటయే భక్తి. వాగ్రూపమున వెలసిన భక్తికి స్తోత్రమని పేరు. ఇంతకు మునుపే చెప్పినట్లు ఇది నవ విధ భక్తులలో నొకటి. స్తోత్రమునకు ఆరు లక్షణములు కలవని చెప్పుదురు.[4]

నమస్కారస్తథాశీశ్చ సిద్ధాంతోక్తిః పరాక్రమః,
విభూతిః ప్రార్థనం చేతి షడ్విధం స్తోత్ర లక్షణమ్॥

నమస్కారము చేయుట, ఆశీర్వదించుట, తాను చెప్పదలచుకొన్న సిద్ధాంతమును ప్రతిపాదించుట, పరమేశ్వరుని యద్భుత పరాక్రమమును, ఐశ్వర్యమును వర్ణించుట, ప్రార్థనచేయుట యనునవి యారును స్తోత్రలక్షణములు. సర్వదోషములకు నిధియైన కలికాలమున కొక సుగుణము కలదు. అదేమన శ్రీహరినామ సంకీర్తనము వలన మానవుడు సర్వపాప విముక్తుడై[5] పరమపదమును పొందును. కృతయుగములో ధ్యానమువలనను, త్రేతాయుగములో యజ్ఞాదుల నాచరించుటచేతను, ద్వాపరయుగములో అర్చనాదులవలనను కలుగు ఫలము కలియుగమున శ్రీహరి నామోచ్చారణ మాత్రముననే కలుగునని చెప్పుటచే నామసంకీర్తన ప్రాశస్త్యము గడింపబడినది. కలియుగమున మోక్షప్రాప్తికి శ్రీహరి నామస్మరణము తప్ప మఱొకటి లేదని బృహన్నారదీయ పురాణము[7] నుడువుచున్నది.

భగవానుడొక్కడే కాని భక్తులు ఎవరికితోచిన విధముగ నేరూపములో[8] స్తుతించినను భగవానుడు వారికి స్థిరశ్రద్ధను ప్రసాదించి వారి నుద్ధరించును. భక్తుడు స్తోత్రములచేత తన యారాధ్య దైవముతో నైక్యమును పొందగోరును. స్తోత్రమును

రచించుట నవవిధ భక్తులలో నొకటని భాగవతము[9] నుడువుచున్నది.

స్తుతి, స్తోత్రము అనునవి సమానార్థకములు.[10] ఇవి వివిధ దేవతలను పొగడుచు ఆయా భక్తులు భక్తిపారవశ్యమున వ్రాసిన భక్తి సూచక శ్లోకములు లేక నామ సమూహములు. స్తోత్రములు రెండు విధములు. అందొకటి పరమేశ్వరుని యనంత కల్యాణ గుణగణములను, దయాకార్యములను, అద్భుతలీలా వినోదములను, పరాక్రమమును విరివిగా శ్లోకరూపమున వర్ణించు ప్రశంసా స్తోత్రములు ఈ కోవకు చెందినవే. శ్రీ శంకరుల ఆనందలహరి, శివానందలహరి, శివపాదాది కేశాన్తస్తుతి, కులశేఖరాళ్వారుల ముకుందమాల మున్నగునవి. రెండవది పరమేశ్వరుని గుణగణములను సూక్ష్మముగా వచించు నామస్తోత్రములు. వీటిలో అష్టోత్తర శతనామ స్తోత్రములు, త్రిశతి, సహస్రనామస్తోత్రములు మొదలగునవి కలవు. లక్ష్మి, కృష్ణ, రామాది దేవతల యష్టోత్తర శత నామములు, లలితాత్రిశతి, లలిత, శివ,విష్ణు సహస్రనామ స్తోత్రములు మొదలైనవి వీటికుదాహరణములు. ఈ రెండు విధములైన స్తోత్రములు మనకు రామాయణ, మహాభారత, పురాణములలో లభించుచున్నవి. ఇందు తపోధనులు, జ్ఞానులు, పరమాత్మ సాక్షాత్కారము బడసిన ఋషులు మున్నగువారు ఆయా సందర్భములలో తమ్మాశ్రయించిన భక్తాదుల ననుగ్రహించుటకొఱకు ఆయా దేవతల నారాధించు క్రమమును, స్తోత్రములను యుపదేశించి భావిలోకమునకు మహోపకార మొనర్చిరి. అవియే మన పురాణేతిహాసఆగములలో పేర్కొనబడి భారతీయుల మనః ఫలకములలో ననాదిగా లిఖింపబడి నేటికిని పఠన పాఠనములలో నున్నవి. శ్రీ రామాయణాంతర్గత ఆదిత్య హృదయస్తోత్రము, భారతాంతర్గత శివ, విష్ణు సహస్రనామ స్తోత్రములు, శ్రీ భాగవతమునందలి గజేంద్ర మోక్షము మొదలగువాటి నెన్నింటినో భక్తులు నేటికిని ప్రతిదినము పారాయణము చేయుచు నభీష్టముల బడయుచున్నారు.

అట్టి స్తోత్రములలో నతిముఖ్యమై స్తోత్రరాజమనిపించుకొను శ్రీ మద్విష్ణు దివ్య సహస్రనామ స్తోత్రమును కోట్లకొలది హైందవులు నిత్యము పఠించుచు నైహికాముష్మికముల బడయుచున్నారు. ఇప్పుడు మనకుపలభ్య మానమగునవి మూడువిధములైన విష్ణు సహస్ర నామస్తోత్రములు. అందొకటి శ్రీ మహాభారతము నందలి అనుశాసన పర్వములో లభించునది. రెండవది గరుడ పురాణము[11] లోనిది. మూడవది పద్మ పురాణములోనిది.[12] ఈ మూడింటిని వ్యాసుడే రచించినను వాటి నుపదేశించినవారు, ఉపదేశము నొందిన భక్తులు భిన్నులు. శ్రీ మహాభారతాంతర్గత విష్ణు సహస్ర నామమును భీష్ముడు యుధిష్ఠిరున కుపదేశింపగా గరుడ పురాణములోని సహస్రనామ స్తోత్రమును శ్రీహరి రుద్రునికి, పద్మపురాణములోని స్తోత్రమును మహాదేవుడు తన సతి పార్వతి కుపదేశించెనట. కాని ఈ మూడింటిలో నతి ప్రాచీనమై, ప్రసిద్ధమై శ్రీ శంకర భగవత్పాదుల, పరాశర భట్టాదులచేత వ్యాఖ్యానింపబడి బాలురు, వృద్ధులు, స్త్రీలు—వేయేల వర్ణ, లింగ వివక్షలేక నిత్య పారాయణములో నున్నది భారతాంతర్గతమైనదే.మిగతా రెండు స్తోత్రములు అప్రసిద్ధములు కానచాలమందికి వాటిఉనికియే తెలియదు,నిత్యపారాయణములో లేవు, వాటికి వ్యాఖ్యానములు కూడా లభించుటలేదు. సర్వజనామోదము, బహుళ ప్రశస్తి, గౌరవములు శ్రీ భారతములోని సహస్రనామమునకే కలవు. దీని మహిమను క్రీ.శ. 6—7 శతాబ్దములకు చెందిన బాణభట్టు[3] తన 'కాదంబరి'లో విలాసవతి యను రాణికి జన్మించిన బాలకుని రక్షణ కొఱకు సూతికాగృహ సమీపములో విప్రవర్యులు నాను సహస్రమును పఠించుచుండిరని నుడువుటచే ఈస్తోత్ర ప్రాశస్త్యము ప్రాచీన కాలమున నుండియే మనవారి కవగతమైనట్లు తెలియుచున్నది. మహాజ్వరములను పోగొట్టుటకు విష్ణుసహస్రనామ పారాయణ మొనరింపవలెనని ఆయుర్వేద వైద్య గ్రంథములు[14] నుడువుచున్నవి. నవగ్రహములచే నాయాదశలలో మానవులకు సూచింపబడిన అరిష్టములను అనిష్టములను బాపి శాంతికరముగ శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మొనరింపవలెనని జ్యోతిష గ్రంథములుద్ఘోషించుచున్నవి. దీని మహిమ ''కలి సంతారణో పనిషత్తు'' నందిట్లుగ్గడింప బడినది.

హరేరామ హరేరామ రామ రామ హరే హరే,
హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే॥

అను నామ మంత్రము కలిదోషముల నన్నింటిని పోగొట్టునని ద్వాపర యుగమున బ్రహ్మదేవుడు నారదునితో చెప్పెను. నారాయణ మంత్ర జపము వలన సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్యము లనెడి మోక్షదశలు నాలుగును సిద్ధించునని ఈ యుపనిషత్తు నందు చెప్పబడినది.

శ్రీవిష్ణు సహస్రనామమునకు మహామంత్రమని పేరు. ఇందలి వెయ్యి నామములను లేక నొక్క నామము నుచ్చరించుటను గూడ జపమందురు. ఈ జపమును మించిన యనుష్ఠానము లేదు. 'హరి' యను రెండక్షరములు జపించిన మాత్రముననే సమస్త కష్టములు, పాపములు నశించి సకల శుభములు శ్రేయస్సు కలుగుననిశాస్త్రములుచెప్పుచుండగా నొక్కొక్క సమయమున నెన్నితూర్లు జపముచేసినను ఫలసిద్ధి కలుగకుండును.దీనికి కారణము మంత్రానుష్ఠానమునందేర్పడు నామాపరాధములు, అనగా జపము చేయుటలో నేర్పడు దోషములు లేక యపరాధములు. ఇవి పదియని పద్మపురాణములో చెప్పబడినది.[15] అవి 1) సాధు జనులను దూషించుట 2) శివ విష్ణువులమధ్య భేదము కల్పించుట 3) పరమాత్మ గుణముల నగౌరవ పరచుట 4) వేదములు, శాస్త్రములు నిరర్థకములని నిందించుట 5) పరమాత్మ నామముల యొక్క యుత్కృష్టతను, మాహాత్మ్యమును అతిశయోక్తిగా తలంచుట 6) పరమేశ్వరుని నామములన్నియు ఊహాకల్పితములనుట 7) నామజపము చేయుచుంటిమి కాన పాతకములన్నియు నశించునను ధైర్యముతో నిచ్ఛాపూర్వకముగా పాపములు జేయుచు విహిత కర్మలను ధర్మము నాచరింపకుండుట 8) భక్తి శ్రద్ధలులేని వారికి నామజపముపదేశించుట 9) దానగుణము నలవరచుకొనక పోవుట 10) అహంకార మమకారములచే నియంత్రింపబడుట. ఈ దోషములన్నియు నిరంతర జపముచే తొలగును.

శ్రీ శంకరులు 'గేయం గీతానామ సహస్రం' యని తమ 'మోహ ముద్గర స్తోత్రము'లో నుడువుటచే భగవద్గీతకు, నామసహస్రమునకు కల సమప్రాధాన్యము, యన్యోన్య సాపేక్షత మనమూహింపవచ్చును. గానము చేయుటకు గీత, ధ్యానమునకు నామసహస్రము ప్రశస్తములు. ఇవి రెండును భారతములోనివే. భీష్మపర్వములో భారతయుద్ధమునకు పూర్వము గీతోపదేశము జరిగినది. అనుశాసనిక పర్వములో భారత యుద్ధము ముగిసిన తరువాత సహస్రనామ సంకీర్తనము జరిగినది. ధర్మసంమూఢచేతస్కుడైన యర్జునుని నజ్ఞానమును పోగొట్టి కర్మ ప్రబోధము గావించుటకు గీత బోధింపబడగా వివేకియైన ధర్మరాజు మనస్సులో నుదయించిన సంశయములను పోగొట్టి సచ్చిదానందమయుడైన సనాతన సారథి లీలలను, విభూతిని బహువిధములుగా స్తుతించి ప్రపంచమునకు ధర్మమును పరతత్త్వమును నుపదేశించినది నామ సహస్రము. గీత శాసనము, సహస్ర నామము అను శాసనము. భగవద్గీతకు సహస్ర నామమునకు కొంత పూర్వ పర సంబంధమున్నట్లు గోచరించును. గీతలో దాదాపు చివరిలో 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' (XVIII 66) యని శ్రీకృష్ణుడు శాసించిన దానిని 'కో ధర్మః సర్వ ధర్మాణాం భవతః పరమో మతః' అను శ్లోకముతో ధర్మరాజు నామ సహస్ర పీఠికలో ప్రశ్నించును. కావున గీతాంతమున తేలిన ధర్మసారమే నామ సహస్రములో కీర్తింపబడినది. 'సర్వం విష్ణుమయం జగత్' అను భావమే 'విశ్వం విష్ణుర్' అను దానితో ప్రారంభమగు నామ సహస్ర మందంతటను విపులీకరింపబడినది. సకల ధర్మ సర్వస్వమై సర్వలోకములను పాలించు పరతత్త్వమే నామ సహస్రములో ప్రతిపాదితమైనది.

నామ సహస్రమును చక్కగా పఠించుచో వీనులకు విందుగా నుండును. నేటి కాలమున గానకోకిల ఎం. యస్. సుబ్బులక్ష్మి గానము చేసిన శ్రీ విష్ణుసహస్రనామమెంత మధురముగానున్నదో మనకు తెలియును. ఇందుకు కారణము నామసహస్రమునందు కూర్చబడిన నామములయొక్క యక్షర రమ్యత, వాటి కూర్పు. వేదో వేదవిదవ్యంగో వేదాంగో వేదవిత్కవిః, కరణం కారణం కర్తా వికర్తా గహనో గుహః, బ్రహ్మణ్యో బ్రహ్మకృద్ బ్రహ్మ బ్రహ్మ బ్రహ్మ వివర్ధనః' ఇత్యాది నామ పంక్తులు చదువుటయందు చెవుల కింపుగా నుండును. కొన్ని నామములు పలుతూర్లు వచ్చినను వాటిని పునరుక్తిగా భావింపరాదు. సందర్భము ననుసరించి యొకే నామము వేర్వేరు యర్థముల నిచ్చును. అనంత నామాంకితుడైన సర్వేశ్వరునికి దేవతల పేర్లు, మనుష్యుల పేర్లు, గుణగణముల పేర్లు, చెట్ల పేర్లు, గుట్టల పేర్లు, జంతువుల పేర్లు, పంచభూతముల పేర్లు — ఇవి యవి యననేల? అన్నియు ఆయనకే అన్వయించును. ఆయనే ప్రాణము, ప్రణవము, అనలము, అనిలము, నిమిషము, అహస్సు, వత్సరము, సంవత్సరము, ఋతువు, క్రతువు, వసువు, వాయువు, అన్నము, అన్నాదుడు, వేదము, వేదాంగము, రవి, కవి, ఓజస్సు, తేజస్సు. ఇటువంటి మహాపురుషుని చూచుటకు మనకున్న పాంచభౌతికమైన చక్షువునకు వీలుపడదు. కాని దివ్యదృష్టితో చూచినచో ప్రపంచమంతయు పరమాత్మ స్వరూపముగ గోచరించును.[16] 'సర్వం విష్ణుమయం జగత్' అను భావము దృఢీకరింపబడును.

సహస్ర నామమనగా సరిగా వెయ్యి పేర్లని యనుకొనరాదు. ఇచ్చట సహస్ర శబ్దమున కర్థము 'అనంతము' అని చెప్పకొనవలెను. నామ రూప గుణరహితుడగు పరమాత్మ నెట్లు వెయ్యి పేర్లతో స్తుతించుటెట్లు పొసగుననగా, ఈ నామ జపము వలన నామరహితుడగు పరమాత్మ సాక్షాత్కారమగును. 'సహస్ర శీర్షా పురుషః, సహస్రాక్షః సహస్రపాత్, స భూమిం విశ్వతో వృత్వా...'' ఇత్యాది పురుష సూక్తములోని 'సహస్ర' శబ్దమునకు 'అనంతము, అసంఖ్యేయము' అని యర్థమని సాయణ మాధవాచార్యుడు తన వేద భాష్యమున వివరించెను అట్లుకాక విరాట్పురుషునికి వేయి తలలు కలవనిచో వేయిక్కి కడవది లేదనియు ఆయన శీర్షముల సంఖ్యను పరిమితము చేసినట్లగును. ఇది సత్యవిరుద్ధము కాన సహస్ర శబ్దమునకు నర్థము యనంతము అని లక్షణగా స్వీకరింపవలెను. ఈ యర్థమునే ప్రతిపాదించు బహుశిరాః (115), సర్వతోముఖః (816), సహస్ర మూర్ధా (224), సహస్రాక్షః (226), సహస్రపాత్ (227), విశ్వ బాహుః (316), విశ్వమూర్తిః (717), నైకరూపః (271), అనంతరూపః (932), అనేకమూర్తిః (721) అను విష్ణు నామములు అనంతత్వమును సూచించుచున్నవి. కావుననే పరమాత్మని మాహాత్మ్యమున కవధి లేదని అనాది (941), అనంతః (886), అనాది నిధనః (42), అతులః (355), అద్భుతః (895), అమిత విక్రమః (516), అనంతశ్రీః (933) మొదలగు నామములు నుడువుచున్నవి. పరమాత్ముని లీలలు, గుణములు, కర్మలు యనంతములైనట్లు ఆయన నామములు కూడ అనంతములే. ఒక్కొక్క నామము ఒక్కొక్క ఉత్కృష్టతను సూచించును. అనంతములైన నామము లన్నింటిని సేకరించి జపించుటకు సాధ్యపడదు కాని భక్తుని యనుగ్రహించుట కొఱకు దివ్య పురుషులు వెయ్యి నామములను మనకందజేసిరి.

శ్రీ భరతాంతర్గత విష్ణు సహస్రనామ స్తోత్రమున కింతటి ప్రశస్తి కలదు కావుననే శ్రీ శంకరుల వంటి మహనీయులీ స్తోత్రమునకు భాష్యము వ్రాసిరి. ఈ భాష్యమును ఆదిశంకరులు రచింపలేదని కొందరు, ఆదిశంకరులే రచించిరని కొందరు నుడువుదురు. నవీన విమర్శకు లేమన్నను ఈ భాష్యము ఆదిశంకర కృతమని సంప్రదాయ బద్ధ హైందవు లందరు నమ్మెదరు.[17] శ్రీశంకరులు 'లలితా సహస్ర నామ స్తోత్రము'నకు భాష్యమును రచింపు తలంపుతో 'లలితా సహస్ర నామస్తోత్ర గ్రంథము'ను తెమ్మని శిష్యుల నాదేశింపగా వారు శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రగ్రంథమును తెచ్చిరట. అదికాదనియు 'లలితా సహస్రనామము'ను తెమ్మనగా మూడు పర్యాయములు కూడ నట్లే జరిగినదట. లలితా సహస్ర నామ భాష్యమునకు లలితాంబిక యనుజ్ఞ లభింపలేదని భావించి శ్రీశంకరులు శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రమునకే భాష్యము రచించిరట.[18]

శ్రీ మహావిష్ణువు పరమ పురుషుడు, బ్రహ్మశబ్ద వాచ్యుడు అని ప్రతిపాదించు ఈ సహస్ర నామమునకు అద్వైతాచార్యులగు శ్రీ శంకరుల భాష్యము వ్రాయుటెట్లు కుదురును? అద్వైతమత రీత్యా పరమాత్మ నిర్గుణము, నిరంజనము, నామరూప రహితము

కదా! పరబ్రహ్మము తప్ప తక్కినదంతయు మిథ్యయనుటచే విష్ణువు యొక్క సర్వోత్కృష్టతను శ్రీ శంకరు లెట్లు తమ భాష్యములో సమర్థింతురు? యను శంక కలుగక మానదు. కాని ఈ శంక నిరాధారమైనది. అద్వైతుల ప్రాతిభాసిక, వ్యావహారిక, పారమార్థిక దశల నంగీకరింతురు. అంతేకాక వ్యవహారదశలో సగుణ బ్రహ్మమును, పారమార్థికదశలో నిర్గుణ బ్రహ్మను నంగీకరించుటచే శివ, విష్ణ్వాది దేవతల నారాధించుట సగుణోపాసనలోనికి వచ్చును. మాయాచ్ఛాదిత బ్రహ్మము ఈశ్వరుడు అనగ శివ కేశవాది దేవతలు. ఈయన నిర్గుణ బ్రహ్మకన్న భిన్నుడు కాడు. సగుణోపాసన వలన చిత్తశుద్ధికలిగి తద్ద్వారమున నిర్గుణోపాసనకు దారికలుగును. పరబ్రహ్మము నిర్గుణము; నిర్గుణోపాసన చేయుట కష్టము, కాన మందులైనవారికి చిత్తైకాగ్ర్యము కలుగజేసి వారి ననుగ్రహించుటకు నిర్గుణ పరబ్రహ్మ సాధన కొఱకు పరమాత్మని కర చరణాద్యవయవములు, లీలలు, గుణములు, పరాక్రమము, నామములు కల్పింపబడినవి. దీని నద్వైతు లిట్లు వివరించిరి.[19]

నిర్గుణం పరం బ్రహ్మ సాక్షాత్కర్తుమనీశ్వరాః
యే మందాస్తేఽను కంప్యన్తే సవిశేష నిరూపణైః॥

కావున షణ్మత స్థాపకులైన శ్రీ శంకరులకు శివకేశవ భేదము లేదు. కాన వారు విష్ణు సర్వోత్తమత్వమును ప్రతిపాదించుటలో యనౌచిత్యము గాని విరోధముగాని లేదు. ఈ సగుణ బ్రహ్మమునకే భక్తి నర్పింతురు. సాధకులు తమ తమ ఇష్టము వచ్చిన రూపములో పరమాత్మని కొలువ వచ్చును. ఈ భాష్య ప్రారంభమునందు శివకేశవాభేదము నుగ్గడించు హరివంశ శ్లోకములను శ్రీశంకరు లుదహరించి శివకేశవుల కభేదమని నొక్కి చెప్పిరి. కావుననే విష్ణు సహస్ర నామములో శివుని నామములను శివకేశవుల కభేదముగా నన్వయించిరి.[20]

శ్రీ విష్ణు సహస్ర నామమునకు శ్రీ శాంకర భాష్యముతో బాటు బృహత్ భాష్యము, విష్ణువల్లభ భాష్యము, ఆనందతీర్థ — కృష్ణానంద—గంగాధర యోగీంద్ర—పరాశరభట్ట—మహాదేవ వేదాన్తి—రంగనాథాచార్య—రామానందతీర్థ—శ్రీరామానుజ — విద్యారణ్యతీర్థ — బ్రహ్మానంద భారతి — సుదర్శనభట్ట — గోవిందభట్టుల భాష్యములు (వ్యాఖ్యానములు) పదునైదు నున్నవి.[21]

ఇప్పుడు మన కుపలభ్యమానములగు భాష్యములలో శ్రీ శంకరులదే ప్రాచీనమని చెప్పవచ్చును. శ్రీ శంకరులు మృదు మధుర శైలిలో ప్రసన్న గంభీరతతో కూడిన రీతిలో భాష్యమును రచించిరి. పెక్కు తావులందు తమ సిద్ధాంతమును దృఢీకరించుచు సంహితలు, ఆరణ్యకములు, బ్రాహ్మణములు, ఉపనిషత్తులు, రామాయణ-భారతములు, పురాణములు, స్మృతుల నుండి నెన్నియో శ్లోకములను వాక్యములను ఉదహరించిరి. వేదాన్తమంతయు ఇందు ప్రదిపాదితమై సర్వ విషయముల కాకరమై భారతీయ ధర్మ, వేదాన్త సర్వస్వ మన దగి యున్నది. ఇంత ప్రశస్తమగు విషయములు సంస్కృత భాషలో నుండుటచే సంస్కృతము రాని ఆంగ్ల భాషాభిజ్ఞులకు ఈ భాష్యము దుర్బోధకమని తలంచి వారి ననుగ్రహించుటకై మద్రాసులోని అడయార్ లైబ్రరీలో నుద్యోగించుచున్న ఆర్. అనంతకృష్ణశాస్త్రిగారు శంకర భాష్యము నాధారము చేసుకొని 1901 లో ప్రప్రథమముగా నాంగ్లానువాదము గావించిరి.[22] వారంతకు మునుపే లలితా సహస్ర నామము, ఆనందలహరిని యాంగ్లమున ననువదించి యుండిరి. 1926 లో శ్రీ విష్ణు సహస్రనామ భాష్యానువాదమును సవరించి, విస్తరించి థియొసాఫికల్ పబ్లిషింగ్ హౌస్ ద్వారమున ప్రకటించిరి. ఆగ్రంథము మిక్కిలి జనాదరణకు లోనై 1927 లో పునర్ముద్రింపబడెను. తరువాత 1980 వఱకు తిరిగి ముద్రింపబడలేదు.

ఈ గ్రంథమునందు ఆంగ్లమున అడయార్ లైబ్రరీ రీసర్చ్ సెంటర్ వారి డైరెక్టర్ రాధా బర్నియర్ వ్రాసిన మున్నుడి, సవరింపబడిన 1926 వ సంవత్సరపు పునర్ముద్రణకు ఏ.జి. కృష్ణ వారియర్‌గారు ప్రస్తుతము రచించిన పీఠిక, 1926 లో శ్రీ అనంతకృష్ణ శాస్త్రిగారు వ్రాసిన పరిచయము కలవు. పీఠికయందు శంకర విష్ణు సహస్రనామ భాష్య ప్రాశస్త్యమువివరింపబడినది మేము పైన వివరించినట్లు అద్వైతులైన శ్రీ శంకరులు ఈ భాష్యమును రచించు టెట్లు పొసగునో శ్రీకృష్ణవారియర్ (పుటలు 14–15) వివరించిరి. 1926 వ సంవత్సరపు ప్రచురణములోనున్న దోషములను కొన్నింటిని 1927వ సంవత్సరపు ప్రచురణములో పరిహరించి పెక్కు మార్పులు చేసిరి.

శ్రీ అనంతకృష్ణశాస్త్రి గారి "పరిచయము" మిక్కిలి విలువైనది. వీనియందు విష్ణు సహస్ర నా మ ము న కు కల వ్యాఖ్యానములు, భాష్యములు, శ్రీశంకరులీ భాష్యమును వ్రాయుటలో వారి ఉద్దేశ్యము, సహస్ర నామ స్తోత్రము నెవరెట్లు ఏ పద్ధతిలో పారాయణము చేయుదురనెడి విషయమును సంగ్రహముగా పేర్కొనిరి. 'యోగో, యోగవిధాం నేతా ప్రధాన పురుషేశ్వరః' అను శ్లోకములోని 'యోగ' శబ్దార్థమును వివరించుచు రేచక, పూరక, కుంభకములతో కూడిన ప్రాణాయామము — దాని ప్రాశస్త్యము నుగ్గడించుచు నేటి భారతీయులు ప్రాణాయామమును నిర్లక్ష్యము చేయుటచే భౌతికముగా, మానసికముగా బలహీనులైరని వాపోయిరి. విష్ణు సహస్ర నామమున కొక యజ్ఞాత వ్యాఖ్యాత రచించిన వ్యాఖ్యానము లభింపగా దాని నాధారము చేసికొని శ్రీ శాస్త్రిగారు అందలి క్రొత్త విషయములను తమ యాంగ్లానువాద, వివరణములలో నుదహరించిరట. ఈ నూతన వ్యాఖ్యలో చెప్పబడిన సహస్ర నామార్చన విధి భృగు సంహితలో నున్నదట. సహస్ర నామములను చర్చించుచు తులసి, బిల్వ పత్రము, నంద్యావర్త—పద్మ—మల్లిక జాజి—పున్నాగ—శతపత్ర పుష్పములతోను విష్ణు పూజ సలుపవలెను. ఈ పూజను ప్రతి దినము చేయుటకు వీలులేనిచో తమ జన్మదినమున, గ్రహణ దినమున, జన్మ నక్షత్ర దివసమున, సూర్యుడు ఒకరాశి నుంచి మరొక రాశికి మారునప్పుడు, గ్రహబాధా నివారణ కొఱకు, రాజక్రోధము తప్పించు కొనుటకు, రోగ బాధల నుండి విముక్తుడగుటకు, శత్రుకృత కష్టములను తొలగించుకొనుటకు, ధర్మర్థక ప్రాప్తికి చేయవలెను అని నుడివిరి.

తరువాత 431 పేజీలలో సహస్రనామ స్తోత్రము, ప్రతి శ్లోకమునకు శంకర భాష్యము నాగర లిపిలోను, వెను వెంటనే

యాంగ్లానువాదము, వివరణము లియ్యబడినవి. సంస్కృతములలోని పాఠ భేదములు, అధిక పాఠములు చిన్న అచ్చులో సూచింపబడినవి. ఆంగ్లానువాదము సరళముగా సులభ శైలిలో వ్రాయబడి కొద్ది యాంగ్ల పరిచయమున్నవారికి కూడా నుపకరించును. శాంకర భాష్యములో నుదహరింపబడిన ఉపనిషత్, రామాయణ, భారత, పురాణ, స్మృత్యాది గ్రంథముల నుండి యుదహరింపబడిన వాక్యములకు ఆయా పుటలలో సంస్కృతాంగ్లములలో 'ఆకరములు' చూపబడినవి. ఇది కడు ప్రశంసనీయము. గ్రంథాంతమున నీ పుస్తక రచనమున కుపకరించిన గ్రంథముల పట్టిక, సహస్ర నామములోని వెయ్యి పేర్లకు అకారాదిక్రమములో కూర్పు, వాటి క్రమసంఖ్య, గ్రంథములో అవి కన్పించు పుట సంఖ్యలు ఇవ్వబడినవి. దీనివలన ఒకానొక నిర్దిష్ట నామముయొక్క అర్థము తెలిసికొనగోరువారు శ్రమింపక సులభముగా నీ పట్టికలో భాష్యమును, యాంగ్లాను వాదమును చదువుకొనగలరు. చివర భాష్యోదాహృత భారతాది గ్రంథస్థ శ్లోకములు, వాక్యములకు అకారాది క్రమములో నను క్రమణిక, ప్రక్కననే ఆకరములు చూపబడినవి.

గ్రంథమంతయు చక్కని గ్లేజు కాగితముపై నిర్దుష్టముగా, సందముగా ముద్రింపబడినది. స్తోత్రములోని భాష్యమును, శ్లోకములను, పాఠ భేదములను, అధిక పాఠములను, ఆకరములను, ప్రతీకలను సులువుగ గుర్తించుట కనువుగా వివిధ పరిమాణముకల టైపు లుపయోగింపబడి చదువుట కాహ్లాదము కల్గించుచు నేత్రములకు ఖేదము పరిహరింపబడినది. శాంకర విష్ణు సహస్ర నామ భాష్యామృతమును గ్రోలువారికిది స్వర్ణ చషకము వంటిది. భక్తులకు దీని నందజేసిన **The Adayar Library and Research Institute Centre** వారు ధన్యులు. పాఠకలోక మీ గ్రంథము నాదరించుగాక !

## అ ధో జ్ఞా పి క లు

1 ఈ కర్మభూమిలో పుట్టిన మనుజుడు దైవచింతన చేయనిచో వాడు మందభాగ్యుడని భర్తృహరి నుడివెను. చూడుడు : 'ప్రాప్యేమాం కర్మభూమిం న భజతి మనుజో యస్తపో మందభాగ్యః' నీతి శతకము, శ్లోకము 96.

2 VI. 2. 18.

3 యజ్ఞానాం జప యజ్ఞోస్మి స్థావరాణాం హిమాలయః **X. 25.**

4 **T. M. P. Mahadevan : Vishnusahasranama - a study, Bharatiya Vidya Bhavan, Bombay,** 1972, పుట 18.

5 సర్వదోష నిధేరస్తి కలేరేకో మహాన్గుణః,
నామ సంకీర్తనాద్విష్ణోః ప్రయాన్తి పరమాం గతిమ్॥
శ్రీ మద్భాగవతమ్, **XI**. 3. 51

6 ధ్యాయన్ కృతే యజన్ యజ్ఞైః త్రేతాయాం ద్వాపరే ఽర్చయన్,
యదాప్నోతి తదాప్నోతి కలౌ సంకీర్త్య కేశవమ్॥
విష్ణు పురాణమ్, **VI**. 2. 17.

7 హరేర్నామైవ నామైవ నామైవ మమ జీవనమ్,
కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతిరన్యథా॥
**I. X.** i 15.

8 యో యో యాం యాం తనుం భక్తః
శ్రద్ధయార్చితుమిచ్ఛతి,
తస్య తస్యా చలాం శ్రద్ధాం
తమేవ విదధా మ్యహమ్॥ భగవద్గీత, **VII**. 21.

9 శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్,
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్॥
**VII**. 5. 23

10 'స్తోత్రం' అనునది శ్రీ విష్ణుస్రహస నామములలో నొకటి. (681, 682)

11 చౌకాంబా ప్రచురణము, 1964; 15వ అధ్యాయము. పుటలు 17–22.

12 ఆనందాశ్రమ సంస్కృత సీరీస్ ప్రచురణ, 1893; ఉత్తర ఖండము 72వ అధ్యాయము, పుటలు 1396–1404.

[నవీన కాలములో శ్రీ బెల్లంకొండ రామరాయ కవీంద్రులు (కాలము 1875–1914) వివర్ణాది విష్ణు సహస్ర నామమును రచించిరి.]

13 "... అవిచ్ఛిన్న పఠ్యమాన నారాయణ నామ సహస్రం ... సూతికా గృహ మపశ్యత్। కాదంబరి, చౌకాంబా ప్రచురణము, 1961; పుటలు 220–221.

14 (a) విష్ణుం సహస్ర మూర్ధానం చరాచర పతిం విభుమ్
స్తువన్నామ సహస్రేణ జ్వరాన్ సర్వాన్ వ్యపోహతి॥
చరక సంహిత.

(b) 'సహస్ర నామ్నాం పఠనం జ్వరఘ్నమ్'
వైద్య చింతామణి, జ్వర ప్రకరణము

15 చూడుడు **Sri Vishnusahasranamam with English Translation and notes by K. E. Parthasarathy, Ganesh & Co. Madras Private Ltd, Madras-17, 1966,** పీఠిక పుటలు 30–31.

16 శ్రీ విష్ణుసహస్ర నామము. వివరణకర్త : డా. ఇలపావులూరి పాండురంగారావు, ప్రాగ్భారతీ పబ్లికేషన్స్, మద్రాసు, 1978; అవతారిక పుటలు 1–40.

17 16వ శతాబ్దికి చెందిన కేరళ కవి నారాయణభట్టు తన "నారాయణీయము"లో

శ్రీ శంకరో౽పి భగవాన్ సకలేషు తావ
త్త్వమేవ మానయతి యో నహి పక్షపాతీ,
త్వ న్నిష్ఠ మేవ స హి నామ సహస్రకాది
వ్యాఖ్య ద్వ్యవత్ స్తుతి పరశ్చ గతిం గతో౽సౌ॥

(X. 90. 5)

అని శ్రీ శంకరులు విష్ణు సహస్ర నామ భాష్యమును రచించిరని నుడివెను.

18 శంకర గ్రంథ రత్నావళి (సప్తమ సంపుటము), సాధన గ్రంథ మండలి, తెనాలి, 1974; సహస్రపది పుట 20.

19 వేదాన్త పరిభాష, ప్రయోజన పరిచ్ఛేదః.

20 "విష్ణు గుణ్యతయా శుద్ధత్వాత్ శివః। 'స బ్రహ్మ స శివః' ఇత్యభేదోప దేశాత్ శివాది నామభిః హరిరేవ స్తూయతే"
"శివః" అను 27 వ నామముపై శంకర భాష్యము.

21 **Anfrecht's Catalogues Catalogromme, 1903.**

22 1966 లో గణేష్ అండ్ కో, మద్రాసు వారు శంకర — పరాశరభట్టుల వ్యాఖ్యానము ననుసరించి కె. ఇ. పార్థసారథి ఆంగ్లానువాదమును ప్రకటించిరి.

డాక్టర్ కాశీభట్ట సేతురామేశ్వర దత్త

# మృత్యుగీతం

పెన్నా శివరామకృష్ణ

ఓ మృత్యువా ! ఎంత వేడినను వరమీయవుగదా !
అందుకు నీవూ నాకు దేవతవే
నా గొంతు పాటల సమాధి,
నా కళ్లు ఆశల సమాధులు, నా హృదయమా ?
అది కవిత్వపు రంగుదారాలల్లుతోంది
పాడలేని నా గొంతుకు ఉరెయ్యటానికి -
నేనే ఓ నడుస్తున్న సమాధిని -
నాకిక్కడేంపని, నన్ను తీసికొనిపో,
నిశ్శబ్ద పేటికకు, ఆత్మలపూల వాటికకు
అక్కడ సమాధుల సహజీవన సౌందర్యం చూడాలనివుంది
అక్కడి ఆత్మల గత జీవన వ్యధాగానాలలో
గొంతు కలిపి పాడాలనివుంది —
ఇక్కడ అన్ని ఆత్మల రహస్య నాళాల్లో ప్రవహించేది
ఒకే గీతం, అది స్వేచ్ఛ
కాని వీళ్ళ దేహాలు బంగారు పంజరాలు -
నేను పన్నెండు గంటలు సూర్యుణ్ణి
తలమీద మోస్తున్నా - ఒక్క సాయంసంధ్యకోసం.
ఏంలాభం, ఎక్కడివో మేఘాలు
నా సంధ్యను వానలో ముద్దచేస్తున్నవి -
మళ్ళీ పన్నెండు గంటలు చీకటి శిలువకు
వ్రేలాడుతున్నా -
ఒక్క అరుణోదయపు పలకరింపుకోసం -
కాని ఈ తూర్పు కొండలు
అరుణోదయపు గొంతు నొక్కేస్తున్నవి.
కావున స్మశానంవైపు నా పయనం
అందుకే మృత్యుదేవతా వాహనాధ్యయనం—
నా సమాధి పాదాల చెంత మొలిచే
మొక్కకు ఎరువునయిపోతా !
జీవం తొణికిసలాడే ఒక్క పూవయినా పూయకపోతుందా.
ఒక్క తోటకే జీవితాన్నంకితం చేసి
పాడి పాడి మరణించిన పక్షికి
వృక్షమే రెండు ఎండుటాకులను రాల్చి
సమాధి కడుతుంది—నేనూ అంతే
ఈ వ్యధల భారం చాలు. మళ్ళీ నాపై ఆ కరకు
గాళ్ళు బరువెందుకు ?
నీవు నన్ను ప్రేమిస్తావని తెలిసికాబోలు
ఏ ఉషస్సు నా జోలికి రాలేదు —
మృత్యువా ! నన్ను గాఢంగా కౌగిలించుకో —
త్వరగానన్ను నీ తీరం చేర్చుకో !

# కలగూరగంప

## పరిశోధన - నియమిత చర్చ

భారతి ఆగస్టు '80లో పరిశోధనా పద్ధతిపై కుమారి విద్యేశ్వరి వెలిబుచ్చిన అభిప్రాయాల పర్యవసానమే నాయీ భావనా వేదిక. నిజానికీ విషయాన్ని 'భారతి'తో ముచ్చటించాలనే చాలారోజుల నా కోరిక టైమ్ ఫాక్టర్‌కి లోబడిపోయింది. పిహెచ్.డి. థీసిస్‌వర్క్ ఎండ్ కావడంతో నా ఒపీనియన్‌లని తెలిపే అవకాశం కలిగింది.

పరిశోధనాంశాన్ని ఎలా ఎన్నుకోవాలి? ఎప్పుడు, ఎలా మొదలు పెట్టాలి?...అంటూ విద్యేశ్వరి రాసిన తీరుచూస్తే 'రీసెర్చి స్కాలర్' కామాత్రం యింగితజ్ఞాన ముండదా ? పూర్వాపరాలు కూలంకషంగా తెలియందే యిన్‌వెష్టిగేషన్‌లోకి ఎవరైనా దిగుతారా? అనిపిస్తుంది. 'స్పూన్‌ఫీడింగ్'—డాక్టరేట్ లెవల్లో ఊహించుకొంటే ఒళ్ళు జలదరిస్తుంది. ఇదే నిజమైతే ఆ స్టూడెంటొక వేస్ట్ ప్రాడక్ట్. ఆ గైడొక యినర్ట్ మెటీరియల్. ఆ యిన్‌స్టిట్యూషన్ యూస్‌లెస్. మొత్తంమీద నేషనల్ యిమేజికి పెద్ద అప్సెట్! ఈ విషయంలో వ్యాస రచయిత్రికి అవగాహన లేదని నా అర్థంకాదు, ఆమెను అలా రాయించడానికి దారితీసిన సంఘటనలపైనే నా విచారమంతా.

ఇంతకీ లోప మెక్కడుంది ?

రీసెర్చి అనేది నా మటుకు నాకు ఒక అనంత యోగాభ్యాసము. నిరంతర నిష్కల్మష నిర్గుణ నిష్కామ జ్ఞానయజ్ఞము. నిత్య స్థైతిక ప్రజ్ఞాభరిత నిర్మల హృదయ హోమము. దానికి ఆరంభమేకాని, అంతమంటూ ఉండదు. అనుకొన్న ఫలితాన్ని సాధించడంలో అహోరాత్రులూ శ్రమించగలిగే బోధిసత్వతత్వాన్ని,కృష్ణతత్వాన్ని కొనితెచ్చుకొన్నప్పుడే సిద్ధార్థులయ్యేందుకు, కర్తవ్య నిర్వహణలో కృతకృత్యులయ్యేందుకు వీలుపడుతుంది. మానవసేవే మాధవసేవ అన్నట్లు లోకకళ్యాణార్థం మహనీయులెందరో అనుసరించే విభిన్నమార్గాల్లో ఈ రీసెర్చి కూడ ఒకటి.హ్యూమన్ వెల్‌ఫేర్ లక్ష్యంగా,తరాల సంస్కృతిని ఎన్రిచ్ చెయ్యడం ఆశయంగా పెట్టుకొని భారత జాతీయతను ప్రతిబింబింపచేస్తూ విశ్వమానవాభ్యుదయానికి పాటుపడేదే పరిశోధన. ఈ అవగాహనలేని వారెందరో యీనాడు రీసెర్చి స్కాలర్‌లు!

ఇలా ఎందుకు జరిగింది ?

లోపమనేదే లేక ఏ దేశ చరిత్రాలేదు. ఐతే దాని శాత మెక్కువైతే అసలు చరిత్రే ఉండదు.

అదే నేడు మనక్కూడా దాపురించింది.

నాకు తెలిసినంతవరకు యీ లోపం మూడు దశల్లో ఉంది.

i) రీసెర్చిస్కాలర్ పరంగా;

ii) రీసెర్చి సూపర్‌వైసర్ పరంగా;

iii) రీసెర్చిని ఎన్‌కరేజి చేసే ప్రైవేట్ లేక పబ్లిక్ సంస్థల పరంగా.

నిర్దిష్టమైన స్థూలమైన చర్చకు అవకాశంలేదు కనుక, తక్కువగానైనాసరే వీలైనంతవరకు లోపాలను, వాటికి కారణాలను నా మేరలో వివరిస్తాను.

## నేటి రీసెర్చ్ స్కాలర్‌లు-తీరు తెన్నులు

పిహెచ్. డి. ప్రధాన ధ్యేయంగా, ఉద్యోగమే గోల్‌గా పెట్టుకొని రీసెర్చికు రావడం దురదృష్టకరం. దేశంలో యీనాడు తాండవిస్తున్న ఆర్థిక దుస్థితి, ముఖ్యంగా నిరుద్యోగ సమస్య దీనికి మూల కారణం. రాజకీయ అస్థిరత దీన్ని బలపరిచే మరో కారణం. 'సోషల్ స్టేటస్' అనే సూడో ప్రెస్టీజ్ ఊబిలో చిక్కుకొనిపోయినవారు కొందరు, ఇంట్రెస్ట్ లేకపోయినా ఇదో హాబీగా చేరే నవనాగరీకులు కొందరు, అర్థం పర్థం లేకుండా రాండంగా, హాఫ్‌హజర్డ్‌గా చేరేవారు యింకొందరు...ఇలాంటి వారికి చేయూతనిచ్చే పొల్యూటెడ్ పొలిటికల్ ఫిగర్స్ కొందరు, ఆ తాలూకూ భజగోవింద బృందాలు—వీరందరూ దేశశ్రేయస్సును గుర్తించనివాళ్ళు. లేదా గుర్తించినా పట్టించుకోనివాళ్ళు. స్వార్థప్రయోజనాల నాశిస్తున్నంతకాలం ఈ విషయంలో ప్రగతిరాదు. దీన్ని గుర్తించవలసిన అవసరం ప్రతి విద్యార్థికీ ఉంది. దాన్ని తెలియజేయవలసిన అవసరం కేవలం అధ్యాపకునికేకాదు, మంచి చెడ్డలు తెలుసుకొన్న ప్రతివ్యక్తికీ ఉంది. ఉండాలి. ఉండితీరాలి. విద్యార్థి అర్హతను నిర్ణయించే సరియైన కొలమానం లేకపోవడం కూడ ఒక లోపమే. మౌలిక విద్యావ్యవస్థలోని లోటుపాట్లు దీనికి ప్రధాన కారణం. వీటిని పర్యవేక్షించవలసిన అవసరం దేశంలోని విద్యావేత్తలందరి ప్రధాన కర్తవ్యం. దీన్ని సాధ్యమైనంత త్వరలో గుర్తించవలసిన అవసరం ఎంతేని ఉంది. గుర్తించడమేకాదు. తగిన చర్యలు కూడా తీసుకోవాలి.

## ఈనాటి రీసెర్చి సూపర్‌వైసర్‌లు-రూపురేఖలు

కేవలం నంబర్ మోటివ్, పవర్ మోటివ్ రీసెర్చికోసం ప్రలోభపడి, అయోగ్యులైనాసరే ఫరవా లేదనుకొంటూ వారిచేత తమపనులు పూర్తిచేసుకొనే సూపర్‌వైసర్‌లున్నంతకాలం—పరిశోధన దేశాన్ని ఉద్ధరించలేదు. తమ బ్రతుకుతెరువుకోసం వృత్తిని కించబరచుకొనే యీ మనస్తత్వాలు ఎదగవలసిన అవసరం ఎంతో ఉంది. ''పర్‌ఫెక్ట్ అవుట్‌లుక్'' వీరికే లేనప్పుడు ఇక వీరు చదువుచెప్పే విద్యార్థుల్లో ఎలా వస్తుంది?

నా ఐదు సంవత్సరాల యూనివర్సిటీ క్యరీర్...వీళ్ళేం చెప్తున్నారు? పిల్లలేం నేర్చుకొంటున్నారు? వీళ్ళెలా వాళ్ళని ట్రీట్ చేస్తున్నారు? వాళ్ళెలా రియాక్ట్ ఔతున్నారు? వీళ్ళ మార్కులెలా యిస్తు

న్నారు? వాళ్లెలా తెచ్చుకొంటున్నారు ?—అని తలచుకొంటే సిగ్గుతో, అవమానంతో తలదించుకొంటుంది. వీళ్ల ప్రాతిపదిక విద్యార్థి యోగ్యతకాదు. అర్హత అంతకన్నాకాదు.

కులం, మతం, జాతి, ప్రదేశం, డబ్బు, హైదరాబాద్ బలం, ఢిల్లీ జులుం! ఇవీ!

కాకాపట్టే కెపాసిటీని బట్టి సలాంచేసే మెంటాలిటీనిబట్టి మార్కులు 'పొయ్యడం' లేదా 'కొయ్యడం' జరుగుతుంది. స్త్రీ, పురుష లైంగికభేదం ఉండనే ఉంది.

ఇక ఆలోచించండి.

ఎక్కడుంటుంది ది యోగా ఆఫ్ రీసెర్చి ?

యస్సీ, యస్టీ, బిసీల బిజినెస్ దీనికి చాలవరకు కారణం. నేషనల్ ప్రాబ్లమ్స్, ఏవో తెలుసుకోలేని 'లెక్చరర్‌లు' 'రీడర్‌లు' 'ప్రొఫెసర్‌లు' 'వి.సి.లు' 'వి.ఐ.పీ.లు' ఉన్నంతకాలం ప్రతిష్ఠాకరమైన జాతిశక్తి బజారుపాలౌతుంది. దీనికి తగిన చర్యలు తీసుకోవలసిన అవసరముందని, తీసుకోవాలని విజ్ఞులను కోరుకొందాం.

## రీసెర్చి కౌన్సిల్స్/ అసోసియేషన్స్/ కమిషన్స్ - ఆనుపానులు

కేవలం మార్కుల పర్సంటేజ్‌ను ఆధారంగా, రెకమెండేషన్‌ల ప్రభావానికి దాసోహమని ఫెలోషిప్‌లను కేటాయించే అవలక్షణం తొలగనంతవరకు ఈ సమస్య ఒక కొలిక్కిరాదు. స్టూడెంట్‌లోని రీసెర్చి ఇన్‌స్టింక్ట్‌ని ఎవాల్యుయేట్ చేయడంలో యీ సంస్థలు దారుణంగా దెబ్బతింటున్నాయి. అందువల్లే రీసెర్చ్ క్వాంటిటీ పెరుగుతోందే తప్ప క్వాలిటీమాత్రం పడిపోతోంది. ఈ విషయంలో పబ్లిక్ సెక్టార్‌కన్నా ప్రయివేట్ సెక్టార్ చాలవరకు జాగ్రత్తగా ఉండడం కొంతవరకు సంతోషించదగ్గ విషయం.

ప్రోగ్రెస్ రిపోర్ట్‌లను కేవలం యాంత్రికంగా పరిశీలించడం మాని, వ్యక్తిగతంగా, ప్రత్యక్షంగా ఆ ప్రోగ్రెస్ ఏమిటో పర్యవేక్షించి, నిపుణులతో సంప్రతించి ఫెలోషిప్‌ను రెన్యూవల్‌కు అప్రూవ్ చేయడమంటూ జరిగితే, కొంతవరకు స్టాండర్డ్ పెరిగేందుకు అవకాశముంది. అంతేకాదు, 'లాబరేటరీ ఫెసిలిటీస్'ను అంచనా వేయకుండా కాగితాలమీద సంతకాలు చూచి గ్రాంట్స్ మంజూరు చేయడాన్ని ఈ సంస్థలు మానుకోవాలి. ఎక్కువ సంఖ్యలో ఫెలోషిప్‌లు ఇవ్వడం కన్నా, ఎక్కువ మోతాదులో యిచ్చి, సంఖ్యను తగ్గించి 'రీసెర్చి ఎట్మాస్ఫియర్'ని ఎన్‌హ్యాన్స్ చేయగలిగితే మరీ మంచిది. ఐతే ఎంతవరకీ చర్యలను ఇవి తీసుకోగలుగుతాయి అనేది ఒక సిగ్మా. పొలిటికల్ హ్యాండ్‌నుంచి యివి బైట పడాలి.

## మరో మాట

విద్యార్థి అభిమానించే అంశంకన్నా యిమ్మీడియట్‌గా దేశావసరానికి పనికివచ్చే అంశం—పరిశోధనకు యోగ్యమైనదని నేనంటాను. ఇలా అనడంలో విద్యార్థి యిన్నర్ జీల్‌ని ఓవర్‌లుక్ చెయ్యడం నా అభిమతం కాదు. ఇంతకుమునుపే చెప్పినట్లు రీసెర్చి అనేది మ్యాన్ కైండ్‌ని డార్క్ ఫేజుల్లోంచి సన్‌లైటుకు నడిపించుకొని వెళ్లేది.

అంటే సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయపరంగాఉన్న చీకట్లను తొలగించేందుకు చేతిలోఉన్న టార్చ్‌లైట్ రీసెర్చి. దారిచూపేవాడికన్నా, టార్చ్‌లో బ్యాటరీ ముఖ్యం. నా దృష్టిలో రీసెర్చి సూపర్‌వైజర్ బ్యాటరీలాంటివాడు. అతనెంతగా లోడైవుంటే అంతగా లైటింగ్ ఎఫెక్ట్ ఉంటుంది. బ్యాటరీ మినహా మిగతా టార్చ్‌లైట్ స్టూడెంట్‌లాంటిది. దానికి ఎస్సెన్స్ బ్యాటరీ. ఎంతగా బ్యాటరీని పుంజుకో గలిగితే అంతగా కాంతిని చూపగలుగుతుంది. ఐతే వీరికి ముందుదారి చూపవలసిన అవసరం రీసెర్చి కౌన్సిల్స్/ అసోసియేషన్స్/కమిషన్స్‌లకు ఎంతైనా ఉంది. వీరిని సక్రమంగా ఉపయోగించుకోవలసిన అవసరం కూడా ఉంది. లేకపోతే 'బ్రెయిన్ డ్రెయిన్' ప్రమాదముంది. అయితే ఎవరు ఎంతవరకు తోడ్పడుతారన్నది ప్రతిఒకరూ ఆత్మవిమర్శ చేసుకోవాలి.

## చివరి మాట

ఎక్సెంషన్స్ అనేవి ఎక్కడైనాఉంటాయి. అలాగే యీ అంశంలోనూఉన్నాయి.మంచినిప్రశంసించవలసినఅవసరం అంతగాలేదు.చెడును విమర్శించడమే మనధర్మం కాదు. చెడులోని మంచిని ఎక్స్‌ట్రాక్ట్ చేసి చెడును మంచిగా మార్చడం గొప్పతనం. ఇవి కేవలం నా వ్యక్తిగత అభిప్రాయాలు. అయినా ఇవి జాతీయ సమస్యను సూచించేవి కనుక పత్రికాముఖంగా తెలియబరచేందుకు ప్రయత్నించడం జరిగింది. ప్రయత్న లోపాలు ఉండవచ్చు. మన్నించవలసినది. ఈ విషయంలో నేనెప్పుడూ 'రాజీ'కన్నా 'చర్చ'కు సిద్ధంగా ఉంటాను.

వ్యక్తిగతంగా కాని, భారతి జోక్యంతోకాని సఫర్ ఔతున్న నా యింట్రికసీని అర్థం చేసుకొంటారనే ఆశతో...

శ్రీ గుమ్మనూరు రమేష్‌బాబు

## లేఖలు

ఫిబ్రవరినెల భారతిలో శ్రీ చెఱుకుపల్లి జమదగ్నిశర్మగారి శ్రీ రామరాజ్యమును విమర్శించుచు శ్రీ శివలెంక ప్రకాశరావుగారు 'ఇప్పటికి ఆంధ్రీకరించిన వాటిల్లో అర్థప్రాధాన్యంగా పురాణఫక్కిలో సాగిన తిక్కన రచన విపుల వర్ణనాత్మకంగా రీతి ప్రాధాన్యంగా ప్రబంధ ఫక్కిలో నడచిన పాపరాజు రచనలే ప్రసిద్ధాలు' అని సెలవిచ్చిరి. శ్రీ ఆత్మకూరి గోవిందాచార్యులు గోవింద రామాయణము పేర ఉత్తర రామచరితమును 1942వ సం॥న ప్రకటించిరి. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు దానికి తొలిపలుకున '...ఇది యేదో రామాయణ కథారచనయని యీసడింపుతోనే యెత్తికొనియు తొలి పద్యము దొరకొని యితిశ్రీ దాక యేకధారగా చదివియే యింకొ

కరిచేత పెట్టవలసిన వాడనయితిని. నన్నీ కావ్యమంత తన్మయుని కావించినని' అనియు నుగ్గడించిరి. శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు తమ పీఠికలో 'పిరికిగల కవితాప్రతిభ సామాన్య కవుల కందునదికాదు' అని ప్రశంసించిరి. శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారు, శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు, శ్రీ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు, శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు మున్నగు పండిత ప్రకాండులీ కావ్యమును ప్రశంసించినారు. ఇది మరల 1950వ సం॥న ద్వితీయ ముద్రణ మందినది.

> 'తిక్కన వ్రాసియుండె మునుదియ్యని మాటలమూటఁగట్టి పే
> రెక్కిన పాపరాజు రచియించె సమాసములన్ ఘటించి వే
> ఱొక్కడు వ్రాయఁగాఁ దగునె యుత్తరకాండము కావ్యరీతి, నే
> నొక్కఁడఁబూనుకొంటి మఱియొక్కరు త్రొక్కనిఫక్కినేటికిన్'

అని గోవిందాచార్యులు ప్రతినపూని ఏడువందల పద్యములతో ఐదాశ్వాసముల కావ్యముగా రచించిరి. అనావశ్యక వర్ణనల పొంతపోక కథా ప్రధానముగా ఈ రచనసాగి సహృదయ హృదయోల్లాసియైనది.

ఈ కావ్యమును విమర్శకులు తడవకుండుటకు కారణము వారీ కావ్యము నెఱుఁగరా? లేక పేర్కొనదగినంత ప్రసిద్ధముగా వారికి తోచలేదో తెలియకున్నది. 'వంకలు దీఱినశయ్య, పొంకముగల పలుకు తీఱు, శుచి రుచులుగల పాకము, వడిగల కథావస్తుగతి' కల గోవింద రామాయణము తెలుగునందలి ఉత్తర రామాయణములలో పేర్కొనదగినదని మనవి చేయుచున్నాను.

శ్రీ ఎన్. ఎ. నారాయణరావు

లేపాక్షి.

మార్చి '81 భారతిలో అచ్చయిన నా పొయిట్రీలో కొన్ని అచ్చుతప్పులు కనబడ్డాయి. అవి 'మొగలిపొదలు' అన్నదానికి బదులుగా 'వెలగలి పొదలు' అని పడ్డది. యింకోచోట 'పిరికివాళ్ళు కల్పించే' అనేదానికి బదులుగా 'పిరికివాళ్ళు కవ్వించే' అని పడ్డది. ఈ విషయం పాఠకుల సౌలభ్యంకోసం మాత్రమే!

శ్రీ బి. బి. జి. తిలక్

తిరుపతి.

# ఎదుగుతూ ఉంటే

## శ్రీ నందిని సిధారెడ్డి

బోర్లించిన గ్లాసు మీద నిలబడి
కొవ్వొత్తి ప్రపంచాన్ని పరికిస్తుంది.
టేబుల్ మీద అడ్డదిడ్డంగా ఎదిగిన అరణ్యాల మధ్య
తనో మహానగరంలా వెలిగిపోతోంది.
తను కొంచెం కొంచెం కదుల్తూ
మన నీడల్ని తరంగాలు తరంగాలుగా కదిలిస్తూ
మన వెనుక సముద్రాల్ని చూపెడుతుంది.

గ్లాసు మహాపర్వతం మీంచి
వాటర్ ఫాల్స్‌లా కరుగుతూ
రెప్పల మధ్య గుంటలోకి పేరుకోబోతున్న
విషాదాన్ని తోసుకుంటూ తను ప్రవహిస్తుంది.

పెదాల లోయల మధ్య తారట్లాడే
భయంకర నిశ్శబ్దాన్ని ఖండిస్తూ
వీస్తున్న 'మాట'లా
కొవ్వొత్తి ఈ ఏరియాని ఏలుతోంది.

గడ్డంలో వేళ్లు జొప్పించి
తల ముక్కలు చేసుకుంటున్న
నాకేసి చూసి నవ్వుకొంటుంది.

గిల్టీగా
కుళ్లిపోతున్న అంతరాత్మ మీదికి జాలిగా నడిచొచ్చి
తను సృష్టించిన ప్రపంచాన్ని
నాకు ప్రజంట్ చేసి
మళ్లా గ్లాసు మీదికి వెళిపోతూంది.

ఆశ్చర్యంలోంచి తేరుకుని చూసేసరికి
తనే నిర్మించుకున్న సమాధిలోకివెళిపోతున్న 'యోగి'లా
కొవ్వొత్తి అదృశ్యమై
అదే గ్లాసు మీద ఒక సమాధి మిగుల్తుంది.

నాలో
తను సృష్టించిచ్చిన ప్రపంచం మాత్రం
క్షణక్షణానికీ ఎదుగుతూ వుంటుంది!

# గ్రంథ విమర్శలు

## శ్రీ మద్భగవద్గీత

[ఆంధ్రీకరణ కావ్యకర్త: అభినవ వేమన, సరసకవి సుధాకర, విద్వాన్, శివశ్రీ ఇ. శివరామారెడ్డి, ఎం. ఎ. డెమ్మిసైజు 26+316 పేజీలు. గట్టిబైండు. వెల: రు. 20. ప్రకాశకులు శివశ్రీ విద్యాసేవాసంస్థ, 6/52 నబీకోట, కడప, ఆం. ప్ర.]

ఇటీవల కొన్ని యేళ్లనుంచీ ఆంధ్రవిద్వత్కవుల దృష్టి భగవద్గీత పైకి మళ్లింది. తత్ఫలితంగా ఆ ఆధ్యాత్మిక గ్రంథానికి ఎన్నో టీకా తాత్పర్యాలు, పద్యానువాదాలూ విరివిగా వస్తున్నవి. కొన్ని సంస్కృతమూలంతోసహా ఉన్నవి. కొన్ని మూలరహితంగా ఉన్నవి. కొత్తగా వెలువడిన అనువాదాలలో ఇది ఒకటి. ఇందులోని విశేషమేమిటంటే--పుటకు ఎడమప్రక్క మూలశ్లోకం, దానిక్రింద తెలుగు తాత్పర్యం, కుడివైపు పుటలో పద్యానువాదం ఉన్నవి. గ్రంథాదిని గీతామాహాత్మ్య శ్లోకాలు, తాత్పర్యం, పద్యానువాదం కూడా ఇయ్యబడినవి.

భగవద్గీతలోని విషయం దురవగాహమైనది. దానిని ఇతర భాషల్లో తెలుసుకోవాలంటే టీకా తాత్పర్యాలే చాలా అనుకూలమైనవి. ఆ తర్వాతిస్థానం వచనానువాదానిది. పద్యంలో గీతార్థాన్ని వివరించడం కష్టసాధ్యం. వృత్తాల్లో అనువదిస్తే యతిప్రాసల గొడవ. వ్యర్థపదాల చేరిక, అర్థానవగతి సంభవింపవచ్చు. అందుకనే పద్యానువాదం చేసేవారు అనుష్టుప్ ఛందస్సుకు అనుకూలమైన గీత పద్యాలనే తీసుకోవడం కొన్ని దశాబ్దాలుగా ఆచారంలో ఉంది.

ప్రస్తుతానువాదకర్త శివశ్రీగారు కూడా తమ భాషాంతరీకరణానికి గీతపద్యాలనే స్వీకరించారు. ఇందులో మరొక విశేషం. మూలంలోని సంస్కృత పదాలను యథాతథంగా తెలుగులో పెట్టితే మూలాభిప్రాయం సులభంగా అర్థంకాదనే భావంతో వీలయినంతవరకూ తత్సమేతర పదాలనే యిందులో వాడారు. ఇది సముచితమైన పద్ధతి. ఒకవేళ సంగ్రహంగా ఉండే అనువాదం వెంటనే అర్థంకాకపోయినా— ప్రక్క పుటలోని తాత్పర్యాన్ని చూచి అభిప్రాయాన్ని గ్రహించవచ్చును.

భగవద్గీతకు తాము చూచిన వ్యాఖ్యలు సంస్కృతంలోనే నూటికిపైగా ఉన్నవని డాక్టర్ పుట్టపర్తివారు వ్రాస్తున్నారు. ఇక ఇతర భాషల్లో వ్యాఖ్యలు, అనువాదాలు అసంఖ్యాకంగా ఉండడంలో ఆశ్చర్యంలేదు. ఎన్ని అనువాదాలు వచ్చినా, వస్తున్నా, భగవద్గీతపై ఉండే ఆదరంవల్ల, అందులో ప్రతిపాదితమైన విషయంవల్ల - ఇంకా వ్యాఖ్యలు, అనువాదాలు వస్తూనే ఉంటాయని గ్రహించవచ్చును. ఇంతవరకూ వెలువడిన ప్రశస్తానువాదాలలో ఇది ఒకటి అని చెప్పవచ్చును. అనువాద, వివరణ పద్ధతులకు ఒక్క ఉదాహరణ—పుస్తకం తెరవగా కనబడినది —

మూలం—

"బ్రహ్మణ్యాధాయ కర్మాణి
సంగం త్యక్త్వా కరోతియః,
లిప్యతే న స పాపేన
పద్మపత్ర మివాంభసా"

[కర్మసన్న్యాసయోగము. పుట. 116]

**తాత్పర్యము—**

ఎవడు, తాను జేయు కర్మములను పరమాత్మ కర్పించి, సంగమును (ఆసక్తిని) విడిచి చేయుచున్నాడో, అట్టివాడు తామరాకు నీటిచే అంటబడనట్లు పాపముచే నంటబడకుండును.

**అనువాదము—**

"స్వార్థమింతయు లేక బ్రహ్మార్పణముగ
సర్వకర్మల నిరపేక్ష సలుపువాని
అంబుజాతంబునం జల మంటనట్లు
పాపజాలంబు లంటక పాటిపోవు"

ఇక్కడ "సంగం త్యక్త్వా" అనే దానికి "స్వార్థమింతయు లేక" అనిన్నీ, 'లిప్యతే న స పాపేన" అనేదానికి "పాపంబులంటక పాటిపోవు"ననిన్నీ అనువాదంలో చెప్పడం ఎంతో చక్కగా ఉన్నది.

రచన అంతా ఈ పద్ధతిలోనే సాగింది.

ఆంధ్రీకర్త స్వార్థత్యాగి అని ఇందులో ఈయబడిన ఆయన సంగ్రహ జీవిత చరిత్రవల్ల తెలుస్తున్నది. అట్టివారే గీతానువాదానికి అర్హులు. ఇట్టి గ్రంథం అచ్చు కావడానికి తిరుమల తిరుపతి దేవస్థానంవారు కొంత ద్రవ్యం సహాయం చెయ్యడం ప్రశంసనీయం. డాక్టర్ పుట్టపర్తివారు, డాక్టర్ దివాకర్లవారు వీనిపై చక్కని అభిప్రాయాలిచ్చారు. అందరూ ఆదరింపవలసిన గ్రంథం యిది.

**"అంగీరస"**

## కొయ్య గుర్రం

[నగ్నముని. వెల: రు. 5—00 లు. ప్రతులకు: సృష్టి ప్రచురణ; హైదరాబాదు.]

"అశ్వం
వేగానికి విశ్వాసానికి చిహ్నం
విజయానికి పరిపాలనా దార్ఢ్యానికి సంకేతం
కొయ్య గుర్రం
స్తబ్దతకి మూర్ఖతకి

అజ్ఞానానికీ అహంకారానికి
అసమర్థ పరిపాలనకీ ప్రతీక.''

ఈ పాదాలు తన కవితా సంకలనానికి మకుటమైన 'కొయ్య గుర్రం' యొక్క ప్రతీకార్థాన్ని వెల్లడిస్తున్నాయి. అశ్వం ఆరోగ్యం గల వ్యవస్థకు ప్రతీక అయితే కొయ్యగుర్రం అనారోగ్యకరమైన, అసహ్యమైన వ్యవస్థకు ప్రతీక. 1977 నవంబరులో కోస్తా ఆంధ్రలో భీకరంగా నాట్యం చేసిన పెనుతుఫాను ఇతివృత్తంగా ఈ కవితా సంకలనం ఆవిర్భవించినది. 'ఉదయించని ఉదయాలు' దగ్గర నుంచి నేటి దాకా నగ్నముని కవిత్వం రాస్తూనే ఉన్నారు. ఆయన కవిత్వానికి వ్యంగ్యం ప్రాణప్రదమైన లక్షణంగా కనుపించడం యథార్థమైన విషయం. వచన కవిత్వాన్ని నడపడంలో ఆయన సిద్ధహస్తుడు. ఇదంతా కవితా శిల్పం సంగతి. విషయదృష్ట్యా 'కేశవరావు' నుండి నగ్నమునిగా పరివర్తన చెంది దిగంబర కవిత నుండి, విప్లవ కవితకు ఆయన ప్రస్థానించాడు. ఆ పిమ్మట వి. ర. సం. నుండి తప్పుకొన్నాడు. కారణాలు ఆయన వ్యక్తిత్వానికి సంబంధించినవి. కవితాఇతివృత్తం సామాజికం. అది ఏ సిద్ధాంతం పునాదిగా ఉన్నది ? అని ఆలోచించడం వివాదానికి దారి తీయడమే కాగలదు.

కష్టపడేవాడు దోపిడీ చెయ్యబడుతున్నాడు అని చాలమంది చెబుతారు. కొంతమంది సాదాగా చెబుతారు. కొంతమంది కవితాత్మకంగా చెబుతారు. అట్లా కవితాత్మకంగా చెప్పే చాలా తక్కువమంది ఆధునికులలో నగ్నముని ఒకడు.

''పండించిన వాడి నోటిలో మొలిచేది మాత్రం జిల్లేడు
కళ్ళలో కదిలేవి వెలుగు కిరణాలు కాదు కన్నీళ్ళు.''

తుఫాను బీభత్సంలో దోపిడికీ వ్యంగ్యం చెయ్యడం నగ్నముని ప్రత్యేకత.

''మనిషి ఊపిరి కొయ్యడానికి
కత్తి కానక్కర్లేదు
జీవితాల్ని చెరచడానికి
మరుక్షణం మృత కళేబరం చెయ్యడానికి
తుపాకులూ యుద్ధాలే రానక్కర్లేదు.

నూరేళ్ళు నవ్వుతూ తుళ్ళుతూ వేయి రేకలతో
వెలుగులు వెదజల్లుతూ పుష్పించవలసిన బతుకుల్ని
భగ్గున మండించెయ్యడానికి పెట్రోలే అక్కర్లేదు
ఉప్పునీళ్ళు చాలు.''

అని ఆనాటి ఉప్పెన కెరటం కావించిన దుర్మార్గాన్ని చెబుతాడు.

మరణం ప్రతివాడికి సహజమే అయినా; గొప్పవాడి మరణానికి, దిక్కులేనివాడి మరణానికి వ్యత్యాసం ఉంది. బతుకులోఉన్న వ్యత్యాసమే చావులో కూడా ధ్వనింపచేశారు నగ్నమునిగారు.

''జీవితాంతం పదవిని ఒంటినిండా బట్టగా
చుట్టుకున్నవాళ్ళు మరణిస్తే
వినయంతో విషాదంగా తలదించుకుంటుంది
దేశమ్మీద ఎగిరే జెండా

దిక్కులేని జనం వేనకువేలు దిసమొలలో
జీవితాంతం దుమ్ములో బతికి
కళ్ళముందే క్షణంలో దుమ్ములో కలిసిపోతే
జెండా కన్నీరు కార్చదు.''

ఇట్లా కొయ్య గుర్రం కావ్యం ఆనాటి తుపాను బీభత్సాన్ని, నేటి వాస్తవాన్ని ధ్వనింపచేస్తున్న ఆధునిక కావ్యం. ఇది మహా కావ్యం అవునా ? కాదా ? అనే చర్చ ఆయన కవిత్వంమీద కంటె ఆయనమీద అభిమానం, దురభిమానం కలవాళ్ళకు వదిలేద్దాం !

## కళలు, సాహిత్యం ఎవరికోసం?

(మావో అభిప్రాయాలు)

[వెల : రు. 1-00. ప్రతులకు : సృజన, హన్మకొండ, వరంగల్.]

కళలు, సాహిత్యం ఎవరికోసం? అనేఅంశంపై మావో ప్రసంగాలు, పత్రికల సంపాదకీయాల సారాంశం ఈ పుస్తకం. ప్రజాచైతన్యానికి, ప్రజా పురోగమనానికి అంకితమైన రచయితల బాధ్యతల గురించి మావో ఎక్కువగా మాట్లాడినాడు. ప్రజా రచయితలు మార్క్సిజం —లెనినిజం ఎందుకు చదవాలో మావో స్పష్టంచేశాడు ''మనం మార్క్సిజం—లెనినిజం చదవడం మన రచనల్లో ఆ శాస్త్ర చర్చలను, సిద్ధాంత ఉపన్యాసాలను గుప్పించడానికి కాదు. సమాజాన్నీ, సాహిత్యం, కళలనూ గతి తార్కిక భౌతికవాద దృష్టితోనూ, గతి తార్కిక చారిత్రిక దృష్టితోను పరిశీలించి అర్థంచేసుకోడానికే మనం వాటిని చదవాలి. మార్క్సిజం — లెనినిజం వాస్తవాలను సరిగా ఆకళింపు చేస్తుందితప్ప తానే వాటిని తయారుచేయదు.''

కవిత్వానికి లేక సాహిత్య ప్రక్రియలకు వాటి ఉత్తమత్వ, అధమత్వ నిర్ణయాలకు కేవలం శిల్పమే ప్రధానమని, కేవలం సిద్ధాంతమే ప్రధానమని విరుద్ధాభిప్రాయాలు మనకున్నాయి. వాటిపై మావో సరిఅయిన అభిప్రాయాన్ని వెల్లడించి ఉన్నాడు. కేవల నినాదం కళ కాదని మనం గ్రహించాలి. ''సాహిత్యంలో శైలే సమస్తమూ అని, దాని పాత్రను ఆకాశాని కెత్తారు. రచయితలకు, కళాకారులకు కళాత్మక శైలి అవసరమని మార్క్సిస్టు—లెనినిస్టులూకూడా అభిప్రాయ పడతారు. రాజకీయంగా ఎంత అభివృద్ధికర రచనలైనప్పటికీ కళాత్మకత లోపించిన రచనలు శక్తివంతంగా ఉండవు. అయితే శైలీ ఒక సాధనమూ, పద్ధతి మాత్రమే. కాని ఎన్నటికీ మూలాధారానికి ప్రత్యామ్నాయం మాత్రం కాదు.''

ఈ చిన్న పుస్తకంలో ప్రజా రచయితలు నిజమైన రచయితలుగా అవతరించడానికి చేయవలసిన కృషి అంతా సహేతుకంగా మావో వివరించడం ఉంది. ప్రజా కళల సృష్టికి కారణభూతమవుతున్న రచయితలు ఈ పుస్తకాన్ని చదివి తీరవలసినదే.

## ష రా మా మూ లే
(క వి తా సం పు టి)

[డా॥ కొలకలూరి ఇనాక్. వెల: రు. 10–00, ప్రతులకు: జ్యోతి గ్రంథమాల, 129, టి. నగర్, అనంతపురం–515 001]

కొలకలూరి ఇనాక్ మంచి కథకులుగా పేరు పొందినవారు. మంచి కథకుడు. మంచి కవిత్వం కూడా రాయగలడని ఈ సంకలనం బుజువు చేస్తోంది. మనిషి పురోగమనం మీద ఈ కవికి ప్రగాఢమైన విశ్వాసం ఉంది.

''వేల ఏళ్ళకాలం
వేసిన ముతక సంప్రదాయాల సంకెళ్ళు
వందలేళ్ళ నాగరక జీవితం
వడ్డించిన ముడి ఆచారాల బండరాళ్ళు ఛేదిస్తూ తొలగిస్తూ
ఇవాళ మనిషి విజృంభిస్తున్నాడు.''

అంటారు కవిగారు.

వచన కవిత్వానికే కాదు ఏ కవితా ప్రక్రియకైనా వలసిన చమత్కృతి, శబ్దాల కూర్పు, భావధ్వని ఇనాక్‌గారి కవిత్వానికి లక్షణాలుగా కనబడతాయి. దోపిడీని చిత్రించడంలో ఆయన అవలంబించిన పద్ధతి పై భావనకు బలం.

''ఒకడు నోటిని ఫేక్టరీగా కడుపును గోడౌన్‌గా
మందులను లారీలుగా తోలుకొంటుంటే
మరొకడు నాలుకను ఆకురాయిగా డొక్కను ఇనుం ముక్కగా
మందులను రవ్వలుగా రేవుకొంటుంటే
వాడే బట్టల దుకాణం వంటికి చుట్టుకొని
కేతిగాడిలా ఊరేగుతుంటే
వీడి గోచిపాత సిగ్గుపడి జారిపోయి
దిగంబరానికి మాసిక గుడ్డయితే
మనం ఏం చేసేట్టు
దేశం ఏమయ్యేట్టు''

తెల్లవాడి దొరతనం మారినా, ప్రజా ప్రభుత్వంలో మనం జీవిస్తున్నా దేశ ఆర్థిక స్వరూపంలో ఏ మాత్రం మార్పు రాలేదని ఇనాక్‌గారు ఖచ్చితంగా చెబుతున్నారు. పర బానిసత్వంలోంచి, స్వబానిసత్వంలోకి దేశం ప్రస్థానించడం ఈ కవి బాగా గమనించారు.

''అయితే ప్రజా ప్రభుత్వంలోనూ
జమిందార్లు రాజులు మునులు దేవుళ్ళు
సింహాసనాలెక్కి రాజ్యాలు పాలిస్తున్నారు
దేశంలోని స్థిర చరాస్తుల కొందరే పంచుకొంటున్నారు
దేశ పరిణామమూ మామూలే
సంపద పంచుకోవటమూ మామూలే''

'ఇదెక్కడి శక్తి' అనే గేయంలో తుఫాను బీభత్సం కవితాత్మకంగా వర్ణించడం జరిగింది. భావ చిత్రాలు వెలయించడంలో కవికిగల శక్తి మెచ్చతగింది.

''ఇన్నేళ్ళయినా
నడకలో వాడుపు నడలని వృద్ధ పృథ్వి
పెట్టుకొన్న నుదుటి బొట్టు సూర్యబింబం
ఈ ఉగాదినాడు కూడా
ఆ పాత సూర్యుడే ఉదయించాడు''

మొదలైన కవితా ఖండికలలోని పాదాలు ఉత్తమ భావ చిత్రాలు. వచన కవితా గుణానికి బలాన్నిచ్చే కావ్యాల్లో ఇదొకటి.

## భారతీయ పునరుజ్జీవనం

[డి. రామలింగం. వెల: రు. 6–00లు, ప్రతులకు: 1) యువభారతి, 5, కింగ్స్‌వే, సికిందరాబాద్ – 500 003. 2) యువభారతి కార్యాలయం, ఆంధ్రసారస్వత పరిషత్ భవనములు, తిలక్‌రోడ్డు, హైదరాబాదు–500 001.]

'యువభారతి' సాహిత్య సంస్థ ఒక దశాబ్దంన్నరనుంచి తెలుగు సాహిత్యానికి, సంస్కృతికి సేవ చేస్తున్న విషయం ఆంధ్ర పాఠక లోకానికి క్రొత్త కాదు. నిర్మాణాత్మకంగా కృషిచేస్తున్న ఇట్లాంటి సాహిత్యసంస్థలు ఆంధ్రదేశంలో అతి తక్కువగా ఉన్నాయి. ఈ సంస్థ నుండి వచ్చిన మరొక ఉత్తమగ్రంథం భారతీయ పునరుజ్జీవనం. డి. రామలింగంగారు తెలుగు పాఠకలోకానికి సుపరిచితులు. ఈ గ్రంథాన్ని ఎనిమిది ప్రకరణాలుగా విభజించి ఒక్కొక్క ప్రకరణంలో ఆయా అంశాలను స్థూలంగా వివరించారు.

యూరపు పునరుజ్జీవనం భారతదేశ పునరుజ్జీవనంపై ప్రభావం, ఆంగ్లేయులపాలన, వారు నేర్పిన ఆంగ్లవిద్య భారతీయ పునరుజ్జీవనానికి ఎట్లు సహకరించినది ఈ గ్రంథంలో విశ్లేషించడం జరిగింది. భారతీయ పునరుజ్జీవనానికి మూలపురుషుడైన రామ మోహనరాయ్ అనంతర మహానుభావులు వాళ్ళు సాధించిన విశేషాలు, జాతీయభావం, స్వాతంత్ర్యోద్యమం, సంస్కరణోద్యమాలు సాహిత్యంలో క్రొత్తపోకడలు, ఆంధ్రదేశంలో పునరుజ్జీవనం, దానికి మూలకారకులైన కందుకూరి, గురజాడ మొదలైనవారి రచనలు ఇత్యాదులుగా ఈ గ్రంథంలో వివరణ సాగింది.

గ్రంథవిస్తరభీతి సూక్ష్మాంశ పరిశీలనకు అవకాశమీయక పోవడంవల్ల భారతీయ పునరుజ్జీవన మహోజ్జ్వల చరిత్ర స్థూలంగా మాత్రమే ఈ గ్రంథంలో దర్శనీయమైనది. ఇవ్వాల్టితరం చదువ తగ్గ గ్రంథం ఇది. 'యువభారతి'వారి కృషికి అభినందనలు.

పైనే కాకుండా, గాంధిమహాత్ముడు, పటేలు, సుబాస్‌చంద్రబోస్, తిలక్, నెహ్రూ మొదలైన నాయకులపై రాసిన అనేక పద్యాలు ఇందులో ఉన్నాయి. నిమ్మకాయల సుబ్బారావుగారు అన్నిభావాల్ని, అన్ని మతాల్ని సమదృష్టితో చూడగలరనటానికి ఈ సంకలనమే ఉదాహరణ.

## వెలుగు

[ఆధునిక సాహిత్య కరపత్రిక. ఎడిటర్ : వెంపలి వెంకట శివ ప్రసాద్, వెల : 0–60 పై.]

ఈ కరపత్రంలో అద్దేపల్లి రామమోహనరావుగారితో ఒక ఇంటర్వ్యూ. 'మారిన కాలం—మారని వ్యవస్థ' యన్నంరెడ్డి వెంకట రెడ్డి, 'అగ్ని ప్రశ్న' సురీడు 'ప్రైజుకోసం పుస్తకం' వెంపలి వెంకట శివప్రసాద్‌గార్ల మినీకథలు,కొన్ని మినీకవితలు ఉన్నాయి. ఇంటర్వ్యూలో చెప్పుకోతగ్గ సాహిత్యగత అంశాలేమీ లేవు. మినీకథలు ఈ కాలపు చైతన్యానికి సరిపోయినాయి. ఒకటి రెండు మినీకవితలు ఉదాహరణ ఇస్తాను. "వేశ్య" అని శెట్టి ప్రభాకరరావుగారి గేయం

"తను శవమై
ఒకరికి వశమై
తనువు పుండై
ఒకడికి పండై
ఎప్పుడూ ఎడారై
ఎందరికో ఒయాసిస్సై"

విరియాల లక్ష్మీపతిగారి గేయం

"వృశ్చికమా !
నీకింత విషం ఎలా వచ్చింది ?" — ప్రశ్న

"నే కుట్టిన
ఒక రాజకీయవేత్త
మస్తిష్కంలోంచి." — జవాబు

## శ్రీ వెంకటేశ సారస్వత వినోదిని

[బయిరెడ్డి సుబ్రహ్మణ్యం. వెల : రు. 1–00, ప్రతులకు: రచయిత, రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు, నెహ్రూ మునిసిపల్ హైస్కూలు, శాంతిపురం, తిరుపతి–517 502.]

ఇది బాలలకు ఎక్కువగా వినోదాన్నిచ్చే కవిత్వం. పద్యంలో ప్రశ్నలు దానిక్రింద జవాబులు ఇచ్చారు సుబ్రహ్మణ్యంగారు. భావ కవిత్వం, గర్భ కవిత్వం, చిత్ర కవిత్వం, దాగుడు పదములు మొదలైన శీర్షికలతో పద్యాలు సాగినవి. కవిగారు 108 ఆటవెలది పద్యములతో గ్రంథము రాసినట్లు, అది అముద్రితమైనట్లు కావ్యాంతంలో చెప్పే కొన్ని పద్యాలు అచ్చువేశారు. అవి కూడా బాలబాలికలకు మంచి వినోదాన్ని కలుగజేస్తాయి. ఉదాహరణకు

"కలదు పరిమళమ్ము కాని పుష్పము కాదు
కలదు రగులు గుణము కాదు దివిటీ
కలదు పొగయుఁ గాని కాదు కర్పూరమ్ము
దీని భావమేమి తిరుమలేశ ?"

అని పద్యం రాసి దానికి జవాబు ఊదువత్తి అని సమాధానం ఇచ్చారు. పిల్లలకు బాగా ఉపకరించే గ్రంథ మిది.

## మానవులం

[కె. ప్రభాకర్. వెల : రు. 5–00 లు. ప్రతులకు : (1) దేశి బుక్ డిపో, నారాయణగుడ, హైదరాబాద్. (2) నవయుగ బుక్ హౌస్, సుల్తాన్ బజార్, కోటి, హైదరాబాద్–500 001 (3) రాజీ బుక్ సెంటర్, 62, పాండీబజార్, మద్రాస్ – 600 017.]

ఈ సంకలనానికి పలువురు సినీ కళాకారులు పరిచయాలు రాశారు. రచయిత చివర పేజీల్లో విశాలమైన కాన్వాస్‌లో కృతజ్ఞతలు చెప్పుకొన్నారు. ఈరెండు విషయాలకంటె కవి గళము, కలము బలవత్తరమైనవని, శక్తివంతమైనవని ఈ కవితాసంకలనం ఋజువు చేస్తున్నది. ప్రభాకర్‌గార్కి ఈ వ్యవస్థపైన, వ్యవస్థాగత దుష్టశక్తులపైన కావలసినంత కసి ఉంది. ఆ కసితోనే 'మాటల్ని ఈటెలు'గా మార్చి కవిత్వం రాశారు. సామాజిక స్పృహతో వచ్చే కవిత్వమంతా నినాదాలప్రాయమనే సాహితీ న్యాయమూర్తులు మనకు కావలసినంత మందున్నారు. అట్లాంటి మేధావులు ఇట్లాంటి కవిత్వాన్ని చదివితే బాగుండును.

'కవి కంఠం చితిమంట
కవి కంఠం డైనమైట్
కవి కంఠం క్లోరోఫారమ్.'

అనే పాదాల్లో కవిత్వానికిగల మేల్కొల్పేశక్తి, జోకొట్టి నిద్రపుచ్చే శక్తి రెండూ ధ్వనిస్తున్నాయి. కవిత్వం మనిషికి ఉపకారం చెయ్యగలదు. అట్లానే అపకారం చెయ్యగలదు. మంచి కవిత్వం, చెడ్డ కవిత్వం అనే తేడా అందుకనే కదా వచ్చింది. ప్రభాకర్‌గారు ఆయన కవితా తత్త్వాన్ని ఇట్లా చెప్పుకొన్నారు.

'నాకు నచ్చిన ఇతివృత్తం తీసుకొని
నాకు వచ్చిన భాషలో రాసెద
జనులకు నచ్చకున్న నొచ్చుకోను
జనులు మెచ్చుకున్నా ఎగిరిపడను.'
'ఇతరుల కోసం నన్ను నేను
చితిమంటగా మార్చుకొని
భోగిమంటగా మారిపోతా !
మంట లేనిదే వేకువ జనించదు
మంట లేనిదే తిమిరం నశించదు
మంట లేనిదే తూర్పు భాసించదు !'

'గుండెలతో కొండలను కూడ పిండిచేసే
జాతి జండాల కింద గుండాలున్న దేశం ఇది'
'ప్రపంచమే పెద్ద హాస్పటల్
ఒక్కొక్కడు మహాపేషంట్
కవిత్వం మందుతున్న పొయ్యి
తవ్వుకున్న గొయ్యి.'

పై పాదాలు ప్రభాకర్‌గారి కవితా శక్తికి, సామాజిక దృష్టికి మంచి ఉదాహరణలు. ఈ కవికి మంచి భవిష్యత్తు ఉంటుందని (కవిగా) నా ఆశ.

## శ్రీశ్రీ నిరాస శతకము

[సోమయాజుల శ్రీరామదత్తాత్రేయశర్మ. వెల: రు1-00, ప్రతులకు : రచయిత, ఇండవల్లి, తణుకు తాలూకా. ప.గో. జిల్లా.]

ఇది ఆటవెలది ఛందంలో నూట తొమ్మిది పద్యాలు గల శతకం. 'మీ కృషికి ఆశీర్వచనములు. ఆ శ్రీనివాసుడు మిమ్ము సర్వదా సిరిసంపదలతో రక్షించుగాక' అని ఒకరు; 'పద్యములు ప్రాతః కాలమున లేవగనే పఠించి తరించవలసినవిగా నున్నవి' అని మరొకరు; 'శ్రీ వెంకట రమణమూర్తి తమకు నాయురారోగ్య భాగ్యము లిచ్చి సర్వదా రక్షించమని' ఇంకొకరు; 'ఎల్లరను శ్రీ శ్రీనివాసు డాయురారోగ్య భాగ్యము లొసంగి రక్షించుగాక' అని మరి ఒకరు కవిగారికి లేఖలలో రాసినారు. అంతకంటె ఇంక సమీక్ష మాత్రం వేరొకటి ఏమి రాస్తాం. కవిగారి కవిత్వానికి ఒక ఉదాహరణ

'కష్ట నిష్ఠురములు కలిగించి పరికించి
తుష్టి పొందిగాని తోడు పడవు
తమ పరీక్ష నెగ్గ తరమౌనె నరులకు
శేష శైలవాస! శ్రీనివాస.'

## తెలుగులో కవితా విప్లవాల స్వరూపం

['కవిసేన'కు జవాబు. త్రిపురనేని మధుసూదనరావు. వెల : రు. 1–00, ప్రతులకు : సృజన, వరంగల్ – 506 001]

'తెలుగులో కవితా విప్లవాల స్వరూపం' అనే ఈ సిద్ధాంతగ్రంథం వేల్చేరు నారాయణరావుగారిది. దానిపై అనేక పత్రికలలో సమీక్షలు రావడం ఆధునిక సాహిత్యాన్ని అధ్యయనం చేస్తున్నవారికి తెలియని విషయం కాదు. ఒక సిద్ధాంత గ్రంథంలో అల్పమైన లోపాలు ఉండవచ్చు. విచిత్రమేమిటంటే — శేషేంద్రశర్మగారి కవిత్వాన్ని నారాయణరావుగారు పట్టించుకోనందుకు శర్మగారు ఆ గ్రంథంపై స్టెన్సిల్ కాపీలతో విరుచుకుపడ్డారు. నిజానికి కవిసేన ఒక ఉద్యమం కాదు. వెనుక ఒక సమీక్షకుడు 'మయసభలో దుర్యోధనుని'లా అని శేషేంద్ర శర్మగారిని సంబోధించినట్లు నాకు గుర్తు.

అదే యథార్థం శేషేంద్రశర్మగారు రాసిన సంగతులపై త్రిపురనేని మధుసూదనరావుగా రిచ్చిన సమాధానం ప్రస్తుత సమీక్షా గ్రంథం. విప్లవ రచయితల దృక్పథంలోంచి మధుసూదనరావుగారు సమాధానమిచ్చారు. శేషేంద్రశర్మగారికి సమాజంగాని, దానితాలూకూ వేదనగాని పట్టదని ఆయనకు వైయక్తికమైన కీర్తి అత్యంతావశ్యకమని, ఆ కీర్తి కూడా ఉన్న పళంగా వచ్చేయాలని ఆయన విమర్శ చదివిన ఎవరైనా గ్రహించగలరు. ఇతః పూర్వం కీర్తి లభించిన కవులెవరూ 'మమ్మల్ని గుర్తించండి' అని బజారుమీద పడలేదు. దేశంలోని ప్రజలు వాళ్ళని గుర్తించాలి. "అబద్ధాలతో, స్తోత్రాలతో, వంచనలతో, అనుకూల దుష్ట ప్రచారంతో, ఆత్మశ్లాఘనలతో దేశంమీద పడి"నంత మాత్రాన గుర్తింపురాదని నా మనవి. శేషేంద్రశర్మగారి కవిత్వానికి ప్రజలకు ఎంతమాత్రం సంబంధం లేదు. "కవిత్వ భాష వాచ్యార్థ ప్రయుక్త భాషవలె 'అర్థం' అవడం అనే సాధారణ వ్యవహారానికి లొంగిదు" అనిన్నీ "ఛందోబద్ధ కవిత, వచన కవిత, వల్లకాడి కవిత అని రకరకాల పేర్లతో ముసుగులు మార్చి మార్చి తెలుగు జనాన్ని శతాబ్దాలుగా వేధిస్తూవచ్చిన కవిత్వ నామక వాచ్యార్థ ప్రధాన రచనలు" అని తెలుగు కవిత్వాన్ని మొత్తంగా కొట్టిపారేసిన శేషేంద్ర శర్మగారికి సాహిత్యంలో ప్రజాదృక్పథం ఉంటుందని తెలిసినవారెవ్వరూ అనుకోరు.

శేషేంద్రశర్మగారు ఇతరుల గ్రంథాలకురాసే ప్రశంసావాక్యాలు చూస్తే వారి సాహిత్యగత సంస్కారం ఇట్టే అర్థం అవుతుంది. 'రస మంజరి' సాహిత్య వ్యాస సంపుటికి కొన్ని ప్రశంసావాక్యాలు చూడండి. "వచన కవితా పంకిలంలో రసాస్వాదనచేసే మహానుభావులు కూడా ఉన్నారు. వాళ్ళ దళసరి చర్మం, తెలుగుదేశపు వాతావరణం వాళ్ళని రక్షిస్తున్నాయి. ఈమధ్య ఒక డిగ్రీదారి, విమర్శక శిఖండి ఒకడివచన కవితలో వక్రోక్తి ఉందని రాస్తే చదివి ఆశ్చర్యాఘాతం తగిలి పడిపోయాను. ఈ శిఖండులు కవిత్వపు తామర కొలనులో ప్రవేశించి పువ్వులను, ఆకులను, తూళ్ళను కొమ్ములతో కుమ్మి అవతల పారేస్తున్నారు. అయితే వచన తృణంలో వక్రోక్తిని చూచిన ఈ మహానుభావులు వట్టి కుక్షింభరులు, బ్రతుకుతెరువు సాహిత్యపరాయణులు, ఆధునిక సాహిత్యంలో ఇదొక కిరాయి మూక" అన్నారు శేషేంద్రశర్మగారు. కిరాయిమూక అనే మాటకు అందరికంటె శేషేంద్రశర్మగారికే అర్థం బాగా తెలిసుండాలి, ఆయన మొదట్నించి అవలంబించినది ఇదే పద్ధతి కనుక.

తెలుగులో కవితా విప్లవాల స్వరూపం, దానిపై శేషేంద్రశర్మగారి ఆంగ్లంలోఉన్న స్టెన్సిల్ విమర్శ, త్రిపురనేని మధుసూదనరావుగారి సమాధానం ఈ మూడు చదివితే మధుసూదనరావుగారి అభిప్రాయానికి ఆధునిక కవితానుశీలురు రావడం నిశ్చయం. ఆ అభిప్రాయం ఇది. "మీమీదమీకు ఎన్నో భ్రమలున్నాయి. దేశంలో ఎవరికీ ఏమీరాదని అన్నీ నాకేవచ్చునసే దురహంకారంతో బ్రతుకుతున్నారు మీరు. ఆత్మ విమర్శ అనేది లేకుండా ఆత్మభ్రమలో చిక్కుకుపోయారు. పాండిత్య ప్రకర్ష అనే పిల్లచేష్ట మీకు ఒక అలవాటుగా మారిపోయింది. నైరాశ్య అసహన రోగంతో బాధపడేవాడు నాకుతప్ప ఇంకెవడికీ ఏమీ రాదనే కేకలతో కాలం గడుపుతుంటాడు. ఈ స్థితినుంచి బయట పడకపోతే మిమ్మల్ని ఎకడమిక్ స్తనంధయుడుతప్ప ఎవరూ పట్టించు

# మనవి

అనివార్య కారణాల వలన ఈ సంచిక తరువాత కొన్ని నెలలపాటు 'భారతి' ప్రచురణ నిలిపివెయ్యవలసి వస్తోంది.

త్వరలోనే పరిస్థితులుమారి 'భారతి' మళ్లీ సక్రమంగా వెలువడగలదని ఆశిస్తున్నాము.

చందాలు కట్టినవారికి మిగులు మొత్తాలని తిప్పిపంపే ఏర్పాటు చేస్తున్నాము.

వ్రాత ప్రతులని తిప్పి పంపే ఏర్పాటు కూడా చేస్తున్నాము. వాటి విషయమయి ఉత్తరాలు రాయవద్దని రచయిత్రులనీ, రచయితలనీ కోరుకుంటున్నాము.

అందరికీ కృతజ్ఞులము.

భారతి
సంపాదకుడు

# స మా లో చ న

(చతుర్థ ప్రత్యేక వార్షిక సంచిక)

[జాతీయ సాంస్కృతిక పక్షపత్రిక. సంపాదకుడు : విద్వాన్ బులుసు సీతారామశాస్త్రి, రాజమండ్రి. విడిప్రతి 0–60 పై.]

ఇందులో సాహిత్యగత వివిధ అంశాలపై పలువురు ప్రముఖుల వ్యాసాలున్నాయి. పానుగోటి అర్జునరావుగారి 'వసుచరిత్ర—నాటకీయత అభిజ్ఞాన శాకుంతలానుసరణము' అనే వ్యాసం విషయ వివరణాత్మకంగా ఉంది. 'సాహిత్యసృష్టిలో ప్రేరణ' అనే వ్యాసం ఆర్. ఎస్. సుదర్శనంగారి విమర్శకస్థాయిని బుజువు చేసేది. 'నవసమాజ నిర్మాణంలో రచయితల బాధ్యత' సోమసుందర్‌గారి దృక్పథాన్ని తెలియజేస్తోంది. ఇట్లే అనేక వ్యాసాలు. సాహితీప్రియులు చదవదగిన పత్రిక.

# అ వ గా హ న

[ఆధునిక ఆలోచనా వీచిక—3. వెల : రు. 2–00లు. ప్రతులకు: బెహరా సత్యం, బుక్స్ అండ్ బుక్స్, బొండాడవీధి, విజయనగరం—531 201.]

వర్తమానకాలంలో ఇలాంటి పత్రికలను నడపడం కష్టమైన విషయం అని సాహిత్యపు విలువలను గ్రహించిన వారందరికితెలుసును. నాగరికత వ్యాపార సంబంధిగా మారినపుడు సాహిత్యంకూడా వ్యాపార విలువల్ని ప్రతిబింబించేదిగానే ఉంటుంది. అట్లాంటి సాహిత్యం టన్నులుకొద్దీ అమ్ముడుపోతుంది. సమాజం ఆలోచనను ఆరోగ్యవంతమైన, అభివృద్ధికరమైన మార్పువైపు మళ్ళించే పత్రికలు జీవించడమే కష్టమైన ఈ స్థితిలో విజయనగరంనుంచి ఇట్లాంటి ఆలోచనా వీచికలు వెలువడుతున్నందుకు మానేపల్లి సత్యనారాయణగార్ని వారి చేదోడు వాదోడుగా పనిచేస్తున్న వారి మిత్రబృందాన్ని మనస్ఫూర్తిగా ప్రతి సాహిత్యవేత్త అభినందించవలసిందే. అట్లాగే వీటికి రచనలను అందజేసి సహకరిస్తున్న రచయితలను కూడా మెచ్చుకోవలసిందే. ఇందులో కృష్ణశాస్త్రిగారిపై ఇంద్రగంటివారి వ్యాసం, కొడవటిగంటి వ్యాసం, శ్రీశ్రీ గురించి ఆచార్య రోణంకి వ్యాసం, శ్రీశ్రీ మహాకవిత్వం పరిశీలనపేరుతో శ్రీ మానేపల్లి వ్యాసం చెప్పుకోతగ్గ స్థాయిలో వున్నాయి. వాటిపై సమీక్ష ఈ సమీక్ష పరిధితో సాధ్యం కానిది.

# ప్ర తి ధ్వ ను లు

[మినీ సంకలనం. జయధీర్ తిరుమలరావు కవిత. వెల 40 పైసలు. అడ్రసు : సాహితీ సర్కిల్, 2–2–4, పహడ్‌నగర్, భువనగిరి—508 116.]

ప్రజాకవిత్వాన్ని అందరికీ అందుబాటులోఉండేటట్లు చెయ్యాలనే ప్రయత్నంలో సాహితీ సర్కిల్ ప్రథమ సాధన ఫలితమిది. జయధీర్ తిరుమలరావుగారు ఈవరకే కవిగా పేరు తెచ్చుకొన్నవారు. ఏ భావజాలంతో 'అరణ్యనేత్రం' కవితా సంకలనం వెలువరించారో అదేభావంతో ఈ ప్రతిధ్వనులు సంకలనం వెలువడింది.

''వీళ్ళకు పత్రికలున్నాయి, చర్చావేదిక లున్నాయి
సభామంటపాలున్నాయి, కవిత్వ గోష్ఠులున్నాయి
అకాడమీలు, ఆకాశవాణులున్నాయి
ఇద్దరుగా జీవించడానికి విడి విడి గదులున్నాయి
కవిగా, వ్యక్తిగా వేషం ధరించడానికి
అప్పుడే లాండ్రీనుండి వచ్చిన వేర్వేరు దుస్తులున్నాయి''

అంటూ ప్రజలపేర కవిత్వంరాస్తూ కీర్తిని క్యాష్ చేసుకుంటున్న కవుల్ని ఎత్తిపొడుస్తున్నారు తిరుమలరావుగారు. ఏ సమాజంలో ప్రజలు నిలువుదోపిడీ చెయ్యబడుతున్నారో ఆ సమాజంలోంచే —

''ఎర్రని కవితాభాను డుదయిస్తాడు
అదే ఆకాశంలోంచికాదు
ఆకాశవాగులోంచి అకాడమిల్లోంచి
ఆరాం కుర్చీల్లోంచి, అసహజ సంస్కృతిలోంచి అసలేకాదు
లోతుగా పాతుకున్న వర్గ సంఘర్షణలోంచి
జనం ఒకడైన నవచైతన్యంలోంచి
అనాగరికమైనదిగా భావిస్తున్న మొరటు పెదిల్లోంచి''

ప్రజాకవులు, ప్రజాకవిత్వం ఉద్భవిస్తుందని చెబుతున్నాయి.

# కవితా మంజూష

[సహజ కవితా విలాస నిమ్మకాయల సుబ్బారావు. వెల : రు. 7–50లు. ప్రతులకు : రచయిత, తిలక్‌వీధి, కాకినాడ.]

నిమ్మకాయల సుబ్బారావుగారు అనేక విషయాలపై, వ్యక్తులపై వెలయించిన భావధార ఈ కవితా సంకలనం. చారిత్రక స్థలాలపైన, యుగపురుషులపైన, భగవంతునిపైన వారు పొందిన అనుభూతి ఫలితమే ఈ కవిత్వం. ''శ్రీ సుబ్బారావు కవిత్వము సెలయేటి సలిలమువలె, జలపాతధారవలె స్వచ్ఛమై, సహజమై, సొంపుగా ఉంటుంది'' అని ఎండమూరి వెంకటరమణగారు, ''అక్షరరమ్యతయే కాకుండా ఆంధ్రావళికి మోదమును గూర్చే విశిష్ట శిల్పచాతుర్యమూ ఉన్నది'' అని దేవత సుబ్బారావుగారు చెబుతున్నారు. అక్షరరమ్యత, ఆంధ్రావళికి మోదము అంటే సుబ్బారావుగారికి నన్నయ, తిక్కనల ప్రక్కన పీఠం వేసినట్లే. వ్యక్తులపైనున్న అభిమానం ఒక్కొక్కప్పుడు అట్లా అతిశయోక్తులు పలికిస్తుంది.

''ఒకనాడు బౌద్ధమతోద్యమ చంద్రుండు
పండువెన్నెల గాయుచుండు నగరు
లొక్కప్పుడాంధ్ర వీరోచిత బౌద్ధమ్ము
దిశలావరించిన దిటపునేల''

మొదలైన పద్యాలు వారి శైలీసారళ్యానికి తార్కాణాలు. మెహరు బాబా, ఏసుక్రీస్తు, సత్యసాయిబాబా, బాలయోగి మొదలైన వారి

కోరు. స్మగ్లర్లు, సారా కాంట్రాక్టర్లు, తార్పుడుగాళ్ళు, బ్లాక్ మార్కెటీర్లు, రౌడీలు నిర్మించుకున్న అధోలోకంగా మాత్రమే మిగిలి పోతాయి.

వర్గ సమాజాన్ని గురించి, ఆ సమాజంలో ఉండే కళాస్వరూపాన్ని గురించి శేషేంద్రశర్మగారికి సక్రమ అవగాహన లేకపోవడంవల్ల అశాస్త్రీయమైన విమర్శ చెయ్యడం జరుగుతోంది. సంస్కృతాంగ్ల గ్రంథాల్లోంచి ఊపిరి సలపకుండా కొటేషన్లు ఇవ్వడం విమర్శకాదు. వర్గస్వభావం తెలియకుండా, లేకుండా విప్లవ నినాదాలు చెయ్యడం కవిత్వం కాదు.

## మా ఊరు మాట్లాడింది

[వ్యాస సంపుటి. డా॥ సి. నారాయణరెడ్డి. వెల : రూ. 5–00లు, ప్రతులకు : ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు, సికింద్రాబాద్.]

మా ఊరు మాట్లాడింది అనే శీర్షికతో రాసిన ఆరు వ్యాసాల్లోనూ కరీంనగరం ప్రాంతంలో వాడుకలోనున్న మాండలిక పదాలను పరిగణనలోనికి తీసికొనడం జరిగింది. తరువాత మలినుడుగులో రాసిన ఆరు జానపద గేయాలకు, అందులోని శబ్దాలకు వ్యాఖ్యానం ఇవ్వడం జరిగింది. ఈ శాబ్దిక చర్చను గురించి ''ఈ చర్చ భాషావ్యాకరణ సూత్రాల పరిధిలో గిరిగీసుకుని ఉన్నదికాదు. కొంత శాస్త్రీయంగా, కొంత చమత్కారంగా, కొంత ఛలోక్తిగా జరిపిన పద పరిశీలన ఇది. అయితే కొత్తగా చెప్పాలన్న కుతూహలంవల్ల కొన్ని ప్రమాదాలు దొర్లినా ఆశ్చర్యంలేదు'' అని నారాయణరెడ్డిగారు స్వయంగా చెప్పుకున్నారు.

'మస్కుల కాసినా పని ఒడుస్తలేదయ్యా' అనేవాక్యం అక్కడ జన వ్యవహారంలో ఉంది. 'ఎంత పొద్దుకాడ లేచినా చింతగుండుపాలెం దగ్గరే తెల్లారింది' అనేది కృష్ణాజిల్లాలో ఉన్న నుడికారం. మస్కుల అంటే తెల్లవారుఝామున అని అర్థం. మసకవేళ మస్కుల అయింది. ఒడుస్తలేదు అంటే పూర్తికాకపోవడం, తెమలకపోవడం. 'తెమలకపోవడం' అనేది కోస్తా జిల్లాలలో వాడుకలో ఉన్నపదం. కవిత్వాలవాడు 'కైత్కాలాడు'గా మారి చమత్కారి అనే అర్థంలో అక్కడ మాండలికంలో స్థిరపడింది. అట్లాగే నువ్వద్దిపదం నిబద్దికిమారుగా జనవ్యవహారంలోకి వచ్చింది. కార్తీతోవ పిల్లతొవ్వగా మారింది. కూపస్థ మండూకం 'బాయిలకప్ప' అనే తెలుగు నుడికారాన్ని పొందింది. డబ్బు కాజేయడానికి బదులుగా డబ్బుగుంజడం అనేమాట తెలుగునాడులో అధికభాగం ప్రచారంలో ఉన్నదే. అల్పశబ్దానికి అలిపిరి వికృతిగా మారింది. మిత్తి మృత్య శబ్ద వికృతిగా కాక 'వడ్డీ' అనే అర్థంలో వాడుకలో ఉంది. జానపద కవిత ఎంత చమత్కారవంతమైనదో, ఎంత నిసర్గ సుందరమైనదో ఈ క్రింది నాలుగుపాదాలు ఋజువు చేస్తాయి.

''మాదిగోని మగులుమీదా
మంచి మల్లే పూసినాది
కాపువారి కైలీకోడె
జో! నాయమ్మలారా!
వాసనకే మోసపోయె''

''మాదిగమాల అనే మాటలు ఈనాడు హరిజన శబ్దంలో కలుపుకున్నాము. వాటిని ఉచ్చరించవలసిన అవసరం ఇప్పుడు కలగడం లేదు. కలగకూడదు కూడా. కాని ఒక చారిత్రకసత్యం వీటి వెనుక ఉంది. ఆ దృష్టితోనే ఈ పరిశీలన'' అన్న రచయిత దృక్పథంతోనే పై పాదాలను పరిశీలించాలి. మంచిమల్లె పడుచుపిల్లకు, కైలీకోడె కాపు యువకునికి ప్రతీకలు. ఇట్లా ధ్వన్యాత్మకంగా కవిత చెప్పడం జానపద కళావైశిష్ట్యానికి ఒక ఉదాహరణ మాత్రమే. నారాయణరెడ్డిగారి ఈ వ్యాస సంకలనం భవిష్యత్ భాషాశాస్త్ర పరిశోధకులకు, జానపద వాఙ్మయ పరిశోధకులకు ఉపయుక్తం కాగలదు.

**శ్రీ టి. ఎల్. కాంతారావు**

# రెండు సైద్ధాంతిక వ్యాసాలు

## శిల్ప ప్రభావతి

[డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి. శిల్పి ప్రచురణలు. పుటలు–291+26. ప్రతులకు : శ్రీమతి లక్ష్మీకాంతమ్మ, కేరాఫ్ ఆర్. చంద్రశేఖరరెడ్డి, తెలుగుశాఖ, పి. జి. సెంటర్, అనంతపురం. వెల : సాధారణ ప్రతి 25 రూ. మేలు ప్రతి 30రూ.]

పింగళి సూరన అనడంతోటే ఆనాటివారు 'కృతిమరత్న'మని నిరసించినా నేటికీ ఆయన రచించిన కళాపూర్ణోదయమే ప్రసక్తమవడం పరిపాటి. కాని దానికి దీటుఖున శిల్పంప్రభావతీ ప్రద్యుమ్నంలో చోటు చేసుకున్నది. ఈ విషయమై కట్టమంచివారు, పింగళివారు నామమాత్రంగా పరిశీలన చేయడమూ, అడపా దడపా సాహిత్య విమర్శకులు ''ప్రబంధాలలో అదికూడా ఒకటి'' అన్నట్లు వ్యాసాలు వ్రాయడం తప్ప ఆ గ్రంథంపై ఒక సమగ్రమైన పరిశీలనకు పూనుకున్నవారులేరు. ఆ కీర్తి డా॥ రాచపాళెం వారికి దక్కడం ప్రశంసనీయం.

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆచార్య జి. యన్. రెడ్డిగారి పర్యవేక్షణలో రూపొందిన ఈ సైద్ధాంతికవ్యాసం కథాశిల్పం, కథనశిల్పం, రసశిల్పం, పాత్ర చిత్రణశిల్పం, వర్ణనాలంకార శిల్పం, శైలీశిల్పం, తులనాత్మకశిల్పం అనే ఏడుభాగాలుగా విభజింపబడింది. దీనికి 'శిల్పప్రభావతి' అని పేరుపెట్టడంలో రెడ్డిగారు ముఖ్యంగా శిల్పదృష్టితో కావ్యతత్వానుశీలనం జరిపినట్లు విదితమవుతుంది. ఇందున్న సప్తాంగాలూ చక్కని శిల్పాలుగా చెక్కబడినాయి. అట్టి 'శిల్పప్రభలు కలవి శిల్పప్రభావతి.' అంతేకాదు. ఈ ప్రబంధ నాయిక ప్రభావతి. ఆమె సూరనార్యుని కళాప్రతిభకు, పాండిత్య ప్రభలకు ఆటపట్టు. ఆమెను శిల్పంగా తీర్చిదిద్దడంలోగల సూరన నైపుణ్యానికి వ్యాఖ్యాన రూపమే ఈ 'శిల్పప్రభావతి'. (శిల్పమయిన ప్రభావతి, శిల్పంగా రూపొందించబడ్డ ప్రభావతి.) సూర

నార్యుని శిల్పాన్ని ఆవిష్కరించడంలో ''రచయిత చేసిన వింగడింపు సరికొత్తది'' అనిపించినా, ఇట్టి కృషి ఆంధ్రవిశ్వవిద్యాలయంలో శ్రీనాథుని సాహిత్యంపై డా॥ జంధ్యాల జయకృష్ణ బాపూజీ ఇతః పూర్వమే చేశారు. కళాసూత్రాలకు సాహిత్యాన్ని జోడించి, లక్షణలక్ష్య సమన్వితంగా గ్రంథాన్ని పరిశీలించడమే ఈ పద్ధతిలోని ప్రధానాంశం.

పింగళి సూరన 'తనవంశమును శ్రీ కృష్ణవంశముతో సమా నముగా భావించియు ఈ కథను గ్రహించి ఉండవచ్చు' (పు. 5) అను రచయిత ఊహ ఇంకా సోపపత్తికంగా ఉంటే ఒక సిద్ధాంతమయేది.

'ప్రబంధము నేటి పరిమిత కుటుంబమువంటిది' (పు. 7) 'పురాణము వసుధైక కుటుంబము. ప్రబంధము ఒక వ్యక్తి కుటుం బము. పురాణమహావృక్షమునకు పుట్టిన ఒక కొమ్మయో, రెమ్మయో ప్రబంధకథ' (పు. 12) 'ప్రబంధ పద్యము నాయికవలెనే నఖశిఖ పర్యంతము అలంకరించుకొనును. పురాణ పద్యము పురాణ పధూటి వలెనే నిరాడంబరముగా ఉండును.' (పు. 14-15)వంటి రచయిత వ్యాఖ్యలు రసోత్కర్షాలేకాక, అత్యంతాసక్తకా లనడంలో సందేహంలేదు.

'కథానిర్మాణమనగా కథలోని చిన్న సంఘటనలకు పొసగింపు... కథనమనగా కథను చెప్పెడి పద్ధతి' (పు. 56) అని కథాకథనాలకు గల భేదాన్ని పాటించడం రచయిత సూక్ష్మబుద్ధికొక నిదర్శనం.

కథనశిల్పంలో సూరన నాటకీయత, 'సరస్వతీ బ్రహ్మల ప్రణయ కలహం'వంటి ఘట్టాల్లో 'ఫ్లాష్ బాక్ టెక్నిక్'లోని విశి ష్టత నిరూపించబడినాయి. ఈ ప్రబంధంలో అంగిరసమైన శృంగారం మోతాదుకుమించే ఉందనే పూర్వవిమర్శకు వంతపలికారు రచయిత. క్షీణప్రబంధ యుగ ధర్మానికి దరిదాపుల్లో ఈ గ్రంథం ఉండడమే దీనికి ముఖ్యకారణం అని నా అభిప్రాయం.

'హంస ప్రాణమునకు ప్రతీక...కవికి శబ్దము ప్రాణము. కావున శుచిముఖి కవియే. కవి ప్రాణజన్యమైన శబ్దరూప కార్యమంతయు హంసయే కావున శుచిముఖియే కావ్యము. కావ్యమే కవి' (పు. 151) అని శుచిముఖి పాత్ర చిత్రణను గూర్చి రచయితచేసిన వ్యాఖ్య కవి ఆయువు పట్టుపు పసిగట్టు ప్రజ్ఞకు ఒక మచ్చుతునక.

వర్ణనలో 'పరిశీలన, భావన' అనే రెండంశాలుంటాయనీ, అలంకారాలు కావ్యశోభాహేతువులనీ సూరన ఈ విషయాల్లో ఔచిత్యం పాటించాడనీ నిరూపించబడింది. సూరన శైలి ఇందు మంచిపాకంలో పడిందని కొనియాడారు రచయిత.

శ్రీనాథుడు మతాన్ని ఐహికంచేయగా, రాయలు దైహికేచ్ఛను దైవపరంగాను, పెద్దన నైష్ఠికతవైపుగాను, భట్టుమూర్తి ఐహిక విషయపరంగాను, 'సంకుసాల' రాగవైరాగ్యాలను వేరుచేసే విధంగాను, రచించారనీ, సూరన ఐహికాముష్మిక విషయ సమన్వయంతో రచించా డనీ (పు. 273) చెప్పడం రెడ్డిగారి తులనాత్మక శిల్పదృష్టికొక గీటురాయి.

ఈ 'కావ్యము తెలుగు సాహిత్యోద్యానమున పూచి పరిమళించు చున్న బొండు (చెండు) మల్లెపూవు' అని చెప్పి కళాపూర్ణోదయా నికి సరసన పీఠమెక్కించవలసిన అర్హత దీనికున్నదని రచయిత నిరూ పించారు. దీనివల్ల సాహిత్య లోకంలో ప్రభావతీ ప్రద్యుమ్నంపై ఉన్న చిన్నచూపు తొలగవచ్చని ఆశించవచ్చు.

దీనికి మొదట ఆచార్య జి. యన్. రెడ్డి, డా॥ తుమ్మపూడి కోటేశ్వరరావు, సర్దేశాయి తిరుమలరావుగారల ప్రశంసా వాక్యాలూ, చిట్టచివర హరివంశంలోని మూలకథా వివరణం కూర్చబడినాయి.

ఈ గ్రంథంలో ఎక్కడా రచయితపేరుకు ముందు 'డాక్టరు' అని చేర్చుకోకపోవడం, ఉపయుక్త గ్రంథావళిని పాదసూచికలోనే తెల్పడం, తప్పొప్పులపట్టిక లేకపోవడం నేటి కాల విరుద్ధాలైనా, ప్రశంసనీయార్హ విషయాలు.

# పల్లెపదాలలో ప్రజాజీవనము

[డాక్టర్ యెల్దండ రఘుమారెడ్డి. గురుకుల విద్యాపీఠ ప్రచు రణలు, యెల్దండ. పుటలు 471+7+5. ప్రతులకు: వై. రాం చంద్రారెడ్డి (నల్లాల బావిదగ్గర), గురుకుల విద్యాపీఠం, యెల్దండ, కలువకుర్తి తాలూకా, మహబూబ్‌నగర్ జిల్లా. వెల: రూ. 50/-]

ఈమధ్య జానపద సాహిత్యానికున్న స్థానాన్ని గుర్తించి దాని మీద కోకొల్లలుగా వ్యాసాలు, ఉపన్యాసాలు ప్రకటించటం ముఖ్య విషయమయింది. దీనికి ఉస్మానియా విశ్వవిద్యాలయం చేయూత నిస్తున్నది. ఆచార్య బిరుదు రాజు రామరాజు, డా॥ నాయని కృష్ణ కుమారి ప్రభృతులిందుకు మార్గదర్శకులవడం ముదావహం.

జనపదం (పల్లె)లో ఉండేవారు జానపదులు. వారి మానసిక సంస్కృతీపరమైన ఆస్తి జానపద సాహిత్యం. అందులో సుమారు 5000 పదాలదాకా ఎన్నుకొని, ఆంధ్రదేశంలో వివిధ ప్రాంతాలు సందర్శించి వేయిపదాలదాకా సేకరించిన యెల్దండవారి సత్కృషి ఫలితమే ఈ పరిశోధనా వ్యాసం.

ఈ గ్రంథంలో జనపద మనస్తత్వము, కుటుంబ జీవనము, సామాజిక జీవనము, ఆచార వ్యవహార స్వరూపము, శృంగారజీవనము, కవితా స్వరూపము, భాషాస్వరూపము అను ఏడు ప్రకరణలున్నాయి. ప్రతి ప్రకరణంలోను ఆ యా విషయోచితంగా పెక్కు పల్లె పదా లుదహరించి హేతుబద్ధంగా రెడ్డిగారు విమర్శించారు. సామాన్య ప్రజా జీవన విధానానికి, సంస్కృతికి సంబంధించిన ప్రాచ్య పాశ్చాత్య శాస్త్ర దృక్పథాన్ని సమీక్షించారు వీరు.

'ప్రతి పల్లెపాట పల్లీయుని మనస్తత్వమునకు పిల్లబాట ప్రకృతి ప్రభావముల మూట. సంప్రదాయామ్నాత ప్రవాహపు తేట' (పు. 36) వంటి కవితా ధోరణిలో ఉన్న వ్యాఖ్యలూ,

'వేదములందలి భాషాతత్త్వము, భావన, అడుగడుగున అలం కారం ప్రయోగము, ప్రకృతి పరిశీలనవంటి లక్షణములు పల్లెపదాలలో గూడ కన్పించును' (పు. 40) వంటి పద్యవిమర్శనాత్మకప్రకటనలూ,

'రక్తసంబంధములు, శారీరకమైన దగ్గర సంబంధము, అన్యో న్యాశ్రయము, నిరంతర సంబంధములు, సమానోద్దేశములు' మున్నగు నవి కుటుంబ జీవన లక్షణములు (పు. 43)వంటి ప్రామాణిక వాక్య

ములూ ఈ గ్రంథాన కోకొల్లలు. ఇవన్నీ రచయిత పరిశోధనాపరిధిని చూపెట్టే మణిదీపికలు.

కుటుంబంలో వ్యక్తికీ మరో వ్యక్తికీ మధ్యగల పరస్పర సంబంధాలు వివరించబడినాయి. జానపద సమాజంలో స్త్రీకి స్వేచ్ఛ ఎక్కువని తెలుపబడింది.

'సామాజిక జీవనం'లో వ్యవసాయ సంబంధమైన ఏరువాక కలుపు—కోతలు మున్నగు సందర్భాలలో పల్లెల్లోనివారి మనఃప్రవృత్తి, వివిధ వృత్తులూ—పరిశ్రమలు, వినోదం కలిగించే ఆటపాటలూ వస్త్రాద్యలంకారాలు చాల వివరణాత్మకంగా సమీక్షించబడినాయి. ఇదే మిగిలినవాటికంటె పెద్ద ప్రకరణం.

'ఆచార వ్యవహార స్వరూపం'లో వివాహం, సమర్త, సీమంతం, పసనవాదులూ, ఉగాది, సంక్రాంత్యాది పండుగలూ, వ్రతాలు—నోములు మొదలైన పెక్కు సందర్భాలలో పాడుకునే పల్లెపదాలు సోదాహరణంగా విమర్శించబడినాయి.

'పల్లీయుల శృంగార జీవనమంత వ్యవసాయ పరిసరముల తోడనే ముడిపడియుండుట సహజము' (పు. 367) అనీ, వారి శృంగారపదాలెక్కువగా శ్రమను నివారించేందుకే ఉద్దేశింపబడినా యనీ, 'నిత్యజీవితములోని మంచిచెడ్డలు, రంకుబొంకులు మున్నగునవి పల్లీయుల నోటినుండి ఉన్నదున్నట్లు బహిర్గతములగుచుండును' (పు. 407) అనీ వివరించారు రచయిత.

'కొత్తగొంగడన్న కప్పుకోవె లగ్గోసిల్లా
దగ్గరికి రారాదే లగ్గోసిల్లా
నీవు సిగ్గుపడితె తడుస్తావు లగ్గోసిల్లా ...' (పు. 133)

అనడంలోని ఆత్మీయతా,

'అమ్మా నేను సిన్నదాన్ని—అల్లుడొస్తే తోలవోకే
యింతా యింతవి నాసండ్లూ—సింతాగింజలంతలేవు

(పు. 409) అనడంలోని అనాగరకతా,

'వస్తావు పోతావు నా కొరకూ—వచ్చి కూకున్నాడు నీకొరకూ' (పు. 409) అనడంలోని రంకుటాలి అన్యాపదేశాలూ,

'...వంకరదువ్వే పాపట్లు—కుంకుమ సరిపడనీ బొట్లూ
తీరు తీరు పలారాలు—తీరకుండ కలయామూలు
వేర వేర సంసారాలు—నేలముండల పపంచాలు
ఆడవారి సదువుల్లు-ఆరగింపులేని గుళ్లు
అదర బెదర దూసుడాట—అద్దంలో సూసుడాట,
సిన్న పెద్దల తెలువకుండ—సీరవిడిసి కట్టుడాట
ముడిలేని రైకలాట—లోపల బాడీలాట
ఇగ్గిగ్గి కట్టుడాట—ఇరిసి ఇరిసి నడుసుడాట...' (పు. 411)

అంటె ఆధునిక సమాజస్త్రీ నాగరకతను దుయ్యపట్టే ఉపదేశాలు నిద్వినుర్శతో పరామర్శించారు శ్రీ రెడ్డిగారు.

పల్లెపదాల కవితా స్వరూపాన్ని వివరిస్తూ 'తెలుగులో ఆది కవిత్వమేది యన్నప్పుడు అది జానపద కవిత్వమేయగును' (పు.420) అని చెప్పి, 'పల్లీయుల భాష నిత్య వ్యావహారికమైనది. నన్నయాదుల భాషకు భిన్నమైనది. కృతకము కానిది. వ్యాకరణ మరిగించుకొనలేనిది. పునాదిమీది కాలానుగుణముగా సహజమైన మార్పుల నంగీకరించునట్టిది' (పు. 446) అన్న రఘుమారెడ్డిగారు పల్లెపదాలకు సంబంధించిన తమ సిద్ధాంత వ్యాసాన్నిమాత్రం, నేడు విశ్వవిద్యాలయాలు ఆమోదిస్తున్నా, వ్యావహారికంలో కాకపోయినా కనీసం శిష్టవ్యావహారికంలోనయినా రాయకపోవడం చాలా శోచనీయం. వారి గ్రాంథిక భాషా వ్యామోహంవల్ల కొన్నిచోట్ల సహజ సిద్ధంగా ఉండాలిసిన వ్యాఖ్యలు కృతకంగా తయారయినాయి అనడంలో సందేహంలేదు.

ఉదాహరణకు—

'అంత మంగళగౌరి సత్యవతీదేవికి స్వప్నమున కనిపించి విషయమును దెల్పగా నామె మేల్కొని దిగ్గునలేచి చూచి నవ్వుచు స్వర్ణ కలశమును దెచ్చియుంచెను. (పు.334).

''కొయ్యండల్లా కొయ్యండీ—కోసి బణుపులెయ్యండీ...గింజలు, బందలు పడిపోకుండ'' పాడుచు పండి తలవంచిన చేలను చక్కగ పాయ దీసి గింజలు రాలకుండ కోసి వరుసగా మెదలువేయుచు ''కాలంసూత్తే సీతాకాలం—కొడవలిపాటు జాగ్రత్తరా'' అని హెచ్చరించుకొనుచు, ''కాలూ సెయ్యీ ఆడితేనె—కుండలో కూడు కనిపిస్తాది'' అనుచు నౌకరి మేలొకరోర్చుచు, రెక్కాడనిదే డొక్కాడదని నమ్ముకొని చక చక పనిచేయుచుండెడు స్వయం సేవకులు వారు. (పు. 151)

దీనిని ఆచార్య బిరుదురాజువారు ''ఉత్కృష్టమైన గ్రంథముగా ఉండగలద''ని ఆశీర్వదించారు.

దీనిపై వచ్చిన సొమ్మును ఒక విద్యాపీఠానికి 'ముడుపు' కట్టడంవల్ల రచయిత దాత అయ్యారు.

**శ్రీ శివలెంక ప్రకాశరావు**

# చలం నవలలు - సామాజిక చైతన్యం

(కాకతీయ విశ్వవిద్యాలయం ఎం.ఫిల్. డిగ్రీకి సమర్పింపబడిన పరిశోధన గ్రంథం)

[రచన : వెన్నవరం ఈదారెడ్డి, ఎం. ఏ., బి. ఇడి; ఎం.ఫిల్. లెక్చరర్, ప్రభుత్వ జూనియర్ కాలేజి, హన్మకొండ. వెల : రు. 12–00.]

ఇందులో ఉన్న పట్టికలూ, పుటల సంఖ్యలూ పరిశోధనకు గుర్తు.

''చలం సాహిత్య జీవితాదర్శ తాత్పర్యం ?'' అనే శీర్షికలో డా. కేతవరపు రామకోటి శాస్త్రిగారు ''అఖిల భారత రాజకీయాల్లో అంబేత్కర్, ఆంధ్ర సాహిత్యంలో చలం — ఇద్దరూ ఏమి సాధించారో ఏమి సాధించలేదో చెప్పడానికి ఎన్నోవిషయాలు తెలియాలి''అంటారు

''చలం తత్వం'' అని ముందు మాటగా శ్రీ కె. వి. రమణా రెడ్డి వ్రాశారు. అందులో ఒకచోట ''చలం వాఙ్మయ జీవితంలో మన ఈదారెడ్డి చేసిందానికంటె చెయ్యవలసి వుండవలసింది మరెంతో

విస్తృతమూ, ప్రగాఢమూ. ఆయన విశ్లేషణ కివ్వని ప్రాముఖ్యాన్ని వివరణ కిచ్చారు'' అంటారు.

ఈ పుస్తకం చదివిన తరువాత చలాన్నిగూర్చి కొన్ని విషయాలైనా పాఠకులకు తప్పక తెలుస్తాయి. ఎందుకంటే శశిరేఖ, దైవమిచ్చిన భార్య, అమీనా, మైదానం, వివాహం, బ్రాహ్మణీకం, అరుణ, జీవితాదర్శం — అనే ఈ ఎనిమిది నవలల్లోని కథలనూ సంక్షిప్తంగా రచయిత వ్రాయడమే కాకుండా ప్రతిదానికీ విషయ విచారణ కూడా చేశారు. ఈ పుస్తకం పరిశోధక గ్రంథం. ఈ విషయంపై పరిశోధన ఎలా చేశారో చెప్పుతూ రచయిత నివేదనంలో ఇలా అంటారు.

''చాలా కాలం తరువాత చలం సాహిత్యంపై పిహెచ్.డి. చేద్దామని ఉస్మానియా విశ్వవిద్యాలయం చుట్టూ తిరిగాను. కాని అవకాశం లభించలేదు. 1977 లో కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎం. ఫిల్.లో చేరడం జరిగింది. ఇక్కడ నా పరిశోధన పర్యవేక్షకులు డా. కేతవరపు రామకోటి శాస్త్రిగారు 'చలం-సామాజిక స్పృహ' అనే విషయాన్ని పరిశోధనకు నిర్ణయించారు. ఈ విధంగా ఈ సిద్ధాంత గ్రంథాన్ని రాయడం జరిగింది.''

ఇందుకు డా. రామకోటిశాస్త్రిగారు అభినందనీయులు. అయితే అందరూ శ్రీ శాస్త్రిగారిలా లేనందున ఎందరికో అన్యాయం జరుగుతుంది. తెలుగు సాహిత్యంపై పరిశోధన చేయడానికి మన యూనివర్శిటీలు ఉత్సాహవంతులందరికీ అవకాశం ఎందుకు కల్పించవో తెలియదు. సీట్ల సంఖ్య పరిమితం చెయ్యవలసిన అవసరంలేదు. ఇందుకు యూనివర్శిటీ కయ్యే ఖర్చేమీ లేదు. లేబరేటరీలూ, ఆధునిక యంత్ర సామగ్రీ అవసరంలేదు. ఇకనైనా అధికారులూ, ప్రొఫెసర్లు అనవసర భేషజాలకుపోక పరిశోధకులను ప్రోత్సహించి, ''వారిచుట్టూ తిరిగే'' శ్రమను తప్పిస్తారని ఆశించవచ్చు. ప్రొఫెసర్లతో నిమిత్తం లేకుండా స్వేచ్ఛగా పరిశోధనచేసి యూనివర్శిటీలకు సమర్పించే సుదినం వచ్చిన రోజున ఈదారెడ్డి వంటి వారెందరో మంచి కృషి చేయగలరు.

కాల్పనిక రచయిత అయిన చలంయొక్క సామాజిక చైతన్య లక్షణాన్ని నిరూపించడం ఒక్కటే ధ్యేయంగా శ్రీరెడ్డిగారీ గ్రంథాన్ని రచించారు. చాలవరకు సఫలీకృతులయ్యారు. 224 పుటల పుస్తకం వెల పన్నెండు రూపాయలు.

**శ్రీ పులిచెర్ల సాంబశివరావు**

## కే దా ర ం (ఉర్దూ కథలు)

[రచయిత్రి : శ్రీమతి జీలానీబాను. తెలుగు అనువాదం : శ్రీ దాశరథి రంగాచార్య. డెమ్మీ: 298పుటలు. వెల: రు. 7-00 ప్రచురణ: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, కళాభవన్, సైఫాబాద్, హైదరాబాదు — 4.]

శ్రీమతి జీలానీ భానూకు భాషమీద చక్కని అధికారంవుంది. ఆమె కథలలో కొన్ని చోట్ల కవితా ధోరణి కనిపిస్తుంది. అయినా శైలి సరళంగానే వుంది. మానవ జీవితాన్ని అనేకకోణాల్లో నిశితంగా పరిశీలించి వ్రాసిన కథల సంగ్రహమే ఈ 'కేదారం'. పుస్తకం తెరవగానే అనువాద సాహిత్య అవసరాన్ని గురించి శ్రీదేవులపల్లి రామానుజరావుగారి 'విజ్ఞప్తి' కనిపిస్తుంది. అందులోనే కథారచయిత్రి సాహిత్య పరిచయం కూడా వుంది. అటు ప్రక్కనే 'ఛాయ' పేరుతో ఈ గ్రంథ అనువాదకులు శ్రీ దాశరథి రంగాచార్యులుగారి అభిప్రాయం వుంది. అందులో ఆయన అనువాద ప్రక్రియలోవుంటే ఇబ్బందులను గురించి వివరించారు. వారి అభిప్రాయంతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను.

ఈ పుస్తకంలో మొత్తం ఇరవై నాలుగు కథలు వున్నాయి. ఇందులో కొన్ని కథలు పరిమాణంలో చిన్నవైనా మరికొన్ని కథలు పాతిక పేజీలకు మించిపోయాయి. 'ఆదరణ', 'శ్యామల', 'శాలువ', 'దొంగ సొమ్ము' కథలు అన్ని విధాలా బాగున్నాయి. అద్దం, మోక్షం, మనసొకచోట, సతీసావిత్రి, సరస్వతి, నిరీక్షణ, పరుల ఇల్లు, గొడ్రాలు, బంగారు లేడి పేర్లుగల కథలు ఒక మోస్తరుగావున్నాయి. 'చప్పటి కథ' చప్పగానేవుంది. 'అపరిచితులు'కథ అపరిచితంగానేవుండిపోయింది. 'ఎంకమ్మ' కథలో భర్త సానిదానివెంట తిరిగేప్పుడు భార్య అనుభవించే మానసిక క్షోభ చక్కగా వర్ణించబడింది. సానికీ సంసారికీ జీవిత పోరాటంలో చూపెట్టిన తులనాత్మక పరిశీలన వాస్తవికంగావుంది.

'స్కూటర్‌వాలా' కథ ఆడవాళ్ల అసంబద్ధ ఆలోచనలకు అద్దం పట్టినట్లుంది. ''కిషన్ ఓ కిషన్'' ఒకే పాత్ర కలిగి తన వృత్తిపట్ల పశ్చాత్తాపం చెందుతున్న వేశ్య కథ. 'వినోదం' కథలో ఒకళ్ల బాధ ఒకరికి వినోదంగా చూపెట్టబడింది. ఈ కథాసంగ్రహం లోని చివరిదీ, పుస్తకం పేరుతో వున్నదీ 'కేదారం'. ఇందులో కేదార రాగానికి ఏమీ ప్రత్యేకతలేదు. ఈ కథ సాహిత్యాభిలాషతో చదివేవాళ్లకు తప్ప కాలక్షేపానికి చదివేవాళ్లకు రుచించదు.

అనువాదకులు ఆరితేరిన రచయితలు. అనువాదం సరళ వ్యావహారికంలో చక్కగా కుదిరింది. బొమ్మగీయడం అనే అర్థంలో 'బొమ్మదించడం', గీత గీయను చేతకాదు అనే అర్థంలో 'గీత గీయరాదు,' పరీక్ష రాస్తున్నాడు అనే అర్థంలో ''పరీక్ష ఇస్తున్నాడు''వంటి ప్రాంతీయ ప్రయోగాలు స్వల్పంగా వున్నాయి.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు అనువాద సాహిత్యాన్ని ప్రచురించుటకు పూనుకోవడం, కొన్ని అనువాద గ్రంథాలు ప్రచురించడం ఎంతో సంతోషించదగ్గ విషయం. కాని, ఇది కథాసంగ్రహం గదా! ఈవిధంగా ఒకేరచయిత కథలు కాకుండా ఉర్దూలోవున్న వేరువేరు ప్రముఖ కథారచయితల ప్రముఖమైన కథలను ఎన్నుకొని వాటి అనువాదాన్ని ప్రచురించివుంటే తెలుగు పాఠకులకు కథలలోనూ కథా కథనంలోనూ కొత్తదనం కనుపించి ఎంతయో ఉపయోగకరంగావుండేది.

మొత్తంమీద ఈ 'కేదారం' తెలుగు పాఠకులకు ఉపయోగకరమైన కథాసంగ్రహమే. పుస్తకంలో అచ్చుతప్పులు సామాన్యంగా దొరకవు. మంచి పేపరు. డెమ్మీసైజులో 298 పేజీల పుస్తకానికి ఏడురూపాయల ధర ఈ రోజుల్లో చాలా ఉదారంగా ఉన్నదనే చెప్పాలి.

**శ్రీ గాదంశెట్టి శ్రీరాములు**

Printed and Published for Nageswara Rao Estate (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 61247.